ఈనాడు

హైదరాబాద్ 25-9-2024 బుధవారం సిటీ సంపుటి 51. సంచిక 46
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



నేడు ఏడు జిల్లాల్లో భారీ వర్షాలు!

ఈనాడు, హైదరాబాద్: మధ్య, వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో బుధవారం రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచించింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కొన్ని చోట్ల వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. మంగళవారం అత్యధికంగా జనగామ జిల్లా దేవరుప్పులలో 11.5 సెం.మీ. వర్షం కురిసింది. నల్గొండ జిల్లా కామారెడ్డి గూడెంలో 10.9, తిమ్మాపూర్‌లో 9.9, శాలిగౌరారంలో 9.1, రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో 8.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

అదిగో.. అల్లదిగో..
మహాప్రసాదం!

- శతాబ్దాల కిందట వడ.. తర్వాత బూందీ లడ్డూ
- శ్రీవారికి 50 రకాల ప్రసాదాలు
- 'దిట్టం' లెక్క.. పోటులో తయారీ
- భక్తులకు 3.50 లక్షల వరకు పంపిణీ



ఈనాడు-తిరుపతి, కడప, అమరావతి: తిరుపతి వేంకటేశ్వర స్వామి దర్శనమంటే.. భక్తులకు మధురానుభూతి. శ్రీవారి ప్రసాదాన్ని భక్తులు అపురూపంగా భావిస్తారు. నెలరోజులైనా లడ్డూ రుచి, వాసన తగ్గేది కాదు. తిరుమల నుంచి ఇంటికొచ్చిందాకా.. లడ్డూల కవర్లు నేలను తాకనివ్వకుండా జాగ్రత్తపడతారు. అనంతరం బంధుమిత్రులకు పంపిణీ చేస్తారు. తిరుమల వెళ్లి వచ్చాక.. ఎవరు కలిసినా లడ్డూ ప్రసాదం ఏదనే ప్రశ్నే వస్తుంది. తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని లడ్డూ ప్రసాదాన్ని ఎలా తయారుచేస్తారో, ఏయే వస్తువులు వినియోగిస్తారో.. తెలుసుకుందామా?

అప్పట్లో వడ.. కాలక్రమంలో లడ్డూ

15వ శతాబ్దం నుంచి శ్రీవారి ప్రసాదం అంటే వడ.. అప్పట్లో స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు భోజన, వసతి సౌకర్యాలు లేవు. వడ ప్రసాదంతో ఆకలి తీర్చుకునేవారు. కాలక్రమంలో 19వ శతాబ్దంలో తీపి బూందీ ప్రవేశపెట్టారు. 1940 నాటికి.. బూందీని లడ్డూగా చేసి ఇవ్వడం ప్రారంభమైంది.

1803 నుంచే ప్రసాదాల విక్రయం

తిరుమల శ్రీవారి నివేదనలకు ఎన్నో రకాల ప్రసాదాలు తయారవుతున్నా, లడ్డూలకు విశేష ఆదరణ ఉంది. స్వామివారి ప్రసాదం కోసం ఎందరో రాజులు, రాణులు ఎన్నో దానాలు చేశారు. 1803లో ఆలయంలో ప్రసాదాల విక్రయాన్ని అప్పటి మద్రాసు ప్రభుత్వం ప్రారంభించింది. లడ్డూ తయారీకి రూపమైన బూందీని తీపి ప్రసాదంగా విక్రయించారు. అనంతరకాలంలో లడ్డూగా రూపొందించారు.

రూపాయి నుంచి.. రూ.50 వరకు

ప్రస్తుతం విక్రయిస్తున్న చిన్న లడ్డూ ఖరీదు మొదట్లో రూపాయి ఉండగా.. క్రమంగా రూ.25 అయింది. గత ప్రభుత్వ హయాంలో రూ.50 చేశారు. కల్యాణం లడ్డూను రూ.100 నుంచి రూ.200 చేశారు. దర్శనానికి వెళ్లిన భక్తులకు ఉచితంగా ప్రసాదవితరణ చేస్తుండగా అదనపు లడ్డూలు కావాలంటే కొనుక్కోవాలి.

మరిన్ని వివరాలు 2లో..



ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ షురూ

- కన్వీనర్ కోటా మెరిట్ జాబితా విడుదల
- నేడు 5 గంటల్లోపు అభ్యంతరాల స్వీకరణ
- గురువారం వెబ్ ఆప్షన్లకు అవకాశం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం నుంచి మొదటి రౌండ్ అడ్మిషన్లకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు మంగళవారం కన్వీనర్ కోటా సీట్ల కోసం దరఖాస్తు చేసుకున్న 16,679 మంది విద్యార్థుల ప్రాథమిక మెరిట్ జాబితాను కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. ...మిగతా 2లో



ఇకపై ఎక్కడా
ఆక్రమణలు జరగొద్దు

ఓఆర్ఆర్ లోపల చెరువులు, నాలాల వివరాలు సేకరించాలి

- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించాలి
- సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి
- అర్హులైన పేదలకు రెండు పడకగదుల ఇళ్లు లేదా ప్రత్యామ్నాయం చూపించాలి
- దసరాలోపు కేంద్రానికి మెట్రో విస్తరణపై డీపీఆర్
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ఈనాడు - హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో అవుటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) లోపల ఉన్న ప్రతి చెరువు, నాలాల్లో ఆక్రమణల వివరాలు సేకరించాలని, అంతటా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించాలని, సంబంధిత పూర్తిస్థాయి నివేదికను ఇవ్వాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇకపై ఎక్కడా ఆక్రమణలకు గురికాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని, అన్ని చెరువుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని అన్నారు. ఆక్రమిత చెరువులు, నాలాలతో పాటు మూసీ పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న అర్హులైన పేదల వివరాలు సేకరించాలని చెప్పారు. ఆయా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి రావద్దని, వారికి రెండు పడకగదుల ఇళ్లు కేటాయించాలని లేదా మరో ప్రత్యామ్నాయం చూపించాలని ఆదేశించారు. దసరాలోపు మెట్రో విస్తరణ మార్గానికి సంబంధించి పూర్తిస్థాయి డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలని సూచించారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గానికి సంబంధించి పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. పురపాలక ముఖ్య కార్యదర్శి దానకిశోర్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. ...మిగతా 2లో

700 మంది ఏఈఈలకు నియామక పత్రాలు

- రేపు జలసౌధలో అందజేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి 9లో



ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు తోడ్పాటు

- జెలెన్‌స్కీతో భేటీలో మోదీ 11లో
- ముగిసిన అమెరికా పర్యటన

డీఎస్సీ-2008 బాధితులకు కొలువులు

- కాంట్రాక్టు విధానంలో ఎస్జీటీలుగా నియామకం 9లో
- 2,367 మందికి అవకాశం



పాతాళంలో నీళ్లు.. విద్యార్థినుల కన్నీళ్లు

బకెట్లను వరుసలో పెట్టి నీళ్ల కోసం విద్యార్థినులు వేచిచూస్తున్న ఈ చిత్రం కామారెడ్డి జిల్లా పిట్లం కేజీబీవీ పాఠశాలలోనిది. భూగర్భ జల మట్టం పడిపోవడంతో నీళ్లు పై అంతస్తులో ఉన్న ట్యాంకులోకి వెళ్లడం లేదు. బడి ఆవరణలో ఉన్నపైపుల ద్వారా నీటిని బకెట్లలో నింపి పైకి మోసుకెళ్తున్నారు. పాఠశాలలో 305 మంది విద్యార్థినులున్నారు. —న్యూస్‌టుడే, పిట్లం



ఎఫ్‌టీఎల్ ఎంత వరకు?

- నిర్ధారించే పనిలో కలెక్టర్లు నిమగ్నం
- ఇప్పటికే 71 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్
- నెలరోజుల్లో తుది నిర్ధారణకు ఏర్పాట్లు

ఈనాడు హైదరాబాద్: ఒకవైపు జీహెచ్ఎంసీ పరిధిలోని నీటివనరుల్లో ఆక్రమణలను హైడ్రా కూల్చివేస్తుండగా, మరోవైపు ఔటర్ రింగ్ రోడ్డు బయట చెరువులకు పూర్తిస్థాయి నీటిమట్టం(ఎఫ్‌టీఎల్) నిర్ధారించి, నోటిఫికేషన్లు జారీ చేయడంలో ఐదు జిల్లాల కలెక్టర్లు నిమగ్నమయ్యారు. ఇప్పటికే 71 చెరువులకు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించి, ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేశారు. ...మిగతా 2లో

కోర్‌ను కాపాడుదాం

- ఆర్థిక ప్రోత్సాహకాలు అందించే యోచనలో సర్కారు
- బీటెక్ సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు
- సీఐఐ, ఫిక్కీ, క్రెడాయ్ తదితర సంస్థల సహకారంతో నియామకాలు పెంచే యత్నాలు




ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజినీరింగ్ అంటే సీఎస్ఈ, ఐటీ సంబంధిత గ్రూపులే అన్నట్లు పరిస్థితులు మారిన నేపథ్యంలో కోర్ బ్రాంచీలను కాపాడుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. కొన్ని నెలలుగా ఈ దిశగా సమాలోచనలు జరుపుతున్న విద్యాశాఖ దానిపై ఒక ప్రణాళికను సిద్ధం చేస్తోంది. బీటెక్ సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో చేరే వారికి అన్ని విధాలా సహకరించాలని భావిస్తోంది. ఏటా కోర్ బ్రాంచీల్లో నాలుగో వంతు సీట్లు కూడా నిండడం లేదు. అదే సమయంలో కంప్యూటర్, ఐటీ తదితర వాటిల్లో దాదాపు 90 శాతం సీట్లు భర్తీ అవుతున్నాయి.

10 వేల మంది విద్యార్థుల ఎంపిక

బీటెక్, పాలిటెక్నిక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్ బ్రాంచీల్లో ప్రతిభావంతులు చేరేలా ప్రోత్సహించాలని ఏఐసీటీఈ నిర్ణయించింది. ఆ మేరకు దేశవ్యాప్తంగా 5వేల మంది ఇంజినీరింగ్, మరో 5 వేల మంది పాలిటెక్నిక్ డిప్లొమా విద్యార్థులను వారి ఇంటర్ మార్కుల ఆధారంగా ఎంపిక చేయనుంది. ఇంజినీరింగ్ విద్యార్థులకు సంవత్సరానికి రూ.18 వేలు, డిప్లొమా విద్యార్థులకు రూ.12 వేల చొప్పున ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించింది. ...మిగతా 2లో

హైదరాబాద్ ఇక చిప్‌నగరం!

- మైక్రోచిప్‌ల తయారీకి ప్రయోగాలు
- ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రతిష్ఠాత్మక పరిశోధన
- మరో రెండు నెలల్లో పూర్తయ్యే అవకాశం



ఈనాడు - హైదరాబాద్

మనం వాడుతున్న సెల్‌ఫోన్, చేతికి పెట్టుకుంటున్న స్మార్ట్‌వాచ్, ఇంట్లో చూస్తున్న టీవీ, దాన్ని ఆపరేట్ చేసే రిమోట్, కార్యాలయాల్లో ఉపయోగిస్తున్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మనం ప్రయాణిస్తున్న కార్లు, విమానాలు, మనదేశం అంతరిక్షంలోకి పంపిస్తున్న రాకెట్లు, మనకు వాతావరణ వివరాలు చేరవేస్తున్న ఉపగ్రహాలు... ఇలా అన్నింట్లోనూ చిప్‌లది అత్యంత కీలక భూమిక. వీటి దిగుమతికి మనదేశం ఏటా లక్షల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. ఈ సమస్యకు మన ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిష్కారం చూపనుంది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్ పరిశ్రమలకు చిరునామాగా మారిన హైదరాబాద్‌ను 'చిప్'నగరంగా మార్చేందుకు అడుగులు వేస్తోంది.

తైవాన్‌కు పోటీ ఇచ్చేలా పథకం

మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో మైక్రోచిప్‌ల వినియోగం అధికం. ఇవిలేకుంటే తయారీ రంగం కుదేలవుతుంది. గత ఆర్థిక సంవత్సరం(2022-23)లో రూ.1,29,703 కోట్ల విలువైన చిప్‌లను మనదేశం దిగుమతి చేసుకుందంటేనే వీటి ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. మైక్రోచిప్‌ల తయారీకి విశ్వవ్యాప్త చిరునామా తైవాన్. భారత్‌తోపాటు మరికొన్ని దేశాల్లో 3-5 మిల్లీమీటర్ల(ఎంఎం) పరిమాణంలో ఉండే చిప్‌లు కొంతమేర తయారవుతున్నాయి. తైవాన్‌లో మాత్రమే ఒక ఎంఎం పరిమాణంలో ఉండేవి ఉత్పత్తి అవుతున్నాయి. ...మిగతా 2లో

అక్టోబరు 16న విచారణకు రావాలి

ఓటుకు నోటు ఈడీ కేసులో సీఎం రేవంత్‌ను ఆదేశించిన నాంపల్లి కోర్టు

ఈనాడు, హైదరాబాద్: ఓటుకు నోటు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నమోదు చేసిన కేసులో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఇతర నిందితులు అక్టోబరు 16న కోర్టుకు హాజరుకావాలని నాంపల్లి కోర్టు ఆదేశించింది. మంగళవారం జరిగిన విచారణకు మత్తయ్య ఒక్కరే హాజరవ్వగా రేవంత్‌రెడ్డి, ఉదయ్‌సింహా, వేం కృష్ణకీర్తన్, సండ్ర వెంకట వీరయ్య, సెబాస్టియన్ హాజరుకాలేదు. దీంతో నాంపల్లి కోర్టు అసహనం వ్యక్తం చేసింది. అనంతరం మంగళవారం నాటి విచారణకు మినహాయింపు ఇవ్వాలన్న నిందితుల అభ్యర్థనను అంగీకరించిన కోర్టు.. తదుపరి విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. విచారణను అక్టోబరు 16కు వాయిదా వేసింది.

ఇకపై ఎక్కడా ఆక్రమణలు జరగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

"అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న చెరువులు, కుంటల పరిరక్షణను బాధ్యతగా చేపట్టాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని వాటిని కాపాడుకోవాలి. ఇకపై చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురికాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలి. అదే సమయంలో నిజమైన, అర్హులైన పేదలకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి. పాత బస్తీ మెట్రో విస్తరణ పనులను వేగంగా చేపట్టాలి. మెట్రో మార్గాలకు సంబంధించిన భూసేకరణ, ఇతర అడ్డంకులుంటే వాటిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించి, పరిష్కరించాలి" అని సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట సహా మెట్రో విస్తరణకు సంబంధించి పలు అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు.

ఎంబీబీఎస్ కౌన్సెలింగ్ షురూ

(మొదటి పేజీ తరువాయి)

జాబితాపై అభ్యంతరాలుంటే బుధవారం సాయంత్రం ఐదు గంటల్లోపు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా తెలియజేయాలని వర్సిటీ వైస్ ఛాన్సలర్ బి.కరుణాకర్‌రెడ్డి తెలిపారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం గురువారం తుది మెరిట్ జాబితాను విడుదల చేసి, అదేరోజు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఈమేరకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని సూచించారు. గత ఏడాదికి సంబంధించిన సీట్ల కేటాయింపు వివరాలు వైద్య కళాశాలల వారీగా వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

స్థానికతపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు...

ఈ ఏడాది ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకునే వారిలో... ఇంటర్‌కు ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివితే మాత్రమే స్థానికులుగా గుర్తించేలా జారీ చేసిన జీవో 33పై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దాంతో స్థానికతకు సంబంధించిన మార్గదర్శకాలను కొత్తగా రూపొందించాలని హైకోర్టు ఆదేశించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు గత శుక్రవారం కౌన్సెలింగ్ ప్రక్రియకు అనుమతిస్తూ, కోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని ఆదేశించింది. హైకోర్టు ఉత్తర్వులను సైతం పరిగణనలోకి తీసుకోవాలంది. సుప్రీంకోర్టు తీర్పుపై న్యాయశాఖ సమీక్ష, సూచనల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కౌన్సెలింగ్‌కు అనుమతించింది. కోర్టును ఆశ్రయించిన 135 మంది విద్యార్థుల మెరిట్ జాబితాను ప్రత్యేకంగా విడుదల చేసింది.

మొత్తం 8,900 ఎంబీబీఎస్ సీట్లు

రాష్ట్రంలోని 34 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 4,090 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. వాటిలో 15% సీట్లు ఆలిండియా కోటాలో భర్తీ అవుతాయి. మిగిలిన అన్ని సీట్లు రాష్ట్ర విద్యార్థులకు కౌన్సెలింగ్‌లో అందుబాటులో ఉంటాయి. ప్రైవేటు కళాశాలల్లో మరో 4,810 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం కన్వీనర్ కోటాలో భర్తీ అవుతాయి. మిగిలినవి బీ, సీ కేటగిరీ సీట్లుగా అందుబాటులో ఉంటాయి.



వారితో వాదిస్తే మీకే నష్టం

సమాజంలో అందరి తెలివితేటలు ఒకే స్థాయిలో ఉండవు. ఇతరులతో వాదనలకు దిగే ముందు ఈ విషయాన్ని గుర్తుతెచ్చుకోండి. అవతలివారికి మీ స్థాయిలో అవగాహన, అర్థం చేసుకునే శక్తి లేనప్పుడు వారితో వాదనకు దిగడం వల్ల మీరే నష్టపోతారు. కాబట్టి- అలా అనవసరపు వాదోపవాదాలకు దిగడానికి బదులు.. ఆ శక్తిని ముఖ్యమైన పనుల కోసం ఉపయోగించుకోండి. - వివేక్ సింఘాల్, ఇన్వెస్టర్

అదిగో.. అల్లదిగో.. మహాప్రసాదం!





శ్రీవారి ఆలయానికి ఆగ్నేయంలో 'పోటు'

శ్రీవారి గర్భాలయానికి ఆగ్నేయంలో ఉన్న 'పోటు' (వంటశాల)లో తయారుచేసిన ప్రసాదాలను.. ముందుగా వకుళమాతకు చూపించి, అనంతరం స్వామి వారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

లడ్డూ తయారీకి 'దిట్టం'

లడ్డూల తయారీకి వినియోగించే వస్తువులు, సరకులను ఏది ఎంత మోతాదులో వాడాలో సూచించేదే 'దిట్టం'. తొలిసారిగా 1950లో దిట్టంను నిర్ణయించారు. 2001లో సవరించిన దిట్టాన్ని తితిదే ప్రస్తుతం అనుసరిస్తోంది. దీనినే పడితరం దిట్టం స్కేలుగా కూడా పిలుస్తున్నారు. పడి అంటే 51 వస్తువులు. పడికి కావలసిన వస్తువులను 'దిట్టం'గా ఉంచుతారు. ఇలా ఉగ్రాణం (శ్రీవారి స్టోర్) నుంచి సరకులు సమకూరుస్తారు.

- 2001 దిట్టం ప్రకారం.. 5,100 లడ్డూల తయారీకి 803 కిలోల సరుకులు వినియోగిస్తున్నారు.
- ప్రస్తుతం 3.50 లక్షల లడ్డూల తయారీకి అవసరమైన దిట్టాలను పోటుకు అందిస్తున్నారు.

'పొగ' కారణంగా బూందీపోటు

తొలినాళ్లలో లడ్డూలను కట్టెల పొయ్యి మీద తయారుచేసేవారు. శ్రీవారి ఆలయ పోటులో పొగ అధికం కావడంతో గ్యాస్ పొయ్యిలను వినియోగిస్తున్నారు. 15ఏళ్ల క్రితం బూందీపోటును ఆలయానికి వెలువల ఉత్తరభాగాన ఏర్పాటుచేశారు. బూందీని వెలుపల తయారుచేసి, కన్వేయర్ బెల్టు ద్వారా ఆలయానికి తీసుకెళ్లి ఆగమోక్తంగా స్వామివారి ప్రాకారం లోపలే లడ్డూలు తయారుచేస్తున్నారు. తర్వాత ట్రేల ద్వారా ఆలయం వెలుపల లడ్డూ కేంద్రానికి కన్వేయర్ బెల్టు ద్వారానే తరలిస్తున్నారు.

- చిన్న లడ్డూ: 140- 170 గ్రాములు
- కల్యాణం లడ్డూ: 700 గ్రాములు
- రోజుకు తయారయ్యే చిన్న లడ్డూలు: 3.5 లక్షలు
- రోజుకు తయారయ్యే కల్యాణం లడ్డూలు: 7100
- రోజుకు తయారయ్యే వడలు: 4 వేలు
- రోజుకు తయారయ్యే మినీ లడ్డూలు(ఉచిత పంపిణీకి): 1,07,100



శ్రీవారి అన్నప్రసాదాలు



శ్రీవారి లడ్డూప్రసాదం విక్రయ కేంద్రం లోపల దృశ్యం



శ్రీవారి సీరా ప్రసాదం

శ్రీనివాసునికి 50 రకాల ప్రసాదాలు

శ్రీనివాసునికి ఆగమశాస్త్రంలో నిర్దేశించినట్లు 50 రకాల ప్రసాదాలను నివేదిస్తున్నారు. స్వామికి నివేదించే ప్రసాదాల్లో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. వెయ్యేళ్ల క్రితం శ్రీరామానుజాచార్యులు నిర్దేశించిన నిబంధనల ప్రకారం శ్రీవారికి నైవేద్యం ఇప్పటికీ సమర్పిస్తున్నారు. సుప్రభాతం సేవ నుంచి రాత్రి ఏకాంతసేవ వరకు ప్రసాద నివేదనలు జరుగుతాయి. రోజూ జరిగే నిత్యసేవల వివిధ రకాల నివేదన సమర్పిస్తారు.

- సుప్రభాత సమయంలో నవనీతం, గోక్షీరంతో తయారుచేసిన పదార్థాలను నివేదిస్తారు.
- తోమాల పూర్తయిన తర్వాత కొలువు సమయంలో నల్లనువ్వులు, బెల్లం, శొంఠి నైవేద్యంగా సమర్పిస్తారు.
- సహస్రనామార్చన తర్వాత జరిగే మొదటిగంటలో మీగడ, వెన్న, పెరుగుతో తయారుచేసిన అన్నాన్ని స్వామివారికి నివేదిస్తారు.
- రోజువారీ చిత్రాన్నం, దద్ధోజనం, క్షీరాన్నం, కదంబం, పాయసాన్నం స్వామివారికి సమర్పిస్తారు.
- మధ్యాహ్నం ఆరాధనలో నాదుకం, లడ్డూ, దోసె, వడ, అప్పం నైవేద్యంగా పెడతారు.
- సాయంకాలం అష్టోత్తర శతనామార్చన తర్వాత శుద్ధన్నం, సీరా నివేదన జరుగుతుంది.
- రాత్రి నైవేద్య సమయంలో తోమాల తర్వాత మిరియాలతో తయారుచేసిన మరీచ్యాన్నం, ఉడాన్నం నివేదిస్తారు.
- రాత్రి ఆరాధన తర్వాత ఏకాంతసేవలో పాయసం నైవేద్యంగా పెడుతున్నారు.

803 కిలోల 'దిట్టం'లో సరకులు ఇవీ

ఆవునెయ్యి:	165 కిలోలు
శనగపిండి:	180 కిలోలు
ముంతమామిడి(జీడి):	30 కిలోలు
చక్కెర:	400 కిలోలు
ఎండు ద్రాక్ష:	16 కిలోలు
కలకండ:	8 కిలోలు
యాలకులు:	4 కిలోలు

సహకార డెయిరీల నుంచే నెయ్యి

గతంలో సహకార రంగంలోని విజయ, నందిని డెయిరీల నుంచి డబ్బాల రూపంలో నెయ్యి సరఫరా అయ్యేది. లక్ష వరకు లడ్డూలు తయారుచేస్తున్న రోజుల్లో డబ్బాలతోనే నెయ్యి సరఫరా కాగా, యాత్రికుల సంఖ్యకు అనుగుణంగా లడ్డూల తయారీ పెంచారు. నెయ్యి వినియోగం భారీగా పెరగడంతో ట్యాంకర్ల ద్వారా సరఫరా ప్రారంభించారు.

శ్రీవారికి నివేదించే వివిధ రకాల ప్రసాదాలు: పొంగలి, చక్కెర పొంగలి, పులిహోర, దద్ధోజనం, కేసరిబాత్, మిరియాల అన్నం, కదంబం, పాయసం, కేసరి, లడ్డూ, వడ, అప్పం, జిలేబీ, పోలి, బెల్లపు దోశ, అమృతకలశం, దోశ, నెయ్యి దోశ, వడపప్పు, పానకం, ధనుర్మాసంలో ప్రత్యేక ప్రసాదాలు.

ఎఫ్‌టీఎల్ ఎంత వరకు?

(మొదటి పేజీ తరువాయి)

ఎఫ్‌టీఎల్ వివరాలతోపాటు మ్యాప్‌లను కూడా జత చేసి హెచ్ఎండీఏకి కలెక్టర్లు పంపించారు. వీటిని నోటిఫై చేసి అభ్యంతరాలుంటే 30 రోజుల్లో తెలపాలని హెచ్ఎండీఏ కోరింది. చెరువులు, ఇతర నీటి వనరులను సంరక్షించడానికి లేక్ ప్రొటెక్షన్ కమిటీ(ఎల్‌పీసీ) 2010లోనే ఏర్పాటైనప్పటికీ పూర్తిస్థాయిలో పనిచేయలేదు. ఈ కమిటీ నీటివనరుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తించి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయాలి. 30 రోజుల్లో అభ్యంతరాలను స్వీకరించి తుది నోటిఫికేషన్ జారీ చేయాలి. అనంతరం రక్షణ చర్యలు చేపట్టాలి. అయితే కొన్ని చెరువులవి మాత్రమే తుది నోటిఫికేషన్ వరకు వచ్చాయి. ప్రాథమిక నోటిఫికేషన్ కూడా పూర్తి స్థాయిలో జరగలేదు. ప్రస్తుత ప్రభుత్వం నీటివనరుల్లో ఆక్రమణలు తొలగించి వాటిని రక్షించడంతోపాటు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించే ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించింది. నదులతోపాటు చెరువులు, లేక్‌లు, ఇతర నీటి వనరుల్లో ఎఫ్‌టీఎల్ వరకు ఎలాంటి నిర్మాణాలను అనుమతించరాదని 2012, 2016లో పురపాలకశాఖ వేర్వేరు జీవోలు ఇచ్చింది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లోనూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని, బఫర్‌జోన్‌లు రిక్రియేషన్‌కు సంబంధించినవి మాత్రమేనని పేర్కొంది. దీని ప్రకారం... నగరపాలక సంస్థలు, పురపాలక, నగర పంచాయతీలు, హెచ్ఎండీఏ ప్రాంతాల్లో నది సరిహద్దుకు 50 మీటర్ల వరకు బఫర్ జోన్ ఉంటుంది. 2016లో పురపాలకశాఖ ఇచ్చిన జీవో-7 ప్రకారం నీటిపారుదల, రెవెన్యూ శాఖలు ఈ సరిహద్దును నిర్ణయించాలి. పది హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న లేక్‌లు, చెరువులు, కుంటల్లో ఎఫ్‌టీఎల్ నుంచి 30 మీటర్ల వరకు బఫర్‌జోన్ ఉంటుంది. ఈ 30 మీటర్లలో 12 అడుగుల మేర వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేసుకోవచ్చు. పది హెక్టార్ల కంటే తక్కువ విస్తీర్ణమున్న నీటి వనరులకు తొమ్మిది మీటర్ల వరకు బఫర్‌జోన్ ఉంటుంది. 10 మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణమున్న కాలువలు, వాగులు, నాలాలు మొదలైన వాటికి నిర్ణయించిన సరిహద్దు నుంచి తొమ్మిది మీటర్లు, పది మీటర్ల వరకు వెడల్పు ఉంటే రెండు మీటర్ల బఫర్ జోన్ ఉంటుంది. ఎఫ్‌టీఎల్ సరిహద్దులను మ్యాప్‌ల ఆధారంగా నీటిపారుదలశాఖ గుర్తించి, సర్వే నంబర్ల ఆధారంగా రెవెన్యూ శాఖ పరిశీలించి సర్టిఫై చేయాలి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని ఓఆర్ఆర్ బయట ఉన్న 71 చెరువులకు ఆయా జిల్లాల కలెక్టర్ల నివేదికల ఆధారంగా ఈ నెలలోనే ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేశారు. ఇందులో రంగారెడ్డి జిల్లాలో ఏడు, సంగారెడ్డి జిల్లాలో పది, సిద్దిపేట జిల్లాలో 20, మేడ్చల్-మల్కాజిగిరిలో 27, యాదాద్రి-భువనగిరి జిల్లాలో ఐదు చెరువులు ఉన్నాయి.

కోర్‌ను కాపాడుదాం!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం కూడా వారికి ఆర్థిక సహకారం అందించాలని భావిస్తోంది. దానిపై త్వరలోనే నిర్ణయాన్ని ప్రకటించనుంది.

◆ ఆ బ్రాంచీల్లో చేరిన వారికి తప్పనిసరిగా ఇంటర్న్‌షిప్ కల్పించాలని భావిస్తోంది. వారికి ఉద్యోగావకాశాలు పెంచేందుకు భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఫిక్కీ, క్రెడాయ్ సంస్థల సహకారం తీసుకోనుంది. దీనిపై వారం క్రితమే క్రెడాయ్ ప్రతినిధులతో రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్, కార్యదర్శి సంప్రదింపులు జరిపారు.

◆ కోర్ బ్రాంచీలను కాపాడుకోవాలన్న లక్ష్యంతో సిలబస్‌లోనూ మార్పులు చేయాలని భావిస్తున్నారు. దీనిపై సబ్జెక్టు నిపుణులు, కంపెనీల ప్రతినిధులతో దసరా తర్వాత సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు.

ప్రాంగణ నియామకాలపై గ్యారంటీ ఇస్తేనే...

ప్రస్తుతం కోర్ బ్రాంచీలపై ప్రత్యేక ఆసక్తి ఉన్న వారితోపాటు ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా పెట్టుకున్న వారే వాటిలో చేరుతున్నారు. చివరకు వారిలోనూ ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్, ఐటీ కంపెనీల్లో చేరుతున్నారు. ప్రాంగణ నియామకాలకు కోర్ కంపెనీలు చాలా తక్కువగా వస్తున్నాయి. తక్కువ వేతన ప్యాకేజీని ఆఫర్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నియామకాలపై విద్యార్థులకు భరోసా ఇవ్వకుంటే, మంచి ప్యాకేజీలు రాకుంటే ప్రవేశాల సంఖ్య పెరగదని కొందరు నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో సెమీకండక్టర్ పరిశ్రమలు పెద్ద ఎత్తున ఏర్పాటవుతున్నందున ఎలక్ట్రికల్ బ్రాంచి విద్యార్థులకు ఉద్యోగాల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందని జేఎన్‌టీయూ హెచ్ సీనియర్ ఆచార్యుడు, ఆర్ అండ్ డీ విభాగం సంచాలకుడు కామాక్షిప్రసాద్ అభిప్రాయపడ్డారు.

కోర్ బ్రాంచీల్లో సీట్ల వివరాలివీ (బీ కేటగిరీ సహా)

సంవత్సరం	కోర్	ప్రవేశాలు-శాతం
2020-21	40,355	22,916(34.87)
2021-22	48,776	45,377(32.66)
2022-23	41,011	21,982(26.69)
2023-24	36,991	21,424(23.54)
2024-25	34,000	9,000 (కన్వీనర్ కోటా మాత్రమే)

హైదరాబాద్ ఇక 'చిప్'నగరం!

(మొదటి పేజీ తరువాయి)

దాంతో అన్ని దేశాలు వాటిపై అధికంగా ఆధారపడుతున్నాయి. కరోనా సమయంలో వీటి ఎగుమతి ఆగిపోవడంతో ప్రపంచ ఆర్థికవ్యవస్థకు నష్టం వాటిల్లింది. దాంతో ఈ మార్కెట్‌ను సొంతం చేసుకోవడానికి చైనా శతథా ప్రయత్నిస్తోంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉత్పత్తి కేంద్రమైన మనం... వీటిని సొంతంగా ఎందుకు తయారు చేసుకోకూడదనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల క్రితం చిప్-టు-స్టార్టప్ పథకాన్ని ప్రకటించింది. దీనికి ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాలలోని ఎలక్ట్రానిక్స్ విభాగం స్పందించింది.

ఒక్క ఆలోచన రూ.5 కోట్లు తెచ్చింది

తైవాన్‌కు దీటుగా మనకున్న వనరులతో ఫ్రీక్వెన్సీ సింథసైజర్‌ను రూపొందించాలన్న లక్ష్యంతో వర్సిటీ ఎలక్ట్రానిక్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పరిశోధక విద్యార్థులు రంగంలోకి దిగారు. రెండు మిల్లీమీటర్ల పరిమాణంలో తయారు చేస్తామని, అది గిగాహెర్ట్జ్‌ల సామర్థ్యంతో పనిచేస్తుందని నివేదిక సమర్పించారు. పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది. దాంతో ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాల... హైదరాబాద్‌లోని మరో ఇంజినీరింగ్ కళాశాల, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తున్న మూడు ప్రముఖ సంస్థలను భాగస్వాములుగా చేసుకుంది. దానికి తగిన సాఫ్ట్‌వేర్‌ను కేంద్రమే సమకూర్చింది. బెంగళూరులోని సీ-డాక్ సంస్థ చిప్‌ల ఫ్రీక్వెన్సీ ఎలా ఉండాలన్న అంశాలపై పరిశోధక బృందానికి శిక్షణ ఇచ్చింది.



పరిశోధనలు చేస్తున్న ఓయూ విద్యార్థులు

ఇదో విప్లవాత్మక ముందడుగు



కరోనా సమయంలో ఎదురైన పరిస్థితులు భవిష్యత్తులో తలెత్తకూడదనే లక్ష్యంతో ఫ్రీక్వెన్సీ సింథసైజర్ చిప్‌లను తయారు చేస్తున్నాం. ఇవి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాక.. చిప్‌ల కోసం విదేశాలపై ఆధారపడటం బాగా తగ్గిపోతుంది. రానున్న 3-5 సంవత్సరాల్లో 20% చిప్‌ల దిగుమతి తగ్గొచ్చు. భారత ఎలక్ట్రానిక్స్ రంగంలో ఇదో విప్లవాత్మక ముందడుగు. వీటి తయారీ వాణిజ్య తరహాలో మొదలయ్యాక... మార్కెట్‌లో అమ్ముడయ్యే ప్రతి చిప్‌పై ఉస్మానియా వర్సిటీకి రాయల్టీ వస్తుంది.

– ప్రొఫెసర్ చంద్రశేఖర్, ప్రిన్సిపల్, ఓయూ ఇంజినీరింగ్ కళాశాల

దీంతో ఉస్మానియా వర్సిటీలో 2023 జనవరిలో పరిశోధన ప్రారంభించారు. ఈ ఏడాది ఆగస్టులో 90% పూర్తి చేశారు. మరో రెండు నెలల్లో చిప్ తయారీ పూర్తయ్యే అవకాశాలున్నాయి.

మూడు ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలకు సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్ర నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు చేపట్టినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో) సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన జిల్లా ఎన్నికల అధికారులు, ఓటు నమోదు అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ... "మెదక్- నిజామాబాద్- ఆదిలాబాద్-కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్ర నియోజకవర్గాలకు, వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీల పదవీకాలం వచ్చే మార్చి 29న ముగుస్తుంది. వాటికి ఎన్నికలను నిర్వహిస్తాం. ఈ నెల 30న కొత్త ఓటర్ల నమోదుకు ప్రకటన ఇస్తాం. నవంబరు 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. సహాయ నవంబరు 23న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తాం. డిసెంబరు 30న తుది జాబితా విడుదల చేస్తాం" అని తెలిపారు.

గ్రహం అనుగ్రహం

25-9-2024 బుధవారం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయణం; వర్ష రుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం

అష్టమి: సా. 5-00 తదుపరి నవమి
ఆర్ద్ర: తె. 3-40 తదుపరి పునర్వసు
వర్జ్యం: మ. 12-10 నుంచి 1-46 వరకు
అమృత ఘడియలు: సా. 5-44 నుంచి 7-19 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-28 నుంచి 12-16 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ. 5.52; **సూర్యాస్తమయం:** సా.5.53

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నిజామాబాద్	34.4	23.7
ఖమ్మం	33.4	25.6
రామగుండం	32.2	26.4
సూర్యాపేట	31.5	26.5
మెదక్	31.4	21.2
కరీంనగర్	31.0	23.0
హనుమకొండ	31.0	21.5
హైదరాబాద్	30.9	23.7
ఆదిలాబాద్	29.8	24.2
నల్గొండ	29.0	23.4
మహబూబ్‌నగర్	27.1	23.5

పౌర సేవలు సులభతరం.. సత్వరం

- ప్రతిష్ఠాత్మకంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ప్రాజెక్టు
- నాలుగు రాష్ట్రాల్లో అధ్యయనానికి అధికారుల బృందాలు

ఈనాడు, హైదరాబాద్: ఒక రాష్ట్రం.. ఒకే డిజిటల్ కార్డు కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ప్రజలు సులభంగా, వేగంగా రాష్ట్రంలో ఎక్కడైనా ఆయా సేవలు పొందేలా 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు'లను అందుబాటులోకి తీసుకురావడానికి కసరత్తు చేస్తోంది. మొదట డిజిటల్ హెల్త్‌కార్డులు ఇవ్వాలని నిర్ణయించినా.. సమీకృత డిజిటల్ కార్డులను ప్రతి కుటుంబానికి ఇస్తే మరింత ప్రయోజనం ఉంటుందని తాజాగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక, హరియాణా రాష్ట్రాల్లో అమలవుతున్న డిజిటల్ కార్డుల విధానాన్ని అధికారులు ప్రాథమికంగా పరిశీలించారు. వాటన్నింటిని అధ్యయనం చేసి తెలంగాణలో వినూత్నంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతానికి పౌరసరఫరాలు, వైద్యారోగ్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల సేవలకు ఉపయోగపడేలా కార్డులు అందించాలని నిర్ణయించినా.. ఇతర సేవలనూ అనుసంధానం చేసే అంశం పరిశీలిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా 119 పట్టణాలు, 119 గ్రామాల్లో ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందించనున్నారు.

స్వయంగా మార్పులు చేసుకునేలా..

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల్లో ప్రత్యేక చిప్‌లను అమర్చనున్నారు. ఇందులో కుటుంబ యజమాని పేరు, ఫొటో, ఆధార్ సంఖ్య, ఫోన్ నంబరు తదితర వివరాలు ఉంటాయి. ప్రజలు వీటి సాయంతో మీసేవ కార్యాలయానికి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సరిపోయేలా వెసులుబాటు కల్పించనున్నట్లు సమాచారం. పెళ్లయిన యువతి పేరును ఆమె పుట్టింటి రేషన్‌కార్డు నుంచి తీసి, భర్త కుటుంబ కార్డులో చేర్చడం వంటి సేవలను ఆన్‌లైన్‌లో లబ్ధిదారులే స్వయంగా చేసుకునేలా అవకాశం కల్పించనున్నారు. ఎక్కడ రేషన్ తీసుకోవాలో కూడా ఎంచుకునే వీలుంటుంది.

కర్ణాటకలో ఇలా..

కర్ణాటకలో కుటుంబాలకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ద్వారా ఒక ఏకీకృత నిర్వహణ వ్యవస్థను అమలు చేస్తున్నారు. లబ్ధిదారుల సమాచారం తీసుకోవడం, అర్హతలను తనిఖీ చేయడం, అర్హులను గుర్తించి సేవ, పథకాన్ని మంజూరు చేయడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టు రూపొందించారు. ఇందుకు అందుబాటులో ఉన్న వివిధ శాఖల డేటాబేస్‌ను ఉపయోగిస్తున్నారు.

రెండు రోజులపాటు పరిశీలన

కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్, హరియాణా రాష్ట్రాల్లో అధ్యయనం కోసం ఉన్నతాధికారులతో బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. రాజస్థాన్‌లో పరిశీలనకు పౌర సరఫరాల శాఖ ముఖ్యకార్యదర్శి డి.ఎస్.చౌహాన్, ఐఏఎస్ అధికారి భవేశ్‌మిశ్ర ఇతర అధికారుల బృందం బుధవారమే వెళ్లనుంది. మహారాష్ట్ర, కర్ణాటక, హరియాణాలకు వెళ్లాల్సిన బృందాలు నేడోరేపో ఖరారవుతాయి. ఆయా రాష్ట్రాల్లో వీరు రెండు రోజులపాటు అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు.


మన మెడికవర్ హాస్పిటల్స్
ఇప్పుడు నమ్మ బెంగళూరు లో!
శ్రీ సిద్దరామయ్య గారు
గౌరవ కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు
మెడికవర్
హాస్పిటల్స్
వైట్ ఫీల్డ్స్
గౌరవ కర్ణాటక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు,
శ్రీ డి. కె. శివకుమార్ గారి
చేతుల మీదుగా ప్రారంభోత్సవం
తేది: 25 సెప్టెంబరు 2024
సమయం: ఉ. 11:30 ని॥లకు
విశిష్ట అతిథులు
శ్రీ సతీష్ జర్కిహొళి గారు
కర్ణాటక రాష్ట్ర పి.డబ్ల్యు.డి శాఖామాత్యులు
శ్రీ దినేష్ గుండు రావు గారు
కర్ణాటక రాష్ట్ర వైద్యారోగ్య,
కుటుంబ సంక్షేమ శాఖామాత్యులు
MEDICOVER HOSPITALS
మెడికవర్ హాస్పిటల్స్
గౌరవ అతిథులు
శ్రీ బసవరాజ్ బొమ్మై గారు
ఎం పి - హావేరి, కర్ణాటక రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు
శ్రీమతి మంజుల అరవింద్ లింబావళి
ఎమ్మెల్యే - మహాదేవపుర నియోజకవర్గం (బెంగళూరు)
శ్రీ యన్. ఏ. హారిస్
ఎమ్మెల్యే - శాంతి నగర్ (బెంగళూరు)
ఆహ్వానించువారు
డా. జి. అనిల్ కృష్ణ
ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్
డా. రక్షిత్ పాలలోచన
బి. ఈ (మెకానికల్), పి. జి. డి. ఎం. ఎస్
పి హెచ్ డి- ఇమ్యునాలజీ & జెనెటిక్స్ (అంకాలజీ)
డా. ఎ. శరత్ రెడ్డి
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్
పి. హరి కృష్ణ
ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్
డా. ఎ. ఆర్. కృష్ణ ప్రసాద్
డైరెక్టర్ - మెడికవర్ హాస్పిటల్స్
మెడికవర్ బెంగళూరు ప్రత్యేకతలు
100+ ఎక్స్‌పర్ట్ డాక్టర్లు
ప్రపంచస్థాయి క్యాత్‌ల్యాబ్, రోబోటిక్స్, యం.ఆర్.ఐ, సిటి & ఆపరేషన్ థియేటర్స్ మరెన్నో ప్రత్యేకతలు
30+ స్పెషాల్టీస్
★★★★★ హాస్పిటల్స్, ప్రత్యేక సదుపాయాలు
ఇన్సూరెన్స్ & టిపిఏ లతో నగదు రహిత వైద్య సేవలు
200 కార్ పార్కింగ్ సౌకర్యం
మెడికవర్ ప్రత్యేకతలు
13 దేశాలు
40+ హాస్పిటల్స్
7000+ బెడ్స్
3000+ ఐసియు బెడ్స్
200+ ఆపరేషన్ థియేటర్స్
2 కోట్ల మందికి పైగా వైద్యం
1700+ డాక్టర్స్
45000+ ఎంప్లాయిస్
మెడికవర్ ఇండియా హాస్పిటల్స్ నెట్‌వర్క్: ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | మహారాష్ట్ర | కర్ణాటక | మరియు యూరప్‌లోని 12 దేశాలలో వైద్యసేవలు

బాధ్యులను బోనెక్కించాల్సిందే!

'తిరువీధుల మెరసీ దేవదేవుడు' అన్న దివ్యాలాపనల నడుమ తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు మరికొన్ని రోజుల్లో కన్నులపండువగా జరగనున్నాయి. ఇటువంటి విశేష వేళలో శ్రీవేంకటేశ్వరుడి లడ్డూకు సంబంధించి కఠోర వాస్తవాలు వెలుగుచూడటం యావద్భారతాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఏడుకొండల వెంకన్నస్వామి మహాప్రసాదమైన లడ్డూ తయారీకి జంతు కొవ్వులు కలగలిసిన నెయ్యి సరఫరా అయ్యిందన్న సమాచారం- అశేష భక్తజనానికి పిడుగుపాటైంది. జగన్‌మోహన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డిల ఏలుబడిలో తిరుమల పుణ్యక్షేత్ర పవిత్రత మంటగలిసింది. దశాబ్దాలుగా దేవస్థానానికి నెయ్యిని సరఫరా చేస్తున్న కర్ణాటక మిల్క్ ఫెడరేషన్‌ను కాదని జగన్ పార్టీ హయాంలో అనామక సంస్థలకు ఆ కాంట్రాక్టును కట్టబెట్టారు. నాణ్యమైన ఆవునెయ్యిని అంత తక్కువ ధరలకు అందించడం ఎవరికీ సాధ్యంకాదని చిన్నపిల్లలను అడిగినా ఇట్టే చెప్పేస్తారు. అలాంటిది సొమ్ము ఆదా పేరిట అక్రమాలకు పాల్పడటం- నిష్కృతి లేని మహాపాపం. ఘోరాపచారాలకు పాల్పడిన జగన్ ముఠా- తిరువేంకటాచలపతి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసింది!

నోటికొచ్చినట్లు అబద్ధాలాడటం- జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య. "వైకాపా అధికారంలోకి వచ్చాక టీటీడీలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. స్వామివారి ప్రసాదాలు, లడ్డూ, అన్న ప్రసాదాల్లో నాణ్యతను పెంచేందుకు అక్కడి ల్యాబ్స్‌ను పటిష్ఠపరిచాం" అని నాలుగు రోజుల క్రితం మహాగొప్పగా సెలవిచ్చారాయన. 2023 జూన్, జులై నెలల్లో కేంద్ర హోంశాఖ నిపుణుల బృందం తిరుమలలో అధ్యయనం చేసి ఓ నివేదికను రూపొందించింది. దాన్ని పరిశీలిస్తే- జగన్ పచ్చిబూటకాలరాయుడని తేలిపోతుంది. వెంగమాంబ అన్నదాన సత్రంలో వడ్డిస్తున్న ఆహారంలో శుచి, శుభ్రత, నాణ్యత లేవని... నిబంధనలను గాలికొదిలేస్తున్నారని నిపుణుల బృందం గుర్తించింది. శ్రీనివాసుడి జలప్రసాదం పరిస్థితీ అలాగే ఉందని నివేదించింది. ఆహార పదార్థాల నాణ్యతను నిర్ధారించాల్సిన ల్యాబ్‌లో పరీక్షా పరికరాలే లేవని నిపుణుల బృందం కరాఖండీగా చెప్పింది. ఈ విషయాలను దాచేస్తున్న జగన్ భజనపరులు- శ్రీవారి లడ్డూను రాగితో, పందికొవ్వు చేపనూనెలను బంగారంతో పోల్చే దుస్సాహసానికి పాల్పడ్డారు. ఒడిగట్టిన పాతకాన్ని కప్పిపుచ్చేందుకు వికృత వ్యాఖ్యలు చేస్తూ, తమ పాడుబుద్ధులను నిర్లజ్జగా బయటపెట్టుకుంటున్నారు!

జగన్ జమానాలో తిరుమలలో సాగిన అరాచకాలు అన్నీఇన్నీ కావు. కొనుగోలు టెండర్ల నిబంధనలను ఇష్టారీతిగా మార్చడం మొదలు అనవసరమైన పనులతో శ్రీనివాసుడి సొమ్ములకు ఎసరుపెట్టడం వరకు కొండ మీద చోటుచేసుకున్న అక్రమాలకు అంతేలేదు. అవన్నీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పరిశీలనలో బట్టబయలైనట్లు తెలుస్తోంది. జగన్ ఏలుబడిలోని చివరి ఆర్నెల్లలో తితిదే నిధులతో తిరుమల, తిరుపతిల్లో రూ.1400 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలవడం వెనక గూడుపుఠాణీ ఏంటో కూడా తేలాలి. కల్తీ నెయ్యితో పాటు ఇతర అక్రమాలు, అధికార దుర్వినియోగంపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) నియమిస్తున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు మొన్న ఆదివారం ప్రకటించారు. 'సిట్' సత్వరం రంగంలోకి దిగాలి. జగన్ పాలనాకాలంలో కోనేటిరాయడి దివ్యధామంలో జరిగిన అకృత్యాలన్నింటిపై లోతుగా దర్యాప్తు చేయాలి. అక్రమాలూ అపచారాలకు బాధ్యులను గుర్తించి బోనెక్కించి, కఠినంగా శిక్షించాలని యావత్ భక్తజనం ముక్తకంఠంతో కోరుకుంటోందిప్పుడు!

కప్పగంతులు ఆగుతాయా?

పార్టీ ఫిరాయింపుల నిరోధానికి హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల కీలక బిల్లు తీసుకొచ్చింది. ఫిరాయింపుల వల్ల శాసన సభ్యత్వానికి అనర్హులుగా ప్రకటితులైన ఎమ్మెల్యేల పింఛన్లను రద్దు చేయడానికి వీలుకల్పిస్తున్న బిల్లు అది. శాసనసభ్యులు అంతకుముందు తీసుకున్న పింఛన్లను కూడా వాపసు తీసుకోవడానికి ఆ బిల్లు అనుమతిస్తోంది. అది సభామోదం పొందింది.

ఈ ఏడాది ఆరంభంలో ఆరుగురు హిమాచల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ విప్‌ను ధిక్కరించి బడ్జెట్‌పై ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో భాజపా అభ్యర్థికి మద్దతు ఇచ్చారు. ఇలాంటి ధోరణులను అరికట్టడానికే కాంగ్రెస్ ప్రభుత్వం పింఛన్లపై వేటు బిల్లును తీసుకొచ్చింది. రాజ్యాంగంలోని పదో షెడ్యూలు (ఫిరాయింపుల నిషేధ చట్టం) కింద అనర్హులుగా ప్రకటితులైన శాసనసభ్యులు పింఛన్ హక్కును కోల్పోతారని బిల్లు స్పష్టం చేస్తోంది. ప్రజాతీర్పును గౌరవిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడటానికి ఫిరాయింపులను అరికట్టాల్సి ఉందని, అందుకే ఫిరాయింపుదారుల పింఛన్ల నిలిపివేతకు తమ బిల్లు అనుమతిస్తోందని కాంగ్రెస్ సర్కారు వివరించింది. 10వ రాజ్యాంగ షెడ్యూలు కింద ఎమ్మెల్యేలు ఎప్పుడు అనర్హులుగా ప్రకటితులైనా వారికి పింఛన్ రాదని బిల్లు స్పష్టీకరించింది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూలదోయడానికి సహకరించే శాసన సభ్యులకు తమ బిల్లు అడ్డుకట్ట వేస్తుందని హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు భావిస్తున్నారు.

గతంలో పార్టీ ఫిరాయింపుల జోరు ఎక్కువగా ఉన్నప్పుడు దాన్ని అడ్డుకోవడానికి రాజ్యాంగ సవరణ చేశారు. పార్లమెంటు, అసెంబ్లీ సభ్యుల అనర్హత, సీట్ల ఖాళీకి సంబంధించి రాజ్యాంగంలోని 101, 102, 190, 191 అధికరణలను అది సవరించింది. పార్టీ ఫిరాయింపుల నిషేధానికి రాజ్యాంగంలో కొత్తగా 10వ షెడ్యూలును చేర్చింది. ఒక పార్టీ తరఫున ఎన్నికైన తరవాత దాన్ని వదిలి మరో పార్టీలో చేరినా, సొంత పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా ఓటు వేసినా, విప్‌ను ధిక్కరించి ఓటింగ్‌లో పాల్గొనకపోయినా, సదరు ఎమ్మెల్యే లేదా ఎంపీ అనర్హులవుతారని పదో షెడ్యూల్ ఉద్ఘాటిస్తోంది. తరవాత అనేక రాష్ట్రాలు పదో షెడ్యూలు అమలుకు చట్టాలు చేశాయి. పార్టీ చీలికకు సంబంధించి పదో షెడ్యూలులో ఒక నిబంధన ఉంది. దాని ప్రకారం ఒక రాజకీయ పార్టీనుంచి శాసనసభకు ఎన్నికైన సభ్యుల్లో మూడోవంతు మంది విడిపోయి వేరే పార్టీగా ఏర్పడితే, వారికి ఫిరాయింపు నిషేధ చట్టం వర్తించదు. కానీ, ఈ నిబంధనను 2003లో చేసిన 91వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా తొలగించారు. ఒక పార్టీ వేరొక దానిలో విలీనమైతే, మొదటి పార్టీలో మూడింట రెండువంతుల మంది సదరు విలీనానికి ఆమోదముద్ర వేసినట్లయితే ఆ సభ్యులపై అనర్హత వేటు పడదు. లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, రాజ్యసభ ఉపాధ్యక్షులు, శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసనమండలి అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఆ పదవులకు ఎన్నిక కావడానికి ముందు తమ తమ పార్టీలకు రాజీనామా చేసినా, వారికి ఫిరాయింపు చట్టం వర్తించదు. ఇతర సభ్యులకు ఫిరాయింపు చట్టం వర్తిస్తుందా లేదా అనేది నిర్ణయించే అధికారం పైన చెప్పుకొన్న సభాపతులకు, సభాధ్యక్షులకు ఉంటుంది. పదో షెడ్యూలు కింద తీసుకునే చర్యలపై కోర్టులకు విచారణాధికారం ఉండదని మొదట్లో పేర్కొన్నారు. కానీ, ఇది 368వ రాజ్యాంగ అధికరణలోని రెండో క్లాజుకు విరుద్ధమని సుప్రీంకోర్టు తరవాత స్పష్టంచేసింది. ఆచరణకు వచ్చేసరికి పదో షెడ్యూలు పార్టీ ఫిరాయింపులను నిరోధించలేకపోయింది. ఫలానా సభ్యులు పార్టీ ఫిరాయించారని సభాపతులకు తెలియజేసినా, వారు దానిపై ఎటూ తేల్చకుండా వ్యవహారాన్ని నానబెట్టడం దీనికి చాలావరకు కారణం.




పాత రోగమే...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలోనే రాజకీయ నాయకుల గోడదూకుళ్లు మొదలయ్యాయి. 1950 నుంచి అడపాదడపా పార్టీ ఫిరాయింపులు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. వాటిని పరిశీలిస్తే- అధికారపక్షాల పంచన చేరడమే రాజకీయాల పరమార్థమని భావించే నేతలకు మనదేశంలో ఏనాడూ లోటులేదని అర్థమవుతుంది.

- 1957-67 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా 97 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌ను వదిలివెళ్లిపోయారు. అదే సమయంలో ఇతర పార్టీలకు చెందిన 419 మంది ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ గూటిలోకి వచ్చిచేరారు.
- 1967-83 మధ్యలో మనదేశంలో 2700 మంది నాయకులు పార్టీలు మారారు. వారిలో సుమారు 1900 మంది కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్నారు
- 2014-21 నడుమ దేశవ్యాప్తంగా 177 మంది ఎమ్మెల్యేలూ ఎంపీలు కాంగ్రెస్‌కు వీడ్కోలు పలికారు. పలు పార్టీలకు చెందిన 173 ప్రజాప్రతినిధులు భాజపా తీర్థం పుచ్చుకొన్నారు.

మణిపుర్ వ్యవహారంలో...

మణిపుర్ అసెంబ్లీ స్పీకర్ ఇలాగే ఫిరాయింపు వ్యతిరేక పిటిషన్లను త్రిశంకు స్వర్గంలోకి నెట్టేశారని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మణిపుర్‌లో కాంగ్రెస్ టికెట్‌పై గెలిచి భాజపాలోకి ఫిరాయించిన శాసన సభ్యుడు టి.శ్యామ్‌కుమార్‌ను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ 2017 ఏప్రిల్-జులై మధ్య స్పీకర్‌కు పలు పిటిషన్లు వచ్చాయి. ఈ కేసును నాలుగు వారాల్లో పరిష్కరించాలని సుప్రీంకోర్టు మణిపుర్ స్పీకర్‌ను కోరింది. ఇక తెలంగాణలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ముగ్గురు శాసన సభ్యులను అనర్హులుగా ప్రకటించాలన్న పిటిషన్లను స్పీకర్ నాలుగు వారాల్లో పరిష్కరించాలని ఈ సెప్టెంబరు 9న హైకోర్టు ఆదేశించింది. అలా జరగకపోతే వివాదాన్ని తానే సుమోటోగా స్వీకరించి తేలుస్తానని స్పష్టీకరించింది. మణిపుర్ స్పీకర్ వ్యవహారంలోనూ సుప్రీంకోర్టు ఇలాగే తేల్చిచెప్పింది. ఈ పరిస్థితుల్లో హిమాచల్ శాసనసభ ఆమోదించిన బిల్లు ఏ మేరకు ఫలితాలనిస్తుందన్నది వేచిచూడాల్సిందే!



వివేక్ కే అగ్నిహోత్రి
విశ్రాంత ఐఏఎస్ అధికారి, రాజ్యసభ మాజీ సెక్రటరీ జనరల్



పెన్సిల్ పాఠాలు!

హోంవర్క్ పూర్తిచేసి అప్పటివరకూ వాడిన పెన్సిల్, ఎరేజర్ లాంటి సరంజామా అంతా హడావుడిగా బ్యాగులోకి తోసేస్తున్న మనవణ్ని చూసి 'నీకో కథ చెప్పనా' అడిగింది బామ్మ.

కథలంటే ఇష్టపడే మనవడు 'చెప్పు చెప్పు' అంటూ వచ్చి పక్కన కూర్చున్నాడు. 'ఇప్పటిదాకా నువ్వు రాసుకున్నావే, ఆ పెన్సిల్ వల్ల ఎన్ని లాభాలున్నాయో తెలుసా నీకు' అడిగింది బామ్మ.

'రాసుకోవచ్చు, బొమ్మలు వేసుకోవచ్చు. అంతేకదా' చెప్పాడు మనవడు.


'అది చేసే పనులు అవే కానీ, చెప్పే పాఠాలు చాలానే ఉన్నాయి. అవి మనకెంతో ఉపయోగపడతాయి' చెప్పింది బామ్మ.

'అయితే చెప్పు మరీ' ఆసక్తిగా అడిగాడు మనవడు.

'మొదటి పాఠం... పెన్సిల్ దానంతటది రాయదు. మనం పట్టుకుని రాస్తేనే దాని ప్రయోజనం. అలాగే నువ్వు గొప్పవాడివి అయినా, పెద్ద పెద్ద పనులు చేయగల సమర్థుడివే అయినా, నీ వెన్నంటి ఉండి మార్గనిర్దేశం చేసే చెయ్యి ఒకటుందని మర్చిపోకూడదు. ఆ చెయ్యి దేవుడు కావచ్చు, అమ్మానాన్నలు కావచ్చు, ఉపాధ్యాయుడు కావచ్చు. రెండోది.. కాసేపు రాశాక పెన్సిల్ మొద్దుబారి పోతుంది. అప్పుడు షార్పెనర్ వాడతాం. అది పెన్సిల్‌ను కొంత బాధ పెట్టినప్పటికీ పదునుగా ఇంకా బాగా రాసేలా చేస్తుంది. అలాగే మనం బాధలు, దుఃఖాలను భరించడం అలవరచుకుంటే వ్యక్తిగా మనల్ని రాటుదేలుస్తాయి అవి. మూడోది.. పెన్సిల్‌తో తప్పు రాస్తే ఎరేజర్‌తో చెరిపేయవచ్చు. ఎవరూ జీవితంలో కావాలని తప్పులు చేయరు. వాటిని సరిచేసుకునే ఆలోచన ఉండాలన్నదే దాని పరమార్థం. నాలుగో పాఠం ఏంటంటే.. పెన్సిల్‌లో ముఖ్యమైన భాగం- పైకి కనిపించే చెక్క కాదు. లోపలుండే గ్రాఫైట్. అలాగే మనకి కూడా బయటి రూపం కాదు, లోపలి గుణం ముఖ్యం. చివరిదీ ముఖ్యమైనదీ... పెన్సిల్ ఉపయోగించిన ప్రతిసారీ అది కాగితం మీద ఒక గుర్తును వదులుతుంది. అలాగే జీవితంలో మనం చేసే ప్రతి పనీ ఒక గుర్తులా ఉండిపోతుందన్నది దృష్టిలో ఉంచుకోవాలి' వివరించి చెప్పింది బామ్మ.

బామ్మ చెప్పిన ఈ మాటలు ప్రఖ్యాత రచయిత పాలో కొయెలో రాసినవి. 'లైక్ ది ఫ్లోయింగ్ రివర్' అనే పుస్తకంలో పెన్సిల్ నుంచి ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన అంశాలంటూ వీటిని వివరించారు. ఒక్క పెన్సిలే కాదు, ఆలోచిస్తే సృష్టిలోని ప్రతి వస్తువూ మనకు ఏదో ఒకటి నేర్పిస్తుంది. ఆ పాఠాలు మన వ్యక్తిత్వాన్ని మలచుకునేందుకు ఎంతో దోహదపడతాయి. ఎగిరే పక్షి విమానం తయారీకి ప్రేరణ అయినట్లు- కొబ్బరి టెంక హెల్మెట్ తయారీకి స్ఫూర్తినిచ్చినట్లు... అనేక అంశాలను నిత్యజీవితం నుంచి నేర్చుకోవచ్చు.

– ర్యాలి హేమంత్ కుమార్



సైన్సు, టెక్నాలజీలు ప్రగతిసాధనకు తోడ్పడే శక్తిమంతమైన పనిముట్లు. వాటిని చాలా జాగ్రత్తగా అభివృద్ధి చేసుకుని ప్రజల జీవనప్రమాణాలను మెరుగుపరిచేందుకు వినియోగించాలి. అంతేకానీ సమాజంలో అతికొద్దిమంది సంపన్న వ్యాపారులకు లాభాలు ఆర్జించిపెట్టడానికి కాదు.

– ప్రొఫెసర్ సతీష్ ధావన్

ఆడంబరం అనవసరం

కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ వెలుగుల కన్నా దేవుడి ముందు వెలిగే చిరుదివ్వె మనసుకు ఆహ్లాదాన్నిస్తుంది. నిరాడంబర జీవితం నిజమైన ప్రశాంతతను ఇస్తుంది. నిరాడంబరత గొప్పవారి గుణం. వ్యక్తిత్వం, మాటతీరు, నడవడిక.. అన్నింట్లోనూ ఉన్నతంగా ఆలోచించగలగడమే నిరాడంబరత. వేషభాషలు, ఇతరుల పట్ల ప్రవర్తించే తీరులో ఎటువంటి డాంబికాన్ని ప్రదర్శించక పోవడం నిరాడంబరత. ఎంత సంపద ఉన్నా సంపన్నులమనే భావాన్ని మనసులోకి రానివ్వకపోవడమే నిరాడంబరత.

అల్పుడెపుడు పల్కు ఆడంబరము గాను- సజ్జనుండు పల్కు చల్లగాను... అని వేమన చెప్పినట్లు ప్రగల్భాలు పలకడం అల్పుల లక్షణం. ఆడంబరం లేని మాట, ఆహార్యం పలువురిని ఆకర్షిస్తాయి. కనుకనే వివేకానందుడి ఆహార్యం, ఉపన్యాసాలు ప్రపంచాన్ని భారత్ వైపు చూసేటట్లు చేశాయి. ఈ నిరాడంబరతను అలవర్చుకోవటానికి కృషి, పట్టుదల అవసరం. ప్రశంసలను, విమర్శలను ఒకే విధంగా స్వీకరించాలి. అహంకారాన్ని వదిలి తన సంపదను, మేధస్సును, సమాజ అభివృద్ధికి వినియోగించాలి. ప్రతికూల పరిస్థితులను కూడా అవకాశాలుగా మలచుకోవాలి. ఒకసారి ప్రముఖ విద్యావేత్త ఈశ్వర చంద్ర విద్యాసాగర్ కలకత్తా విశ్వవిద్యాలయం కోసం విరాళాలు సేకరిస్తూ అయోధ్య నవాబును కలిశారు. అతడు అహంకారంతో తన కాలి చెప్పును ఈశ్వరచంద్ర జోలెలో వేశాడు. ఆయన దాన్ని చిరునవ్వుతో స్వీకరించి మర్నాడు ఆ రాజభవనం వెలుపలే వేలం వేశారు. అది నవాబుది కావడంతో ధర భారీగా పలికింది. ఆ డబ్బును విద్యాసాగర్ విరాళంగా తీసుకున్నారు. జరిగింది తెలుసుకున్న నవాబు వేలంలో వచ్చిన మొత్తానికి సమానంగా విరాళం ఇచ్చాడట. నవాబు చేసిన పనిని అవమానంగా భావించక అవకాశంగా మలచుకున్నారు విద్యాసాగర్. ఈ మానసిక పరిపక్వత నిరాడంబరత వల్లే సాధ్యపడుతుంది. అది అన్నింటినీ ఒకే విధంగా చూడగల స్థితప్రజ్ఞత దిశగా అడుగులు వేయిస్తుంది.



అంతర్యామి

ఈ గుణమే సామాన్యుల జీవన పథంలో మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకోవడానికి తోడ్పడుతుంది. గమ్యం స్పష్టంగా ఉండడం వల్ల భయం, ఒత్తిడి, నిరాసక్తత వంటివి దరిచేరవు. ఈ తత్వం ఉన్నవారు వాస్తవాన్ని అంగీకరించగలరు- లోతుగా విశ్లేషించగలరు. ప్రాథమ్యాలను నిర్ణయించుకోగలరు. ప్రలోభాలకు లొంగరు.

ఆలోచనల్లో ఉన్నతంగా, జీవన విధానంలో సాధారణంగా ఉండాలని సనాతన ధర్మం చెబుతోంది. మహనీయులెవరూ ఆహార్యానికి ప్రాధాన్యమివ్వలేదు. వ్యక్తిత్వానికి ఇచ్చారు. అందుకే ప్రపంచ ప్రఖ్యాతులయ్యారు. ఐహిక భోగాల పట్ల ఆసక్తిని తగ్గించుకుని నిరాడంబర జీవితం గడిపినప్పుడు మనలోకి మనం ప్రయాణించగలం. పరమాత్మకు చేరువ కాగలం. ఈశ్వరుడు నిరాడంబర తత్వానికి ప్రతీక. సకల చరాచర సృష్టి తన అధీనంలోనే ఉన్నా నిత్యం యోగసమాధిలోనే ఉంటాడు. పట్టు పీతాంబరాలు ధరించగలిగినా జంతు చర్మాన్ని చుట్టుకుంటాడు. సువర్ణాభరణాల బదులు పాములను ధరిస్తాడు. లోకం బాగు కోసం విషాన్ని స్వీకరించిన అమృతమయుడు. దైవం స్వీకరించేది ఆడంబరంతో కూడిన పూజలు కాదు. స్వచ్ఛమైన హృదయ పుష్పాన్నే!

– శ్రీమత్కందాళ బాలసరస్వతి



ప్రపంచం గుండెలపై అణ్వాయుధాలు

ప్రపంచంపై యుద్ధమేఘాలు కమ్ముకొంటున్నాయి. ఇప్పటికే చాలాకాలంగా రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతోంది. గాజాపై ఇజ్రాయెల్ దాడులు సాగిస్తోంది. ఇజ్రాయెల్, ఇరాన్ పోరుబాటలో ఉన్నాయి. తాజాగా యుద్ధ ఘర్షణలు లెబనాన్‌కూ పాకాయి. ఈ క్రమంలో ఆయా దేశాల మధ్య ఘర్షణాత్మక వైఖరి మరింతగా పెరిగితే ప్రపంచానికే ప్రమాదకరం కావొచ్చు. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఏ దేశం దగ్గర ఎన్నేసి అణ్వాయుధాలు ఉన్నాయంటే...

అమెరికా	3708
రష్యా	4380
చైనా	500
ఫ్రాన్స్	290
యూకే	225
ఇండియా	172
పాకిస్థాన్	170
ఇజ్రాయెల్	90
ఉత్తరకొరియా	50

(ఆధారం: సిప్రి ఇయర్‌బుక్-2024)

సమదృష్టి వాదానికి సరైన సారథి

గుంటూరు జిల్లాలోని సామాన్య రైతు కుటుంబంలో రాజరత్నమ్మ వీరభద్రయ్య దంపతులకు జన్మించిన సచ్చిదానందమూర్తి- భరతమాత ముద్దుబిడ్డగా ఎదిగిన క్రమం యువతకు ఒక పాఠ్యాంశం. ఆ విషయాన్ని గుర్తించిన తమిళనాడు ప్రభుత్వం ఆయన జీవిత చరిత్రను తొమ్మిదో తరగతి తెలుగు వాచకంలో పాఠంగా నిర్ణయించింది. ఆంధ్ర విశ్వకళాపరిషత్ తత్వశాస్త్ర విభాగానికి అధిపతిగా, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతిగా, యూజీసీ ఉపాధ్యక్షుడిగా, దేశ విదేశ విద్యాసంస్థలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా- విశ్వవిఖ్యాత తత్వవేత్తగా సచ్చిదానందమూర్తికి గొప్ప గుర్తింపు లభించింది. అధ్యయనంలో వైశాల్యం, ఆలోచనల్లో లోతు, దృక్పథంలో శాస్త్రీయత, అవగాహనలో పరిపక్వత, బోధనలో సరళత... వంటి అపురూపమైన అగ్రశ్రేణి ఆచార్యుడి లక్షణాలను గుర్తించి దేశదేశాల విశ్వవిద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశాయి.



తత్వశాస్త్ర మాగాణి క్షేత్రంలో విశేషంగా కృషి చేసిన తెలుగు రైతు- ఆచార్య కొత్త సచ్చిదానంద మూర్తి. లోకం ఆయనను 'ఆధునిక రుషి'గా అభివర్ణించింది. 'తత్వశాస్త్ర కులపతి'గా కీర్తించింది. సర్వేపల్లి రాధాకృష్ణ తరవాత ఎవరంటే- సచ్చిదానందమూర్తి పేరును ప్రతిపాదించింది. ఈ దేశ అత్యున్నత పౌరపురస్కారం 'పద్మవిభూషణ్'తో ప్రభుత్వం సత్కరించింది. నేడు ఆ ప్రతిభావంతుడి శతజయంతి.

అసాధారణ ప్రజ్ఞ

'ఏది ఉన్నదో - అదే తత్వం! దాన్ని ఉన్నది ఉన్నట్లుగా చూడటం తత్వదర్శనం. గీతాచార్యుడు చెప్పిన సమదృష్టికి తాత్పర్యం అదే' అన్నారు సచ్చిదానందమూర్తి. తత్వశాస్త్రం నిరంతర ప్రవాహం. దానిలో మనిషి ఒక భాగం. సమాజ పురోగమనానికి అవసరమైన వాటిని ఆ ప్రవాహంలోంచి నేర్పుగా ఎంచుకోవడం, ఇముడ్చుకోవడం మనిషికి ఎంతో అవసరం. కాలం చెల్లిన వాటిని విడిచిపెడుతూ, కాల ప్రవాహంతో కలిసి ముందుకు సాగిపోతూ ఉండటమే- హేతుబద్ధమైన జీవన విధానం అని ఆయన నిర్వచించారు. 'ముఖ్యంగా మనిషిలో మానవత లోపిస్తే జ్ఞానమంతా వ్యర్థమే' అని సచ్చిదానందమూర్తి స్పష్టంగా ప్రకటించారు. అదే మార్గంలో జీవించారు. ఆయనది 'అనుష్ఠాన వేదాంతం' అని ప్రముఖులెందరో ప్రస్తుతించడంలోని ఆంతర్యమదే. సచ్చిదానందమూర్తి మీద వచ్చిన లెక్కలేనన్ని వ్యాసాలు- ఆయనను తత్వశాస్త్ర నిధిగా, సమదృష్టివాదానికి సారథిగా, ప్రాక్ పశ్చిమశాస్త్రాల సమన్వయ వారధిగా, భారతీయ తాత్విక సంస్కృతికి ప్రతినిధిగా... శాస్త్రీయంగా నిరూపించాయి. భరత ఖండం వారివేకాదు, ఖండాంతర పండితుల సమస్త తత్వశాస్త్ర రహస్యాలను ఆయువుపట్లను అమోఘంగా ఆకళించుకొన్న దార్శనికుడిగా, విద్యా కోవిదుడిగా లోకానికి పరిచయం చేశాయి. వివిధ తత్వదర్శనాలను తులనాత్మకంగా పరిశీలించి నిగ్గుతేల్చిన అసాధారణ ప్రజ్ఞ ఆయన సొత్తు. వాటిలోని లోటుపాట్లను ఈ లోకానికి విస్పష్టంగా ప్రకటించిన మేధావి సచ్చిదానందమూర్తి. అందుకే ఆయనను సర్వేపల్లి రాధాకృష్ణతో పోల్చారు.

సచ్చిదానందమూర్తి ఆలోచనలు ప్రాచీన మహర్షుల కోవకు చెందినవి. వేషధారణలో ఆయన అత్యంత ఆధునికుడు. అంతరంగంలో అచ్చమైన మునిపుంగవుడు. అమోఘమైన పాండిత్యం... సచ్చిదానందమూర్తిలోని భగవద్దత్తమైన భావుకతను, హాస్య ప్రవృత్తిని అణచివేయక పోవడం- ఆయన వ్యక్తిత్వానికి ఎనలేని ప్రత్యేకతను ఆపాదించింది. మునులకు సహజసిద్ధమైన గుణం- వాత్సల్యం. అదే ఆయనకూ ఆభరణం.

అద్వైత వేదాంతం


సచ్చిదానందమూర్తి వెలువరించిన ఒక్కో పుస్తకం, ఒక్కో ఆణిముత్యం. 'అద్వైత వేదాంతంలో అనుభూతి, హేతువు (రివలేషన్ అండ్ రీజన్ ఇన్ అద్వైత వేదాంత)' గ్రంథం- భారతీయ మౌలిక తత్వచింతనకు సంబంధించిన అమృత జీవధారను తనలో నింపుకొన్న పసిడి కలశం. 1959లో ప్రచురించిన ఆ గ్రంథాన్ని ఆయన డాక్టరేట్ డిగ్రీకోసం సమర్పించారు. వివిధ మతాల మూలసూత్రాలను అందులో క్రోడీకరించారు. అది సచ్చిదానందమూర్తికి గొప్ప పేరు తెచ్చింది. యజ్ఞాన్ని ఆరాధనా విధిగాను, సూక్తాలు హవిస్సులు అగ్ని... మూడింటినీ యజ్ఞ సారాంశంగాను... తిరిగి దాన్ని అంతటినీ మనిషి ఆంతరికయజ్ఞంగాను సూత్రీకరిస్తూ 1990లో వెలువరించిన అద్వైతిక్ విజన్ (వైదిక మీమాంస)- ఆయన ప్రతిభా వైదుష్యానికి పతాక శీర్షిక. తత్వశాస్త్ర దర్శన అధ్యయన అధ్యాపనలకు జీవితాన్ని అంకితం చేసి, ఆ తపోదీక్షలో తన మనుగడను ఒక సుదీర్ఘ యాగంలా నిర్వహించారు. దానికి ఫలితంగా మనకు దక్కిన యజ్ఞప్రసాదం- ఆ గ్రంథం. 'సచ్చిదానందమూర్తి పేరును వెతుక్కోవాల్సింది డాక్టరేట్ల పట్టికలో కాదు- ప్రాచీన మునుల జాబితాలో... ఈ దేశ మహోన్నత దార్శనికుల పరంపరలో..!' అని నిరూపించిన పరమ ప్రామాణిక గ్రంథమది. చివరి మజిలీని తమ తాతల నాటి సొంత ఇంట్లో ఏకాంతంగా ప్రశాంతంగా అంతర్ముఖుడైన యోగిలా గడిపి... ఉత్తరాయణ పుణ్యకాలంలో (2011) జీవయాత్రను ముగించిన ధన్యచరితుడాయన. సచ్చిదానందమూర్తి- ఈ జాతి సంపద!

– ఎర్రాప్రగడ రామకృష్ణ

మొసలి కన్నీళ్లు

దేవాపురం ఊరి చివర ఒక చెరువు ఉండేది. ఒకరోజు ఉదయాన్నే అందులోంచి బయటికి వచ్చిందో మొసలి. అప్పుడే అక్కడికి వచ్చిన కోతి.. 'మొసలి మామా నాకు చాలా కాలంగా ఓ సందేహం ఉంది. నువ్వు ఏదైనా ఒక ప్రాణిని ఆహారంగా తీసుకున్న తర్వాత ఎందుకు కన్నీరు కారుస్తావు?' అని అడిగింది. 'మా శరీర నిర్మాణమే అలా ఉంటుంది. మీ అందరిలా మాకు నోట్లో నాలుక ఉండదు. అందుకే మేము ఏ ప్రాణిని నోటితో పట్టుకున్నా ముక్కలుగా చేసి మింగేస్తాం. మీకు ఉన్నట్లు మాకు చెమట గ్రంథులు ఉండవు. మా జీర్ణ వ్యవస్థలోని కొన్ని రకాల వ్యర్థాలు కంటి నుంచి ద్రవ రూపంలో బయటికి వస్తాయి. దాన్ని చూసి.. అందరూ కడుపు నిండుగా తిని కన్నీరు కారుస్తున్నాం అనుకుంటారు' అని చెప్పింది మొసలి.

కాసేపటికి.. 'దూరం నుంచి నువ్వు ఎవరో తెలియడం లేదు. కాస్త దగ్గరకు రా!' అంది మొసలి. 'వెళ్లొద్దు అన్నయ్యా! వెళ్తే అది నిన్ను తినేస్తుంది' అంది అక్కడే చెట్టు మీదున్న రామచిలుక. 'నీ గురించి నాకు బాగా తెలుసు మొసలి మామా!' అంటూ వెనక్కి కదిలింది కోతి. కానీ ఒక్కసారిగా కోతి తోకను పట్టేసుకుందది. దాని నుంచి తప్పించుకోవడానికి ఎంత ప్రయత్నించినా..



హాయ్! బుజ్జీ!!

కోతి వల్ల కావడం లేదు. దాంతో రామచిలుక ఎగురుకుంటూ వచ్చి మొసలి కళ్లలో పొడిచింది. ఊహించని ఆ పరిణామానికి మొసలి.. కోతి తోకను వదిలేసింది. దాంతో అక్కడి నుంచి పరిగెత్తిందది. 'సమయస్ఫూర్తితో నా ప్రాణాలు కాపాడినందుకు ధన్యవాదాలు చిలకమ్మా!' అంది కోతి. 'ఆపదలో ఒకరికి ఒకరు సహాయం చేసుకోకపోతే... ఎలా? ప్రాణం ఉన్న ప్రతి జీవికి ఎదుటి వాళ్లతో ఎప్పుడో ఒకసారి ఏదో అవసరం వస్తూనే ఉంటుంది. కాబట్టి చేతనైన సాయం చేస్తుండాలి' అని బదులిచ్చింది చిలుక.

– బెల్లంకొండ నాగేశ్వరరావు

రాయగలరా?

ఇక్కడ కొన్ని పదాలు గజిబిజిగా ఉన్నాయి. వాటిని సరైన పదాలతో కలిపి అర్థవంతంగా చేయండి చూద్దాం.

నవ	సంపదలు	వాయు	బొమ్మ	దానం
సిరి	గుండం	గాలి	బొమ్మల	అన్న
కొలువు	గాజు	కృషి	సుడి	ధాన్యాలు
జింక	వలుడు	గోడ	కృష్ణ	పిట్ట

ఈనాడు హైదరాబాద్ HMDA
బుధవారం సెప్టెంబరు 25, 2024

యువత పఠనాసక్తిని పెంపొందించుకోవాలి: గవర్నర్


గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

బేగంబజార్, న్యూస్‌టుడే: పుస్తకానికి పాఠకుడికి మధ్య యంత్రం ఉండవద్దని, యువత పఠనాసక్తిని పెంపొందించుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. 133 ఏళ్ల చరిత్ర కలిగిన అఫ్జల్‌గంజ్ రాష్ట్ర కేంద్ర గ్రంథాలయంలో జాతీయ సామాజిక సంఘం(ఎన్ఎస్ఎస్) 55వ వ్యవస్థాపక దినోత్సవానికి ఆయన హాజరయ్యారు. గవర్నర్ కార్యాలయ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి నర్సింహారెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ కార్యదర్శి మామిడి హరికృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రతినిధులతో కలిసి జ్యోతిని వెలిగించారు. 'గ్రంథాలయ దీప్తి' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం గవర్నర్ మాట్లాడారు. యువత, విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారని, గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదువుతూ ఉజ్వల భవిష్యత్తుకు శ్రీకారం చుట్టాలని సూచించారు. బుక్ డాక్టర్ పేరిట ప్రత్యేక కార్నర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రంథాలయాలు సరస్వతీ నిలయాలని వాటిని పరిరక్షించే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని బుర్ర వెంకటేశం చెప్పారు. సాలార్‌జంగ్ మ్యూజియాన్ని రోజూ 20వేల మంది సందర్శిస్తుంటే ఈ గ్రంథాలయానికి కేవలం 500మంది రావడం అసంతృప్తిగా ఉందన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ డా.రియాజ్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలిసారిగా రాష్ట్ర గవర్నర్ ఈ గ్రంథాలయాన్ని సందర్శించడం విశేషమన్నారు. పౌర గ్రంథాలయ శాఖ ఉప సంచాలకులు శ్రీహరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ కష్టాలివే

జాతీయ రహదారుల సంస్థ ఎన్‌హెచ్-65పై చేపట్టిన ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం స్థానికులకు శాపంగా మారింది. కోటి జనాభా ఉన్న నగరంలో 12 వరుసల ఎక్స్‌ప్రెస్ వే నిర్మిస్తుండటంతో.. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రాంతాల మధ్య గోడ కట్టినట్లయింది. ఉద్యోగులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సిటీ బస్సు ఎక్కాలన్నా, దిగాక కాలనీ రోడ్డుకు చేరుకోవాలన్నా సగటున 6 కి.మీ. నడవాల్సి వస్తోంది. ఇల్లు ఓ వైపు, పాఠశాల మరో వైపుంటే.. పిల్లలను తీసుకెళ్లడం తల్లిదండ్రులకు కత్తిమీద సాములా మారింది. పాత కల్వర్టులు విస్తరించకపోవడం, కాలనీ రోడ్లకు పదడుగుల ఎత్తున ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం, కనుచూపు మేరలో యూటర్న్‌లు లేకపోవడం వంటి సమస్యలతో ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌వాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు.

ఇరువైపులా ఉన్న ప్రాంతాలకు హద్దు గోడైన రోడ్డు
● బస్సు ఎక్కాలన్నా, దిగాలన్నా 6 కి.మీ. నడవాల్సిందే


భాగ్యలత నుంచి ఎల్బీనగర్ మార్గంలో సర్వీసు రోడ్డుకు ఏర్పాటుచేసిన గ్రిల్స్

ప్రాజెక్టు స్వరూపం..



పని.. ఎల్బీనగర్ నుంచి మల్కాపూర్ వరకు ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం

పొడవు.. 25 కి.మీ.

వెడల్పు.. 200 మీటర్లు

వంతెనలు.. రోడ్డు పొడవునా 8 కూడళ్లపై

ఎన్ని లైన్లు.. ● ఎల్బీనగర్ క్రాస్‌రోడ్డు నుంచి ఓఆర్ఆర్ వరకు 12లైన్ల రోడ్డు ● ఓఆర్ఆర్ నుంచి బాటసింగారం, అక్కడి నుంచి మల్కాపూర్ వరకు 10 లేన్లు

వ్యయం.. రూ.545 కోట్లు

పూర్తవ్వాల్సిన గడువు.. 2023 ఆఖరు

ప్రధాన నగరంలో ఎక్స్‌ప్రెస్ వేనా..

ఎల్బీనగర్ చింతలకుంట చెక్‌పోస్టు నుంచి విజయవాడ వెళ్లే ఎన్‌హెచ్-65ను 'ఎక్స్‌ప్రెస్ వే'గా అభివృద్ధి చేసే పనులు 2021లో ఆమోదం పొందాయి. రెండేళ్లలో పనులు పూర్తవ్వాలన్నది ఒప్పందం. వేర్వేరు కారణాలతో ఇంకా కొనసాగుతున్నాయి.

● ఎల్బీనగర్ నుంచి భాగ్యలత, శారదనగర్, బీడీఎల్, హైకోర్టుకాలనీ, శాంతినగర్, సామానగర్, నర్సింహారావునగర్, ఇతర చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లేవారు ఇటీవలి వరకు భాగ్యలత రోడ్డు వద్ద సిటీ బస్సు దిగేవారు. ఇప్పుడు 2 కి.మీ. అవతల ఉన్న హయత్‌నగర్‌లో దిగి, మరో 2.కి.మీ వెనక్కి వస్తున్నారు. రోడ్డు పొడవునా గ్రిల్స్ ఏర్పాటుతో ఈ సమస్య తలెత్తింది.


జింకలపార్కు చెంత అసంపూర్తిగా కాలువ పనులు

స్థానికంగా అనేక సమస్యలు

ఈనాడు, హైదరాబాద్, వనస్థలిపురం, హయత్‌నగర్-న్యూస్‌టుడే

● ఎల్బీనగర్ చింతలకుంట చెక్‌పోస్టు సమీపంలోని ఆగమయ్యనగర్, హాకీమాబాద్ కాలనీ రోడ్లకు 8 అడుగుల ఎత్తున ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణమవుతోంది. సుష్మా, హైకోర్టుకాలనీ, వర్డ్ అండ్ డీడీ కాలేజీ ఎదురుగా ఉన్న ప్రాంతాలకు, పెద్దఅంబర్‌పేట శివారులోనూ సమస్య తీవ్రంగా ఉంది. హైవే నుంచి కాలనీల్లోకి వెళ్లే దారి లేక జనం నానా అవస్థలు పడుతున్నారు.

● పనామా తర్వాత డీమార్ట్ వద్ద కల్వర్టు మరమ్మతుల్లో జాప్యంతో రోడ్డు ముంపునకు గురవుతోంది. ● ఎల్బీనగర్ నుంచి సుష్మా, హిల్‌కాలనీ, హుడా సాయినగర్, వనస్థలిపురం-4, కమలానగర్ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే గతంలో సుష్మావద్ద దిగేవారు. ఇప్పుడు ఆటోనగర్‌లో దిగి 2 కి.మీ. వెనక్కి నడవాల్సి వస్తోంది.

● ప్యారడైజ్, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద బాక్స్ డ్రెయిన్ పనులు ఏడాదిగా పూర్తవకపోవడంతో అక్కడున్న హోటల్, ఆస్పత్రి, ప్రభుత్వ ఆఫీసులకు వచ్చే జనం నిత్యం అవస్థలు పడుతున్నారు.

● ఆటోనగర్ కూడలి, రాజధాని హోటల్, రాయల్ ఓక్ షోరూం ప్రాంతాల్లో సర్వీసు రోడ్డు పనులు మూడేళ్లవుతున్నా మొదలుకాలేదు.

● వనస్థలి పార్కు, పుల్లారెడ్డి మిఠాయి దుకాణం వద్ద కల్వర్టులు విస్తరణకు నోచుకోక ఆ ప్రాంతాలు చిన్న వానకే చెరువులా మారుతున్నాయి.


సర్వీసురోడ్డు లేని ప్రాంతాల్లో ప్రయాణికుల అగచాట్లు

● హయత్‌నగర్ బస్ డిపో, కృష్ణవేణి ఆస్పత్రి రోడ్లకు 8 అడుగుల ఎత్తున హైవే నిర్మాణంతో డిపోక్లే బస్సులు అవస్థలు పడుతున్నాయి. ఇక్కడ గ్రిల్స్‌తో డిపో చుట్టుపక్కల ప్రాంతాలకు 4 కి.మీ. అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది.

● తొర్రూరు - హయత్‌నగర్ హైవేకు రాకపోకలు సాగించే వాహనాలతో కూడలిలో రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కూడలివద్ద బస్టాపుతో సర్వీసు రోడ్డు అనాథగా మారింది. ● ఆర్టీసీకాలనీ, హయత్‌నగర్ బస్టాండు పరిసరాల్లో భూ సేకరణ జరగక సర్వీసురోడ్డు అతుకుల బొంతలా మారింది.

● పెద్దఅంబర్‌పేట జేసీబీ కూడలి ఆర్‌వోబీవద్ద రోడ్డు విస్తరణ జరగకపోవడం, పనుల నత్తనడకతో వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నారు.

● లక్ష్మారెడ్డిపాలెం పిల్లలు హైవే అవతలున్న కాండర్ బ్రైన్ స్కూల్‌కు వెళ్లాలంటే హయత్‌నగర్ బస్టాండు, ఇంటిక్కెలెం దుకు పెద్దఅంబర్‌పేటకు వెళ్లి యూటర్న్ తీసుకుంటున్నారు. 100మీటర్ల దూరంలో ఉన్న బడి కోసం రోజూ 6 కి.మీ. అదనంగా ప్రయాణిస్తున్నారు.

● పెద్దఅంబర్‌పేట ఎంఆర్ఎఫ్ టైర్ల షోరూం ఎదురుగా హైవేపై కాలువను అసంపూర్తిగా వదిలేయడంతో వరద సర్వీసురోడ్డును ధ్వంసం చేస్తోంది.

పైవంతెనపై స్పష్టత రావాలి

ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణ ప్రతిపాదన 2021 నాటిది. కొంతకాలంగా పనామా నుంచి హయత్‌నగర్ వరకు పైవంతెన నిర్మించాలని ప్రజలతో పాటు కార్పొరేటర్లు, ఎమ్మెల్యే అడుగుతున్నారు. రూ.340కోట్లతో అంచనాలను కేంద్ర సర్కారుకు పంపాం. ఆమోదం లభిస్తే పైవంతెన నిర్మిస్తాం. లేదంటే.. ప్రస్తుత పనులే కొనసాగుతాయి. పలు చోట్ల పాదచారుల వంతెనలు నిర్మిస్తాం. **- ధర్మారెడ్డి, ఈఈ, ఆర్అండ్‌బీ**

వరుణ ప్రతాపం


నాగోల్ నుంచి ఉప్పల్ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు, ఇబ్బందులు పడుతున్న పాదచారులు

ఈనాడు, హైదరాబాద్: రాజధానిలో మంగళవారం రాత్రి వరుణుడు బీభత్సం సృష్టించాడు. సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు వేర్వేరు ప్రాంతాల్లో కుండపోత కురిసింది. అత్యధికంగా నాగోల్‌లో 8.9సెం.మీ వర్షపాతం నమోదైంది. ఉప్పల్ నుంచి నాగోల్ వరకు ప్రధాన రహదారిపై పలుచోట్ల మోకాల్లోతు నీరు నిలిచింది. న్యూ నాగోల్ రోడ్డు10లో ఇళ్లలోకి నీరు చేరింది. కొత్తపేట ఎస్ఆర్ఎల్ కాలనీ ప్రధానిపై నడుముల్లోతు వరద ప్రవహించింది. ఎల్బీనగర్, వనస్థలిపురం, ఉప్పల్ నుంచి రామంతాపూర్ వైపు భారీఎత్తున ట్రాఫిక్ సమస్య తలెత్తింది. బండ్లగూడ, హబ్సిగూడలో 7, రామంతాపూర్ 5.2, హయత్‌నగర్‌లో 5, ఓయూలో 4.6, వనస్థలిపురం 4.3, సరూర్‌నగర్ 4.2, ఎల్బీనగర్‌లో 3.5 సెం.మీ. వర్షం కురిసింది.


ఉప్పల్‌లో భారీ వర్షం..

సీజనల్ వ్యాధులతో అప్రమత్తత అవసరం


అధికారులతో సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు

ఈనాడు, హైదరాబాద్: వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. వైద్యులు, సహాయ సిబ్బంది సెలవు తీసుకోకుండా పనిచేయాలని, రోజంతా వైద్యులు అందుబాటులో ఉండేట్లు దవాఖానాలకు ఆదేశాలివ్వాలని ఆయన యంత్రాంగానికి సూచించారు. కలెక్టర్ శశాంక్, ఇతర ఉన్నతాధికారులతో మంగళవారం మినిస్టర్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, ఇతర ఉప కేంద్రాల్లో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. పసి పిల్లలు, గర్భిణులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దోమల నివారణ చర్యలను ముమ్మరం చేయాలన్నారు.

ఇద్దరి ప్రాణాలను బలిగొన్న అతివేగం

ఘట్‌కేసర్ వద్ద ఔటర్‌పై కారు బోల్తా


ప్రమాదానికి గురైన కారు

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: అతివేగం రెండు ప్రాణాలను బలిగొంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ సీఐ సైదులు కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన ఇడుపులపాటి సాంబయ్య నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సైదియల్‌లో 40ఏళ్లక్రితం వ్యవసాయ భూమి కొన్నాడు. దానికి సంబంధించి ఆన్‌లైన్ పని నిమిత్తం సాంబయ్య కొడుకు సురేష్ అదే గ్రామానికి చెందిన సామినేని రాఘవరావు, కాకుమాను అమ్మయ్య, ముక్త రమేష్‌లు ఈనెల 22న కారులో వర్నికి వచ్చారు. పని పూర్తయ్యాక సోమవారం రాత్రి కారులో తిరుగు ప్రయాణమయ్యారు. మంగళవారం తెల్లవారుజామున ఘట్‌కేసర్ వద్ద ఔటర్ మీదుగా వస్తుండగా కారునడుపుతున్న సురేష్ ముందు వెళ్తున్న లారీని తప్పించే ప్రయత్నంలో కారు బోల్తాపడింది. సురేష్(35) తోపాటు పక్కన కూర్చున్న రాఘవరావు(45) అక్కడికక్కడే మృతిచెందారు. గాయపడిన అమ్మయ్య, రమేష్‌లను స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అతివేగంతోపాటు నిద్ర మత్తు కారణంగా ప్రమాదం చోటు చేసుకుందని సీఐ చెప్పారు.

రికార్డుల్లో నిషేధిత భూములు..

ధరణిలో ప్రైవేటు పట్టాలు

● వట్టినాగులపల్లిలో 80 ఎకరాల ఆక్రమణకు స్కెచ్
● పాతికేళ్ల కిందట ప్రణాళిక.. తాజా సర్వేతో వెలుగులోకి

ఈనాడు, హైదరాబాద్: రాజధాని నగరం శివారు ప్రాంతాల భవిష్యత్తును ఊహించిన కొందరు వ్యక్తులు గండిపేట చెరువు సమీపంలో ప్రభుత్వ భూములను ఒక పథకం ప్రకారం ఆక్రమించేందుకు పాతికేళ్ల కిందటే ప్రణాళిక రచించారు. వట్టినాగులపల్లిలో సర్వే నం. 110 నుంచి 150 మధ్య వందల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు ఇచ్చినట్టు తెలుసుకున్నారు. అసైనీలకు ఇచ్చిన ప్రైవేటు పట్టాలు.. ఖాళీ ప్రభుత్వ భూముల పక్కనున్న 80 ఎకరాలను ఆక్రమించేందుకు కార్యాచరణ రూపొందించారు. కొందరు అసైనీల నుంచి, ప్రైవేటు పట్టాదారుల నుంచి భూములు కొని పక్కన ప్రభుత్వ స్థలాలకు మార్కింగ్ వేసుకున్నారు. వట్టినాగులపల్లి, గోపన్‌పల్లి, ఆర్థిక జిల్లాల పరిసర ప్రాంతాల్లో బహుళజాతి ఐటీ సంస్థలు వచ్చినా.. అనూహ్యంగా అభివృద్ధి చెందినా తొందరపడలేదు. ఐదేళ్ల కిందట ధరణి పోర్టల్ అందుబాటులోకి రాగానే.. గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు, వారి కుటుంబ సభ్యుల పేర్లను రికార్డుల్లోకి ఎక్కించి ప్రైవేటు పట్టాలుగా మార్చారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రెవెన్యూ అధికారులు నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయం వెలుగులోకి రాగా, రికార్డుల మార్పిడిపై అంతర్గతంగా విచారణ చేస్తున్నారు. ఈ భూముల విలువ రూ.2500 కోట్లుంటుందని అంచనావేస్తున్నారు.



అమ్మోరి పండగొస్తోంది!

తెలంగాణలో వైభవంగా నిర్వహించే దసరా పండుగకు నగరంలోని ధూల్‌పేటలో అమ్మవారి విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. కార్మికులు రంగులద్దుతూ, తుది మెరుగులు దిద్దుతూ ప్రతిమలను ముస్తాబుచేస్తున్నారు. దూరప్రాంతాల వారు ఇప్పటికే కొనుగోళ్లు పూర్తి చేసి తరలిస్తున్నారు.

వేగం పెరిగితేనే రిమోట్ సెన్సింగ్‌కు భవిష్యత్తు


వేడుకలను ప్రారంభిస్తున్న ఇస్రో ఛైర్మన్ సోమనాథ్, మాజీ ఛైర్మన్లు రాధాకృష్ణన్, కిరణ్‌కుమార్ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: ఉపగ్రహాల నుంచి అవసరమైన చిత్రాలు, డేటాను మాత్రమే సేకరించేలా భవిష్యత్తు రిమోట్ సెన్సింగ్ సాంకేతికతలపై పనిచేయాల్సి ఉందని ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఇస్రోకు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ)కు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం బాలానగర్‌లోని సంస్థ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గోల్డెన్ జూబ్లీ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. రిమోట్ సెన్సింగ్ పరంగా గడిచిన 50 ఏళ్లలో ఎన్ఆర్ఎస్‌సీ దేశానికి ఎంతో సేవ చేసినా, ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకనుగుణంగా మారకపోతే మనుగడ కష్టమన్నారు. సాంకేతికతలో వేగంగా మార్పులు వస్తున్నాయని.. సమాచారం అత్యంత వేగంగా కావాలని ప్రజలు, వ్యవస్థలు, విధానకర్తలు, సంస్థలు కోరుకుంటున్నాయని చెప్పారు. కమిటీలుగా ఏర్పడి 5, 10, 25 ఏళ్లకు ప్రపంచంలో రానున్న మార్పులు, అందుకు మనం ఏం చేయాలనేది నివేదికలు రూపొందించాలని సూచించారు. ఈ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపు, సీడ్ ఫండింగ్‌తో పరిశోధనలను వేగవంతం చేయవచ్చన్నారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు కె.రాధాకృష్ణన్, ఏ.ఎస్.కిరణ్‌కుమార్, ఎన్ఆర్ఎస్‌సీ డైరెక్టర్ ప్రకాశ్ చౌహాన్, మాజీ డైరెక్టర్లు బి.ఎన్.దీక్షితులు, వి.జయరామన్, డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థ రహితంగా సికింద్రాబాద్ స్టేషన్

ఈనాడు, హైదరాబాద్

పారిశుద్ధ్యానికి రూ.10 కోట్ల వ్యయం


ప్లాట్‌ఫామ్‌లను శుభ్రం చేస్తున్న సిబ్బంది

పారిశుద్ధ్యం, స్వచ్ఛతలో ఆదర్శంగా నిలుస్తున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ దీనికోసం రూ.10కోట్లు ఖర్చు చేస్తోంది. ఐజీబీసీ-సీఐఐ గ్రీన్ రేటింగ్‌లో 'ప్లాటినం' గ్రేడ్ దక్కించుకోగా పారిశుద్ధ్యం, పర్యావరణహిత ఆవిష్కరణలను అందిపుచ్చుకుంది. మూడేళ్ల పాటు స్వచ్ఛత పనులు చేపట్టేలా వేర్వేరు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. 197 ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు, 2లక్షల మంది నిత్యం రాకపోకలు సాగిస్తున్నప్పటికీ ప్రమాణాలు పాటిస్తోంది. స్టేషన్ ఆవరణలో చేపట్టిన కార్యక్రమాలను అధికారులు వివరించారు.

పురోగతిలో జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్: రోజూ 4 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ కోసం స్టేషన్‌లో 10 ప్లాస్టిక్ బాటిల్ ష్రెడ్డింగ్‌యంత్రాలు, 26 చ.మీ.విస్తీర్ణంలో వేస్ట్ సెగ్రిగేషన్ షెడ్ ఏర్పాటు చేశారు. ఆకుపచ్చ డబ్బాలో బయోడీగ్రేడబుల్ వ్యర్థాలు, నీలిరంగు డబ్బాలో నాన్ బయోడీగ్రేడబుల్ వ్యర్థాలు వేసేందుకు డబుల్ డస్ట్‌బిన్ వ్యవస్థ ఏర్పాటు చేశారు.

● స్టేషన్‌లో 2400 కిలోలీటర్ల నీటి వినియోగం ఉండగా.. సున్నా నీటి వృథా కోసం 500 కేఎల్‌డీ సామర్థ్యంతో రీసైక్లింగ్ ప్లాంటు ఏర్పాటు చేశారు. రీసైకిల్ నీటిని పారిశుద్ధ్యం, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ● 100 శాతం ఎల్ఈడీ విద్యుద్దీపాలు, విద్యుత్తు ఆదాకు బీఎల్‌డీసీ ఫ్యాన్లు, ఇన్వర్టెడ్ ఎయిర్ కండిషనింగ్ యూనిట్లు, 500 కేడబ్ల్యూపీ సోలార్ వ్యవస్థలతో కర్బన ఉద్గారాలను తగ్గిస్తోంది.

● ర్యాగ్‌పికింగ్ యంత్రాలు, రైడ్‌ఆన్ స్క్రబ్బర్, గ్రానైట్ డ్రైయర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను శుభ్రం చేసేందుకు వాక్ బిహైండ్ స్వీపింగ్ మెషీన్లు వినియోగిస్తున్నారు.

చెరువుల చెంత నిర్మాణ అనుమతులపై హైడ్రా లేఖాస్త్రం

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మహా నగరంతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అడ్డగోలుగా ఇచ్చిన భవననిర్మాణ అనుమతుల రద్దుకు రంగం సిద్ధమవుతోంది. ఈ మేరకు హైదరాబాద్ జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలకు హైడ్రా లేఖలు రాసింది. రెండు నెలలుగా అనేక చెరువుల సమీపంలో పరిశీలిస్తే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న దాదాపు 30 నిర్మాణాలకు అనుమతి ఇచ్చారని తేలింది. కొంతమంది ఒక సర్వే నెంబరులో నిర్మాణ అనుమతులు తీసుకుని ప్రభుత్వ స్థలంలో భారీ నిర్మాణాలు చేశారు. నిర్మాణ అనుమతులు ఇచ్చిన తరువాత అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన కూడా చేయలేదని తేలింది. ఇందులో కొందరు అధికారులకు రూ.లక్షల్లోనే అందిందన్న విషయం వెలుగులోకి వచ్చింది. తమంతట తామే ఈ తప్పులన్నింటినీ సరిదిద్దుకోవాలని రెండు ప్రభుత్వ సంస్థలను హైడ్రా కోరింది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడానికి సిద్ధమవుతున్నారు. అక్రమ అనుమతులని తేలితే రద్దు చేయనున్నారని అధికారవర్గాలు తెలిపాయి.

మూసీ నిర్వాసితులకు 16 వేల ఇళ్లు

● బాధితుల గుర్తింపునకు నేటి నుంచి ఇంటింటి సర్వే
● పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్

ఈనాడు, హైదరాబాద్: మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టుకు కీలక ముందడుగు పడింది. పనులను ప్రారంభించేందుకు అవసరమైన భూసేకరణ, నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్లు ఇచ్చేందుకు సర్కారు సిద్ధమైంది. నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న 16వేల ఇళ్లను మూసీ నిర్వాసితులకు ఇచ్చేలా మంగళవారం జీవో జారీచేసినట్లు పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ మంగళవారం వెల్లడించారు. కొన్నినెలలుగా 3 జిల్లాల పరిధిలోని మూసీ నదిపై సర్వే జరిగింది. రెవెన్యూ అధికారులు నదిగర్భంలో, బఫర్‌జోన్‌లో 10,200 నిర్మాణాలను గుర్తించారు. వాటిలో ఎవరెవరు ఉన్నారో గుర్తించేందుకు బుధవారం నుంచి జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే జరుగుతుంది. బాధితులకు పునరావాసం ఎక్కడ కల్పిస్తున్నామనే వివరాలు కూడా ఇస్తాం. మొదట నదీ గర్భంలో ఉన్న 1,600 నిర్మాణాల్లోని బాధితులకు ఇళ్ల కేటాయింపు జరుగుతుంది. పునరావాసం కల్పించాక ఆక్రమణలను తొలగిస్తాం. అర్హులైన ప్రతి ఒక్క బాధితుడికి చట్ట ప్రకారం నష్టపరిహారం, పునరావాసం అందాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలను పక్కాగా అమలు చేస్తాం' అని ఆయన వివరించారు. పునరావాస ప్రక్రియ కొలిక్కి వచ్చిన తరువాత కూల్చివేతల ప్రక్రియను హైడ్రాకు అప్పగించాలని నిర్ణయించారు. దీనిపై మంగళవారం ఉన్నతాధికారులు చర్చించారు.

అర్ధరాత్రి ఒంటిగంట వరకు ఆహార కేంద్రాలు

ఈనాడు, హైదరాబాద్: దుకాణాల మూసివేత సమయాలపై హైదరాబాద్ కమిషనరేట్ ఉన్నతాధికారులు మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, టిఫిన్ సెంటర్లు, టీస్టాళ్లు, పాన్‌షాప్‌లు అర్ధరాత్రి ఒంటిగంట వరకు నడుపుకోవచ్చు. సూపర్ మార్కెట్లు, ఎలక్ట్రానిక్, నగలు, దుస్తులు, సెల్‌ఫోన్, కిరాణా తదితర దుకాణాలు, వైన్‌షాప్‌లు రాత్రి 11 గంటలవరకు తెరిచి ఉంచొచ్చు. బార్లు శుక్ర, శనివారాల్లో అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యం విక్రయించొచ్చు.

వ్యాధుల నివారణకు చర్యలు: ఆమ్రపాలి

ఈనాడు, హైదరాబాద్: నగరంలో నానాటికీ విస్తరిస్తున్న సీజనల్ వ్యాధులను కట్టడికి ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల వైద్యాధికారులతో కలిసి డెంగీ, గన్యా, మలేరియా జ్వరాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. బస్తీ దవాఖానాలు, స్థానిక ప్రజారోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని, ప్రజలు వాటి ద్వారా సత్వర వైద్య సేవలు అందుకుంటున్నారు. జ్వరం ఫిర్యాదులపై 24 గంటల్లో ఇచ్చేట్లు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు సైతం ఇంట్లో దోమలు ఉత్పత్తి కాకుండా, చుట్టూ ఉన్న నీటి నిల్వలను తొలగించుకోవాలని, పొడి వాతావరణంతో దోమల సమస్య దూరమవుతుందని సూచించారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

ఐకమత్యంతో బీసీల హక్కుల సాధన



గురునాథ్‌రెడ్డిని సత్కరిస్తున్న సమితి ప్రతినిధులు

రవీంద్రభారతి: రాష్ట్రంలో బీసీ జనగణన జరిగి తీరుతుందని, రేవంత్‌రెడ్డి ఈ విషయంలో కులగణనపై దృఢంగా ఉన్నారని వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు హామీ ఇచ్చారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో సబ్బండ వర్గాల సంబరం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సామాజిక వర్గాల కార్పొరేషన్ ఛైర్మన్లకు ఆత్మీయ సన్మానం చేశారు. అనంతరం పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. బీసీలు ఐక్యంగా ఉంటే హక్కులు సాధించుకోవచ్చన్నారు. రాష్ట్ర మత్స్యకార సహకార సంస్థ ఛైర్మన్ మెట్టు సాయికుమార్, తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు బెల్లాపు దుర్గారావు, ప్రధాన కార్యదర్శి కీర్తియుగంధర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. టీజీఐఐసీ ఛైర్మన్ టి.నిర్మలజగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట మధ్య

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

బంజారాహిల్స్ న్యూస్‌టుడే :

? బంజారాహిల్స్ రోడ్డు నం.14 శ్రీవేంకటేశ్వరనగర్‌లో కొన్ని నెలలుగా వీధిదీపం వెలగడం లేదు. దీంతో చీకటిపడిన తరువాత రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సమస్యను పరిష్కరించగలరు.

– శ్రీనివాసరావు, స్థానికుడు, బంజారాహిల్స్

✔ ఆ ప్రదేశంలో నెలకొన్న సమస్య గురించి మాకెవ్వరూ ఫిర్యాదు చేయలేదు. ఎక్కడైనా సాంకేతిక లోపం తలెత్తిందేమో. సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. – సుష్మ, మున్సిపల్ ఏఈ (వీధి దీపాల విభాగం), సర్కిల్–18

? బంజారాహిల్స్ రోడ్డు నం.13లోని వైట్ హౌస్ వెనుక ప్రాంతంలో చెత్త పేరుకుపోతుంది. కొంతమంది చెత్తను ఇక్కడికి తీసుకొచ్చి వేస్తున్నారు. దుర్వాసనతో పాటు పందుల బెడద పెరిగిపోయింది.

– రామారావు, స్థానికుడు, బంజారాహిల్స్

✔ పరిశీలించి, చెత్తను తరలించే ఏర్పాటు చేస్తాం.

– అమిత్, పారిశుద్ధ్య సూపర్‌వైజర్, సర్కిల్–18.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు

స్పందనకు వందనం

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ప్రగతి నగర్‌కాలనీ శ్రీసాయిరామ్ మ్యానర్ అపార్టుమెంట్ సమీపంలో ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఈ విషయాన్ని వివరిస్తూ 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్' శీర్షికన 'ఈనాడు' ప్రచురించిన కథనానికి స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు మరమ్మతులు చేయించారు.

సుబ్రహ్మణ్యస్వామికి భస్మాభిషేకం



షేక్‌పేట, న్యూస్‌టుడే: షేక్‌పేట ఓయూ కాలనీ రామలింగేశ్వర ఆలయంలో మంగళవారం భస్మాభిషేకం భక్తిశ్రద్ధలతో చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

బోరబండ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని బోరబండ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ ఫసియుద్దీన్ అధికారులకు సూచించారు. సైట్-2 కాలనీ క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ సర్కిల్-19కు చెందిన వివిధ విభాగాల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.

తాగునీటి సరఫరా పరిశీలన

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: జలమండలి ఓఅండ్ఎం డివిజన్-6 పరిధిలోని ఆనంద్‌నగర్ కాలనీలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ మంగళవారం పర్యటించారు. ఆ ప్రాంతంలో తాగునీటి సరఫరా, నాణ్యత, సరఫరా స్థాయి, మురుగునీటి నిర్వహణ తదితరాలను పరిశీలించారు.

ఆక్రమణల తొలగింపు

ఫిల్మ్‌నగర్: బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ ప్రాంతంలో విలువైన వివాదాస్పద స్థలంలో వెలిసిన ఆక్రమణల్ని షేక్‌పేట రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. ఏసీబీ కార్యాలయానికి ఎదురుగా 14 ఎకరాల స్థల వివాదం న్యాయస్థానంలో ఉంది. ఈ స్థలంలో కొందరు ఓ గదిని నిర్మించి గుడిసెలు వేసి స్థలం తమదేనంటూ ఆధీనంలోకి తీసుకున్నారు. అంతే కాకుండా ఈ స్థలం వద్ద నిత్యం కొందరు కాపలా ఉంటున్నారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆక్రమణల్ని తొలగించాలని షేక్‌పేట రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు తహసీల్దార్ వై. అనితారెడ్డి ఆధ్వర్యంలో యంత్రాంగం అక్కడికి చేరుకుని నిర్మాణాలు తొలగించారు.

నిందితులు.. కేరాఫ్ వాట్సప్ గ్రూపులు!



యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ముఖ్యమైన సమచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడంతో పాటు నిందితులను పట్టించడంలోనూ వాట్సప్ గ్రూపులు ప్రస్తుతం కీలకంగా మారుతున్నాయి. మధురానగర్ ఠాణా పరిధిలో ఇటీవల జరిగిన రెండు సంఘటనల్లో అవే క్రియాశీలకంగా మారాయి. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ అందుబాటులో ఉంది. సామాజిక మాధ్యమాల్లో అందరూ స్పందిస్తున్నారు. ఫ్యామిలీ గ్రూప్, ఫ్రెండ్స్, కాలనీ సంక్షేమ సంఘం, అపార్ట్‌మెంట్ వాసులు, రాజకీయ పార్టీలు ఇలా తదితర గ్రూపులను ఏర్పాటు చేసుకుని సమాచారాలను పంచుకుంటున్నారు.

కెమెరాలు అద్దెకు తీసుకొని మోసం..

కెమెరాలను అద్దెకు తీసుకుని తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్న ఇద్దరిని వాట్సప్‌గ్రూప్ పట్టించింది. కల్యాణ్‌నగర్, అమీర్‌పేట్ ప్రాంతాల్లోని రెండు దుకాణాల్లో ఇద్దరు వ్యక్తులు కెమెరాలను రోజువారి అద్దెకు తీసుకున్నారు. ఐడీ ప్రూఫ్‌గా ఆధార్ కార్డులను ఇచ్చారు. నిందితులు కెమెరాలను తిరిగి ఇవ్వలేదు. చరవాణిలోనూ స్పందించకపోవడంతో కెమెరాలను అద్దెకు తీసుకుని మోసగిస్తున్నారని అద్దెకిచ్చే వ్యాపారుల గ్రూప్‌లో నిందితుల ఆధార్‌కార్డులను ఉంచారు. అప్పటి ఉంచి వ్యాపారులు అప్రమత్తంగా ఉన్నారు. ఎల్లారెడ్డిగూడలోని షాపుకు ఇద్దరు వ్యక్తులు వచ్చి కెమెరాలు అద్దెకు కావాలని ఆధార్‌కార్డులను ఇవ్వడంతో అప్రమత్తమైన వ్యాపారి నిందితులను పట్టుకుని మధురానగర్ పోలీసులకు అప్పగించారు.

నీటి ట్యాప్‌ల దొంగ పట్టివేత..

మధురానగర్ ఠాణా పరిధిలోని యాదగిరినగర్ బస్తీ వాసులు ఓ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకున్నారు. బస్తీలో నిత్యం ఏదో ఒకచోట ఇళ్లలోని నీటి నల్లా(ట్యాప్)లు చోరీకి గురవుతున్నాయి. వాటిని చోరీ చేస్తున్న నిందితుడిని సీసీ టీవీ ఫుటేజీలో గుర్తించి ఆ దృశ్యాలను బస్తీకి చెందిన గ్రూపులో షేర్ చేసి అందరినీ అప్రమత్తం చేశారు. ఓ వీధిలో అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తి గ్రూప్‌లోని వీడియోలో ఉన్న నిందితుడు ఒక్కడే అని నిర్ధారించుకున్న బస్తీ వాసులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందాలి: కలెక్టర్



పాఠశాలలో పత్రాలను పరిశీలిస్తున్న అనుదీప్ దురిశెట్టి

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన జరగాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం ఖైరతాబాద్ మండలం రాజ్‌భవన్ ఎదుట గల ఎంఎస్‌మక్తాలోని సోమాజిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కమ్యూనిటీ హాల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1 నుంచి 10వ తరగతి వరకు ఒకే చోట తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియం ఉండడంతో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందన్నారు. పాఠశాల వెనుక గల కమ్యూనిటీ హాల్‌లో తరచూ కార్యక్రమాలతో విద్యాబోధనకు అంతరాయం కలుగుతోందని చెప్పారు. విద్యార్థుల సౌకర్యం కోసం పాత పాఠశాల స్థలంలో అన్ని హంగులతో నూతన పాఠశాల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. మధ్యాహ్నం భోజనం తీరుపై ఆరా తీశారు. కార్పొరేటర్ విజయారెడ్డి మాట్లాడుతూ తన విజ్ఞప్తి మేరకు పాఠశాలకు ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.40లక్షలు మంజూరు చేశారని తెలిపారు. డీఈఓ ఆర్. రోహిణి, ఈఈ షఫీ మియా, ప్రధానోపాధ్యాయులు మహమూద్‌అలీ, గయాసోద్దీన్, బస్తీ అధ్యక్షుడు ఎస్కే షరీఫ్ పాల్గొన్నారు.

పనీర్‌లో నట్టు.. శాకాహారం ఆర్డరు ఇస్తే మాంసాహారం



జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: తినడానికి హోటల్‌కు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు చేదు అనుభవాన్ని ఎదురుచూశారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతంలోని వేర్వేరు హోటళ్లలో చోటుచేసుకున్న ఈ సంఘటనలపై వారు 'ఎక్స్' వేదికగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తితే.. జూబ్లీహిల్స్‌లోని కాకే డి హట్టి హోటల్‌కు వెళ్లిన తనకు పనీర్‌లో నట్టు వచ్చిందని తన్మయ్ భాండియా అనే ఖాతాదారుడు వాపోయాడు. యజమానిని ప్రశ్నిస్తే అనుకోకుండా పడిపోయి ఉంటుందని సమాధానం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో ఘటనలో బంజారాహిల్స్‌లోని బార్బిక్యూ నేషన్‌లో శాకాహార భోజనం ఆర్డర్ చేస్తే తనకు మాంసాహార పార్శిల్ వచ్చిందని, ప్లేటులో పెట్టుకొని తినే సమయంలో దీనిని గుర్తించామని అంకుష్ గోయల్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎక్స్‌లో తెలంగాణ సీఎస్‌కు టాగ్ చేశారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ రెండు హోటళ్లలో చోటుచేసుకున్న ఈ సంఘటనలు నెట్టింట ఇప్పుడు వైరల్‌గా మారాయి.

45 ఠాణాలకు ట్రైనీ ఎస్సైలు



జూబ్లీహిల్స్ ఠాణాలో ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డిని కలిసిన ట్రైనీ ఎస్సైలు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఇటీవలే పాసింగ్ ఔట్ పరేడ్ పూర్తి చేసుకున్న పలువురికి నగరంలోని వివిధ ఠాణాలలో ట్రైనీ ఎస్సైలుగా అవకాశం కల్పించారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 45 ఠాణాలకు బ్యాచ్-1 నుంచి 73 మంది, బ్యాచ్-2లో 25 మందిని పంపించారు. గ్రేడ్-ఎ ఠాణాలకు ముగ్గురు, నలుగురు ట్రైనీ ఎస్సైలను కేటాయించారు. ఇప్పటికే పశ్చిమ మండలం, ఉత్తర మండలాల్లోని చాలా ఠాణాల్లో ఎస్సైల సంఖ్య తక్కువగా ఉండటంతో విధుల్లో ఉన్నవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కొన్ని సందర్భాలలో ప్రతి మూడు, నాలుగు రోజులకు ఒకసారి రాత్రి విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. తాజా కేటాయింపుల మేరకు పశ్చిమ మండలంలోని జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్ ఠాణాలకు ముగ్గురు చొప్పున, బంజారాహిల్స్, పంజాగుట్ట ఠాణాలకు నలుగురేసి, ఎస్సార్‌నగర్, మధురానగర్ ఠాణాలకు ఇద్దరి వంతున మంగళవారం రిపోర్ట్ చేశారు. ఈ ఠాణాల్లో నెల రోజుల శిక్షణ అనంతరం గ్రేహౌండ్స్ శిక్షణకు వెళ్లి తిరిగి మరో నాలుగైదు నెలలపాటు ప్రస్తుతం కేటాయించిన ఠాణాల్లో వీరంతా విధులు నిర్వహించనున్నారు.

8 గంటలు శ్రమించి.. 9 నెలల చిన్నారి గుండె పదిలం చేసి

నిమ్స్, న్యూస్‌టుడే: తొమ్మిది నెలల చిన్నారికి అత్యంత అరుదైన గుండె సమస్యను శాశ్వతంగా నయం చేశారు నిమ్స్ వైద్యులు. ఆసుపత్రిలో బ్రిటన్ వైద్య బృందం సారథ్యంలో చిన్నారులకు గుండె శస్త్ర చికిత్సలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం నాలుగు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు. ఓ 9 నెలల చిన్నారి గుండెకి మంచి రక్తం సరఫరా కాకపోగా, ఎక్కువగా చెడు రక్తం సరఫరా కావడంతో గుండె పనితీరు మందగించింది. ఈ విషయం గుర్తించిన వైద్య బృందం ఉదయం 9 గంటల నుంచి ఎనిమిది గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స పూర్తి చేసింది. కొనిన వారాల వ్యవధిలో చిన్నారి పూర్తిగా కోలుకుంటుందని వైద్యులు భరోసా ఇచ్చారు. ఈ బృందంలో బ్రిటన్ వైద్యులు రమణ ధన్నపనేనితో పాటు నిమ్స్ కార్డియో థొరాసిక్ విభాగాధిపతి అమరేశ్వరరావు, ప్రొఫెసర్ గోపాల్ ఉన్నారు.

'పాడుతా.. తీయగా'తో వెలుగులోకి ఎందరో గాయకులు



రామాచారి దంపతులను సత్కరిస్తున్న డా.కె.వి.రమణాచారి, ఆర్పీ పట్నాయక్, ఓలేటి పార్వతీశం

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఈటీవీలో ప్రసారమయ్యే 'పాడుతా.. తీయగా' ద్వారా ఎందరో గాయకులు వెలుగులోకి వచ్చి సినీ రంగంలో రాణిస్తున్నారని ప్రభుత్వ మాజీ సలహాదారు డా. కె.వి. రమణాచారి అన్నారు. మంగళవారం రాత్రి రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, కిన్నెర కల్చరల్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో పద్మవిభూషణ్ డా.బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా గాయకుడు, సంగీత దర్శకుడు కొమండూరి రామాచారికి 'కిన్నెర-బాలు' పురస్కారాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా రమణాచారి మాట్లాడుతూ.. 27 ఏళ్లుగా పాడుతా తీయగా కార్యక్రమం ద్వారా రామాచారి, ఉషా వంటి ఎందరో గాయనీ గాయకులు సంగీత ప్రపంచానికి పరిచయం అయ్యారన్నారు. సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, సాహితీవేత్త డా. వోలేటి పార్వతీశం, శ్రీదేవల పర్స్ ఎండీ భోగరాజు మూర్తి మాట్లాడారు. కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ స్వాగతం పలికారు. అంతకు ముందు రామాచారి ఆధ్వర్యంలో లిటిల్ మ్యూజీషియన్స్ అకాడమి విద్యార్థుల సంగీత విభావరి ఆకట్టుకుంది.

పేదల బస్తీల్లో యునాని సంచార వైద్యశాల



ఎస్పీఆర్‌హిల్స్ ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీలో సంచార యూనాని వైద్యశాల

బోరబండ, న్యూస్‌టుడే: ఎర్రగడ్డలోని చర్మ వ్యాధుల యునాని చికిత్స జాతీయ పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో పేద, బడుగువర్గాల ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాల్లో సంచార వైద్యశాల ఏర్పాటు చేస్తున్నారు. వారంలో ఐదురోజులు వేర్వేరు ప్రాంతాల్లో జ్వరం, దగ్గు, ఒళ్లునొప్పులు, నీరసం వంటి సాధారణ జబ్బులతో పాటు దీర్ఘకాలిక రోగాలకు సైతం చికిత్స అందిస్తున్నారు. సోమవారం యూసుఫ్‌గూడ వెంకటగిరి, మంగళవారం బోరబండ సైట్-3 కాలనీ, ఎస్పీఆర్ హిల్స్ ప్రతిభానగర్ దివ్యాంగుల కాలనీల్లో సేవలు అందించగా, బుధవారం బోరబండ పరిసర ప్రాంతల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, గురువారం మల్కాజ్‌గిరి, శుక్రవారం బషీర్‌బాగ్ ప్రాంతాల్లో సేవలు అందించనున్నట్లు యునాని పరిశోధన కేంద్రం రీసెర్చ్ ఆఫీసర్ డా.రాజారామ్ తెలిపారు. తమవద్దకు వచ్చే రోగులకు మందులతో పాటు సూచనలు ఇస్తున్నామని అవసరమైన వారిని ఎర్రగడ్డలోని పరిశోధన కేంద్రానికి పంపిస్తామని చెప్పారు.

భర్త కనిపించడం లేదని భార్య ఫిర్యాదు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: ఇంటి నుంచి బయటకు వెళ్లిన తన భర్త తిరిగి రాలేదని ఓ మహిళ బోరబండ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ స్వరాజ్‌నగర్‌కె చెందిన హఫీజ్‌ఖాన్ ఈనెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య బంధువుల, స్నేహితులకు సమాచారం ఇచ్చారు. వారం రోజులైనా ఆచూకీ తెలియకపోవడంతో బోరబండ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రెడిట్ కార్డు రద్దు చేయమంటే.. నగదు దోచేశారు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: క్రెడిట్ కార్డు రద్దు చేయమని బ్యాంకు అధికారులకు తెలియజేస్తే సైబర్ నేరగాళ్లు నగదు దోచేసిన ఘటన బోరబండ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్యాణ్‌నగర్‌కాలనీలో నివసిస్తున్న ఎన్. నర్సింగరావు కారు డ్రైవర్. అతడి క్రెడిట్‌కార్డు రద్దు చేయమని ఆన్‌లైన్‌లో విన్నవించాడు. ఇది గమనించిన సైబర్ నేరగాళ్లు నర్సింగరావుకి ఫోన్ చేసి, చరవాణి నంబరుకు వచ్చిన ఓటీపీ చెపితే పని అయిపోతుందని నమ్మించారు. ఓటీపీ చెప్పిన కొన్ని క్షణాల్లో రూ.92 వేలు సైబర్ నేరగాళ్లు కాజేశారు. డబ్బులు విత్‌డ్రా అయినట్లు వచ్చిన సందేశం రావటంతో వెంటనే బోరబండ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్భాషలాడిన రికవరీ ఏజెన్సీపై ఫిర్యాదు

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: అకారణంగా మహిళలను దూషించిన సుగుణ ఏజెన్సీపై బోరబండ ఠాణాలో కేసు నమోదు అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ డివిజన్ స్వరాజ్‌నగర్‌లో నివసించే హారిక మరిది అఖిల్ హోటల్ నిర్వాహిస్తున్నాడు. హోటల్ నిర్వాహణకు అఖిల్ భారత్‌యాప్ ఖాతాలో లోన్ తీసుకోవడంతో క్యూఆర్ కోడ్ ఇచ్చారు. అఖిల్ తీసుకున్న లోన్ తిరిగి చెల్లించకపోవడంతో రికవరీ కోసం సుగుణ రికవరీ ఏజెన్సీకి అప్పగించింది. వారు ఫోన్ చేసినపుడు అఖిల్ లిఫ్ట్ చేయకపోవడంతో షూరిటీ కోసం ఇచ్చిన చరవాణి నంబర్ల ఆధారంగా హారిక నంబరుకు ఫోన్ చేసిన ఏజెన్సీ ప్రతినిధి అసభ్య పదజాలంతో దుర్భాషలాడాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల లడ్డూ అపవిత్రతకు పాల్పడిన వారిని శిక్షించాలి



ఖైరతాబాద్ గ్రంథాలయం కూడలిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉత్సవ కమిటీ నాయకులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: తితిదేలో లడ్డూ అపవిత్రతకు కారణమైన వ్యక్తులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఖైరతాబాద్ శ్రీగణేశ్ ఉత్సవ కమిటీ ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. మంగళవారం సాయంత్రం ఖైరతాబాద్ గ్రంథాలయ కూడలిలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కమిటీ నాయకులు మహేందర్ బాబు, మహేష్ యాదవ్, అశోక్, చంద్రశేఖర్ తదితరులు నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. లడ్డూలో అపవిత్రం విషయం హిందూ సమాజాన్ని కలిచి వేస్తుందన్నారు. ఘటనపై ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి దోషులను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. కమిటీ నాయకులు అనిల్, వంశీ, ఎన్డీ నగేష్, పృధ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో మహాగణపతి కానుకల వివరాలు ప్రకటిస్తాం

ఖైరతాబాద్ మహా గణపతికి వచ్చిన కానుకల వివరాలను త్వరలోనే పూర్తి స్థాయిలో వెల్లడిస్తామని అడహక్ కమిటీ సభ్యుడు మహేందర్ బాబు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా సీసీ కెమెరాల నిఘాలో కానుకల లెక్కింపు ప్రక్రియ నిర్వహించినట్లు వివరించారు. కేవలం హుండీ ఆదాయమే రూ.75 లక్షలు వచ్చిందని, ప్రకటనలు, ఇతర దాతల సాయం తదితర వివరాలపై త్వరలో అడ్‌హక్ కమిటీ సమావేశమై లెక్కించాల్సి ఉందన్నారు. ఆ వివరాలన్నీ భక్తులకు తెలియజేస్తామని ప్రకటించారు.

ప్రజావాణికి 360 విన్నపాలు



సమస్యలు వివరిస్తున్న డిగ్రీ ఒప్పంద అధ్యాపకులు

సోమాజిగూడ, న్యూస్‌టుడే: ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 360 వినతులు అందాయి. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ప్రజల సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ-138, విద్యుత్-38, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి-36, ఎస్సీ సంక్షేమం-26, మున్సిపల్ శాఖ-17, ఇతర శాఖలకు-105 వాటిలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

డిగ్రీ ఒప్పంద అధ్యాపకుల గోడు పట్టించుకోండి

రాష్ట్రంలో దాదాపు 24 ఏళ్లుగా పనిచేస్తున్న డిగ్రీ ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ప్రజావాణిలో విన్నవించారు. క్రమబద్ధీకరిస్తామని చెప్పిన గత ప్రభుత్వం ముఖం చాటేసిందని, కొందరికి అర్హతలు లేకున్నా రెగ్యులర్ చేసిందని, మిగతా వారిని విస్మరించిదన్నారు. మానవతా దృక్పథంతో తమ సమస్య పరిష్కరించాలని కోరారు. విషయం సీఎం దృష్టికి తీసుకెళ్తామన్న అధికారులు హామీ ఇవ్వడంతో అక్కడి నుంచి నిష్క్రమించారు.

రూ.10లక్షల విలువైన సీసీ కెమెరాల అందజేత



దాతలతో వెస్ట్‌జోన్ డీసీపీ ఎస్.ఎం.విజయ్‌కుమార్, ఎస్.ఆర్.నగర్ డివిజన్ ఏసీపీ పి.వెంకటరమణ

బోరబండ, న్యూస్‌టుడే: బోరబండ ఠాణా పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఐజంట్ ఫార్మా డ్రగ్ రీసెర్చ్ సొల్యూషన్స్ ముందుకు వచ్చింది. వెస్ట్‌జోన్ డీసీపి ఎస్.ఎం. విజయ్‌కుమార్, ఎస్.ఆర్.నగర్ డివిజన్ ఏసీపీ పి.వెంకటరమణ చొరవతో సామాజిక సీసీటీవి ప్రాజెక్టులో భాగంగా రూ.10లక్షలు విలువచేసే కెమెరాలను సమకూర్చింది. అమీర్‌పేట మైత్రీవిహార్‌లోని సంస్థ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ సీఎండి శ్రీనివాస్‌వర్మ రుద్రరాజు, ఆయన కుమార్తె, సంస్థ డైరెక్టర్ సౌమ్య పోలీసు అధికారులకు వాటిని అందచేశారు.

న్యూసెన్స్ కేసులో ఇద్దరికీ 8 రోజుల జైలు

యూసుఫ్‌గూడ: వేర్వేరు కేసుల్లో న్యూసెన్స్ సృష్టించిన ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం ఎనిమిది రోజుల జైలుశిక్ష విధించింది. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌వర్మ తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌లోని సీవీఆర్ హాస్టల్‌లో ఉంటున్న రాజేష్‌బాబు ఈనెల 23న సాయంత్రం మధురానగర్ ప్రాంతంలో యువతులు, మహిళలను చూస్తూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. సిటీ పోలీస్ యాక్ట్ కింద రాజేష్‌బాబుపై పెట్టి కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని 10వ స్పెషల్ కోర్టులో మంగళవారం హాజరుపరిచారు. న్యాయమూర్తి మంద మురళీ శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించారు.

మరో కేసులో: రహ్మత్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ హాషం డ్రైవర్. ఈనెల 23న రహ్మత్‌నగర్ ప్రాంతంలోని ఓ టిఫిన్ సెంటర్ నిర్వాహకురాలితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు 10వ స్పెషల్ కోర్టులో మంగళవారం న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు.

ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో కార్పొరేటర్లు

బంజారాహిల్స్: ఈశాన్య రాష్ట్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, మున్సిపల్ శాఖ చేపడుతున్న చర్యలపై అధ్యయనం చేసేందుకు హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతరెడ్డితో పాటు వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, నగరంలోని పలు డివిజన్ల కార్పొరేటర్లు 'జీహెచ్ఎంసీ స్టడీ టూర్' పేరిట ఇటీవల తరలివెళ్లారు. వారంతా మంగళవారం షిల్లాంగ్ పట్టణ పురపాలకశాఖ బోర్డు కార్యాలయాన్ని సందర్శించి అక్కడి అధికారులను అడిగి వివరాలు తెలుసుకొన్నారు. టూర్‌కు వెళ్లిన కార్పొరేటర్లలో రోజా, రాజు పటేల్ తదితరులు ఉన్నారు.

మొదటి పటాలంలో వార్షిక క్రీడాపోటీలు



క్రీడాకారులతో కరాచలనం చేస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: పోలీస్ సిబ్బంది క్రీడలకు, వ్యాయామానికి ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయిస్తే ఆరోగ్యంగా, ఒత్తిడికి లోనవకుండా ఉండవచ్చని యూసుఫ్‌గూడలోని మొదటిపటాలం కమాండెంట్ మురళీకృష్ణ అన్నారు. బెటాలియన్ ప్రాంగణంలో సోమవారం వార్షిక క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, క్రికెట్, టగ్గాఫ్‌వార్, టెన్నీస్, క్యారమ్స్, చెస్, 100, 400, 1500 పరుగు పోటీలను నిర్వహించనున్నట్లు కమాండెంట్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్లు అప్పారాయ్, భాస్కర్, చంద్రశేఖర్, ఆర్ఐలు శంకర్, సురేష్, సాంబయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణపై శ్రద్ధ అవసరం



శిబిరంలో వైద్య పరీక్షలు.

షేక్‌పేట, న్యూస్‌టుడే: వయసుతో సంబంధం లేకుండా అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వీటిని నిర్లక్ష్యం చేయకూడదని షేక్‌పేట జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల (జీనిట్స్) ప్రిన్సిపల్ డా.రమేష్ రెడ్డి అన్నారు. నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్) వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలో పీక్యూ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ శారీరక వ్యాయామం, యోగా వంటి వాటికి సమయం కేటాయించాలని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల అకాడమిక్స్ డీన్ రామలింగారెడ్డి, అడ్మిన్ డీన్ అవధాని పాల్గొన్నారు.

శ్రీకృష్ణానగర్‌లో సీవరేజీ సమస్య

శాశ్వత పరిష్కారానికి కృషి



స్థానికులతో మాట్లాడుతున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

యూసుఫ్‌గూడ: శ్రీకృష్ణానగర్‌లో సీవరేజీ సమస్య పరిషారానికి చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం శ్రీకృష్ణానగర్ సీ-బ్లాకులో ఆయన పర్యటించారు. 30 ఏళ్లక్రితం వేసిన సీవరేజీ పైపులు దెబ్బతినడం, ప్రవాహం ఎక్కువ కావడం, వరద కాలువకు సీవరేజీ పైపులు అనుసంధానంగా ఉండటంతో వర్షం పడిన సమయంతో సీవరేజీ పొంగిపొర్లుతోందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన వెంట సీజీఎం ప్రభు, జీఎం హరిశంకర్ పాల్గొన్నారు.


డ్రంకెన్ డ్రైవింగ్ కేసుల్లో పోలీసు, రవాణాశాఖల నిర్లక్ష్యం



రమన్‌జీత్ సింగ్

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన కేసుల విషయంలో పోలీసు, రవాణాశాఖలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని సామాజిక ఉద్యమకారుడు రమన్‌జీత్ సింగ్ పేర్కొన్నారు. ఈ విషయంలో మోటారు వాహన చట్టం సరిగా అమలు చేయని తీరుపై తాను హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేయగా ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసిందని తెలిపారు. మంగళవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. హైకోర్టు వ్యాజ్యాన్ని ఈనెల 20న విచారణకు స్వీకరించిందన్నారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి, రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు రవాణా శాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసిందని, నాలుగు వారాల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలో ఏటా సగటున 2.25 లక్షల డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదవుతున్నాయని వివరించారు. చట్టం ప్రకారం మద్యం తాగి తొలిసారి పట్టుబడితే మూడు నెలల పాటు లైసెన్స్ రద్దు, రెండోసారి పట్టుబడితే లైసెన్స్ పూర్తిగా రద్దు చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో న్యాయవాది ఎంకే పాషా తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారులు అభివృద్ధి చేయండి


కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ఈనాడు, దిల్లీ: తాను ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 4 రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కోరారు. మంగళవారం దిల్లీలో ఆయన్ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. నియోజకవర్గంలోని 7 రహదారుల మరమ్మతులకు కేంద్ర రహదారుల మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) నుంచి రూ.315 కోట్లు విడుదల చేయాలని కోరారు. స్పీకర్ వెంట పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ ఉన్నారు.

టీవీ ఛానల్ యజమాని ఇంట్లో ఐటీ సోదాలు

మూసాపేట, న్యూస్‌టుడే: బీఆర్‌కే న్యూస్ చానల్ అధినేత, వ్యాపారవేత్త, తెదేపా నేత బొల్ల రామకృష్ణ నివాసంలో ఐటీ అధికారులు మంగళవారం సోదాలు జరిపారు. మూసాపేట రెయిన్‌బో విస్టాస్ రాక్‌గార్డెన్ గేటెడ్ సముదాయం ఎ బ్లాకులోని 101లో రామకృష్ణ కుటుంబం రెండేళ్లుగా అద్దెకు ఉంటుంది. ఆయన న్యూస్‌చానెల్‌తోపాటు ఉషస్మృతి, స్థిరాస్తి సంస్థ వంటి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కాగా భారీగా ఆస్తులు ఉన్నప్పటికీ ఆదాయపన్ను చెల్లించడం లేదనే ఆరోపణలతో మంగళవారం తెల్లవారుజామున మూడు వాహనాల్లో 8 మంది ఐటీ అధికారులు ఇంటికి వచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు చేసి పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. రామకృష్ణ సమీప బంధువైన ఇదే కాలనీలో ఏ బ్లాకు 407లో ఉంటున్న గట్టు రాజేష్ ఇంట్లో కూడా సోదాలు జరిగాయి.

జాతీయ లోక్ అదాలత్ 28న

ఈనాడు, హైదరాబాద్: ఈనెల 28న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల్ని పరిష్కరించుకోవాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. కేసుల పరిష్కారం ద్వారా సమయం, డబ్బు ఆదా చేసుకోవాలని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని న్యాయస్థానాల్లో క్రిమినల్ కేసులు, వివాదాలకు సంబంధించిన పెండింగ్ కేసుల్ని సామరస్యంగా పరిష్కరిస్తారని వివరించారు.

సమకాలీన రాజకీయాల్లో ఆదర్శప్రాయుడు ఏచూరి


మాట్లాడుతున్న బి.మహేష్‌కుమార్‌గౌడ్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: సమకాలీన రాజకీయాల్లో సీతారాం ఏచూరి ఆదర్శప్రాయుడని, ఆయన లేని లోటు తీరనిదని వక్తలన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేశ్ అధ్యక్షతన జరిగిన సభలో టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ఏచూరి సామాన్య కార్యకర్త స్థాయి నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ, మాజీ ఎంపీ అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జి. నర్సింహారావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లవ వెంకట్‌రెడ్డి, సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నగరవ్యాప్తంగా స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీ


విధానాన్ని పరిశీలిస్తున్న జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: నగర నీటి సరఫరాలో స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీని విస్తృతం చేసేందుకు జలమండలి కసరత్తు చేస్తోంది. సనత్‌నగర్‌లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఆటోమెటిక్ వాల్వ్ ఆపరేషన్ పద్ధతి (స్మార్ట్ వాల్ సాంకేతికత) సత్ఫలితాలు ఇవ్వడంతో.. నగరంలో తొలి దశలో అనేక చోట్ల వీటిని ఏర్పాటు చేయాలని అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి మంగళవారం సనత్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన వాల్వ్‌ను పరిశీలించారు. పనితీరు, నిర్వహణ, తదితర అంశాలను క్షేత్రస్థాయి లైన్‌మెన్‌తో ముచ్చటించారు.

మున్ముందువిగా ఇబ్బంది.. నీటి సరఫరాలో వేలాది వాల్వ్‌ల నిర్వహణ తప్పనిసరి. 1000-2000 నివాస భవనాలకు సుమారు 30 వాల్వ్‌లు ఏర్పాటు చేశారు. సరఫరా ప్రారంభం, నిలిపివేయడానికి లైన్‌మెన్లు ప్రతి వాల్వ్‌ను పరిశీలించాలి. వాల్వ్‌లు గతంలో రోడ్ల పక్కగా ఏర్పాటుచేయగా, విస్తరణలో భాగంగా నీటి రోడ్డుపైకి వచ్చాయి. వాల్వ్‌ల వద్ద పనిచేస్తున్న పలువురు లైన్‌మెన్లు ప్రమాదాలకు గురయ్యారు. దీంతో స్మార్ట్ వాల్వ్ సిస్టమ్‌ను ప్రయోగాత్మకంగా సనత్‌నగర్‌లో ఏర్పాటు చేశారు. నీటి పంపిణీని సమర్థంగా నిర్వహించడం, నీటి నాణ్యత, క్లోరిన్ శాతం, సరఫరా లోపాలను గుర్తించడానికి ఈ సాంకేతిక ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ వాల్వ్‌లు సెన్సార్లను కలిగి ఉండటంతో లైన్‌మెన్, సంబంధిత అధికారుల మొబైల్‌కు అనుసంధానించి సరఫరాను నియంత్రించవచ్చు. సౌరశక్తితో పనిచేస్తుండటం, బ్యాటరీ బ్యాకప్ సైతం ఉండటంతో నిర్వహణలో విద్యుత్తు సరఫరా సమస్యలుండవు. ఎండీ అశోక్‌రెడ్డి పలు ప్రాంతాల్లో పర్యటించారు. సీవరేజి పైప్‌లైన్లను పరిశీలించారు.

యూట్యూబర్ హర్షసాయిపై అత్యాచారం కేసు



నార్సింగి, న్యూస్‌టుడే: యూట్యూబర్ హర్షసాయిపై అత్యాచారం కేసు నమోదైంది. తనపై అత్యాచారం చేశాడని, నగ్నచిత్రాలు సేకరించి బ్లాక్‌మెయిల్ చేశాడని సినీ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసినట్లు రాజేంద్రనగర్ ఏసీపీ చింతమనేని శ్రీనివాస్ తెలిపారు. సినిమాల్లో అవకాశాల కోసం ముంబయికి చెందిన యువతి కొన్నేళ్ల క్రితం హైదరాబాద్ వచ్చింది. ఒక రియాల్టీ షోలో పాల్గొంది. ఒక ప్రైవేటు పార్టీలో కలిసి స్నేహంగా ఉంటూ పెళ్లి చేసుకుంటానని చెప్పి అత్యాచారం చేసినట్లు, పెద్ద మొత్తంలో డబ్బు తీసుకున్నట్లు యువతి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. యువతిని పోలీసులు కొండాపూర్‌లోని ప్రాంతీయ ఆసుపత్రికి వైద్యపరీక్షల నిమిత్తం తరలించారు. హర్షసాయి తండ్రిపైనా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విశాఖకు చెందిన హర్షసాయి పేదలకు ఆర్థిక సాయం చేస్తూ వీడియోలు తన ఛానెల్‌లో అప్‌లోడ్ చేస్తుంటాడు. ఇతను హీరోగా బాధిత యువతి హీరోయిన్‌గా గతంలో ఒక సినిమాను ప్రారంభించారు.

ప్రతి చెట్టు.. లెక్క తేలేట్టు..


షేక్‌పేట తహసీల్దార్ కార్యాలయం నుంచి కేబీఆర్ పార్కు వరకు పైవంతెన నిర్మాణానికి సర్వే జరుగుతోంది. అందుకు ఆ మార్గంలో డివైడర్లలో చెట్లు ఎన్ని ఉన్నాయో తెలిసేలా మార్కింగ్ వేశారిలా

కూడలి.. వాహనం నెమ్మదిగా కదిలి..


సైబర్ టవర్స్ నుంచి కొత్తగూడ వైపు, బయోడైవర్సిటీ వైపు నుంచి వస్తున్న వాహనాల రద్దీ కారణంగా రహేజా మైండ్ స్పేస్ కూడలిలో బారులు తీరాయి. నెమ్మదిగా కదులుతూ కనిపించాయి

ప్రసాదం పసందేనా?

ఈనాడు, హైదరాబాద్

ఆలయాల్లో ప్రసాదాల నాణ్యతపై ఇచ్చే బోగ్(బ్లిస్‌ఫుల్ హైజెనిక్ ఆఫరింగ్ టు గాడ్) పత్రాల జారీని జీహెచ్‌ఎంసీ నిలిపివేసింది. ఏడాది క్రితం ఫిబ్రవరిలో 10 ఆలయాలకు ఫుడ్ లైసెన్సులు, 8 దేవాలయాలకు బోగ్ పత్రాలు జారీ చేయగా ఇతర దేవాలయాలను పరిశీలించకపోవడం గమనార్హం. తిరుపతి లడ్డూ ప్రసాదం అంశం తెరపైకి రావడంతో నగరంలోని ఆలయాల్లో ప్రసాదాల పంపిణీపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


లడ్డూ ప్రసాదం


పులిహోర

- బోగ్ పత్రాల జారీని నిలిపివేసిన బల్దియా
- నాణ్యత విషయంలో భక్తుల ఆందోళన

పరీక్షించడం ఇలా..

తొలిదశలో భక్తులు అధికంగా వచ్చే దేవాలయాలను గుర్తించాలి. నీటి, సరకుల నాణ్యత, స్టోరేజీ, వంటగదిలో పరిశుభ్రతపై సూచనలివ్వాలి. ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి రిజిస్టర్ అయిన సంస్థల ద్వారా ప్రసాదం తయారు చేసే ఆలయ సిబ్బందికి ఫాస్ట్రాక్ శిక్షణ అందించాలి. అనంతరం ఫుడ్ లైసెన్సులు జారీ చేసి, రిపోర్టుల ఆధారంగా బోగ్ పత్రాలు జారీ చేయాలి. గ్రేటర్‌లో 1500కుపైగా ఆలయాలున్నాయి. రద్దీ అధికంగా ఉండేవి 100 వరకు ఉండగా కేవలం 8 ఆలయాల్లో బోగ్ పత్రాలు జారీ అయ్యాయి.

విజయ డెయిరీ నుంచే నెయ్యి సేకరించాలి

ప్రసాదం నాణ్యత విషయంలో రాజీపడితే చర్యలు తప్పవంటూ ప్రభుత్వం హెచ్చరించింది. విజయడైరీ నుంచే నెయ్యిని సేకరించాలని.. మధ్యవర్తులుంటే తొలగించాలని ఉన్నతాధికారులు ఈవోలకు సూచించారు.

- బల్కంపేట్ దేవాలయానికి ఆది, మంగళవారాల్లో 50వేల మంది, శుక్రవారం 20వేల మంది భక్తులు వస్తుంటారు. ఆయా రోజుల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల పులిహోర, క్వింటా లడ్డూలు విక్రయిస్తారు. వంటశాలలో 8 మంది పనిచేస్తుండగా ఇద్దరిని ఫాస్ట్రాక్ శిక్షణకు పంపించారు. లడ్డూ ప్రసాదం కోసం ఏటా 10వేల లీటర్ల నెయ్యిని వాడుతామని ఆలయ అధికారులు తెలిపారు.
- సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయాన్ని మంగళ, శుక్రవారాల్లో 5-6 వేల మంది భక్తులు సందర్శిస్తుంటారు. రోజూ 15-70 కిలోల పులిహోర, 500 లడ్డూల విక్రయాలు సాగుతాయి. ఇక్కడ కిలో లడ్డూ తయారీకి 750 మిల్లీలీటర్ల నెయ్యిని వినియోగిస్తున్నట్టు సిబ్బంది తెలిపారు.
- సికింద్రాబాద్‌లోని గణేష్ దేవాలయంలో శుక్రవారం, సెలవు రోజుల్లో 1500 నుంచి 2వేల మంది వస్తుంటారు. రోజూ 500 లడ్డూలు, 500 పులిహోర ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఫుడ్ లైసెన్సులు జారీ అయిన దేవాలయాలివే..

మహాకాళి దేవస్థానం - సికింద్రాబాద్, ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానం - బల్కంపేట, హనుమాన్ దేవస్థానం - కర్మన్‌ఘాట్, వీర హనుమాన్ దేవస్థానం - ఎస్పీరోడ్డు, హనుమాన్ దేవస్థానం - సనత్‌నగర్, పెద్దమ్మ దేవాలయం - జూబ్లీహిల్స్, హనుమాన్ దేవాలయం - వివేకనగర్, లక్ష్మీగణపతి దేవస్థానం - ఆర్టీసీ క్రాస్‌రోడ్, శ్రీసాయిబాబ సమాజం - మినిస్టర్‌రోడ్డు, శ్రీగణేష్ దేవాలయం - సికింద్రాబాద్.

40 ఏళ్లు నిండితే మహిళలు మమ్మోగ్రఫీ చేయించుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, చిత్రంలో ఉమా చిగురుపాటి

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: రొమ్ముక్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చని ఏఐజీ ఆసుపత్రి ఛైర్మన్ డా.నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. 40 ఏళ్లు నిండిన ప్రతి మహిళ రొమ్ముక్యాన్సర్‌ను గుర్తించే మమ్మోగ్రఫీ పరీక్ష చేయించుకోవడం తప్పనిసరి అని సూచించారు. మంగళవారం ఫార్మాస్యూటికల్ కంపెనీ గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్, ఏషియన్ మెడికల్ ఫౌండేషన్, యుసీ బ్రెస్ట్ ఫౌండేషన్ సహకారంతో 'బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్'' పేరిట రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ (మొబైల్ వాహనాన్ని) ప్రారంభించారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డా.నాగేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గ్రాన్యూల్స్ ఇండియా లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉమా చిగురుపాటి, ఏఐజీ బ్రెస్ట్ హెల్త్ సెంటర్ ఆంకాలజిస్ట్ డా. ప్రజ్ఞ చిగురుపాటి, ఏఐజీ ఆసుపత్రి వైస్‌ఛైర్మన్ పి.వి.ఎస్.రాజు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న నాగమారుతిశర్మ, చిత్రంలో శైలజామిత్ర, కళా జనార్దనమూర్తి, చక్రపాణి, శ్రీలత

వాడుక భాషకు పట్టం


గాంధీనగర్ , న్యూస్‌టుడే: తెలుగు భాషలో విప్లవాత్మక మార్పులకు ఆద్యుడు మహాకవి గురజాడ అప్పారావు అని విశ్రాంత న్యాయమూర్తి నాగమారుతిశర్మ అన్నారు. త్యాగరాయగానసభ నిర్వహణలో కళా సంగీత నాట్యవేదికలో అభ్యుదయ కవి గురజాడ అప్పారావు యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అభ్యుదయ సాహిత్య వైతాళికుడని కొనియాడారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహిత్యకారుడని అన్నారు. ప్రజలకు అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేశారన్నారు. గురజాడ కన్యాశుల్కం నాటకానికి సాహితీలోకంలో ప్రత్యేక స్థానముందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శైలజామిత్ర, చక్రపాణి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల ప్రయాసలు



హబ్సిగూడ మెట్రోస్టేషన్ వద్ద వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ప్రయాసలు పడుతూ వెళ్లారు

అతి తక్కువ ఖర్చుతో అంతరిక్ష విజయాలు


ప్రదర్శన తిలకిస్తున్న డా.సోమనాథ్

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత దేశం అతి తక్కువ బడ్జెట్‌తో విజయాలు సాధిస్తోందని ఇస్రో ఛైర్మన్ డా.ఎస్.సోమనాథ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో కాన్ఫెడరేషన్ ఆఫ్ తెలుగు రీజియన్ మళయాళీ అసోసియేషన్ (సీటీఆర్ఎంఏ), హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ (హెచ్ఎఫ్‌పీసీ) ఆధ్వర్యంలో 'స్పేస్ టూన్' పేరిట కార్టూన్ ప్రదర్శనను రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సృజనాత్మకతకు అంతరిక్షమే హద్దని ఆర్యభట్ట నుంచి చంద్రయాన్-3 వరకు ప్రగతిని సాధించినట్లేనని ఇందుకు ప్రభుత్వ సహకారం ఎంతో ఉందన్నారు. బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సీటీఆర్ఎంఏ, టీఈడీఎస్, క్లిక్ అధ్యక్షుడు లిబి బెంజిమెన్, కేరళ కార్టూన్ అకాడమి ఛైర్మన్ సుధీర్‌నాథ్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఛైర్మన్ శంకర్, కార్యదర్శి మృత్యుంజయ్ పాల్గొన్నారు.

రూ. 251 కోట్లు వృథా


చెరువు ఎగువన డంపింగ్‌యార్డు

ఈనాడు, హైదరాబాద్: డంపింగ్‌యార్డు నిర్లక్ష్యంతో రూ.251 కోట్ల ప్రజాధనం వృథాగా మారింది. మల్కారం చెరువు శుద్ధి పనులను ఇటీవలే జీహెచ్‌ఎంసీ పూర్తి చేసింది. మూడేళ్లు శ్రమించి మురుగు మొత్తాన్ని శుద్ధి చేసిందని అనుకునేలోపే డంపింగ్‌యార్డు వల్ల చెరువు మళ్లీ కాలుష్య జలాలతో నిండిపోయింది. వద్దంటున్నా వినకుండా తటాకం పక్కనున్న స్థలంలో లక్ష టన్నులకుపైగా చెత్తను కుప్పగా పోయడంతో ఇటీవలి వర్షాలకు వ్యర్థాల నుంచి వెలువడిన వరద నీరంతా చెరువును ముంచెత్తింది. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2009లో శామీర్‌పేట మండలం, జవహర్‌నగర్ గ్రామంలో 338 ఎకరాలను కేటాయించింది. అప్పట్నుంచి నగరంలో ఉత్పత్తయ్యే చెత్త అంతా అక్కడికే తరలుతోంది. 2012లో రాంకీ సంస్థ నిర్వహణ పనులు చేపట్టింది. చెత్త కుప్పల మురుగును శుద్ధి చేయకుండా వదిలేయడం వల్ల పక్కనున్న మల్కారం చెరువు కలుషితమైందని స్థానికులు వాపోయారు. అయినప్పటికీ అధికారులు రాంకీ సంస్థ యాజమాన్యానికి సంబంధించిన మరో సంస్థకు చెరువు శుద్ధి పనులను అప్పగించారు. 3 నెలల క్రితం పని పూర్తయినట్లు వెల్లడించారు. అంతలోనే చెరువు మళ్లీ మురుగుతో నిండిపోయింది. రోజువారీ వ్యర్థాలను నిల్వ చేసేందుకు స్థలం కొరవడిందని, చెరువు పక్కనున్న ఖాళీ స్థలంలో నిల్వ చేయాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

మల్లంపేటలో మహిళ దారుణ హత్య



దుండిగల్, న్యూస్‌టుడే: పట్టపగలు అపార్ట్‌మెంట్లోని ఓ ఫ్లాట్‌లో మహిళ దారుణ హత్యకు గురైన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరుకు చెందిన బొద్దుల సత్యనారాయణ, **శారద**(50) దంపతులు. వారికి ఇద్దరు సంతానం కాగా కుమార్తెకు వివాహమైంది. ఐదు సంవత్సరాల క్రితం సత్యనారాయణ మృతి చెందాడు. ఆమె తన కుమారుడు సాయివినయ్‌తో కలిసి మల్లంపేట గ్రీన్ పార్క్ కాలనీ రోడ్డు నం.2 లో శ్రీ వంశీ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్లో ఉంటోంది. స్థానిక ప్రధాన రహదారి పక్కన విఘ్నేశ్వర మిల్క్ పాయింట్ పేరిట దుకాణం నిర్వహిస్తోంది. సోమవారం ఉదయం తల్లిని మిల్క్ పాయింట్ వద్ద వదిలి కుమారుడు విధులకు వెళ్లాడు. మిల్క్ పాయింట్ మూసి ఉందని అదే రోజు సాయంత్రం పలువురు కస్టమర్లు అతనికి ఫోన్ చేశారు. దీంతో అతను పలుమార్లు తన తల్లికి ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో.. అపార్ట్‌మెంట్లోని తమ ఫ్లాట్ పక్కన ఉండే నరేశ్‌కు సమాచారం ఇచ్చాడు. నరేశ్ వెళ్లి చూడగా మంచంపై శారద మృతి చెంది ఉంది. కుమారుడితో కలిసి ప్రతిరోజు ఉదయం మిల్క్ పాయింట్‌కి వెళ్లి తిరిగి రాత్రి 9 గంటల ప్రాంతంలో కుమారుడితో కలిసి శారద ఇంటికి వచ్చేది. సోమవారం ఉదయం దుకాణం తెరిచిన కొద్దిసేపటికే మూసివేసింది. 10 గంటల ప్రాంతంలో మాస్క్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తితో కలిసి అపార్ట్‌మెంట్లోకి వెళ్తున్న దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. మృతురాలితో అతను వాట్సాప్ కాల్ చేసి మాట్లాడినట్లు పోలీసులు గుర్తించారు.

లడ్డూ కల్తీపై సీబీఐ విచారణ జరిపించాలి


లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రం వద్ద వీహెచ్, దిడ్డి రాంబాబు, కాంగ్రెస్ నేతలు

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ జరిగినందున ప్రధానంగా సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు హిమాయత్‌నగర్ లిబర్టీలోని తితిదే వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నాలుగు గంటల దీక్ష చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు దిడ్డి రాంబాబు, సంబుల శ్రీకాంత్ గౌడ్, లక్ష్మణ్ యాదవ్, పులి జగన్, రమేష్ తదితరులున్నారు.

కుల గణనతోనే బీసీల సంక్షేమం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కోదండరాం, గుజ్జ సత్యం, గుజ్జ కృష్ణ తదితరులు

అంబర్‌పేట, న్యూస్‌టుడే: కుల గణనతోనే బీసీల సంక్షేమం, సామాజిక న్యాయం, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు సాధ్యమని బీసీ సంక్షేమ సంఘం తెలిపింది. మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందగోపాల్, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ కార్యదర్శి రాఫెల్ జ్ఞానేశ్వర్ తదితరులు ఈ నెల 25న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో జరుగనున్న 'సమగ్ర కుల గణన- సామాజిక న్యాయం' అఖిలపక్ష సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం ఆవిష్కరించారు.

స్నాప్‌చాట్‌లో బాలిక నగ్న వీడియోలు


నిందితుడు అఖీలుద్దీన్

ఈనాడు, హైదరాబాద్: బాలిక నగ్న వీడియోలు సేకరించి స్నాప్‌చాట్‌లో ఇతరులకు షేర్ చేస్తున్న వ్యక్తిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్‌క్రైమ్ డీసీపీ ధార కవిత, ఏసీపీ చాంద్‌బాషా తెలిపిన ప్రకారం పాతబస్తీ తలాబ్‌కట్ట ప్రాంతానికి చెందిన అఖీలుద్దీన్ (21) ఎలక్ట్రీషియన్. బండ్లగూడ ప్రాంతానికి చెందిన ఒక బాలికతో పరిచయం పెంచుకున్నాడు. కొన్నిరోజుల తర్వాత బాలికకు స్నాప్‌చాట్ ద్వారా వీడియో కాల్ చేసి ఆమె వ్యక్తిగత, నగ్న వీడియోలు సేకరించాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశారు.

జల వనరుల్లోని నిర్మాణాలను బహిర్గతపరచాలి

రాయదుర్గం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసిన, చెరువుల్లో నిర్మించిన భవనాల వివరాలను బహిర్గతం చేస్తే వినియోగదారులు అప్రమత్తమై కొనుగోలుకు దూరంగా ఉంటారని తెలంగాణ నేషనల్ రియల్ ఎస్టేట్ కౌన్సిల్(నరెడ్కో) ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గం సత్వ నాలెడ్జ్ సిటీలోని సమావేశ మందిరంలో మంగళవారం రాత్రి ఆ సంస్థ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు అలాంటి నిర్మాణాల గురించి తెలియాల్సిన అవసరం ఉందన్నారు.

ఫైనల్స్‌కు చేరిన ఖోఖో జట్లు


సెమీ ఫైనల్స్‌లో ఆడుతున్న బాలికలు

నిజాంపేట, న్యూస్‌టుడే: బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాలలో మూడు రోజులుగా సాగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 ఖోఖో టోర్నమెంట్ పోటీలు మంగళవారం రసవత్తరంగా సాగాయి. సెమీ ఫైనల్స్‌లో మొత్తం 70 జట్లు తలపడ్డాయి. అండర్-17 బాలల జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకోగా.. అండర్-14 జట్లు ఇప్పటికే సెమీ ఫైనల్స్ పూర్తిచేసుకుని ఫైనల్స్‌కు చేరాయి.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

డీలర్ల పేరుపై పురుగు మందుల సంస్థ రుణాలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: తమకు తెలియకుండా ఓ పురుగు మందుల సంస్థ తమ పేరిట రుణాలు తీసుకుని మోసానికి పాల్పడిందని తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు డీలర్లు రాయదుర్గం పోలీసులను ఆశ్రయించారు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఆదిత్య దేశ్‌పాండే ల్యాబ్ టు ల్యాండ్ పేరుతో పురుగు మందుల వ్యాపారం మొదలుపెట్టారు. ఏడాది క్రితం రాయదుర్గం టీహబ్‌లో కార్యాలయం ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లోని డీలర్ల నుంచి ఖాళీ చెక్కులు, వారి కేవైసీ వివరాలు సేకరించారు. డీలర్లు నగదు చెల్లించి సరకులు తీసుకోగా యాజమాన్యం మాత్రం డీలర్ల పేరిట రుణాలు తీసుకుని వాడుకుంది. కిస్తీలు చెల్లించాలని ఫైనాన్స్ సంస్థల నుంచి డీలర్లకు మెసేజ్‌లు రావడంతో వారు అవాక్కయ్యారు. డీలర్లుగా నమోదు చేసిన ఉద్యోగులను దీనిపై ప్రశ్నించారు. దీంతో జిల్లాస్థాయి ఉద్యోగులు మార్చిలో టీహబ్‌కు వచ్చి చూసేసరికి కార్యాలయం మూసి ఉండడంతో రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం తెలుగు రాష్ట్రాల్లోని వివిధ జిల్లాలకు చెందిన డీలర్లు 50 మంది వరకు రాయదుర్గం పీఎస్‌కు వచ్చి తమ పేరుపై రుణాలు తీసుకుని మోసగించిన ఆ సంస్థపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

స్కీము వెనుక రూ.6.7 కోట్ల స్కాము

18 మంది నుంచి వసూలు చేసిన డీబీ స్టాక్ కన్సల్టెన్సీ

ఈనాడు, హైదరాబాద్: పెట్టుబడి పెడితే ఏడాదికి 120 శాతం చొప్పున వడ్డీ ఇస్తామంటూ ప్రచారం చేసిన డీబీ స్టాక్ కన్సల్టెన్సీ సంస్థ బిచాణా ఎత్తేసింది. మొత్తం 18 మంది రూ.6.7 కోట్లు వసూలు చేసిన సంస్థ యజమాని పరారయ్యాడు. ఈ సంస్థ అసోం కేంద్రంగా నడుస్తూ తెలుగు రాష్ట్రాల్లోనూ మోసాలు చేసినట్లు సమాచారం. బాధితుల సంఖ్య, మోసం విలువ ఇంకా భారీగా ఉండొచ్చని తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం ఠాణాలో ఎఫ్ఐఆర్ నమోదైంది. పుప్పాలగూడకు చెందిన షామైపంచాక్షర్ (37) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. అసోంలోని గువాహటి కేంద్రంగా దీపాంకర్ బర్మన్ అనే వ్యక్తి డీబీ స్టాక్ బ్రోకింగ్ కన్సల్టెన్సీ సంస్థను ప్రారంభించారు. నగరంలోని కేపీహెచ్‌బీలోనూ శాఖ ఉంది. తమ సంస్థ 4 రకాల స్కీములు ప్రారంభించిందని, పెట్టుబడులు పెడితే ఏడాదికి 120 శాతం, 6 నెలలకు 54 శాతం, 3 నెలలకు 24 శాతం, నెలకు 7 శాతం చొప్పున వడ్డీ ఇస్తామని దీపాంకర్ ప్రచారం చేశాడు. దీనికి పంచాక్షర్ ఆకర్షితుడయ్యాడు. గత ఏప్రిల్‌లో దీపాంకర్ ఖాతాలకు రూ.11.10 లక్షలు బదిలీ చేశాడు. ఈ సమయంలోనే గువాహటిలో సంస్థను స్థానిక పోలీసులు జప్తు చేశారని, దీపాంకర్ పరారైనట్లు పంచాక్షర్ తెలుసుకున్నాడు. కేపీహెచ్‌బీ కార్యాలయానికి వెళ్లగా తన లాగే మరో 17 మంది రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టినట్లు వెల్లడైంది. బాధితుల ఫిర్యాదు మేరకు దీపాంకర్ మీద కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి: పీఆర్టీయూ


ఈవీ నర్సింహారెడ్డికి వినిపత్రం ఇస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ తెలంగాణ హైదరాబాద్ జిల్లా శాఖ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డిని కోరింది. పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి నేతృత్వంలో పలువురు ఆయనకు సమస్యలు వివరించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల సాయంత్రం 4 గంటలకు వదలడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, మధ్యాహ్నం భోజన సమయం 15 నిమిషాలు తగ్గించి ప్రాథమిక పాఠశాల పిల్లలను 3.45 గంటలకు వదిలేస్తే రద్దీ తగ్గుతుందని సూచించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వతి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రావణ్ కుమార్ రెడ్డి, చక్రారెడ్డి, బాలాజీ, వెంకట్‌రెడ్డి, బి.రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు కుటుంబాల మధ్య చిచ్చుపెడుతున్నాయి. బాధితుల పట్ల కుటుంబ సభ్యుల సూటిపోటి మాటలు మరింత కుంగదీస్తున్నాయి. ఆలుమగలు విడిపోయే పరిస్థితి. పిల్లల చదువులు, వివాహాల కోసం దాచుకున్నదంతా పోగొట్టావంటూ మొదలవుతున్న కలహాలు బంధాలను మరింత దిగజారుస్తున్నాయి. – ఈనాడు, హైదరాబాద్

కాపురాల్లో సైబర్ చిచ్చు

90 శాతం కేసుల్లో విద్యావంతులే బాధితులు



90 శాతం సైబర్ కేసుల్లో విద్యావంతులే బాధితులుగా ఉంటున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 85 వేల కేసులు నమోదవ్వగా అందులో 3 వేల మంది బాధితులు గృహిణులు. టాస్కుల పేరుతో ఇంటి నుంచే సంపాదన, నకిలీ ప్రకటనలు తదితర మోసాల్లో వీరు బాధితులు. కొందరు గృహిణులు తమ దగ్గర డబ్బు లేకున్నా తెలిసినవారి దగ్గర అప్పు చేసి, ఇంట్లో బంగారం, భర్త దాచిన నగదును నేరగాళ్లకు పంపిస్తున్నారు.

చేసిన అప్పుతీర్చలేక.. మహిళలకు కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఒకెత్తయితే పురుషులది దీనస్థితి. మోసమని తెలియక కొందరు ఆస్తులు తాకట్టుపెట్టి మోసపోతున్నారు. రుణదాతల ఒత్తిడి భరించలేక మానసికంగా కుంగిపోతున్నారు. కొందరు అప్పటికప్పుడు బ్యాంకుల నుంచి వ్యక్తిగత రుణాలు తీసుకుని మరీ నేరస్థులకు పంపిస్తున్నారు. మోసపోయామని తెలుసుకొని భార్యను అదనపు కట్నం కావాలని వేధించడం, చిన్న విషయాలకు చేయి చేసుకోవడం వంటి సమస్యలు మొదలవుతున్నాయి.

కొన్ని ఉదాహరణలు..

- ఖైరతాబాద్‌కు చెందిన ఓ మహిళ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో రూ.4.5 లక్షలు పోగొట్టుకుంది. మోసపోయినట్లు గుర్తించిన పోలీసులకు ఫిర్యాదు చేసింది. పిల్లల కోసం దాచిన డబ్బు పోగొట్టావంటూ భర్త సూటిపోటి మాటలతో వేధించడం మొదలుపెట్టాడు. నిత్యం పరిస్థితి విడాకుల వరకూ వెళ్లింది. చిన్నపిల్లలు ఇబ్బందిపడతారని పెద్దలు సర్దిచెప్పడంతో కలిసి ఉంటున్నారు.
- పెట్టుబడులకు లాభాలిస్తామని సైబర్ నేరగాళ్ల ప్రకటన నమ్మి నగరవాసి రూ.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. మధ్య తరగతి నేపథ్యమే అయినా వ్యాపారి లాభాలకు ఆశపడి అప్పులు చేసి మరీ నేరగాళ్లకు డబ్బు పంపాడు. చివరకు మోసమని తెలియడంతో అప్పు ఎలా తీర్చాలో దిక్కుతోచని పరిస్థితి. కుటుంబ సభ్యులు ఇంటి పెద్దను తీవ్రంగా నిందించారు. దీంతో ఆయన మనస్తాపానికి గురై ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు.

అండగా నిలవాలి

కుటుంబానికి ఆసరాగా ఉండాలని ఎక్కువ మంది మహిళలు, గృహిణులు సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నారు. సైబర్ నేరాల బారినపడితే ఆలస్యం చేయకుండా ఫిర్యాదుచేయాలి. డబ్బు కోల్పోయామని కుంగిపోవద్దు. కుటుంబ సభ్యులు సూటిపోటి మాటలు అనకుండా అండగా నిలవాలి.

– ధార కవిత, హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ

పెండింగ్ పాల బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ఇకపై ప్రతి 15 రోజులకు విధిగా రైతులకు చెల్లించాలని, ప్రోత్సాహకాల విడుదల సహా అన్ని డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 26న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పాల ఉత్పత్తిదారుల సంఘం మంగళవారం వెల్లడించింది. విజయ డెయిరీకి పాలు సరఫరా చేసిన రైతులకు రూ.150 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయని.. రెండు నెలలుగా చెల్లింపులు నిలిచిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంది.

500 కుటుంబాలు... 140 లారీలు

- 23 మండలాల్లో సేద్యానికి వెన్నుదన్నుగా యువకులు

న్యూస్‌టుడే, డిచ్‌పల్లి: ఉపాధి వేటలో కన్నతల్లి లాంటి ఊరిని విడిచారు. లారీ డ్రైవర్లుగా యజమానులు చెప్పిన చోటల్లా తిరిగారు. నెల తరబడి కుటుంబాలకు దూరంగా ఉన్నారు. కష్టాల నుంచి పాఠాలు నేర్చుకొని వెనుదిరిగారు. సొంతంగా లారీలు కొనుక్కున్నారు. సరుకు రవాణా అంటే తమపేరే గుర్తుకొచ్చే స్థాయికి చేరారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం నాకతండా, వెస్సెనగర్‌తండా, మాక్లుతండా, సాంపల్లి మేలయతండా, జక్రాన్‌పల్లి మండలం గన్యాతండాల్లో ఎక్కడ చూసినా లారీలే కనిపిస్తాయి. 44వ నంబరు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న ఈ తండాల్లో ముంగిళ్లలో లారీ ఉంటుంది. తండాల మొత్తం జనాభా 3,000... కుటుంబాలు 500. మొదట్లో బతుకుదెరువు కోసం స్థానిక యువకులు గల్ఫ్ దేశాలకు వెళ్లారు. ఇతర రాష్ట్రాల్లో డ్రైవర్లుగా పనిచేశారు. తర్వాత ఒక్కొక్కరుగా వెనక్కి వచ్చారు. సొంతూళ్లకొచ్చి ఆస్తులు అమ్ముకుని, అప్పులు చేసి సొంతంగా 140 లారీలను కొన్నారు. 18 ఏళ్ల కిందట 'శ్రీ సేవాలాల్ లారీ ఓనర్స్ అసోసియేషన్' స్థాపించారు.

అవకాశాన్ని అందిపుచ్చుకొన్న యువకులు

నిజామాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఆర్మూర్, అంకాపూర్, జక్రాన్‌పల్లి, వేల్పూర్, బాల్కొండ, మెండోరా, మోర్తాడ్, కమ్మర్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల తదితర ప్రాంతాలు పసుపు, ఎర్రజొన్నల సాగుకు ప్రసిద్ధి.


నాకతండాలో జాతీయ రహదారి పక్కన నిలిపిన లారీలు

సేంద్రియ వ్యవసాయం చేసే స్థానిక రైతులు పశువుల పేడ, గొర్రెలు, మేకలు, కోళ్ల ఎరువును అధికంగా వాడతారు. తండాల యువకులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి, ఇందల్వాయి, ధర్పల్లి, కామారెడ్డి జిల్లా సదాశివనగర్, గాంధారి, లింగంపేట, బిక్కనూరు, దోమకొండ, మెదక్ జిల్లా చేగుంట, తూప్రాన్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లా జోగిపేట, శంషాబాద్ మండలాల్లోని గ్రామాలకు వెళ్లి ఎరువు కొని రైతులకు విక్రయిస్తున్నారు. ఇలా జనవరి నుంచి జూన్ మొదటి వారం వరకు వ్యాపారం చేస్తారు. వానాకాలం, యాసంగి సీజన్లలో కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలిస్తారు. బియ్యం బస్తాలను ఎఫ్‌సీఐకి చేరవేస్తారు. ఇతర రాష్ట్రాల నుంచి రైలు బోగీల్లో వచ్చే ఎరువును ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చేరవేస్తారు. ఒక్కో లారీకి ఒక డ్రైవర్, క్లీనర్‌తోపాటు ఐదుగురు చొప్పున కూలీలకు ఉపాధి చూపుతున్నారు.

20 మందికి పని కల్పిస్తున్నాం

-భూక్యా సుదర్శన్, లారీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి



మాకు వ్యవసాయ భూమిలేదు. కానీ, మా నాన్న ఒక లారీని కొని పేడ వ్యాపారం ప్రారంభించారు. నేను ఆయన బాటలో నడుస్తున్నా. ప్రస్తుతం మాకు నాలుగు లారీలున్నాయి. మేము 20 మందికి ఉపాధి కల్పిస్తున్నాం.

మా తండాల ఉపాధికి భరోసా

- బి.రవి, నాకతండా



లారీలను కొన్న తర్వాత మా తండాల్లో అందరికీ పని దొరుకుతోంది. మా అన్నదమ్ములకు ఒకటి, నాకు రెండు లారీలున్నాయి. వ్యవసాయ సీజన్‌లో ధాన్యం, తర్వాత పశువుల పేడను తరలిస్తాం.

లస్కర్లొస్తున్నారు..!

- 1800 మందిని నియమిస్తున్నామన్న మంత్రి ఉత్తమ్
- మూడు దశాబ్దాల తర్వాత నియామకం!

ఈనాడు, నల్గొండ: సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్రప్రభుత్వం లస్కర్ల నియామకానికి పచ్చజెండా ఊపింది. గురువారం 1800 మంది లస్కర్లను నియమించనున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. సుమారు మూడు దశాబ్దాల అనంతరం లస్కర్ల నియామకం చేపట్టనున్నారు. గత పదేళ్లలో లస్కర్ల వ్యవస్థ నిర్వీర్యం కావడంతో.. వీఆర్‌ఏలు ఈ బాధ్యతలు చూసేవారు. కొంతకాలంగా వారూ లేకపోవడంతో కాల్వల నిర్వహణ సరిగా లేక.. చివరి భూములకు నీళ్లురాని దుస్థితి నెలకొంది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి నల్గొండ జిల్లాలో సుమారు 6 లక్షల ఎకరాలకు కాల్వల ద్వారా నీటి పారుదల ఉంది. సాగర్ ఎడమకాలువ ఆయకట్టులోని చాలా మేజర్లలో నీటి నిర్వహణను స్థానిక రైతులే చూస్తున్నారు. కరవు కాలంలో చెరువులను నింపడానికి, తాగునీటికి నీటిని విడుదల చేస్తే రైతులు ఎక్కడికక్కడ కాల్వలకు గండ్లు పెడుతున్నారు. దీంతో వారు షట్టర్లను తెరవకుండా కొన్నిచోట్ల వాటికి వెల్డింగ్ చేసే పరిస్థితి నెలకొంది. నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం వద్ద ఎడమ కాల్వకు గండి పడటానికి షట్టర్లకు వెల్డింగ్ చేయడమే కారణమని అధికారులు భావించారు. మరోవైపు ఎడమ కాల్వ పరిధిలోని పలు ఎత్తిపోతల పథకాలను రైతులే నిర్వహిస్తున్నారు. వాటి నిర్వహణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించినా ఇప్పటివరకు నెరవేరలేదు. కాల్వల నిర్వహణకు కనీసం లస్కర్లనయినా నియమిస్తే చివరి భూములకూ నీళ్లు అంది పంటలు పండుతాయని ఆయకట్టు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో సుమారు 250 మంది లస్కర్లు ఉండేవారని.. వారిని నియమిస్తే కాల్వల నిర్వహణ మెరుగుపడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సిద్ధరామయ్యకు సంకట స్థితి!

- ముడా అక్రమాల్లో పాత్రపై విచారణ
- గవర్నర్ ఆదేశాలు చట్టబద్ధమని తీర్పు



ఈనాడు, బెంగళూరు: మైసూరు నగరాభివృద్ధి సంస్థ (ముడా) స్థలాల పంపిణీ- అక్రమాల వ్యవహారంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించడానికి వీలుగా గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ గతంలో ఇచ్చిన ఆదేశాలు సరైనవేనని కర్ణాటక హైకోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. ముగ్గురు ప్రైవేటు వ్యక్తుల ఫిర్యాదు మేరకు అవినీతి నిరోధక చట్టం (పీసీ) 17ఏ, భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్) సెక్షన్ 218 ప్రకారం సీఎంను విచారించాలని గవర్నర్ గతంలో ఆదేశించారు. ఈ ఆదేశాలను సీఎం సిద్ధరామయ్య హైకోర్టులో సవాలు చేశారు. దీనిపై ఆగస్టు 19 నుంచి విచారణ చేపట్టిన జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం సీఎం పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు వెల్లడించింది. చట్టం ప్రకారం గవర్నర్ ఆదేశాలు నిబంధనల మేరకే ఉన్నాయని కోర్టు తేల్చి చెప్పింది. గవర్నర్ కనీస అవగాహన లేకుండా ఆదేశించారన్న ముఖ్యమంత్రి ఆరోపణను తోసిపుచ్చింది. ఈ తీర్పుపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. 'పీసీ చట్టం 17ఏ ప్రకారం ఈ మొత్తం అక్రమాలపై దర్యాప్తునకు మాత్రమే కోర్టు అనుమతించింది. ప్రత్యేకంగా నన్ను విచారించేందుకు అనుమతి ఇవ్వలేదు. తీర్పులోని కీలకాంశాలు పరిగణలోనికి తీసుకోవాలి. ఎలాంటి విచారణకైనా సిద్ధం. న్యాయ నిపుణులతో చర్చించాక.. ఈ తీర్పును డివిజన్ బెంచ్‌లో సవాలు చేస్తా' అని తెలిపారు. తాను రాజీనామా చేసేంత అక్రమాలకు పాల్పడలేదని విపక్షాల డిమాండ్లకు బదులిచ్చారు. దేశంలో విపక్షాలు అధికారంలో ఉన్న ప్రతి రాష్ట్రంలోనూ ప్రభుత్వాలను కూల్చే ప్రయత్నాలకు భాజపా తెగిస్తోందని ధ్వజమెత్తారు. భాజపా, జేడీఎస్‌ల రాజకీయ కుట్రలకు తాను భయపడనని స్పష్టం చేశారు. మరోవైపు.. సిద్ధరామయ్య తక్షణమే పదవికి రాజీనామా చేయాలని భాజపా రాష్ట్రాధ్యక్షుడు బి.వై.విజయేంద్ర, విధానసభలో పార్టీ పక్ష నేత ఆర్.అశోక్ డిమాండు చేశారు.



తిరుమల లడ్డూ అపవిత్రం కావడంపై ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం విజయవాడలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఆలయ మెట్లను కడిగి, పసుపు రాసి, కుంకుమబొట్లు పెట్టారు. – ఈనాడు డిజిటల్, అమరావతి

నా వ్యాఖ్యలతో అపార్థం.. క్షమించండి

- తమిళ హీరో కార్తి

ఈనాడు, హైదరాబాద్: తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో "లడ్డూ గురించి ఇప్పుడొద్దు.. చాలా సున్నితమైన అంశం" అంటూ తమిళ నటుడు కార్తి తన సినిమా వేడుకలో నవ్వుతూ చేసిన వ్యాఖ్యలపై ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. "ఈ అంశంపై మాట్లాడితే మద్దతుగా మాట్లాడండి.. లేకపోతే మౌనంగా కూర్చోండి.. అపహాస్యం చేస్తే ప్రజలు క్షమించరు. 'లడ్డూ సున్నితమైన అంశం' అంటూ జోకులేస్తున్నారు. ఇంకోసారి అలా అనొద్దు. ప్రజలు క్షమించరు" అంటూ పవన్ హితవు పలికారు. దీంతో వెంటనే సామాజిక మాధ్యమాల వేదికగా కార్తి క్షమాపణలు చెప్పారు. తన మాటల వల్ల ఊహించని పరిణామం ఏర్పడిందని.. అపార్థాలు చోటుచేసుకున్నాయని.. క్షమాపణలు తెలిపారు. తానూ వేంకటేశ్వరస్వామి భక్తుడినేనని.. తానెప్పుడూ సంప్రదాయాల్ని గౌరవిస్తానని కార్తి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

✦ కార్తి సత్వర స్పందన పట్ల పవన్ అభినందనలు తెలిపారు. కార్తి నటించిన 'సత్యం సుందరం' విజయవంతమవ్వాలని ఆకాంక్షించారు.

సిట్ అధిపతిగా సర్వశ్రేష్ఠ త్రిపాఠి!

- తిరుమలలో అపచారాలపై విచారణ

ఈనాడు, అమరావతి: జగన్ పాలనలో తిరుమలలో జరిగిన అపచారాలు, లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వులు కలిసిన కల్తీ నెయ్యి వినియోగం, ఇతర అక్రమాలు, అధికార దుర్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న సిట్ అధిపతిగా.. గుంటూరు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని రాష్ట్ర ప్రభుత్వం నియమించనుంది. సభ్యులుగా విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ, వైఎస్సార్ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో పాటు మరికొంతమంది డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లకు చోటు కల్పించనుంది. గోపీనాథ్ జెట్టీ గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. హర్షవర్ధన్‌రాజుకు తిరుపతి ఎస్పీగా పనిచేసిన అనుభవముంది. దీంతో సిట్‌లో వీరి నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదముద్ర వేశారు. సిట్ దర్యాప్తులో తేల్చాల్సిన అంశాలకు సంబంధించిన టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ వివరాలు సిద్ధం చేశారు. వీటన్నింటితో అధికారిక ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉంది.

ఏపీలో భారీగా నామినేటెడ్ పోస్టుల భర్తీ

ఈనాడు, అమరావతి: ఏపీ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో నామినేటెడ్ పదవులను మంగళవారం భర్తీ చేసింది. ఆర్టీసీ, పౌరసరఫరాలు, ఏపీఐఐసీ, వక్ఫ్ బోర్డు వంటి 20 కీలక కార్పొరేషన్లకు ఛైర్మన్‌లతో పాటు ఆర్టీసీకి వైస్‌ఛైర్మన్‌ను కూడా నియమించింది. వీటిలో ఏడు కార్పొరేషన్లలో 64 మంది సభ్యులకు చోటు కల్పించింది. మిగతా 13 కార్పొరేషన్లకు ప్రస్తుతానికి ఛైర్మన్లను మాత్రమే ప్రకటించింది. రాష్ట్రంలో ఇటీవలి ఎన్నికల్లో తెదేపా, జనసేన, భాజపాల మధ్య సీట్ల పంపకానికి అనుసరించిన సూత్రాన్నే, ఈ పోస్టుల భర్తీలోనూ వర్తింపజేసింది. అదే దామాషాలో మూడు పార్టీలకు పదవులు దక్కాయి. తెదేపా నుంచి 16 మందిని ఛైర్మన్లుగా, 53 మందిని సభ్యులుగా; జనసేన నుంచి ముగ్గురిని ఛైర్మన్లుగా, తొమ్మిది మందిని సభ్యులుగా; భాజపా నుంచి ఒకరిని ఛైర్మన్‌గా, ఐదుగురిని సభ్యులుగా నియమించారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పోస్టు తెదేపాకు దక్కింది. ఎన్డీయే పొత్తులో భాగంగా టికెట్ దక్కని వారికి, రాజకీయ సమీకరణాల్లో భాగంగా ఇంకా బలమైన అభ్యర్థులకు టికెట్ ఇవ్వాల్సి వచ్చినప్పుడు, పార్టీ ఆదేశాలకు కట్టుబడి త్యాగం చేసిన వారికి, పొత్తు ధర్మాన్ని పాటించి కూటమి అభ్యర్థుల విజయానికి కృషిచేసిన వారికి గుర్తింపు లభించింది. పూర్తి వివరాలు www.eenadu.netలో..

రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయండి

తెలంగాణ ప్రొఫెషనల్, డిగ్రీ కళాశాలల సమాఖ్య అభ్యర్థన

ఈనాడు, హైదరాబాద్: గత మూడేళ్లుగా రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రొఫెషనల్ అండ్ డిగ్రీ కళాశాలల సమాఖ్య అభ్యర్థించింది. హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు జయపాల్‌రెడ్డి, బొజ్జా సూర్యనారాయణరెడ్డి, నాగయ్య, పరమేశ్వర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. పెండింగ్ బకాయిలతో ఉద్యోగులకు వేతనాలు కూడా ఇవ్వలేకపోతున్నామని, వివిధ రుణాలు చెల్లించలేకపోవడంతో బ్యాంకర్లు నోటీసులు జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్ల నుంచి దాదాపు రూ.6,500 కోట్ల బకాయిలు ఉన్నాయని, వాటిల్లో రూ.1,200 కోట్లకు టోకెన్లు ఇచ్చినా విడుదల కాలేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని దసరాలోపు బకాయిలను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

గర్భస్థ శిశువుకు గన్యా

ఆకివీడు, న్యూస్‌టుడే: తల్లి గర్భంలో ఉన్న శిశువుకు గన్యా సోకిన అరుదైన ఘటన పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలంలో వెలుగుచూసింది. ఈ వివరాలను రామరాజు పిల్లల ఆసుపత్రి (ఆకివీడు) వైద్యుడు మహేశ్వర్మ మంగళవారం విలేకర్లకు తెలిపారు. ఆకివీడు మండలం కుప్పనపూడికి చెందిన నాగసరస్వతి తొమ్మిదో నెల గర్భిణిగా ఉన్నప్పుడు జ్వరం వచ్చింది. ఆమెకు ఈ నెల 5న స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో సిజేరియన్ చేశారు. పుట్టిన మగశిశువు బరువు తక్కువగా ఉండడంతో పాటు శ్వాససంబంధ సమస్యలు కనిపించడంతో రామరాజు పిల్లల ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సతో కోలుకున్న శిశువును 11వ రోజున డిశ్చార్జి చేశారు. రెండురోజుల తరువాత ఆ శిశువును కుటుంబసభ్యులు మళ్లీ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అప్పటికే ముక్కు భాగం నల్లగా మారినట్లు గుర్తించి రక్తనమూనాలను దిల్లీలోని ల్యాబ్‌కు పంపగా, గన్యా ఉన్నట్లు నిర్ధారణ అయింది. తల్లి నుంచి గర్భస్థ శిశువుకు గన్యా సోకడం చాలా అరుదని, సకాలంలో చికిత్స అందించడంతో బిడ్డ ఆరోగ్యం మెరుగుపడిందని వైద్యుడు మహేశ్వర్మ తెలిపారు.

నిమ్స్, ఎన్టీఆర్ వర్సిటీలకు అంబుడ్స్‌పర్సన్‌లను నియమించండి

యూజీసీ ఆదేశం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య విశ్వవిద్యాలయం, తెలంగాణలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో తక్షణం అంబుడ్స్‌పర్సన్‌లను నియమించాలని యూజీసీ ఆదేశించింది. విద్యార్థుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం అంబుడ్స్‌పర్సన్‌లను నియమించాలని ఇప్పటికే దేశవ్యాప్తంగా 23 రాష్ట్ర, 5 ప్రైవేటు, 3 డీమ్డ్ యూనివర్సిటీలు ఇంకా అంబుడ్స్‌పర్సన్‌లను నియమించలేదని యూజీసీ పేర్కొంది. అందులో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, విజయనగరం జిల్లా ద్వారంపూడిలో ఉన్న జేఎన్‌టీయూ, తెలంగాణలోని నిమ్స్‌లకు ఇప్పటివరకూ అంబుడ్స్‌పర్సన్‌లను నియమించలేదని తెలిపింది.

9న సింగరేణి కార్మికులకు బోనస్ చెల్లింపు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులకు ఇటీవల ప్రకటించిన లాభాల వాటా బోనస్‌ను అక్టోబరు 9న చెల్లించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. అమెరికా పర్యటనలో ఉన్న సంస్థ సీఎండీ బలరాం మంగళవారం ఉదయం సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలతో నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. గతేడాది(2023-24) సంస్థ సాధించిన నికర లాభాలలో రూ.796 కోట్లను బోనస్‌గా ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన సంగతి తెలిసిందే.

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలి

సీపీఎస్ ఉద్యోగుల సంఘం వినతి

ఈనాడు, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్)ను రద్దు చేయించి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం విన్నవించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్, ఇతర నేతలు మంగళవారం మహేశ్‌కుమార్‌గౌడ్ నివాసానికి వెళ్లి ఆయనను శాలువాతో సన్మానించి వినతిపత్రాన్ని అందజేశారు. పాత పింఛన్ విధానం అమలు చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇవ్వడంతో సీపీఎస్ ఉద్యోగులు మద్దతిచ్చారని వారు గుర్తుచేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకించాలని వారు కోరారు.

జీఎస్టీ అడ్వాన్స్ రూలింగ్ అథారిటీ సభ్యుడిగా సాయి కిశోర్

ఈనాడు, హైదరాబాద్: వాణిజ్య పన్నుల శాఖలో తెలంగాణ జీఎస్టీ అడ్వాన్స్ రూలింగ్ అథారిటీ సభ్యుడిగా సాయి కిశోర్‌ను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇంతకాలం ఈ పదవిలో ఉన్న అదనపు కమిషనర్ కాశీ విశ్వేశ్వరరావు స్థానంలో సాయి కిశోర్‌ను నియమిస్తున్నట్లు తెలిపింది. జీఎస్టీ వసూళ్లలో రూ.వెయ్యి కోట్లకు పైగా అక్రమాలు జరిగాయని ఈ శాఖ ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ అక్రమాల్లో కాశీ విశ్వేశ్వరరావు ప్రమేయం ఉందని వచ్చిన ఆరోపణలపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఆయనను అథారిటీ నుంచి తొలగించినట్లు తెలుస్తోంది. ఏదైనా సంస్థ లేదా కంపెనీ జీఎస్టీ చెల్లింపులో లోపాలున్నట్లు భావిస్తే ఈ అథారిటీకి ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి న్యాయం చేస్తుంది.



రూపాయి ఖర్చు లేకుండా ఆనందాల వ్యాప్తి

ప్రేమ, ఆప్యాయత, కరుణ.. ఎదుటివారిపై వీటిని చూపడానికి మనం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. వీటిని ప్రదర్శించడంతో పాటు ఇతరులను మనస్ఫూర్తిగా ప్రశంసించడం అలవాటు చేసుకోండి. అప్పుడు ఎదుటివారే కాదు, మీరూ చాలా సంతోషంగా ఉంటారు. ఆనందాల వ్యాప్తికి మీరు వాహకంగా అవతరిస్తారు.
– గ్యారీ వేనర్‌చుక్, వ్యాపారవేత్త



మొగిలయ్యకు ఇంటి స్థలం కేటాయింపు

ప్రముఖ కిన్నెర వాయిద్యకారుడు, పద్మశ్రీ దర్శనం మొగిలయ్యకు హయత్‌నగర్‌లో 600 చదరపు గజాల ఇంటి స్థలం కేటాయించినట్లు ఉత్తర్వులను మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేశారు. చిత్రంలో అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తదితరులు. - ఈనాడు, హైదరాబాద్



అభివాదం చేస్తున్న చెన్నయ్య ఇతర నాయకులు

'వర్గీకరణ ఉప కమిటీ నుంచి మల్లు రవిని తప్పించాలి'

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం నియమించిన మంత్రుల ఉప కమిటీలో మంత్రి కాని వ్యక్తి, ఎంపీ మల్లు రవిని చేర్చడం సరికాదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అభ్యంతరం వ్యక్తం చేసింది. వెంటనే ఆయన్ని కమిటీ నుంచి తప్పించాలని సమితి కన్వీనర్ జి.చెన్నయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. మంగళవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాజకీయంగా, ఉద్యోగాల్లో, ప్రభుత్వ పథకాల్లో మాలలకు తీవ్ర నష్టం జరిగిందని, వర్గీకరణ చేసి ఇంకా అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీ మల్లు రవి వర్గీకరణకు వ్యతిరేకమా? అనుకూలమా? అనేది ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్పష్టత కోసం రాష్ట్రంలోని 50లక్షల మంది మాలలు ఎదురు చేస్తున్నారని పేర్కొన్నారు. స్పందించని పక్షంలో వారి ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సమితి కో-కన్వీనర్లు బేర బాలకిషన్, బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేశ్‌బాబు, బైండ్ల శ్రీనివాస్, ఆనందరావు, మధుకర్, ఎల్లస్వామి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల పారిశుద్ధ్యం, భద్రతలో సమూల మార్పులు

- ఎయిమ్స్, కార్పొరేట్ విధానాలపై అధ్యయనం చేయండి
- వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, భద్రత, పేషంట్ కేర్ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. అఖిలభారత విద్యా సంస్థలు, కార్పొరేట్ ఆసుపత్రులు అవలంబిస్తున్న విధానాలపై అధ్యయనం చేయాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, భద్రతపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఆరోగ్యశ్రీ సీఈవో విశాలాచ్చి, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, డీఎంఈ వాణి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవీందర్ నాయక్, ఎంఎన్‌జే డైరెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. డైట్, శానిటేషన్, సెక్యూరిటీ, పేషంట్ కేర్ విభాగాల పనితీరు, సమస్యలపై చర్చించిన మంత్రి రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారిశుద్ధ్య పరిస్థితులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వాటిని పూర్తిస్థాయిలో చక్కదిద్దాలన్నారు. రోగులు, వైద్య సిబ్బందికి తగిన భద్రత ఉండేలా చూడాలని సూచించారు. ఆసుపత్రుల్లో ఆయా విభాగాల సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయాలని పేర్కొన్నారు. వారికి ప్రతి నెలా సకాలంలో నిధులు విడుదల చేసి వేతనాలు చెల్లించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్ వేతనాలు చెల్లిస్తున్నారా, లేదా అనేది పర్యవేక్షించాలన్నారు. రోగులతో ఎలా మాట్లాడాలో కింది స్థాయి సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, టాయిలెట్స్, ఇతర సదుపాయాలపై నివేదిక తయారు చేయాలని, అన్ని బోధనాసుపత్రుల్లో సెక్యూరిటీ అవుట్ పోస్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. అవుట్ పేషంట్లు వైద్యం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ. చిత్రంలో అధికారులు క్రిస్టినా జడ్ చోంగ్తూ, విశాలాచ్చి, ఆర్.వి.కర్ణన్, హేమంత్

వేర్వేరు ఘటనల్లో పిడుగుపాటుకు ఐదుగురి దుర్మరణం

- మరో ముగ్గురి పరిస్థితి విషమం
- పిడుగు శబ్దానికి వృద్ధురాలి మృతి



కట్టం నాగశ్రీ



సున్నం అనూష



దుర్గం లక్ష్మయ్య



కృష్ణకుమార్



లక్ష్మీబాయి

దమ్మపేట, కొత్తగూడ, హుజూరాబాద్, నవీపేట, న్యూస్‌టుడే: వర్ష బీభత్సంతో పాటు పిడుగులు పడడంతో మంగళవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జగ్గారం పంచాయతీలోని బూర్గుగుంపు, జగ్గారం గ్రామాలకు చెందిన ఎనిమిది మంది మహిళలు పొలంలో కూలి పనికి వెళ్లారు. మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో వారంతా పొలం సమీపంలోని ఓ చెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో పిడుగు పడటంతో వారంతా సొమ్మసిల్లి పడిపోయారు. వారందరినీ ఓ వాహనంలో హుటాహుటిన సత్తుపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బూర్గుగుంపునకు చెందిన కట్టం నాగశ్రీ(22), సున్నం అనూష(23) మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రత్తమ్మ, రాచమ్మ, సీతమ్మల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. మరో ముగ్గురు సత్తుపల్లి ఆసుపత్రిలో కోలుకుంటున్నారు. నాగశ్రీ, అనూష మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

- మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బత్తులపల్లి గ్రామ శివారులో పిడుగుపాటుకు దుర్గం లక్ష్మయ్య(65) అనే రైతు మొక్కజొన్న చేను కాపలాకు వెళ్లి మంగళవారం సాయంత్రం ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా వర్షం కురవడంతో ఓ చెట్టుకింద ఆగారు. ఆ సమీపంలో పిడుగు పడడంతో లక్ష్మయ్య అక్కడికక్కడే మృతిచెందారు. దగ్గరలో ఉన్న మరో రైతు పాయిరి సాంబయ్య పిడుగుపాటుకు స్పృహ కోల్పోయాడు. కొద్దిసేపటికి తేరుకుని లక్ష్మయ్య మృతిచెందిన విషయాన్ని గ్రామంలో తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన కంకణాల కృష్ణకుమార్(30) మంగళవారం పొలంలో పశువులను మేపడానికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో.. తండ్రి సమ్మయ్య వెతుక్కుంటూ వెళ్లగా కృష్ణకుమార్ పొలం వద్ద పిడుగుపాటుకు గురై మృతిచెంది ఉన్నాడు. మృతుడికి భార్య మౌనిక, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు.
- పిడుగుపాటు శబ్దానికి ఓ వృద్ధురాలు మృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం యంచలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. యంచ గ్రామానికి చెందిన బి.లక్ష్మీబాయి(67) కొంత కాలం నుంచి అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. ఒక్కసారిగా మెరుపులు, భారీ శబ్దంతో కూడిన పిడుగు పడటంతో వృద్ధురాలు నిద్రించిన చోటే చనిపోయారు.

డీఎస్సీ-2008 బాధితులకు కొలువులు

ఈనాడు, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్రంలో డీఎస్సీ-2008లో నష్టపోయిన అభ్యర్థులను కాంట్రాక్టు విధానంలో సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీలు)గా నియమించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం కీలక నిర్ణయం ప్రకటించింది. దీనివల్ల 2,367 మంది ప్రయోజనం పొందనున్నారు. నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో అత్యధిక పోస్టులు రానున్నాయని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ తప్ప మిగిలిన అన్ని జిల్లాల్లో బాధిత అభ్యర్థులున్నారని చెబుతున్నారు.

ఇదీ సమస్య...: ఉమ్మడి రాష్ట్రంలో 2008లో డీఎస్సీ నిర్వహించిన సందర్భంగా చివరి నిమిషంలో 30 శాతం ఎస్జీటీ పోస్టులను ప్రత్యేకంగా డీఈడీ పూర్తి చేసినవారికి ప్రభుత్వం కేటాయించింది. దాంతో మార్కులపరంగా ముందున్నప్పటికీ బీఈడీ అభ్యర్థులు ఎంతోమంది నష్టపోయారు. తమకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ అప్పటినుంచి వారు పోరాటం చేస్తూనే ఉన్నారు. న్యాయస్థానాలు సైతం వారికి న్యాయం చేయాలని తీర్పునిచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు తాజాగా వారికి కాంట్రాక్టు విధానంలో ఎస్జీటీ ఉద్యోగాలు ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. వీరికి వేతనం కింద నెలకు రూ.31,030 చొప్పున చెల్లిస్తారు.

ఎంపిక విధానమిలా...: ఉమ్మడి జిల్లాల ప్రకారం ఈ నెల 27 నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపడతారు. పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో వెరిఫికేషన్ పత్రాన్ని అందుబాటులో ఉంచారు. అందులో పూర్తి వివరాలు నింపి.. కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు తీసుకునేందుకు అంగీకరిస్తున్నట్లు సంతకాలు చేయాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది. దాన్ని ధ్రువపత్రాల పరిశీలన సమయంలో అందజేయాలని తెలిపింది.


రేపు 700 మంది ఏఈఈలకు నియామక పత్రాలు

ఈనాడు, హైదరాబాద్: నీటిపారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్లకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం సాయంత్రం నియామకపత్రాలు అందజేయనున్నారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఉన్న జలసౌధలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక కార్యక్రమంలో ఏఈఈలతోపాటు 1800 మంది లస్కర్లకు నియామకపత్రాలు ఇవ్వనున్నారు. దీంతోపాటు ప్రభుత్వ ప్రాధాన్య ప్రాజెక్టులపై ఏర్పాటు చేయనున్న ప్రజంటేషన్ కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు. అనంతరం ఈఎన్సీలు, సీఈ, ఎస్ఈ, ఈఈ, డిప్యూటీ ఈఈ, ఏఈలతో నీటిపారుదల శాఖ ఏర్పాటు చేయనున్న వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు.

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను సమర్థిస్తున్నా: బండి సంజయ్



ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శక్తిమంతమైన మాటలు మాట్లాడారని ఆయన వ్యాఖ్యలను పూర్తిగా సమర్థిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'ఎవరైనా సనాతన ధర్మానికి నష్టం కలిగించే ప్రయత్నం చేస్తే హిందువులు న్యాయబద్ధంగా గళమెత్తుతారని.. లౌకికత్వం అనేది అందరికీ వర్తిస్తుందని.. తమ జోలికి వస్తే మౌనంగా ఉండేది లేదని' పవన్ వ్యాఖ్యానించారని బండి సంజయ్ పోస్టులో పేర్కొన్నారు.



రాంచీలోని బిర్సా ముండా విమానాశ్రయానికి మంగళవారం చేరుకున్న ఝార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు

సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదు

- జగన్ నియమించిన తితిదే బోర్డులోనే లోపాలు
- దుర్గమ్మ సన్నిధిలో ప్రాయశ్చిత్త దీక్షలో ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్

ఈనాడు డిజిటల్, అమరావతి: ఎవరైనా సనాతన ధర్మాన్ని కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. గత ప్రభుత్వం నియమించిన తితిదే బోర్డులో తప్పులు జరిగాయని.. వైకాపా నేతలు బాధ్యతారహితంగా వ్యవహరించడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. సనాతన ధర్మంపై ఎంతవరకైనా పోరాడతానని, అవసరమైతే ప్రాణాలు ఇచ్చేందుకైనా సిద్ధమని పేర్కొన్నారు. తిరుమల లడ్డూ అపవిత్రం కావడంపై ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా విజయవాడలోని దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో శుద్ధి కార్యక్రమాన్ని ఆయన మంగళవారం నిర్వహించారు. ఆలయానికి వచ్చిన డిప్యూటీ సీఎంకు ఆలయ అధికారులు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ మెట్లను పవన్ కడిగి, పసుపు రాసి, కుంకుమబొట్లు పెట్టారు.

తీవ్ర పరిణామాలు తప్పవు

ఈ సందర్భంగా పవన్ విలేకర్లతో మాట్లాడుతూ.. 'తిరుమల లడ్డూ అపవిత్రమైతే వైకాపా నాయకులు బాధ్యత లేకుండా మాట్లాడడం సరి కాదు. తప్పు జరిగినప్పుడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. లేదా జరిగిన లోపాలకు బాధ్యత తీసుకొని విచారణకు అంగీకరించాలి. అంతేకానీ హిందువుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడితే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారు. గతంలో దుర్గగుడిలో వెండి సింహాలు మాయమైతే వాటితో మేడలు, మిద్దెలు కట్టుకుంటామా అని హేళన చేశారు. వందల ఆలయాలు ధ్వంసం చేశారు. వీరంతా ముస్లింలో.. క్రైస్తవులో కాదు.. హిందువులే. గత పాలనలో ఎన్ని అరాచకాలు చేసినా సంయమనం పాటించాను. లౌకికవాదాన్ని ఒకవైపే కాదు.. రెండు వైపుల నుంచి చూడాలి. ఇతర మతాల ఆచార, సంప్రదాయాలకు భంగం కలిగితే ఎలా స్పందిస్తారో.. హిందువుల మనోభావాలకు విఘాతం కలిగినప్పుడూ అలాగే స్పందించాలి. సనాతన ధర్మం విషయంలో జోకులు వేయడం సరికాదు. ఇటీవల ఓ సినిమా ఫంక్షన్‌లో దీనిపై జోకులు వేశారు. ఇలాంటి సున్నిత అంశాలు ఎంతోమంది మనోభావాలతో ముడిపడి ఉంటాయి. వీటి గురించి మాట్లాడేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించండి. తిరుమల లాంటి ఘటనలు మసీదు, చర్చిల్లో జరిగితే ఇలానే అవహేళనగా మాట్లాడతారా' అని పవన్ ప్రశ్నించారు.



ప్రాయశ్చిత్త దీక్షలో భాగంగా విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో మెట్లను శుద్ధిచేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఇంత జరిగినా ధర్మారెడ్డి కనిపించట్లేదు

'వైవీ సుబ్బారెడ్డిని విచారణకు రమ్మంటే రికార్డులు ఇవ్వాలని అడుగుతున్నారు. మీ హయాంలో తప్పు జరిగితే.. ఆ రికార్డులు మీకు ఇవ్వాలా? కరుణాకర్‌రెడ్డి తిరుమలలో పెద్ద డ్రామా చేశారు. తిరుపతిలో ఏమైనా అపచారం జరిగితే కుటుంబాలు నాశనం అవుతాయని శపథం చేశారు. ఆయన నాశనం మొదలైంది. ఇంత పెద్ద అపచారం జరిగితే మాజీ ఈవో ధర్మారెడ్డి కనిపించట్లేదు' అని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పొన్నవోలువి అహంకార వ్యాఖ్యలు

'లడ్డూ అపవిత్రమైందని మేం మాట్లాడుతుంటే.. పొన్నవోలు అహంకారపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారు. పందికొవ్వు ధర ఎక్కువని, దాన్ని నెయ్యిలో ఎలా కలుపుతారని.. బంగారంలో రాగి కలుపుతారు.. రాగిలో బంగారం కలపరని హేళనగా మాట్లాడడం సరికాదు. ఆయన కూడా హిందువై ఇలాంటి మాటలు మాట్లాడడం దారుణం. నాపై విమర్శలు కాదు.. అపవిత్రం అయ్యిందని తెలిసినప్పుడు మీ బాధ్యతేంటి?' అని ప్రశ్నించారు.

ప్రకాశ్‌రాజ్.. విషయం తెలుసుకోవాలి

'సున్నితాంశాలపై నటుడు ప్రకాశ్‌రాజ్ విషయం తెలుసుకొని మాట్లాడాలి. ఆయనతోపాటు అందరికీ చెబుతున్నా.. విమర్శలకు ముందు ఏం జరిగిందో తెలుసుకోండి. ఒకటికి రెండుసార్లు ఆలోచించండి. హిందువులను హిందువులే చులకనగా మాట్లాడడం మానుకోండి' అని పవన్ సూచించారు.

హిందువులంటే వైకాపాకు చిన్నచూపు

ఎంపీలు కేశినేని శివనాథ్, వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్ మాట్లాడుతూ... వైకాపా నాయకులకు హిందువులంటే ఎందుకంత చిన్నచూపని ప్రశ్నించారు. లడ్డూ ఘటనలో గత పాలకుల లోపాలపై సాక్ష్యాలు బయటకు వచ్చినా అడ్డగోలుగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు.

కిలో ఉల్లి రూ.55 పైనే

మార్కెట్లోకి ఉల్లి నిల్వల్ని విడుదల చేయనున్న కేంద్రం

ఈనాడు, అమరావతి: ఉల్లి అర్ధ సెంచరీ దాటేసింది.. మేమూ నీ వెనకే అంటూ టమాటా, వంగ తదితర కూరగాయలూ పరుగు తీస్తున్నాయి. బహిరంగ మార్కెట్లోకి నిల్వల విడుదలకు కేంద్రం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ఉల్లి ధర రెండు రోజుల్లో తగ్గుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఆగస్టు మొదటి వారంలో కిలో రూ.38 నుంచి రూ.40 ఉన్న ఉల్లి ధరలు క్రమంగా పెరుగుతూ రూ.60 వరకు చేరాయి. మంగళవారం విజయవాడ రైతు బజార్లలో మహారాష్ట్ర ఉల్లి కిలో రూ.55, కర్నూలు ఉల్లి కిలో రూ.42 చొప్పున విక్రయిస్తున్నారు. తాడేపల్లిగూడెం మార్కెట్లో మహారాష్ట్ర ఉల్లి ధర కిలో రూ.52, కర్నూలు ఉల్లి రూ.35 నుంచి రూ.45 చొప్పున ఉన్నాయి. కర్నూలు మార్కెట్‌కు రోజూ 4 వేల నుంచి 6 వేల క్వింటాళ్ల ఉల్లి వస్తుండగా సగటున క్వింటాల్ రూ.3 వేల నుంచి రూ.3,500 చొప్పున లభిస్తోంది. గత వారంతో పోలిస్తే ధరల్లో కాస్త పెరుగుదల కనిపించిందనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది.

కూరగాయల ధరలూ పైపైకి..: ఖరీఫ్ ఆరంభంలో వర్షాభావం, ఇప్పుడు అధిక వర్షాలతో కూరగాయల ఉత్పత్తి తగ్గింది. దీంతో వాటి ధరలు పెరుగుతున్నాయి. సెప్టెంబరు మొదటి వారంలో కిలో రూ.26 ఉన్న టమాటా ప్రస్తుతం రూ.40 అయింది. బహిరంగ మార్కెట్లో కిలో రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతోంది. వంగ ధర రూ.28 నుంచి రూ.40కి చేరింది. కాకర, బీర, కాలీఫ్లవర్, క్యారెట్, దొండ, చిక్కుళ్లు, బంగాళాదుంప ధరలు కిలో రూ.35 నుంచి రూ.45 మధ్యకు చేరాయి. దోస కిలో రూ.28 చొప్పున విక్రయిస్తున్నారు. పచ్చిమిర్చి కిలో రూ.20 ఉంది. వెల్లుల్లి ధర కిలో రూ.330, అల్లం రూ.140 పలుకుతోంది. కందిపప్పు కిలో రూ.160 నుంచి రూ.180 వరకు అమ్ముతున్నారు.

దిగి వస్తున్న వంట నూనెల ధరలు: వంట నూనెలపై దిగుమతి సుంకం పెంపు నేపథ్యంలో ఈ నెల 13వ తేదీన వాటి ధరలు ఒక్కసారిగా ఎగశాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల హెచ్చరికల నేపథ్యంలో వాటి ధరలు మళ్లీ తగ్గాయి. సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర లీటరు రూ.102 నుంచి రూ.110 మధ్య విక్రయిస్తున్నారు. పామోలిన్ ధర కూడా తగ్గింది.

వివేకా హత్య కేసులో నిందితుల బెయిళ్లపై విచారణ వాయిదా

నవంబరు 5న విచారిస్తామన్న సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: ఏపీ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులుగా ఉన్న శివశంకరరెడ్డి, ఎర్రగంగిరెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డిల బెయిల్ పిటిషన్లపై విచారణను సుప్రీంకోర్టు నవంబర్ 5కి వాయిదా వేసింది. డి.శివశంకరరెడ్డి, వైఎస్ భాస్కరరెడ్డిలకు ఇచ్చిన సాధారణ బెయిల్, వైఎస్ అవినాష్‌రెడ్డికి ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని, ఈ మొత్తం కేసుపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపించాలని, ఏ-1గా ఉన్న ఎర్రగంగిరెడ్డికి ఆటోమేటిక్ బెయిల్ మంజూరు చేయకూడదని వివేకా కుమార్తె సునీతనర్రెడ్డి దాఖలు చేసిన కేసులు, బెయిల్ కోసం ఎర్రగంగిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్లన్నింటిపై నవంబర్ 5న విచారణ జరుపుతామని జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌ల ధర్మాసనం పేర్కొంది. శివశంకరరెడ్డికి తెలంగాణ హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను సవాల్ చేస్తూ సునీత దాఖలు చేసిన కేసు మంగళవారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. ఆమె తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ ఈ హత్య కేసులో నిందితులకు మంజూరైన బెయిళ్లను సవాల్ చేస్తూ తాము వేసిన పిటిషన్లు నవంబర్ 4న లిస్ట్ అయ్యాయన్నారు. ఆ రోజు ఇతరత్రా వ్యాజ్యాలు ఎక్కువగా ఉన్నందున అన్నింటినీ విచారించడానికి కోర్టు సమయం సరిపోదు కాబట్టి వీటన్నింటినీ కలిపి నవంబర్ 5న విచారించాలని కోరారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారి జైల్లో ఉన్న దస్తగిరిని నిందితుడు శివశంకరరెడ్డి తన కుమారుడి ద్వారా బెదిరించారని, ఆ కేసులో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇంప్లీడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ వాదనలను శివశంకరరెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ ఖండించారు. ఈ కేసులన్నింటినీ ట్యాగ్ చేయకూడదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇంప్లీడ్ చేయాలంటూ వేసిన పిటిషన్‌లో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయం కూడా కోరలేదని, అందువల్ల దాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించామంటూ సిద్ధార్థ లూథ్రా సమాధానమిచ్చారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా ఒకే ఎఫ్ఐఆర్ ఆధారంగా నమోదైన అన్ని కేసులనూ నవంబర్ 5కి వాయిదా వేయాలని ఆదేశించారు.

సీఐ సత్యనారాయణ బెయిలు పిటిషన్‌పై విచారణ

- కౌంటర్లు వేయాలని ఇరుపక్షాలకు హైకోర్టు ఆదేశం
- జెత్వానీ కేసులో కాంతిరాణా, సత్యనారాయణ అరెస్టుకు తొందరపాటు చర్యలొద్దని వెల్లడి

ఈనాడు, అమరావతి: తనపై తప్పుడు కేసు నమోదు చేసి వేధించారంటూ ముంబయి సినీనటి కాదంబరీ జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ ఇబ్రహీంపట్నం అప్పటి సీఐ ఎం.సత్యనారాయణ దాఖలు చేసిన అత్యవసర పిటిషన్‌పై మంగళవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వినోద్‌కుమార్ దేశ్‌పాండే వాదనలు వినిపించారు. పూర్తిస్థాయి వాదనలు వినేందుకు సమయం లేకపోవడంతో విచారణను అక్టోబర్ 1కి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ప్రకటించారు. అప్పటి వరకు సీఐ సత్యనారాయణ, ఐపీఎస్ అధికారి కాంతిరాణా తాతా అరెస్టు విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు స్పష్టం చేశారు. కేసు దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్లను ఆదేశించారు.

- ముందస్తు బెయిలు కోసం కాంతిరాణా తాతా, సీఐ సత్యనారాయణ వేసిన వ్యాజ్యాల్లో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, జెత్వానీని కోర్టు ఆదేశించింది. బెయిల్ పిటిషన్‌లో జెత్వానీ వేసిన ఇంప్లీడ్ పిటిషన్లపై కౌంటర్ వేయాలని పిటిషనర్లు కాంతిరాణా తాతా, సీఐ సత్యనారాయణలను ఆదేశించింది.

బెయిలు కోసం హైకోర్టులో విశాల్ గున్ని వ్యాజ్యం

కాదంబరీ జెత్వానీ ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు ఈ నెల 13న నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ సస్పెన్షన్‌లో ఉన్న ఐపీఎస్ అధికారి విశాల్ గున్ని మంగళవారం హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేశారు. 'జెత్వానీ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో నాపై నిర్దిష్ట ఆరోపణలేమీ లేవు.. కేసు నమోదుకు ముందు ఆమె పూర్వచరిత్రను తెలుసుకునేందుకు నన్ను ముంబయి వెళ్లేందుకు నియమించారని మాత్రమే ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. నేను అమాయకుణ్ని. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు నాకు వర్తించవు' అని పిటిషన్లో పేర్కొన్నారు. దీనిపై హైకోర్టు బుధవారం విచారణ జరపనుంది.

ఉత్తరాఖండ్ హైకోర్టు సీజేగా జస్టిస్ నరేందర్




- కేంద్రానికి సిఫారసు చేసిన సుప్రీం కొలీజియం
- ఏపీ హైకోర్టులో ప్రస్తుతం రెండో స్థానంలో ఉన్న జస్టిస్ నరేందర్

ఈనాడు, అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్‌ను ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజే)గా నియమించేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు కొలీజియం మంగళవారం సిఫారసు చేసింది. కర్ణాటకకు చెందిన జస్టిస్ నరేందర్.. ప్రస్తుతం ఏపీ హైకోర్టు న్యాయమూర్తుల సీనియారిటీలో రెండోస్థానంలో కొనసాగుతున్నారు. కర్ణాటక నుంచి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎలాంటి ప్రాతినిధ్యం లేదని కొలీజియం గుర్తుచేసింది. ఈ నేపథ్యంలో జస్టిస్ నరేందర్‌ను ఉత్తరాఖండ్ సీజేగా సిఫారసు చేస్తున్నట్లు వెల్లడించింది. ఉత్తరాఖండ్ ప్రస్తుత హైకోర్టు సీజే జస్టిస్ రీతూ బారీ ఈ ఏడాది అక్టోబరు 10న పదవీవిరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి సీజే పోస్టుకు జస్టిస్ నరేందర్ పేరును కొలీజియం నిర్ణయించింది. ● ఓబీసీ వర్గానికి చెందిన జస్టిస్ నరేందర్ 2015 జనవరి 2న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఏపీ హైకోర్టుకు 2023 అక్టోబరు 30న బదిలీపై వచ్చారు.

4న శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న ఏపీ సీఎం

- ఏపీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి జరగనున్నందున ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ రోజు రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న మంత్రికి తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి, అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అదనపు ఈవో శ్రీవారి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి విలేకరులతో మాట్లాడారు. 'తితిదే నూతన పాలకమండలిని త్వరలో ముఖ్యమంత్రి ప్రకటిస్తారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యిపై సిట్ నివేదిక వచ్చాక నిందితులు ఎవరైనా ఉపేక్షించేది లేదు. శ్రీవారి ప్రసాదాలన్నింటికీ ఏ గ్రేడ్ పప్పుదినుసులు, నెయ్యిని వినియోగించాలని ఇప్పటికే సీఎం తితిదే ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం నాణ్యమైన నెయ్యితో లడ్డూ, అన్నప్రసాదాలను భక్తులకు తితిదే అందిస్తోంది' అని మంత్రి తెలిపారు.



దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి

రెండు రోజుల్లో కొత్త మద్యం విధానం

3,736 మద్యం, 340 కల్లు దుకాణాలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కొత్త మద్యం విధానం కింద ప్రైవేటు వ్యక్తులు మద్యం దుకాణాలు ఏర్పాటుచేసేందుకు వీలుగా నోటిఫికేషన్ విడుదలకు ఎక్సైజ్‌శాఖ సిద్ధమవుతోంది. రెండు రోజుల్లో ఈ నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడిపేలా గత వైకాపా ప్రభుత్వం చట్టం చేసింది. ఈ చట్టాన్ని సవరించి, ఆర్డినెన్స్ తెచ్చేందుకు ఇప్పటికే కూటమి ప్రభుత్వ మంత్రివర్గం ఆమోదించింది. దీన్ని గవర్నర్ ఆమోదించాక 3,736 మద్యం దుకాణాల కేటాయింపునకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. వీటిలో 340 దుకాణాలను కల్లుగీత వృత్తి కులాలకు ప్రభుత్వం రిజర్వ్ చేయనుంది.

ఛాంపియన్స్



కాన్పూర్‌లో
కథ మారుతుంది

కాన్పూర్

చెన్నైలోని చెపాక్ స్టేడియంలో గత వారం ఎన్నడూ చూడని దృశ్యాలు చూశాం! భారత్-బంగ్లాదేశ్ తొలి టెస్టుకు ఆతిథ్యమిచ్చిన ఈ మైదానంలో ఎర్రమట్టితో కొత్తగా తయారైన పిచ్‌పై బంతి బాగా బౌన్స్ కాగా.. పేసర్లు ప్రమాదకరంగా మారారు. తొలి రెండు రోజులు వారిని ఎదుర్కోవడం బ్యాటర్లకు సవాలుగా మారింది. స్పిన్నర్ల ప్రభావం ఆలస్యంగా మొదలైంది. చెన్నైలో బ్యాటింగ్ ఇంత ఇబ్బందిగా మారడం, పేసర్లు అంత జోరు చూపించడం ఆటగాళ్లకే కాక అభిమానులకూ కొత్త అనుభవం. అయితే ఇప్పుడు రెండో టెస్టుకు వేదిక కానున్న కాన్పూర్ మైదానంలో వికెట్ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి అందరిలోనూ నెలకొంది. శుక్రవారం మొదలయ్యే ఈ మ్యాచ్‌లో పిచ్ సంప్రదాయ శైలిలోనే స్పందిస్తుందని సమాచారం. ఎప్పట్లాగే బ్యాటర్ల జోరు చూస్తామని, పరుగుల వరద పారుతుందని, మ్యాచ్ సాగే కొద్దీ స్పిన్నర్ల ప్రభావం పెరుగుతుందని స్టేడియం వర్గాలు చెబుతున్నాయి. చెన్నైలో పిచ్‌ను మార్చే క్రమంలో ముంబయి నుంచి ఎర్రమట్టిని తీసుకొచ్చి ఉపయోగించారు. దీంతో వికెట్ బౌన్సీగా మారింది. కానీ కాన్పూర్‌లో మాత్రం ఎప్పట్నుంచో ఉన్న పిచ్‌నే వినియోగించనున్నారు. ఇది నల్లమట్టితో కూడి ఉంటుంది. ఈ పిచ్‌పై బంతి గమనంలో మరీ వేగముండదు. బౌన్స్ కూడా ఎక్కువ కాదు. దీంతో ఇక్కడ బ్యాటింగ్ చేయడం సులువని.. కుదురుకుంటే పెద్ద స్కోర్లు చేయొచ్చని.. మ్యాచ్‌లో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశాలున్నాయని సమాచారం. మ్యాచ్ సాగేకొద్దీ బంతి బాగా తిరుగుతుంది కాబట్టి చెన్నైలో మాదిరి కాకుండా రెండు జట్లూ కూర్పును మార్చుకునే అవకాశముంది. తొలి టెస్టుకు రెండు జట్లూ ముగ్గురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లను ఎంచుకున్నాయి. కాన్పూర్‌లో ఒక పేసర్‌ను తగ్గించుకుని మూడో స్పిన్నర్‌ను ఆడించేందుకు ఆస్కారముంది. ఆకాశ్ దీప్ స్థానంలో అక్షర్ పటేల్ లేదా కుల్‌దీప్ యాదవ్ తుది జట్టులోకి రావచ్చు. బంగ్లాదేశ్ నహిద్ రాణా స్థానంలో తైజుల్ ఇస్లామ్ లేదా నయీమ్‌ను ఆడించొచ్చు. స్పిన్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్‌హసన్ ఫిట్‌నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో అతను అందుబాటులో లేకుండా వీళ్లిద్దరూ తుది జట్టులోకి వస్తారు.



గిల్, రోహిత్

కాన్పూర్ చేరుకున్న భారత్, బంగ్లా జట్లు: చివరిదైన రెండో టెస్టు కోసం భారత్, బంగ్లాదేశ్ జట్లు కాన్పూర్ చేరుకున్నాయి. పటిష్ఠ భద్రత మధ్య ఆటగాళ్లను పోలీసులు హోటల్‌కు తీసుకెళ్లారు. జట్లు బుధవారం, గురువారం గ్రీన్‌పార్క్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తాయి. 27న టెస్టు మ్యాచ్ ఆరంభం కానున్న నేపథ్యంలో స్టేడియం వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు.

ఇరానీ ట్రోఫీకి సర్ఫరాజ్, జురెల్, దయాళ్!

భారత జట్టు నుంచి విడుదలయ్యే అవకాశం



సర్ఫరాజ్

దిల్లీ: బంగ్లాదేశ్‌తో తొలి టెస్టు కోసం టీమ్ఇండియాలోకి ఎంపికైనప్పటికీ, మ్యాచ్ ఆడే అవకాశం దక్కించుకోని మిడిలార్డర్ ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్, వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్, పేస్ బౌలర్ యశ్ దయాళ్.. జట్టు నుంచి విడుదల కానున్నట్లు సమాచారం. రెండో టెస్టుకు కూడా వీరు జట్టులో ఉన్నప్పటికీ.. మ్యాచ్‌లో ఆడించే అవకాశాలు తక్కువే. శుక్రవారం మొదలయ్యే రెండో టెస్టులో వీరికి తుది జట్టులో చోటు దక్కని పక్షంలో ఇరాని ట్రోఫీలో ఆడడం ఖాయం. ఈ ముగ్గురికి ఇరాని ట్రోఫీలో ఆడే జట్లలో చోటు కూడా దక్కింది. సర్ఫరాజ్ రంజీ ఛాంపియన్ ముంబయి జట్టులో ఉండగా.. ధ్రువ్, యశ్ రెస్టాఫ్ ఇండియా జట్టుకు ఎంపికయ్యారు. ఇషాన్ కిషన్, రికీ భుయ్ కూడా ఈ జట్టులో ఉన్నారు. ఇరాని ట్రోఫీ టైటిల్ పోరు అక్టోబరు 1-5 మధ్య లక్నోలో జరుగుతుంది.

ద్రవిడ్ అలా.. గంభీర్ ఇలా..!



అశ్విన్

చెన్నై: టీమ్ ఇండియా మాజీ శిక్షకుడు రాహుల్ ద్రవిడ్‌తో పోలిస్తే కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ భిన్నమని సీనియర్ ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ద్రవిడ్ వ్యవహారం కొంచెం కఠినంగా, పద్ధతి ప్రకారం సాగిపోతుందని.. గంభీర్ తాపీగా ఉంటాడని అతనన్నాడు. "ద్రవిడ్ కోచ్‌గా ఉండగా అన్నీ పద్ధతి ప్రకారం జరిగేవి. ఒక ప్రదేశంలో ఒక బాటిల్‌ను పెట్టడం కూడా నిర్దేశించిన సమయం, ప్రదేశంలో జరగాల్సిందే. కానీ గంభీర్ అలా కాదు. అతను వ్యక్తులతో సరదాగా ఉంటాడు. అతణ్ని కుర్రాళ్లు చాలా ఇష్టపడతారు" అని అశ్విన్ పేర్కొన్నాడు.

పంత్‌ను ఆపాలి



కమిన్స్

దిల్లీ: రాబోయే బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో పంత్ చెలరేగకుండా ఆపడం తమకు చాలా అవసరమని ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అభిప్రాయపడ్డాడు. ఆస్ట్రేలియాలో వరుసగా రెండుసార్లు టెస్టు సిరీస్‌లు గెలిచి టీమ్ఇండియా చరిత్ర సృష్టించడంలో పంత్ కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో కమిన్స్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "చివరి రెండు సిరీస్‌ల పైనా పంత్ చాలా ప్రభావం చూపించాడు. కాబట్టి అతను చెలరేగకుండా చూడాల్సిన అవసరముంది. పంత్ చక్కటి షాట్లు ఆడతాడు. అతనాడే రివర్స్ స్లాప్ చాలా ప్రత్యేకమైంది. ప్రతి జట్టులోనూ ఒకరిద్దరు దూకుడుగా ఆడే ఇలాంటి ఆటగాళ్లుంటారు. మా జట్టులో ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ అలాంటి ఆటగాళ్లే. వాళ్లకు చిన్న అవకాశమిస్తే చెలరేగిపోతారు" అని కమిన్స్ అన్నాడు.

బీసీసీఐ కార్యదర్శి ఎంపిక మరింత ఆలస్యం

దిల్లీ: బీసీసీఐ నూతన కార్యదర్శి ఎంపిక మరింత ఆలస్యం కానుంది. బుధవారం జరుగనున్న ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం అజెండాలో కార్యదర్శి ఎంపిక అంశాన్ని బీసీసీఐ పేర్కొనలేదు. ఐసీసీ ఛైర్మన్‌గా జై షా ఏకగ్రీవంగా ఎన్నికవడంతో బోర్డుకు కొత్త కార్యదర్శి నియామకం అనివార్యమైంది. అయితే ఈనెల 29న బెంగళూరులో వార్షిక సర్వసభ్య సమావేశానికి (ఏజీఎం) ముందు జరుగనున్న చివరి అపెక్స్ కౌన్సిల్ భేటీ అజెండాలో కార్యదర్శి ఎంపిక, నామినేషన్ ప్రస్తావన లేదు. దీంతో జై షా కార్యదర్శి హోదాలోనే ఏజీఎంలో పాల్గొననున్నాడు. డిసెంబరు 1న ఐసీసీ ఛైర్మన్‌గా షా బాధ్యతలు స్వీకరిస్తాడు.

దీప్తికి రూ. కోటి అందజేసిన సీఎం



దీప్తికి చెక్‌ను అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కోచ్ రమేశ్, శాట్జ్ ఛైర్మన్ శివసేనారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: పారిస్ పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన 'లక్ష్య' అథ్లెట్, తెలంగాణ క్రీడాకారిణి జీవాంజి దీప్తికి నజరానా లభించింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం దీప్తికి కోటి రూపాయల నగదు బహుమతి అందజేశారు. దీప్తి కోచ్ నాగపురి రమేశ్‌కు రూ.10 లక్షలు నగదు ప్రోత్సాహకం ఇచ్చారు. క్రీడారంగానికి పెద్దపీట వేస్తూ.. అథ్లెట్లను ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ (శాట్జ్) ఛైర్మన్ శివసేనారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఛాంపియన్లు
వచ్చేశారు

చెస్ క్రీడాకారులకు ఘన స్వాగతం

ఈనాడు – హైదరాబాద్



హారిక

ఒలింపియాడ్‌లో స్వర్ణాలు గెలిచి భారత జెండా ఎగరేసిన ఛాంపియన్లు సొంతగడ్డపై అడుగుపెట్టారు. బుడాపెస్ట్ నుంచి స్వదేశానికి వచ్చిన వీరికి ఘన స్వాగతం లభించింది. ద్రోణవల్లి హారిక, దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద, వైశాలితో పాటు పురుషుల జట్టు కెప్టెన్ శ్రీనాథ్ నారాయణన్ మంగళవారం ఉదయం స్వదేశానికి విచ్చేశారు. హారిక.. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగగా.. గుకేశ్, ప్రజ్ఞానంద, వైశాలి, శ్రీనాథ్ చెన్నై చేరుకున్నారు. హారికను తెలంగాణ చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్.ప్రసాద్ అభినందించారు. "చెస్ ఒలింపియాడ్‌లో తొలిసారి విజేతగా నిలవడం చాలా సంతోషంగా అనిపిస్తోంది. గతంలో కాంస్యం మాత్రమే సాధించాం. కానీ ఈసారి పురుషులు, మహిళల విభాగాల్లో పసిడి పతకాలు గెలవడం చాలా గర్వంగా అనిపిస్తోంది. స్థిరంగా ఆడి మావి ఉత్తమ జట్లు అని నిరూపించుకున్నాం" అని ప్రజ్ఞానంద పేర్కొన్నాడు. "ఇదో కలలా ఉంది. చెన్నైలో జరిగిన గత ఒలింపియాడ్‌లో కాంస్యం సాధించాం. ఆఖరి రౌండ్లో సరైన ప్రదర్శన చేయకపోవడంతో స్వర్ణాన్ని సాధించే అవకాశాన్ని కోల్పోయాం. కానీ ఈసారి కీలక సమయాల్లో సత్తా చాటాం. వరుసగా ఆరు మ్యాచ్‌లు గెలిచాక.. పోలెండ్ చేతిలో ఓటమి బాధించింది. కానీ తర్వాత పుంజుకుని పసిడి నెగ్గాం" అని వైశాలి తెలిపింది. "భారత జట్లు సాధికారికంగా ఆడి స్వర్ణాలు గెలిచాయి. ఏళ్ల తరబడి శ్రమ వల్లే ఇలాంటి ఫలితాలు వస్తాయి. ప్రతిభావంతులైన యువ క్రీడాకారుల వల్లే ఇది సాధ్యమైంది. ఒలింపియాడ్‌లో స్వర్ణాలు గెలిచాం.. ఇక గుకేశ్ ప్రపంచ ఛాంపియన్ కావడమే మిగిలింది" అని పురుషుల జట్టు కెప్టెన్ శ్రీనాథ్ అన్నాడు.



గుకేశ్

వ్యక్తిగత టోర్నీగానే భావించా

చెన్నై: చెస్ ఒలింపియాడ్‌ను కూడా వ్యక్తిగత టోర్నీగానే భావించి సత్తా చాటానని భారత చెస్ సంచలనం దొమ్మరాజు గుకేశ్ చెప్పాడు. ఒలింపియాడ్‌లో భారత పురుషులు, మహిళల జట్లు స్వర్ణాలు సాధించిన నేపథ్యంలో అతడిలా అన్నాడు. "ఒలింపియాడ్‌ను ఓ వ్యక్తిగత టోర్నీలాగే భావించా. ఈ టోర్నీలో రాణించాలనే లక్ష్యంతో బరిలో దిగా. నాతో పాటు సహచరులు కూడా సత్తా చాటడంతో స్వర్ణం సాధించగలిగాం. భారత చెస్ సరైన దిశగా వెళ్తోందనడానికి తాజా ఫలితమే నిదర్శనం" అని గుకేశ్ పేర్కొన్నాడు. ఇదే ఫామ్‌ను రాబోయే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లోనూ కొనసాగించాలనే ధ్యేయంతో ఉన్నానని తెలిపాడు. "ప్రస్తుత ఫామ్‌తో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు వెళ్లబోతుండడం చాలా సంతోషంగా ఉంది. డింగ్ లిరెన్‌తో పోరుకు ఇంకా రెండు నెలల వ్యవధి ఉంది. ఈ పోటీ కోసం పూర్తిగా సన్నద్ధమవుతా" అని గుకేశ్ తెలిపాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో క్యాండిడేట్స్ చెస్ గెలిచిన గుకేశ్.. నవంబర్ 20న సింగపూర్‌లో లిరెన్‌తో ఆరంభమయ్యే ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పోటీపడనున్నాడు.



హర్మన్‌ప్రీత్

మా సన్నాహం బాగుంది

ముంబయి: వచ్చే మహిళల టీ20 ప్రపంచకప్ కోసం బాగా సన్నద్ధమయ్యామని భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ చెప్పింది. టోర్నీ అక్టోబరు 3న యూఏఈలో ఆరంభం కానుంది. 2009లో మహిళల టీ20 ప్రపంచకప్ మొదలైనప్పటి నుంచి భారత్ ఒక్కసారి మాత్రమే ఫైనల్ (2020)కు వెళ్లగలిగింది. ఆ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. భారత్ 2017లో వన్డే ప్రపంచకప్‌లోనూ ఫైనల్లో ఓడింది. ఆ రెండు జట్లలోనూ హర్మన్ సభ్యురాలు. 2020లో జట్టుకు ఆమె నాయకత్వం వహించింది. "అత్యుత్తమ జట్టుతో టీ20 ప్రపంచకప్‌కు వెళ్తున్నాం. క్రీడాకారులంతా చాలా కాలంగా కలసి ఆడుతున్నారు. కిందటిసారి సెమీస్‌లో ఓడిపోయాం. గత టోర్నీలతో పోలిస్తే ఈసారి అన్నివిధాలుగా మెరుగ్గా సన్నద్ధమయ్యాం. గతంలో చిన్న చిన్న లోపాలు ఉండి ఉండొచ్చు" అని మంగళవారం భారత మహిళలు యూఏఈ బయల్దేరడానికి ముందు నిర్వహించిన విలేకర్ల సమావేశంలో హర్మన్‌ప్రీత్ చెప్పింది. టోర్నీలో తాము ఏ జట్టునైనా ఓడించగలమని ఆమె తెలిపింది. జులై ఆఖరు తర్వాత భారత జట్టుకు పెద్దగా మ్యాచ్‌లు లేవు. అయితే జట్టు ఎన్‌సీఏలో సుదీర్ఘ సన్నాహక శిబిరంలో పాల్గొంది. అక్కడ ఫిట్‌నెస్, ఫీల్డింగ్, ఆటలో మెరుగుపడాల్సిన అంశాలపై దృష్టిపెట్టింది. "మేం మెరుగుపడాల్సిన అంశాలపై దృష్టిసారించాం. మొదట ఫిట్‌నెస్, ఫీల్డింగ్ శిబిరం నిర్వహించాం. ఆ తర్వాత 10 రోజుల శిబిరంలో నైపుణ్యాలపై మాత్రమే దృష్టి పెట్టాం. స్పోర్ట్స్ సైకాలజిస్ట్ సేవలను కూడా ఉపయోగించుకున్నాం" అని మహిళల జట్టు ప్రధాన కోచ్ మజుందార్ చెప్పాడు.



లక్ష్మి

అంతా మహిళా అంపైర్లే..

దుబాయ్: వచ్చే మహిళల టీ20 ప్రపంచకప్ కోసం ఐసీసీ అంపైర్ల ప్యానెల్‌ను ప్రకటించింది. టోర్నీ పర్యవేక్షణ కోసం 10 మంది అంపైర్లు, ముగ్గురు రిఫరీలను నియమించారు. అందరూ మహిళలే. క్లెయిర్ పొలోసక్ అత్యంత అనుభవజ్ఞురాలు. ఆమె గత నాలుగు మహిళల టీ20 ప్రపంచకప్పుల్లో విధులు నిర్వర్తించింది. కిమ్ కాటన్, జాక్వెలిన్ విలియమ్స్‌లకు ఇది నాలుగో టీ20 ప్రపంచకప్. భారత్‌కు చెందిన వృంద రాఠీ అంపైర్‌గా, గండికోట సర్వ లక్ష్మి రిఫరీగా వ్యవహరించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లక్ష్మి 2023 ప్రపంచకప్ ఫైనల్‌కు రిఫరీగా విధులు నిర్వర్తించింది.

అంపైర్లు: లారెన్ ఏజ్‌బ్యాగ్, కిమ్ కాటన్, దంబనెవన, అనా హారిస్, నిమాలి పెరీరా, క్లెయిర్ పొలోసాక్, వృంద రాఠీ, రెడ్‌ఫెర్న్, షెరిడాన్, జాక్వెలియన్ విలియమ్స్; **మ్యాచ్ రిఫరీలు:** షాండ్రీ ఫ్రిట్జ్, జీఎస్ లక్ష్మి, మిషెల్ పెరీరా.

సింధును మళ్లీ ఛాంపియన్ చేయడమే లక్ష్యం



అనూప్

దిల్లీ: భారత స్టార్ షట్లర్ పి.వి.సింధును మళ్లీ ఛాంపియన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆమె కొత్త కోచ్ అనూప్ శ్రీధర్ అన్నాడు. సింధులో విజయేచ్ఛ తగ్గలేదని అనూప్ అభిప్రాయపడ్డాడు. "కొన్ని వారాల క్రితం సింధు బృందంతో మాట్లాడా. ఈ నెల ప్రారంభం నుంచి హైదరాబాద్‌లో నా దగ్గర శిక్షణ తీసుకుంటోంది. మేం గణనీయమైన పురోగతి సాధించాం. మరో రెండు వారాల్లో టోర్నీల కోసం ఐరోపాకు వెళ్తాం. సింధు మంచి ఫలితాలు సాధించినా.. కొన్నేళ్లుగా కఠినమైన సవాళ్లు ఎదుర్కొంటోంది. అయితే ఆమెలో విజయేచ్ఛ అలాగే ఉంది. ఇప్పటికీ కఠినమైన సాధనతో దేశంలోని బ్యాడ్మింటన్ క్రీడాకారులందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ఆమెను మళ్లీ ఛాంపియన్‌గా చేయడమే లక్ష్యం" అని అనూప్ వివరించాడు.

కన్సల్టింగ్ కోచ్‌గా లీ హ్యున్: పి.వి.సింధుకు దక్షిణ కొరియా దిగ్గజ ఆటగాడు లీ హ్యున్ కన్సల్టింగ్ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవలే అనూప్ శ్రీధర్‌ను శిక్షణ బృందంలోకి తీసుకున్న సింధు.. తాజాగా లీ హ్యున్‌ను ఎంపిక చేసుకుంది. ఈ ఏడాది డిసెంబరు వరకు వీరిద్దరు తాత్కాలిక కోచ్‌లుగా కొనసాగుతారు. డిసెంబరు తర్వాత శాశ్వత నియామకం గురించి సింధు నిర్ణయం తీసుకోనుంది. వచ్చేనెలలో ఫిన్లాండ్, డెన్మార్క్ ఓపెన్‌లలో ఆమె బరిలో దిగనుంది.

భారత్‌లో మాకు అదే అతి పెద్ద సమస్య: గప్తిల్

జోద్‌పుర్: ఏ బంతి తిరుగుతుందో, ఏ బంతి తిరగదో అర్థం కాకపోవడమే భారత పర్యటనలో న్యూజిలాండ్ బ్యాటర్లకు అతి పెద్ద సమస్యని ఆ జట్టు మాజీ ఓపెనర్ గప్తిల్ అన్నాడు. అక్టోబరు 16న ఆరంభమయ్యే మూడు టెస్టుల సిరీస్ కోసం కివీస్ జట్టు భారత్‌కు రానుంది. "కొన్నిసార్లు అక్కడ పరుగులు చేయలేమని అనిపిస్తుంది. భారత పర్యటనలో అత్యంత కష్టమైన విషయం అదే. బంతులు స్క్వేర్‌లో తిరుగుతాయి. అలాంటి బంతే నేరుగా వస్తుంది. ఏ బంతి తిరుగుతుందో, ఏది నేరుగా వస్తుందో తెలియదు. ఎప్పుడూ అదే ఆలోచనలో ఉండాల్సివస్తుంది" అని గప్తిల్ అన్నాడు. భారత్‌లో భారత్‌పై పైచేయి సాధించడం చాలా కష్టమని చెప్పాడు. పైచేయి సాధించగలమని అనిపిస్తే.. వీలైనంత ఎక్కువసేపు అదే భావనతో ఆడాలని అన్నాడు.

జీవన్ జోడీకి హాంగ్జౌ టైటిల్

దిల్లీ: భారత ఆటగాళ్లు జీవన్ నెడుంచెజియన్-విజయ్ సుందర్ హాంగ్జౌ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్లో డబుల్స్ టైటిల్‌ను గెలుచుకున్నారు. చైనాలో జరుగుతున్న ఈ టోర్నీలో మంగళవారం ఫైనల్లో జీవన్ జంట 4-6, 7-6 (7-5), 10-7తో ఫ్రాంట్‌జెన్-జెబెన్స్ (జర్మనీ) జోడీని ఓడించింది. 35 ఏళ్ల జీవన్‌కు ఇది రెండో ఏటీపీ టూర్ టైటిల్. విజయ్ సుందర్‌కు ఇదే తొలి టైటిల్. మరోవైపు చెంగ్డూ ఓపెన్లో యుకి బాంబ్రి-ఒలివెటి (ఫ్రాన్స్) జోడీ రన్నరప్‌గా నిలిచింది. తుదిపోరులో యుకి జంట 4-6, 6-4, 4-10తో సాడియో-ఫాబియన్ రెబౌల్ (ఫ్రాన్స్) జోడీ చేతిలో ఓడింది.

భారత్ ఘన విజయం

థింపు: శాఫ్ అండర్-17 ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటికే సెమీఫైనల్‌కు అర్హత సాధించిన భారత్... మంగళవారం చివరిదైన మూడో లీగ్ మ్యాచ్‌లో 3-0తో మాల్దీవులను చిత్తు చేసింది. 14వ నిమిషంలో శాంసన్ చేసిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లిన భారత్.. ద్వితీయార్ధంలోనూ జోరు కొనసాగించింది. సబ్‌స్టిట్యూట్ లుంకిమ్ (74వ, 89వ) 'డబుల్' సాధించడంతో తేలిగ్గా విజయాన్ని అందుకుంది. గ్రూప్-ఎలో మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన భారత్ 6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఈ గ్రూప్‌లో బంగ్లా రెండో స్థానంతో ముందంజ వేసింది.

ప్రిక్వార్టర్స్‌లో గాయత్రి జోడీ



గాయత్రి, ట్రీసా

మకావు: భారత డబుల్స్ క్రీడాకారులు గాయత్రి గోపీచంద్- ట్రీసా జాలీ.. మకావు ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 300 టోర్నీలో శుభారంభం చేశారు. మంగళవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్లో ఈ జోడీ 15-21, 21-16, 21-14తో అకారి సాటో- మయా తగుచి (జపాన్) జంటపై నెగ్గి ప్రిక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టింది. గద్దె రుత్విక శివాని- సిక్కిరెడ్డి జోడీ మెయిన్ డ్రాకు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ రౌండ్లో రుత్విక- సిక్కి జోడీ 21-10, 21-15తో యాన్ యు- చు వింగ్ (హాంకాంగ్) జంటపై గెలుపొందింది. పురుషుల సింగిల్స్ రెండో అర్హత రౌండ్లో ఆలాప్ మిశ్రా 21-10, 24-2తో ఆర్యమన్ టాండన్‌పై నెగ్గి మెయిన్ డ్రాకు చేరుకున్నాడు.

పారాలింపిక్ షట్లర్లకు బాయ్ నజరానా రూ.50 లక్షలు

దిల్లీ: పారిస్ పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన షట్లర్లకు భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) రూ.50 లక్షలు నగదు ప్రోత్సాహకం ప్రకటించింది. పారాలింపిక్స్‌లో భారత క్రీడాకారులు ఒక స్వర్ణం.. రెండేసి రజత, కాంస్య పతకాలు సాధించారు. పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్3లో స్వర్ణం నెగ్గిన నితేశ్ కుమార్‌కు రూ.15 లక్షలు.. సుహాస్ యతిరాజ్ (పురుషుల సింగిల్స్ ఎస్‌ఎల్4), తులసిమతి మురుగేశన్ (మహిళల సింగిల్స్ ఎస్‌యూ5)కు చెరో రూ.10 లక్షలు ఇవ్వనుంది. మనీషా రాందాస్ (మహిళల సింగిల్స్ ఎస్‌యూ5), నిత్యశ్రీ శివన్ (మహిళల సింగిల్స్ ఎస్‌హెచ్6)కు తలా రూ.7.5 లక్షలు బాయ్ అందజేయనుంది.

'నైరుతి'లో 5 శాతం అధిక వర్షాలు..

దిల్లీ: దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిపించిన నైరుతి రుతుపవనాల ఉపసంహరణ పశ్చిమ రాజస్థాన్, కచ్ (గుజరాత్) ప్రాంతాల నుంచి ఇప్పటికే ప్రారంభమైంది. ఈ సారి దేశంలో అయిదు శాతం అధిక వర్షాలు నమోదైనా, మొత్తం 36 వాతావరణ ఉప విభాగాల్లో అయిదింట లోటు వర్షపాతం కురిసింది. జమ్మూకశ్మీర్ (-26%), హిమాచల్ ప్రదేశ్ (-20%), అరుణాచల్ ప్రదేశ్ (-30%), బిహార్ (-28%), పంజాబ్ (-27%)లలో వర్షపాతం తగ్గింది. రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ కోస్తా వంటి తొమ్మిది ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిశాయి. ఈ సీజనులో దేశవ్యాప్తంగా జూన్ 1 నుంచి సెప్టెంబరు 23 మధ్య 880.8 మి.మీ.ల వర్షం కురిసింది. ఇది సాధారణ వర్షపాతం 837.7 మి.మీ. కంటే కాస్త ఎక్కువ. రాబోయే వారం రోజుల్లో కోస్తా - ఉత్తర అంతర్గత కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, ఈశాన్య భారతదేశంలో భారీ నుంచి అతి భారీగా అల్పపీడన వర్షాలు కురిసే అవకాశముంది.

కోల్‌కతా ట్రామ్‌కు టాటా!



కోల్‌కతా: ట్రామ్ పేరు వినగానే మనకు కోల్‌కతా గుర్తుకొస్తుంది. రెండు బోగీలతో రోడ్డుపై నడిచే రైలుబండి ఇది. ఈ రవాణా సదుపాయం ప్రస్తుతం మన దేశంలో అందుబాటులో ఉన్నది ఒక్క కోల్‌కతా నగరంలోనే. ఆ సేవలు ఇప్పుడు అక్కడ కనుమరుగు కానున్నాయి. 150 ఏళ్లుగా కొనసాగిస్తున్న ఈ సేవలకు త్వరలో ముగింపు పలకాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి స్నేహాశీష్ చక్రవర్తి ఈ విషయాన్ని వెల్లడించారు. మైదాన్- ఎస్‌ప్లనేడ్ మార్గంలో మాత్రం కొంతకాలం పాటు వీటిని కొనసాగిస్తామని మంత్రి తెలిపారు.

కశ్మీర్‌లో రెండోవిడత పోలింగ్ నేడే

శ్రీనగర్: జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. పీర్ పంజాల్ పర్వత శ్రేణికి ఇరువైపులా ఉన్న శ్రీనగర్, బడ్గామ్, రాజౌరీ, పూంఛ్, గందేర్‌బల్, రియాసి జిల్లాల్లోని 26 స్థానాలకు బుధవారం పోలింగ్ జరగనుంది. మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, భాజపా జమ్మూకశ్మీర్ చీఫ్ రవీందర్ రైనా, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా సహా పలువురు కీలక నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. గందేర్‌బల్, బడ్గామ్ స్థానాల్లో ఒమర్ అబ్దుల్లా పోటీలో ఉన్నారు. సెంట్రల్ షాల్టెంగ్ నియోజకవర్గంలో హమీద్ కర్రా, నౌషేరా స్థానంలో రవీందర్ రైనా బరిలో నిలిచారు. ఈ విడతలో 25.78 లక్షల మంది ఓటర్లు 239 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. 3,502 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరగనుంది. వాటిలో 1,056 పోలింగ్ కేంద్రాలు పట్టణాల్లో, 2,446 గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నాయి.

ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు తోడ్పాటు

- జెలెన్‌స్కీతో మరోసారి భేటీలో మోదీ

న్యూయార్క్: ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనకు ఎలాంటి తోడ్పాటు అవసరమైనా అందించేందుకు సిద్ధమని భారత ప్రధాని నరేంద్రమోదీ పునరుద్ఘాటించారు. ఐరాస సమావేశాలకు వచ్చిన మోదీ, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సోమవారం న్యూయార్క్‌లో 45 నిమిషాలసేపు ద్వైపాక్షికంగా భేటీ అయ్యారు. ఉక్రెయిన్‌లో శాంతి, స్థిరత్వాలు నెలకొనడానికి అన్నివిధాలా మద్దతు ఇస్తామని తాను భరోసా ఇచ్చినట్లు మోదీ 'ఎక్స్'లో వెల్లడించారు. గత నెలలో ఉక్రెయిన్‌కు తాను వెళ్లినప్పుడు తీసుకున్న నిర్ణయాల అమలుపైనా సమీక్షించినట్లు చెప్పారు. దీర్ఘకాలం నిలిచేలా శాంతియుత పరిష్కారం కుదిరేందుకు సంపూర్ణంగా అండగా నిలుస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. యుద్ధం ముగిసేది ఎప్పుడనేది కాలమే చెబుతుందని, ఘర్షణకు ముగింపు పలకడంపైనే ప్రపంచనేతలందరి దృష్టి ఉందని చెప్పారు. భారత్‌తో వివిధ రంగాల్లో సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి తాము చురుగ్గా ప్రయత్నిస్తున్నామని జెలెన్‌స్కీ చెప్పారు. ముఖ్యంగా అంతర్జాతీయ వేదికలపై భేటీలను పెంచుకోవాలని, శాంతి సూత్రాన్ని అమలు చేయాలని, రెండో శాంతి సదస్సుకు సిద్ధం కావాలని నిర్ణయించినట్లు తెలిపారు.


మోదీ చిత్తశుద్ధికి నిదర్శనమిది: మిస్రీ

ఉక్రెయిన్‌లో యుద్ధంపై మోదీ ఎంతో కలవరానికి గురవుతున్నారని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ విలేకరులకు చెప్పారు. "శాంతికి భారత్ మద్దతు ఎప్పుడూ ఉంటుంది. చర్చలు, దౌత్యం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలనేది భారతదేశ వైఖరి. ఉక్రెయిన్‌పై మోదీకి ఉన్న చిత్తశుద్ధిని తాజా భేటీ చాటుతోంది" అని ఆయన వివరించారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

పశ్చిమాసియా.. ఉక్రెయిన్‌లలో శాంతి సాధ్యమే

ఐరాస సర్వప్రతినిధి సభలో బైడెన్ వెల్లడి



న్యూయార్క్: పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో శాంతిస్థాపన సాధ్యమేనని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చెప్పారు. మంగళవారం న్యూయార్క్‌లో మొదలైన ఐక్యరాజ్యసమితి 79వ వార్షిక సర్వప్రతినిధి సభలో ఆయన ప్రసంగించారు. లెబనాన్ పోరు, ఇజ్రాయెల్ ఘర్షణల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడి హోదాలో చివరిసారి ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రష్యా సాగిస్తున్న యుద్ధంలో ఉక్రెయిన్‌కు అమెరికా, దాని మిత్రపక్షాల మద్దతు కొనసాగుతుందని చెప్పారు. పూర్తిస్థాయి యుద్ధం ఎవరికీ ఉపయోగకరం కాదన్నారు. హింసను ఎగదోసుకుంటూ పోవడం కంటే దౌత్యపరమైన పరిష్కారమే శాంతికి మార్గమని చెప్పారు.

పరిస్థితుల్ని ఇలా వదిలేయలేం: గుటెరస్

ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ మాట్లాడుతూ- ప్రపంచంలో పరిస్థితుల్ని ఇలా వదిలేయలేమని స్పష్టంచేశారు. శిక్షలలేమి, అసమానతలు, అనిశ్చితి వంటివి ప్రపంచాన్ని అస్థిరపరుస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. భౌగోళిక విభజనలు, అంతూపొంతూ లేని యుద్ధాలు, వాతావరణ మార్పులు, అణ్వాయుధాలు పెరిగిపోతున్నవేళ అనూహ్య పరిస్థితులవైపు మానవాళి వెళ్లిపోతోందని చెప్పారు. అయితే ఇవన్నీ పరిష్కరించదగ్గవేనని అన్నారు.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

ఎన్నారై కోటా అర్హుల పరిధి పెంపు ఫక్తు వ్యాపారమే

- దానిని కొనసాగనివ్వరాదు
- ఎంబీబీఎస్ సీట్లపై సుప్రీం తీర్పు

దిల్లీ: వైద్య కళాశాలల్లోని ఎంబీబీఎస్ ప్రవేశాల్లో ప్రవాస భారతీయుల (ఎన్నారై) కోటాకు అర్హులయ్యే వారి పరిధిని పెంచుతూ పంజాబ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. ఈ కోటాలో ఎన్నారైల దూరపు బంధువులూ సీట్లు పొందవచ్చునంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వు మోసపూరితమని, దానికి వెంటనే ముగింపు పలకాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. మొదట్లో ఎన్నారైలకు, వారి సంతానానికి మాత్రమే వైద్య కళాశాలల్లో (రాష్ట్రానికి ఉండే 85 శాతం కోటాలోని 15శాతం సీట్లను) ప్రత్యేక కోటా కింద సీట్లు ఇచ్చేవారు. ఇప్పుడు ఎన్నారైల దూరపు బంధువులకూ ఆ కోటాలో ప్రవేశాలు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అమలైతే ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాలు దీన్ని వ్యాపారంగా మార్చేస్తాయని పంజాబ్, హరియాణా హైకోర్టు హెచ్చరించింది. ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం ఆగస్టు 20న జారీ చేసిన ఉత్తర్వును సెప్టెంబరు 10న కొట్టివేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ అప్పీలును మంగళవారం సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇదంతా ఎన్ఆర్ఐ కోటా పేరిట డబ్బు దండుకునే వ్యవహారమేనని సుప్రీం కోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

ఆ పోస్టులను చూసి మోసపోకండి



సామాజిక మాధ్యమాల్లో ఇతరులు పెట్టే పోస్టులను చూసి మోసపోకండి. వారితో మీ జీవన విధానాన్ని పోల్చుకొని కుంగిపోకండి. ప్రపంచవ్యాప్తంగా అత్యధికులు తమ రోజు ఎంత బాగా గడిచిందో.. తామెంతటి ఖరీదైన ఆహారం తిన్నామో.. ఎంతటి విలాస వస్తువు కొనుగోలు చేశామో.. సామాజిక మాధ్యమ పోస్టుల రూపంలో తెలియజేస్తున్నారు. వారి ఇబ్బందులు, ప్రతికూలతలను మాత్రం దాచేస్తున్నారు.

– ర్యాన్ హాలిడే, రచయిత

బీరుట్‌పై మళ్లీ దాడి

- యుద్ధ విమానాలతో విరుచుకుపడిన ఇజ్రాయెల్
- హెజ్‌బొల్లా క్షిపణుల కమాండర్ మృతి
- లెబనాన్‌లో 560కి చేరుకున్న మృతుల సంఖ్య

బీరుట్: ఇజ్రాయెల్, హెజ్‌బొల్లాల మధ్య దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. సోమవారం లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై విరుచుకుపడిన ఇజ్రాయెల్ మంగళవారమూ దాడులను కొనసాగించింది. ఇటు హెజ్‌బొల్లా కూడా ఇజ్రాయెల్‌పై దాడులు చేసింది. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్ జరిపిన దాడిలో హెజ్‌బొల్లా క్షిపణుల కమాండర్ మరణించాడు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ధ్రువీకరించింది. మరోవైపు సోమవారం నుంచి లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో మరణించిన వారి సంఖ్య 560కి చేరుకుంది. మరణించిన వారిలో 50 మంది పిల్లలు, 94 మంది మహిళలున్నారు. నలుగురు వైద్య సిబ్బంది మరణించగా.. 16 మంది గాయపడ్డారు. దాడుల్లో మొత్తం 1,835 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్యశాఖ మంత్రి ఫిరాస్ అబియాద్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. 54 ఆసుపత్రుల్లో వారికి చికిత్స జరుగుతోందని వివరించారు.

★ బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో రాకెట్లు, క్షిపణుల కమాండర్ ఇబ్రహీం కొబైసీ మరణించాడు. అతడితోపాటు ఆరుగురు మృతి చెందారని లెబనాన్ వర్గాలు వెల్లడించాయి.

★ సోమవారం రాత్రి నుంచి ఇజ్రాయెల్‌లోని 8 ప్రాంతాలపై క్షిపణి దాడులు చేశామని, పేలుడు పదార్థాల ఫ్యాక్టరీపైనా దాడి చేశామని హెజ్‌బొల్లా వెల్లడించింది. తమ దేశంలోని ఉత్తర భాగంవైపు లెబనాన్ నుంచి 55 రాకెట్లు వచ్చాయని ఇజ్రాయెల్ తెలిపింది. పలు భవనాలు ధ్వంసమయ్యాయని వివరించింది. గాయపడిన ఇద్దరు ఉత్తర ఇజ్రాయెల్‌లోని గెలీలీ వైద్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చారని అధికారులు తెలిపారు.



ఇజ్రాయెల్ దాడితో బీరుట్‌లో ధ్వంసమైన భవనం

★ ఇజ్రాయెల్ దాడుల్లో.. అగ్ని ప్రమాదాలను గుర్తించే అమెరికాకు చెందిన నాసా ఫైర్ ఇన్ఫర్మేషన్ ఫర్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టం కాలిపోయింది.

★ లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై వైమానిక దాడులు చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. అందులో రాకెట్లను ప్రయోగించే ప్రాంతమూ ఉందని పేర్కొంది. యుద్ధ ట్యాంకులను, ఆయుధాలను ధ్వంసం చేశామని తెలిపింది. బీరుట్‌పై జరిగిన దాడుల్లో పలువురు గాయపడ్డారని వివరించింది.

శ్రీలంక కొత్త ప్రధానిగా హరిణి




కొలంబో: శ్రీలంక నూతన ప్రధానమంత్రిగా హరిణి అమరసూర్య (54) నియమితులయ్యారు. దేశాధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే మంగళవారం ఆమెతో ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్ష ఎన్నికల అనంతరం అధికార మార్పిడిలో భాగంగా దినేష్ గుణవర్ధన తన ప్రధాని పదవికి రాజీనామా చేయడంతో హక్కుల కార్యకర్త, విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు హరిణి అమరసూర్యను తరవాతి ప్రధానిగా దేశాధ్యక్షుడు దిసనాయకే నియమించారు. మరోవైపు శ్రీలంక పార్లమెంటును రద్దు చేస్తూ అధ్యక్షుడు దిసనాయకే మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో నవంబరు 14న పార్లమెంటుకు ఎన్నికలు జరగనున్నాయి.

భారత్-చైనా మధ్య నలిగిపోదల్చుకోలేదు

- శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే

ఇంటర్నెట్‌డెస్క్: భారత్-చైనాల మధ్య తాము నలిగిపోదల్చుకోలేదని శ్రీలంక నూతన అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే వెల్లడించారు. అసలు ఏ రెండు దేశాల మధ్య తాము ఒత్తిడికి గురికావాలని కోరుకోవడం లేదని ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తేల్చిచెప్పారు. ప్రపంచ శక్తుల అధిపత్య పోరుకు శ్రీలంక దూరమన్నారు. అదే సమయంలో ఉభయ పక్షాలకు ప్రయోజనకరంగా ఉండేలా దౌత్య, భాగస్వామ్యాలను కుదుర్చుకోవడంపై తాము దృష్టిపెడతామని పేర్కొన్నారు. ''భౌగోళిక, రాజకీయ యుద్ధంలో మేం పోటీదారులం కాదు. భవిష్యత్తులో భాగస్వామి కాబోం. వీటిల్లో శాండ్‌విచ్‌లా నలిగి పోవాలనుకోవడం లేదు. ముఖ్యంగా భారత్-చైనా మధ్య ఇబ్బంది పడాలనుకోవడంలేదు. ఇరు దేశాలు మాకు విలువైన మిత్రులే'' అని దిసనాయకే కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు దిసనాయకే అధ్యక్ష ఎన్నికలకు ముందు చేసినవా లేదా తరవాత చేసినవా అన్న దానిపై స్పష్టత లేదు.

హరియాణా ఎన్నికల్లో ఆమెకేదీ చోటు?



- ఇప్పటిదాకా 87 మందే ఎన్నిక
- అసెంబ్లీలో పురుషాధిక్యమే

గురుగ్రామ్: దేశ రాజకీయాల్లో మహిళల పాత్ర క్రమంగా పెరుగుతున్నప్పటికీ ఇంకా కొన్ని ప్రాంతాల్లో వారి ప్రాతినిధ్యం అంతంత మాత్రంగానే ఉంటోంది. హరియాణా అసెంబ్లీలోనూ వారికి చోటు తక్కువే. 1966లో పంజాబ్ నుంచి వేరుపడి హరియాణా రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అక్కడి రాజకీయాల్లో పురుషుల ఆధిపత్యమే కొనసాగుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 87 మంది మహిళలే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ప్రస్తుత ఎన్నికల బరిలో 51 మంది మహిళలే ఉన్నారు. వారిలో ఎక్కువ మంది రాజకీయ కుటుంబ నేపథ్యం, సెలబ్రిటీ హోదా ఉన్నవారే. సామాన్య మహిళలకు హరియాణా రాజకీయాల్లో అవకాశాలు అంతంత మాత్రమే. ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల జాబితా ప్రకారం ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 12 మంది మహిళా అభ్యర్థులను పోటీలో నిలిపింది. ఇండియన్ నేషనల్ లోక్ దళ్ (ఐఎన్ఎల్‌డీ), బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) కూటమి 11 మంది మహిళా అభ్యర్థులను పోటీకి దింపింది. జన నాయక్ జనతా పార్టీ (జేజేపీ), ఆజాద్ సమాజ్ పార్టీ (ఏఎస్‌పీ) కూటమి 8 మంది, ఆప్ 10 మంది మహిళా అభ్యర్థులకు టికెట్లిచ్చాయి. అధికార భాజపా 10 మంది మహిళా అభ్యర్థులను నిలబెట్టింది.

ప్రముఖుల పోటీ

పారిస్ ఒలింపిక్స్‌లో అనర్హత వేటుతో కుస్తీకి వీడ్కోలు పలికిన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ రాజకీయాల్లో అడుగుపెట్టారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె కాంగ్రెస్ తరఫున జులానా నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు.

- ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి డబ్ల్యూడబ్ల్యూఈ మహిళా రెజ్లర్ కవితా దలాల్‌తో ఫొగాట్ తలపడుతున్నారు.
- ఆసియాలోనే సంపన్న మహిళగా ఖ్యాతి గడించిన సావిత్రి జిందాల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీకి దిగారు. ఆమెకు భాజపా టికెట్ ఇవ్వలేదు. దీంతో హిస్సార్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు.
- కేంద్ర మంత్రి రావ్ ఇంద్రజీత్ సింగ్ కుమార్తె ఆర్తీ సింగ్ అటెలి స్థానం నుంచి భాజపా తరఫున పోటీ చేస్తున్నారు.
- ఇటీవల కాంగ్రెస్‌ను వీడి భాజపా కండువా కప్పుకొన్న మాజీ ముఖ్యమంత్రి బన్సీలాల్ మనవరాలు శృతి చౌదరి తోషం నుంచి బరిలోకి దిగారు.
- కాంగ్రెస్ అత్యధిక సంఖ్యలో మహిళా అభ్యర్థులను నిలబెట్టిందని ఆ పార్టీ ఎమ్మెల్యే, విద్యాశాఖ మాజీ మంత్రి గీతా భుక్కల్ పేర్కొన్నారు. ఈమె ఇప్పటికే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం ఝజ్జర్ నుంచి పోటీ చేస్తున్నారు.
- ఆప్ నుహ్ స్థానం నుంచి రబియా కిద్వాయ్‌ను ముస్లిం మహిళా అభ్యర్థిగా నిలబెట్టింది. హరియాణాకు 13వ గవర్నర్‌గా సేవలందించిన ఏఆర్ కిద్వాయ్‌కు ఆమె మనవరాలు.

2014 తర్వాత మెరుగు

- 2014 ఎన్నికల్లో అత్యధికంగా 116 మంది మహిళా అభ్యర్థులు పోటీకి దిగగా 13 మంది గెలుపొందారు.
- 2019లో స్వతంత్ర అభ్యర్థులుసహా 104 మంది మహిళలు బరిలో నిలిచారు. వారిలో 9 మందే శాసన సభ్యులుగా ఎన్నికయ్యారు.

ప్రోత్సాహం కరవు



- అశోక విశ్వవిద్యాలయానికి చెందిన త్రివేణి సెంటర్ ఫర్ పొలిటికల్ డేటా నిర్వహించిన అధ్యయనం ప్రకారం.. హరియాణా రాజకీయాల్లో మహిళలకు ఎప్పుడూ సరైన ప్రోత్సాహం లభించలేదు. '2000- 2019 మధ్య కాలంలో విధానసభ ఎన్నికల్లో మహిళా అభ్యర్థుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. ఇది మంచి పరిణామమే. అయితే సంపన్న కుటుంబాలకు చెందిన మహిళలే రాజకీయాల్లోకి వస్తున్నారు. సామాన్యులకు అవకాశాలు దక్కట్లేదు' అని ఆ నివేదిక పేర్కొంది.
- రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పటికీ పితృస్వామ్య వ్యవస్థ కొనసాగుతోందని మహేందర్‌గఢ్‌లోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన రాజనీతి శాస్త్ర ప్రొఫెసర్ ఒకరు ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ కుటుంబాల నుంచి వచ్చే మహిళలకే పార్టీలు టికెట్లు కేటాయిస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో సామాన్య మహిళలు రాజకీయాల్లో రాణించడం కష్టమైన వ్యవహారమని పేర్కొన్నారు.

హరియాణా యువత 'డంకీ'లుగా ఎందుకు మారుతున్నారు?: రాహుల్‌గాంధీ




హరియాణాలోని కర్నాల్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ కుటుంబంతో రాహుల్ గాంధీ

దిల్లీ: హరియాణాలో అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. హరియాణాతో పాటు దేశంలోని యువతకు భాజపా ఉపాధి కల్పించకుండా తీవ్ర అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. అందువల్లే హరియాణాలో ఎక్కువ శాతం యువత 'డంకీ'(ఉపాధి కోసం వలస వెళ్లేవారు)లుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అమెరికా పర్యటనకు వెళ్లిన సమయంలో హరియాణా నుంచి వలస వెళ్లిన యువత తమ ఇబ్బందులను పేర్కొంటూ మాట్లాడిన వీడియోను 'ఎక్స్'లో మంగళవారం షేర్ చేశారు. ''హరియాణా యువత 'డంకీ'లుగా ఎందుకు మారుతున్నారు? భాజపా చేస్తున్న తప్పులకు యువత తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ శిక్ష అనుభవిస్తున్నారు. హరియాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఈ పరిస్థితి ఏర్పడకుండా చేస్తాం. వారికి ఇక్కడే ఉద్యోగావకాశాలు కల్పిస్తాం' అని రాహుల్ పేర్కొన్నారు. హరియాణా శాసనసభ ఎన్నికలు (అక్టోబరు 5న) సమీపిస్తున్న నేపథ్యంలో భాజపా నుంచి అధికారాన్ని చేజిక్కించుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోంది. రైతుల సమస్యలు, నిరుద్యోగాన్ని అస్త్రాలుగా చేసుకొని పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారాలు నిర్వహిస్తోంది.

దొంగగా చిత్రీకరించేందుకు భాజపా యత్నం

- దిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్

చండీగఢ్: ''నన్ను దొంగగా చిత్రీకరించేందుకు భాజపా ప్రయత్నిస్తోంది. కానీ, నా ప్రత్యర్థులు కూడా నేను అవినీతిపరుడిని కాదని నమ్ముతున్నారు'' అని ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పేర్కొన్నారు. హరియాణాలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంగళవారం రానియా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడారు. ''కారణం లేకుండా ఐదున్నర నెలలు జైల్లో ఉన్నా. నేను చేసిన తప్పేంటి? దిల్లీకి సీఎంగా ఉండటం నా తప్పా? పేద పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేశాను. పంజాబ్, దిల్లీలో ఉచిత కరెంటును అందించడం తప్పా?'' అని కేజ్రీవాల్ భాజపాపై మండిపడ్డారు. అవినీతిపరులు ఎవరూ ఇలాంటి అభివృద్ధి పనులు చేయరు. నేను దొంగ అయితే నా జేబులో రూ.3 వేల కోట్లు ఉండేవి. నేను నిజాయతీపరుడిని. నన్ను దొంగను చేయాలనుకుంటున్నారు'' అని భాజపాపై ధ్వజమెత్తారు.




సముద్రగర్భంలో దెయ్యం చేప..

గుర్తించిన న్యూజిలాండ్ శాస్త్రవేత్తలు

ఇంటర్నెట్ డెస్క్: సముద్రగర్భంలో అత్యంత రహస్యంగా సంచరించే అరుదైన షార్క్ జాతి చేపను గుర్తించినట్లు న్యూజిలాండ్ శాస్త్రవేత్తలు ప్రకటించారు. పసిఫిక్ సముద్రంలో మైలుకు పైగా లోతులో ఇది సంచరిస్తున్నట్లు పేర్కొన్నారు. పొట్టిముక్కుతో ఉండే దీనిని 'స్పూక్ ఫిష్' అంటున్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జలాల్లో ఇది జీవిస్తున్నట్లు వెల్లింగ్టన్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాటర్ అండ్ అట్మోస్ఫియరిక్ రీసెర్చ్' వెల్లడించింది. న్యూజిలాండ్ దక్షిణాన ఉన్న ఒక ద్వీపం సమీపంలోని 'ది ఛాతమ్ రైజ్' అనే ప్రాంతంలో ఇవి ఉన్నాయని పేర్కొంది. ఈ కొత్తచేప జాతికి 'హర్రియోటా అవియా' అనే పేరు పెట్టినట్లు శాస్త్రవేత్త బ్రిట్ ఫినూసీ తెలిపారు. సముద్రం అడుగున జీవించే ఈ చేపలను సాధారణంగా చిమేరా అంటారు. వీటి ఎముకలు మొత్తం మృదులాస్థితో తయారై ఉండటం విశేషం. నల్లటి కళ్లు ఉండటంతో 'ఘోస్ట్ ఫిష్' అని కూడా అంటారు. ముక్కు వంటి నోటితో ఇవి సముద్రంలో దాదాపు 2,600 మీటర్ల లోతున ఆహారం వెదుక్కొంటాయి.

అవయవదానంలో అతివలదే పైచేయి



దిల్లీ: అవయవదానంలో పురుషుల కంటే మహిళలే ముందు వరుసలో ఉన్నారని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2023లో మొత్తం 16,542 అవయవ దానాలు దేశంలో జరిగాయి. ఇందులో బతికుండగా 15,436 మంది అవయవ దానానికి ముందుకురాగా.. వారిలో 9,784 మంది మహిళలు. సాధారణంగా బతికున్న వ్యక్తులు ఒక మూత్రపిండం, కాలేయం.. ఊపిరితిత్తుల్లో కొంతభాగాన్ని దానం చేస్తుంటారు. కుటుంబసభ్యుల్లో ఎవరికైనా ఇవి అవసరమైనప్పుడు వారి సన్నిహితులు ముందుకొస్తుంటారు. అలాగే బ్రెయిన్‌డెడ్ (జీవన్మృతులు) అయిన వారి నుంచి మరికొన్ని ఇతర అవయవాలు, కణజాలాన్ని కుటుంబసభ్యుల అనుమతి మేరకు దానం చేయవచ్చు. 2023లో ఇలా బతికున్న వారి నుంచి, చనిపోయిన వారి నుంచి తీసుకున్న అవయవాలతో 18,378 అవయవ మార్పిళ్లు జరిగినట్లు కేంద్రం తెలిపింది. ఇందులో అత్యధికంగా 13,426 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగాయి. 4,491 కాలేయం.. 221 గుండెమార్పిడి శస్త్రచికిత్సలు చేశారు. మరణించినవారి నుంచి పొందిన అవయవదానాల్లో తెలంగాణ (252) తొలిస్థానంలో ఉండగా.. తమిళనాడు, కర్ణాటక (178) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. దిల్లీలో అత్యధికంగా 2,576 మందికి కిడ్నీమార్పిళ్లు జరగ్గా.. తమిళనాడు (1,633), మహారాష్ట్ర (1,305) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఒకప్పటితో పోలిస్తే అవయవదానంపై మన సమాజంలోనూ అవగాహన పెరుగుతున్నా.. ఇతర దేశాలకంటే ఇంకా తక్కువేనని చెప్పాలి.

బెంగళూరు ఆటోవాలా అంటే మాటలా!





ఇంటర్నెట్ డెస్క్: టెక్ సిటీగా పేరున్న బెంగళూరు మహా నగరంలో ఆటోడ్రైవర్లు కూడా వినూత్నంగా ఆలోచిస్తున్నారు. నగరంలో గంటల తరబడి ట్రాఫిక్‌లో ఆగిన వాహనాలు నిత్యం సోషల్ మీడియాలో దర్శనమిస్తుంటాయి. రోజంతా ఆటోలు నడిపేవారి పరిస్థితి మరీ దారుణం. ఈ నేపథ్యంలో ఓ ఆటో డ్రైవరు వినూత్న ఆలోచన చేశాడు. ట్రాఫిక్‌లో ఎంతసేపు ఆగినా సౌకర్యంగా కూర్చునేందుకు వీలుగా ఖరీదైన ఎగ్జిక్యూటివ్ ఛైరును ఆటోలో ఏర్పాటు చేసుకున్నాడు. ఈ ఫొటోను క్రెడ్ ఉద్యోగి ఒకరు షేర్ చేయగా.. 'ఆరోగ్యంపై ఈమాత్రం శ్రద్ధ ఉండాల్సిందే' అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

■ బెంగళూరులో మరో ఆటో ఎక్కిన ఓ కస్టమర్ డబ్బు చెల్లింపునకు క్యూఆర్ కోడ్ అడిగాడు. వెంటనే ఆ డ్రైవరు తన చేతికున్న స్మార్ట్‌వాచ్‌లోని క్యూఆర్ కోడ్ చూపించగా విస్తుపోవడం కస్టమర్ వంతైంది. ఈ అనుభవాన్ని అతడు 'ఎక్స్' వేదికగా ఫొటోతో సహా పంచుకోగా.. అది వైరల్‌గా మారింది.



సూసైడ్ క్యాప్సుల్ 'ద సార్కో'

'ఆత్మహత్యా పేటిక' సాయంతో వ్యక్తి మృతి!

స్విట్జర్లాండ్‌లో పలువురి నిర్బంధం

జెనీవా: చిన్న యంత్రంలా కొత్తగా రూపొందించిన 'ఆత్మహత్యా పేటిక' (సుయిసైడ్ క్యాప్సుల్) సాయంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోగా, అందుకు సహకరించారన్న అనుమానంతో పలువురిని అదుపులోకి తీసుకొని క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు దక్షిణ స్విట్జర్లాండ్ పోలీసులు మంగళవారం వెల్లడించారు. మరొకరి సాయంతో జీవితాన్ని చాలించేందుకు ఉపయోగించే ఈ పేటికను 'సార్కో' అంటారు. గతంలో ఎవరూ దీన్ని ఉపయోగించలేదు. ఒక మనిషి పట్టేలా శయ్య ఉన్న ఈ పేటిక లోపలికి వెళ్లి, మీట నొక్కితే సీల్డ్ ఛాంబర్‌లాంటి అందులోకి నైట్రోజన్ వాయువు విడుదల మొదలవుతుంది. లోపల నిద్రపోతున్న వ్యక్తి కొన్ని నిమిషాల్లో ఊపిరాడక మరణిస్తాడు. మేరీషాజన్ అటవీ ప్రాంతంలోని ఓ ఇంటిలో కొందరి సాయంతో 'సార్కో' ద్వారా సోమవారం ఆత్మహత్య జరిగినట్లు అందిన సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఆత్మహత్యకు ప్రేరేపించారన్న అనుమానంతో పలువురిని అదుపులోకి తీసుకున్నారు.

రాములవారి రథానికి నిప్పు

- అనంతపురం జిల్లా హనకనహాళ్‌లో దుండగుల దుశ్చర్య
- దర్యాప్తునకు ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశం
- పోలీసుల అదుపులో ముగ్గురు అనుమానితులు


రథాన్ని పరిశీలిస్తున్న అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీశ్ తదితరులు


హనకనహాళ్‌లో దుండగులు నిప్పంటించడంతో కాలిన రథం

కణేకల్లు, న్యూస్‌టుడే: ఏపీలో అనంతపురం జిల్లా కణేకల్లు మండలంలోని హనకనహాళ్ గ్రామంలో సీతారాముల, ఆంజనేయస్వామి ఆలయ రథానికి సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడం కలకలం రేపింది. షెడ్డులో మంటలు, పొగ వ్యాపించడంతో స్థానికులు అప్రమత్తమై మంటలు ఆర్పి వేశారు. అప్పటికే రథం కొంతమేర కాలిపోయింది. తిరుమల లడ్డూ ప్రసాదం వివాదం నేపథ్యంలో ఈ ఘటనను ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్‌గా తీసుకున్నారు. సమగ్రంగా దర్యాప్తు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఘటనా స్థలాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీశ్ పరిశీలించారు. వివరాలు ఆరా తీశారు. కులం, మతం, గొడవలకు సంబంధించి జరిగిన ఘటన కాదని తేల్చారు. దేవాదాయశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. క్లూస్‌టీం, జాగిలాలను రప్పించి ఆధారాలు సేకరించారు. షెడ్డు తలుపునకు వేసిన తాళం కోసి లోపలికి ప్రవేశించిన దుండగులు వస్త్రం చుట్టిన కర్ర సాయంతో రథానికి నిప్పు పెట్టినట్లు ఎస్పీ తెలిపారు.

వర్గ విభేదాలతోనే..

2022లో గ్రామానికి చెందిన ఎర్రిస్వామి, హనుమంతరెడ్డి, గోపాల్‌రెడ్డి, రామాంజనేయులురెడ్డి సోదరులు రూ.20 లక్షలు ఖర్చు చేసి రథం చేయించారు. గ్రామంలో అది నుంచి ఆధిపత్యం చెలాయిస్తున్న మరో వర్గానికి ఇది నచ్చక శ్రీరామనవమి ఉత్సవాలకు దూరంగా ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. రథం చేయించిన వర్గం గ్రామస్థుల మన్ననలు పొందుతుండటం జీర్ణించుకోలేని మరో వర్గం ఈ దుశ్చర్యకు ఒడిగట్టినట్లు పోలీసులు అంచనాకు వచ్చారు. ముగ్గురు కీలక అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దర్యాప్తులో తేలిన వివరాలను ముఖ్యమంత్రికి నివేదించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి: ఎమ్మెల్యే కాలవ

రథానికి నిప్పంటించిన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కాలిపోయిన రథాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వంపై బురదజల్లాలనే దురుద్దేశంతో ఈ ఘటన జరిగి ఉండవచ్చన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. దోషులకు కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎడ్లబండిపై బడికి..



చిత్రంలో కనిపిస్తున్నది ఉట్నూరు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా. మంగళవారం కుమురంభీం జిల్లా వాంకిడి మండలంలోని వెల్గి గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసేందుకు బయల్దేరారు. గ్రామ సమీపంలోని ఒర్రెపై వంతెన లేక వాహనాలు వెళ్లలేని పరిస్థితి. దీంతో ఆమె ఎడ్లబండిపై ఒర్రె దాటి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం గ్రామానికి రహదారి, ఒర్రెపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆమె ఆదేశించారు. – న్యూస్‌టుడే, వాంకిడి


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో భేటీ అయిన మంత్రి సీతక్క

ములుగును పురపాలికగా మార్చేందుకు సహకరించాలి

గవర్నర్‌కు మంత్రి సీతక్క వినతి

ఈనాడు, హైదరాబాద్: ములుగు జిల్లా కేంద్రాన్ని పురపాలికగా మార్చేందుకు సహకరించాలని, దీని కోసం జీహెచ్‌ఎంసీ చట్టసవరణ బిల్లును ఆమోదించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి సీతక్క రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. మంగళవారం రాజ్‌భవన్‌లో ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ములుగును పురపాలికగా మారుస్తూ 2022లో గత భారాస ప్రభుత్వం శాసనసభలో బిల్లును ఆమోదించిందని, అప్పటి గవర్నర్ తమిళిసై దీనికి ఆమోదం తెలపకుండా రాష్ట్రపతి భవన్‌కు పంపించారని చెప్పారు. దానిని ఆమోదించేలా చొరవ చూపాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో ఇరువర్గాల మధ్య సఖ్యత కుదిర్చేలా జరుగుతున్న ప్రయత్నాలను మంత్రి వివరించారు.

ప్రైవేటు పాఠశాల వద్ద ఆందోళన ఉద్రిక్తం


- కామారెడ్డిలో ఓ యూకేజీ విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన
- నిరసనకు దిగిన తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాలు
- పాఠశాలపై ఓ వర్గం రాళ్లదాడి
- ముగ్గురు పోలీసులకు గాయాలు... లాఠీఛార్జి


రక్తమోడుతున్న సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం: కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు పాఠశాల వద్ద మంగళవారం జరిగిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మూడు రోజుల క్రితం యూకేజీ చదువుతున్న చిన్నారితో వ్యాయామ ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని తల్లిదండ్రులకు చెప్పడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం పాఠశాల వద్దకు చేరుకున్న తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు ఉపాధ్యాయుడితోపాటు ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. శాంతియుతంగా సాగుతున్న నిరసనలు ఓ వర్గానికి చెందిన వారు భారీ సంఖ్యలో ప్రవేశించిన తరువాత ఉద్రిక్తంగా మారాయి. వారు పాఠశాలపైకి రాళ్లు విసరడంతోపాటు భవనంలోకి ప్రవేశించి కిటికీలు, కుర్చీలు ధ్వంసం చేశారు. రాళ్ల దాడిలో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తల, చెవి కింద గాయాలు కాగా ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ నజీరుద్దీన్‌కు కాలు విరిగింది. పట్టణ ఎస్సై రాజారాం సైతం గాయాలతో సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో పోలీసులు నిరసనకారులపై లాఠీఛార్జి చేసి పాఠశాల ప్రాంగణం నుంచి బయటకు పంపించారు. అనంతరం ఆందోళనకారులు పట్టణంలో రోడ్లపైకి చేరి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. నిజాంసాగర్ చౌరస్తాతోపాటు రైల్వేబ్రిడ్జి పైన బైఠాయించడంతో పోలీసులు చేరుకుని తిరిగి లాఠీఛార్జి చేసి వారిని చెదరగొట్టారు. ఎస్పీ సింధూశర్మ, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) డి.శ్రీనివాస్‌రెడ్డి పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకారులతో చర్చలు జరిపారు. విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. పాఠశాల నిర్వాహకులతోపాటు డీఈవో రాజు, ఎంఈవో ఎల్లయ్యలపై చేసిన ఆరోపణలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

పట్టణాలు వేడెక్కడంతో భారీ వర్షాలు

ఐఎండీ డైరెక్టర్ జనరల్ ఎం.మహాపాత్ర



ఈనాడు డిజిటల్, విశాఖపట్నం: దేశవ్యాప్తంగా పట్టణప్రాంతాల్లో వేడి పెరగడంతో ‘హీట్ ఐలాండ్’లుగా తయారై.. భారీ వర్షాలు కురుస్తున్నాయని భారత వాతావరణశాఖ (ఐఎండీ) డైరెక్టర్ జనరల్ ఎం.మహాపాత్ర వెల్లడించారు. వర్షపు నీరు భూమిలోకి ఇంకేందుకు అవకాశం లేకపోవడంతో లోతట్టు ప్రాంతాల్లో చేరి వరదలు సంభవిస్తున్నాయన్నారు. మంగళవారం విశాఖలోని తుపాను హెచ్చరికల కేంద్రం స్వర్ణోత్సవానికి హాజరైన ఆయన విలేకర్లతో మాట్లాడారు. ‘ప్రత్యేకంగా వాతావరణ అంచనాలు రూపొందించేందుకు పెద్ద నగరాల్లో అర్బన్ మోడలింగ్ సిస్టమ్‌ను సిద్ధం చేయాలి. ఇప్పటికే ముంబయి, చెన్నై, కోల్‌కతా, దిల్లీ నగరాలకు నమూనాలున్నాయి. గత దశాబ్దంతో పోలిస్తే ప్రస్తుతం ఐఎండీ అంచనాలు 40-50 శాతం మెరుగుపడ్డాయి. మరింత మెరుగుపరిచేందుకు ప్రతి మండలంలో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ (ఏడబ్ల్యూఆర్), ప్రతి పంచాయతీలో రెయిన్‌గేజ్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. వాతావరణ అంచనాలు రూపొందించడం, ప్రజలకు సమాచారం చేరవేయడంపై ఆసక్తిగల వ్యక్తులు ఐఎండీతో కలసి పనిచేయొచ్చు’ అని తెలిపారు.

మంత్రుల నిర్లక్ష్యంతోనే కృష్ణా నీరు సముద్రంపాలు: జగదీశ్‌రెడ్డి



మిర్యాలగూడ, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రుల నిర్లక్ష్యం కారణంగానే కృష్ణానది నీరు సముద్రం పాలవుతోందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ భారాస కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పది నెలల పాలన తిరోగమనంలో సాగుతోందని.. వైద్యం పడకేసిందని, ప్రాజెక్టుల నీరు రైతులకు అందటం లేదన్నారు. జిల్లా రైతులకు నీరివ్వకుండా తూములకు వెల్డింగ్ చేసి ఖమ్మం జిల్లాకు నీరు తరలించారని వారు చేసిన తప్పిదాలతో సాగర్ కాల్వలు తెగిపోయాయని ఆరోపించారు. జిల్లా మంత్రులు డబ్బు సంపాదన కోసం బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ భారాస నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు చిట్టిబాబు, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టుల మృతి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా చింతాల్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కర్కన్‌గుడ అటవీ ప్రాంతంలో మావోయిస్టు దళాలు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురు కాల్పుల ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా సీఆర్‌పీఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్, డీఆర్జీ బలగాలు కర్కన్‌గుడ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున కూంబింగ్ చేపట్టాయి. ఈ సమయంలో వారికి తారసపడిన మావోయిస్టు దళాలు కాల్పులు ఆరంభించాయి. దీంతో ఇరువర్గాల మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. వీరి మృతదేహాలను తోటి మావోయిస్టులే భుజాలపై మోసుకొని చింతవాగు మీదుగా తీసుకెళ్లినట్లు సుక్మా ఎస్పీ కిరణ్‌చౌహాన్ ఛత్తీస్‌గఢ్ మీడియాకు తెలిపారు. ఘటనా స్థలం నుంచి మావోయిస్టులకు చెందిన పేలుడు పదార్థాలను, ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.

గత పాలకులది మహాపచారం

- తిరుపతిలో స్వామీజీల నిరసన దీక్ష


నిరసన వ్యక్తం చేస్తున్న స్వామీజీలు, సాధువులు

తిరుపతి, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల్లో కల్తీ నెయ్యి వివాదం నేపథ్యంలో తిరుపతిలోని తితిదే పరిపాలన భవనం ఎదుట ఏపీ సాధు పరిషత్ ఆధ్వర్యంలో సాధువులు, స్వామీజీలు, భక్తులు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఏపీ మాజీ సీఎం జగన్, గత ప్రభుత్వ హయాంలోని తితిదే ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి, పాలకమండలి సభ్యులు శ్రీవారి సన్నిధిలో మహాపచారాలు చేశారని వారిని అరెస్టు చేసి జైలుకు పంపాలని నినదించారు. అనంతరం దోషులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తితిదే ఈవో హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.



మాట నిలబెట్టుకుంటేనే మనకు విలువ

ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలోనే మన అసలైన విలువ దాగి ఉంటుంది. కాబట్టి వాగ్దానాలు చేసే ముందు బాగా ఆలోచించుకోండి. వాటిని నిలుపుకోలేకపోతే చాలా నష్టపోతారు. ఒకసారి వాగ్దాన భంగం జరిగితే.. సమాజంలో తిరిగి మీ విలువను పెంచుకునేందుకు కొన్నేళ్లపాటు శ్రమ పడాల్సి రావొచ్చు.

– జాన్ సీనా, రెజ్లర్

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

- ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యోగుల ఐకాస విన్నపం


కోదండరామ్‌ను సన్మానిస్తున్న ఐకాస నేతలు ముజీబ్, శ్రీపాల్‌రెడ్డి, జగదీశ్వర్, ఏలూరు శ్రీనివాసరావు, మధుసూదన్‌రెడ్డి, అంజిరెడ్డి మణిపాల్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్, న్యూస్‌టుడే, బాగ్‌లింగంపల్లి: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగుల ఐకాస రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించింది. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన ఐకాస విస్తృత స్థాయి సమావేశంలో 9 తీర్మానాలను ఆమోదించి, 42 డిమాండ్లను సర్కారు ముందుంచారు. 208 మందితో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం ఐకాస రాష్ట్ర ఛైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ఏపీలో పనిచేస్తోన్న ఉద్యోగులను తెలంగాణకు రప్పించాలని కోరారు. ఐకాస ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఉద్యోగులను చైతన్యం చేసేందుకు అన్ని జిల్లాల కేంద్రాల్లో రానున్న 15 రోజుల్లో సమావేశాలు నిర్వహించి, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో ఐకాస నేతలు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, చావ రవి, సదానందంగౌడ్, జ్ఞానేశ్వర్, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాలు

“నాలుగు పెండింగ్ డీఏలను విడుదల చేయాలి. ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు చేసి, బిల్లులను ట్రెజరీ ద్వారా చెల్లించాలి. రెండో పీఆర్‌సీ అమలుకు చర్యలు వేగవంతం చేయాలి. ఉద్యోగులకు క్యాష్‌లెస్ ఆరోగ్య పథకాన్ని పునఃరిద్ధరించాలి. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలి. జీవో 317ను సమీక్షించాలి. సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగుల ఐకాస నాయకులతో చర్చలు ప్రారంభించాలి. ఉద్యోగుల ఐకాస జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించాలి’’ అన్నారు.

208 మందితో పూర్తిస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీ

మొత్తం 205 సంఘాల భాగస్వామ్యమైన ఐకాసకు పూర్తిస్థాయి ఎగ్జిక్యూటివ్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఏలూరి శ్రీనివాసరావు కొనసాగుతారు. చావా రవి, వి.రవీందర్‌రెడ్డి, జి.సదానందంగౌడ్, జి.జ్ఞానేశ్వర్, ఎం.మణిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డితోపాటు తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిని కోఛైర్మన్లుగా, 21 మందిని ఉపాధ్యక్షులుగా, నలుగురిని డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎన్నుకున్నారు.

కోదండరామ్‌కు ఘనంగా సన్మానం

ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆచార్య కోదండరాంను ఐకాస ప్రతినిధులు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు డీఏలను తక్షణం ఇవ్వాల్సిన అవసరముందని, దసరా పండగకు ప్రభుత్వం నుంచి ఉద్యోగులు, ఒప్పంద, పొరుగు సేవల సిబ్బందికి తీపి కబురు రావాలని ఆకాంక్షించారు.

రాజ్యసభకు ఆర్.కృష్ణయ్య రాజీనామా



ఈనాడు- అమరావతి, న్యూస్‌టుడే – కాచిగూడ: వైకాపాలో మూడో వికెట్ పడింది. ఆ పార్టీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఆర్.కృష్ణయ్య తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, వైకాపా అధినేత వైఎస్ జగన్‌లకు పంపారు. కృష్ణయ్య రాజీనామాను రాజ్యసభ ఛైర్మన్ ఆమోదించడంతో ఆయన స్థానం ఖాళీ అయినట్లు రాజ్యసభ సెక్రటరీ జనరల్ ప్రమోద్ చంద్ర మోదీ మంగళవారం బులెటిన్ విడుదల చేశారు. ఇప్పటికే మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. దీంతో మొత్తంగా రాజ్యసభలో వైకాపా మూడు స్థానాలను కోల్పోయింది.

రాజ్యసభలో మొత్తం 11 స్థానాలను కైవసం చేసుకున్న ఆరు నెలల్లోనే వైకాపా అడుగులు ‘రివర్స్’లో పడుతున్నాయి. 2019లో ఆ పార్టీ అధికారంలోకొచ్చాక 2020, 2022, 2024 ఫిబ్రవరిల్లో జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో కలిపి మొత్తం 11 స్థానాలను దక్కించుకుంది. అయితే మొన్నటి సాధారణ ఎన్నికల్లో వైకాపా ఘోర పరాభవం పాలయింది. ఆ తర్వాత 100 రోజుల్లోనే జగన్ పార్టీ రాజ్యసభలో మూడు స్థానాలను కోల్పోయింది. మరొకరు ఈ వారం, పది రోజుల్లో రాజీనామా చేసే అవకాశం ఉందంటున్నారు. వ్యాపార రంగం నుంచి వచ్చిన మరో ముగ్గురు సభ్యులు కూడా వైకాపాకు గుడ్‌బై చెప్పేందుకు సన్నద్ధమవుతున్నారని సమాచారం.

కులగణన ఉద్యమాన్ని బలోపేతం చేయడానికేనన్న కృష్ణయ్య

కుల గణన ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు ఆర్.కృష్ణయ్య మంగళవారం ప్రకటించారు. బీసీ ఉద్యమం గ్రామ స్థాయికి చేరిందన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల పెంపును సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీసీల డిమాండ్ల సాధనకు ఆందోళనను ఉద్ధృతం చేస్తామన్నారు.

హైదరాబాద్-తిరుపతి విమానంలో సాంకేతిక సమస్య

బయలుదేరిన కొద్దిసేపటికే శంషాబాద్‌లో అత్యవసర ల్యాండింగ్

ఈనాడు- హైదరాబాద్, శంషాబాద్- న్యూస్‌టుడే: హైదరాబాద్ నుంచి తిరుపతి బయల్దేరిన విమానం సాంకేతికలోపం కారణంగా తిరిగి శంషాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండైంది. మంగళవారం ఉదయం జరిగిన ఈ సంఘటన రెండు గంటలపాటు ఉత్కంఠ కలిగించింది. పైలట్ అప్రమత్తంగా వ్యవహరించి సురక్షితంగా విమానాన్ని దించడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విమానాశ్రయ అధికారులు, ప్రయాణికుల కథనం మేరకు.. అలయన్స్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం శంషాబాద్ విమానాశ్రయం నుంచి తిరుపతికి ఉదయం 6.35 గంటలకు 66 మంది ప్రయాణికులతో బయలుదేరింది. 30 నిమిషాలు ఆకాశంలో ప్రయాణించి.. ఉమ్మడి కడప జిల్లా ఒంటిమిట్ట పరిసర ప్రాంతానికి చేరుకున్న సమయంలో ఏసీ జనరేటర్‌లో సాంకేతికలోపం చోటుచేసుకుంది. దీన్ని గుర్తించిన పైలట్ వెంటనే శంషాబాద్ ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు. వారి సూచనల మేరకు వెనక్కి వచ్చిన ఆ విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. సాంకేతిక లోపాన్ని సరిచేసేందుకు ఇంజినీరింగ్ నిపుణులు యత్నించగా ఫలితం లేకపోయింది. అత్యవసరంగా వెళ్లాల్సిన ప్రయాణికులను మధ్యాహ్నం మరో విమానంలో తిరుపతికి పంపినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

హైదరాబాద్–అయోధ్య మధ్య ఇండిగో విమాన సర్వీసులు

శ్రీరాముడి జన్మస్థానమైన అయోధ్యకు హైదరాబాద్ నుంచి విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఈ నెల 27 నుంచే శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ ఈ సేవలను ప్రారంభించనుందని అధికారులు మంగళవారం తెలిపారు. అగర్తలకు వెళ్లే విమాన సర్వీసును సోమవారం, జమ్మూ వెళ్లే విమాన సర్వీసును మంగళవారం ప్రారంభించిన నేపథ్యంలో ఇండిగో ఎయిర్‌లైన్స్ అయోధ్యతో పాటు కాన్పూర్, ఆగ్రా, ప్రయాగ్‌రాజ్ నగరాలకు సంబంధించిన విమాన సర్వీసుల వివరాలను వెల్లడించింది.

పూర్తి వివరాలు www.eenadu.net లో..

రెండు వైపుల నుంచీ వాయుగుండాలు!

- తాడ్వాయి అడవుల్లో విధ్వంసానికి ప్రధాన కారణమిదే
- అటవీశాఖ వర్క్‌షాప్‌లో వాతావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు


వర్క్‌షాప్‌నకు హాజరైన పీసీసీఎఫ్ (హెచ్‌ఓఎఫ్‌ఎఫ్) ఆర్.ఎం.డోబ్రియాల్, పీసీసీఎఫ్ (కంపా) సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్‌లైఫ్) ఎలూసింగ్ మేరు

ఈనాడు, హైదరాబాద్: ములుగు జిల్లాలోని తాడ్వాయి, మేడారం, పస్రా అటవీప్రాంతాల్లో ఆగస్టు 31న జరిగిన విధ్వంసానికి కారణం అరేబియా, బంగాళాఖాతం సముద్రాల్లో ఒకే సమయంలో వాయుగుండాలు ఏర్పడటమేనని వాతావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. దీనివల్లే బలమైన గాలులు, ఒకేచోట కుండపోత వర్షం కురిసి విధ్వంసం జరిగిందని తెలిపారు. ఏటూరునాగారం వన్యప్రాణుల అభయారణ్యంలో జరిగిన ఘటనపై అటవీశాఖ.. అరణ్యభవన్‌లో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించింది. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ), నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ ల్యాబొరేటరీ (ఎన్‌ఏఆర్‌ఎల్), ఇండియా మీటియోరోలాజికల్ డిపార్ట్‌మెంట్ (ఐఎండీ), ఎన్ఐటీ వరంగల్, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్లు, వాతావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు, అటవీశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

130–140 కిమీ వేగంతో గాలులు

‘బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఒకేసారి వాయుగుండాలు ఏర్పడటంతో అట్నుంచి, ఇట్నుంచి గంటకు 130-140 కిలోమీటర్ల వేగంతో వీచిన బలమైన గాలులు తాడ్వాయి అటవీ ప్రాంతంలో ఎదురెదురుపడ్డాయి. అదే విధంగా బలమైన మేఘాలు ఈ ప్రాంతంలో కేంద్రీకృతమై భారీ వర్షం కురవడం జరిగింది. ఇక్కడున్న నేల అత్యంత సారవంతమైనది కావడంతో చెట్లు త్వరగా పెరిగి, వాటి వేళ్లు భూమిలోకి నిలువుగా కాకుండా అడ్డంగా పోవడం వల్ల భారీ సంఖ్యలో చెట్లు కూలిపోయాయి’ అని ఎన్‌ఆర్‌ఎస్‌సీ, ఎన్‌ఏఆర్‌ఏ శాస్త్రవేత్తలు అభిప్రాయపడ్డారు. ప్రభావిత ప్రాంతంలో దాదాపు 332 హెక్టార్లలో 30 వేల చెట్లు కూకటివేళ్లతో సహా కూలిపోయాయని, 20 వేలకుపైగా చెట్లు విరిగిపోయాయని ములుగు డీఎఫ్ఓ రాహుల్ కిషన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. చెట్లు కూలిన అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్, హెచ్‌ఓఎఫ్‌ఎఫ్) ఆర్ఎం డోబ్రియాల్ అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీ రమణ (ఎన్‌ఆర్‌ఎస్‌ఈ), డాక్టర్ అమిత్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ), ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ తన్వి అరోరాతో పాటు వీడియో కాన్ఫరెన్స్‌లో ఐఎండీ నుంచి డాక్టర్ నాగరత్నం, ఎన్జీఆర్ఐ నుంచి షకీల్ అహ్మద్ పాల్గొన్నారు. అటవీశాఖ నుంచి వైల్డ్‌లైఫ్ పీసీసీఎఫ్ ఎలూసింగ్ మేరు, ‘కంపా’ పీసీసీఎఫ్ సువర్ణ, అడ్మినిస్ట్రేషన్ పీసీసీఎఫ్ సునీతా భగవత్, ఇతర అటవీ అధికారులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

త్వరగా ఎన్‌రోల్‌మెంట్ తేదీని ఖరారు చేయండి

రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: న్యాయవాదులుగా ఎన్‌రోల్ చేసుకోవడానికి న్యాయశాస్త్రంలో పట్టా పొందిన అభ్యర్థులు సమర్పించిన దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిశీలించి ఎన్‌రోల్‌మెంట్ తేదీని ఖరారు చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఇటీవల హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జులై 31న రాసిన లేఖ ఆధారంగా ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను నిలిపివేస్తూ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆగస్టు 5న జారీ చేసిన సర్క్యులర్‌ను సవాలు చేస్తూ సికింద్రాబాద్‌కు చెందిన జి.రాధిక, మరికొందరు రెండు పిటిషన్‌లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 2024లో న్యాయశాస్త్రం పూర్తి చేసి ప్రొవిజనల్ సర్టిఫికెట్ పొందారని, ఎన్‌రోల్‌మెంట్‌కు వెళితే రాష్ట్ర బార్ కౌన్సిల్ తిరస్కరించిందన్నారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఓ కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం న్యాయవాదుల ఎన్‌రోల్‌మెంట్ చేసుకునే స్వేచ్ఛను రాష్ట్ర కౌన్సిళ్లకు కల్పిస్తూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆగస్టు 6న లేఖ రాసిందన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ప్రస్తుతం స్వీకరించిన దరఖాస్తులను సర్టిఫికెట్‌ల పరిశీలనకు యూనివర్సిటీలకు పంపామని, అవి వచ్చాక ఎన్‌రోల్‌మెంట్ తేదీని ఖరారు చేస్తామన్నారు. వాదనలను విన్న న్యాయమూర్తి వీలైనంత త్వరగా ఎన్‌రోల్‌మెంట్ తేదీని ఖరారు చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్‌ను ఆదేశిస్తూ పిటిషన్‌లపై విచారణను మూసివేసింది.

ఇక ఇంకుడుగుంతలు తప్పనిసరి!

ఉత్తర్వులు జారీచేసిన పట్టణాభివృద్ధిశాఖ

ఈనాడు, హైదరాబాద్: వాననీటిని ఒడిసిపట్టి... భూగర్భ జలాలను పెంపొందించేందుకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ నడుం బిగించింది. జీహెచ్‌ఎంసీ మినహా అన్ని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడు గుంతలు ఉండాలని ఆశాఖ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. దీనికి సంబంధించి రూపొందించిన విధివిధానాలను కూడా పొందుపరిచారు. భవనాల నిర్మాణాలకు అనుమతి ఇచ్చేటప్పుడే ఇంకుడుగుంత ఉండేలా ప్లాన్ చేయాలని నిర్దేశించింది. 300 చదరపు మీటర్లు మించి నిర్మించే భవనాలన్నిటిలో ఇంకుడు గుంతలు ఉండాలని... ఇప్పటికే ఉన్న భవనాల్లో కూడా ఉత్తర్వులు వెలువడిన ఏడాదిలోగా ఇంకుడు గుంతలు నిర్మించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మున్సిపాలిటీల పరిధిలోని విద్యాసంస్థలు, ఆసుపత్రుల వంటి ప్రభుత్వ విభాగాలతోపాటు ప్రైవేటు వాణిజ్య భవనాల్లోనూ ఏర్పాటు చేయాలన్నారు. ఆక్యుపెన్సీ కమ్ కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు కూడా ఇంకుడు గుంత నిర్మించారో, లేదో పరిశీలించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడుగుంతల ఏర్పాటు బాధ్యతలను టౌన్‌ప్లానింగ్‌కు అప్పగించాలని వివరించారు. అలానే ఇంకుడుగుంతల నిర్మాణానికి సంబంధించి ప్రజల్లో చైతన్యం తెచ్చే బాధ్యత మున్సిపల్ కమిషనర్లదేనని స్పష్టంచేశారు. ఇంకుడుగుంతలు నిర్మించకపోయినా, నిర్మించినవి పాడైపోయినా బాధ్యుల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏలలో 90 శాతం సీట్లు భర్తీ

ఈనాడు, హైదరాబాద్: ఐసెట్ చివరి విడత నాటికి కన్వీనర్ కోటాలోని ఎంబీఏ, ఎంసీఏ సీట్లలో 90.20 శాతం భర్తీ అయ్యాయి. చివరి విడత సీట్లను మంగళవారం కేటాయించారు. ఎంబీఏలో 28,345కు 25,747, ఎంసీఏలో 6,966కు 6,095 సీట్లు భర్తీ అయ్యాయని ప్రవేశాల కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన తెలిపారు. సీట్లు పొందినవారు ఈనెల 27లోపు ఫీజు చెల్లించి.. 28లోగా ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడమే కాకుండా కళాశాలల్లో హాజరవ్వాలని సూచించారు. చేరేందుకు ఆసక్తి లేనివారు 27లోపు ఆన్‌లైన్ ద్వారా సీట్లు రద్దు చేసుకోవచ్చన్నారు.

సాగు వ్యయంపై విస్తృత సర్వే

నమూనా గ్రామాల సంఖ్య రెట్టింపు ● ఖర్చుతోపాటు మూడేళ్ల దిగుబడుల వివరాలూ సేకరణ

● వీటి ఆధారంగానే ఎగుమతులు, దిగుమతులపైనా నిర్ణయాలు



వాతావరణంలో అసాధారణ మార్పుల కారణంగా పంటల దిగుబడుల అంచనాలు తలకిందులు అవుతున్నాయి. దాంతో పంటల సాగుకు, మద్దతు ధరలకు మధ్య పొంతన కుదరడంలేదు. తుపాన్లు, కరవుల సమయంలో పంట నష్ట పరిహారం చెల్లింపులూ రైతుల అవసరాలను తీర్చడంలేదు. విదేశాలకు ఎగుమతి చేయాల్సిన, అక్కడి నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పంటల దిగుబడులపైనా స్పష్టత ఉండటంలేదు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న పంట వ్యయాల సర్వేకు ఈసారి దిగుబడుల అంచనాలను జోడించింది. సర్వే నిర్వహించే గ్రామాలు, నమూనాల సంఖ్యనూ పెంచింది. ఇవీ వివరాలు...

జాతీయ వ్యవసాయ, వ్యయ ధరల కమిషన్(సీఏసీపీ)... 1970-71 నుంచి ప్రతీయేటా రాష్ట్రాల వారీగా విశ్వవిద్యాలయాలు, ఇతర ప్రభుత్వ యంత్రాంగాల్లోని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో అన్ని పంటల సాగు వ్యయంపై సర్వే చేయించి, వాటి నివేదికల ఆధారంగా మద్దతు ధరల(ఎంఎస్‌పీ)పై నిర్ణయం తీసుకుంటోంది. తెలంగాణలో వరి, పత్తి, మొక్కజొన్న, శనగ, మిర్చి, కందులు, వేరుశనగ, నువ్వులు, సోయాబీన్ పంటల సాగు ఖర్చులపై రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సర్వే బాధ్యతలు నిర్వహిస్తోంది. ఇప్పటికే 26 నమూనా మండలాల్లో ఒక్కో గ్రామంలో 10 మంది చొప్పున మొత్తం 260 మంది రైతులను ఎంపిక చేసి అధ్యయనం చేశారు. ఈ సర్వేలో లోపాలు ఉండడంతో దీని పరిధిని మరింత విస్తరించాలని నిర్ణయించారు. గతంలో 26 మండలాల్లోని ఒక్కో గ్రామం ఎంపిక చేయగా... ఇకపై రెండేసి గ్రామాల్లో అంటే మొత్తం 52 గ్రామాల్లో సర్వే జరుగుతుంది. ఒక్కో గ్రామంలో ఆరుగురు రైతుల చొప్పున మొత్తం 312 మందితో అధ్యయం చేస్తారు.

దిగుబడుల హెచ్చుతగ్గులపైనా సర్వే

గతంలో సర్వే పంటల సాగు వ్యయాలకే పరిమితమయ్యేది. ఇకపై కృషి పరపేరక్ష సర్వే (కేపీఎస్) విధానంలో పంటల దిగుబడుల హెచ్చుతగ్గులను సైతం అంచనా వేయాలని కేంద్రం నిర్ణయించింది. క్షేత్ర స్థాయి సిబ్బంది... ఎంపిక చేసిన రైతులు వేసిన పంటల దిగుబడుల్లో హెచ్చు, తగ్గుల వివరాలను సేకరిస్తారు. గత రెండు, మూడేళ్లతోపాటు ప్రస్తుత సంవత్సర ంపంటల దిగుబడి ఎలా ఉందో తెలుసుకుంటారు. ఈ నివేదికలను క్రోడీకరించి... దేశ వ్యాప్తంగా ఆయా పంటల దిగుబడులు పెరిగితే కేంద్ర ప్రభుత్వం వాటి ఎగుమతులకు అవకాశం కల్పిస్తుంది. తగ్గితే ఎగుమతులను నిషేధిస్తుంది.

ఎం-ట్రాకర్‌తో నిరంతర నిఘా

గతంలో సర్వే చేస్తున్న వారిపై నిఘా ఉండేది కాదు. ఇకపై ఎం-ట్రాకర్ పేరిట అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వారి సర్వేను పర్యవేక్షించనున్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది... తాము రైతులతో మాట్లాడి వివరాలను వెబ్ ఆధారిత సిస్టమ్ ద్వారా ఫార్మాప్ (ఫార్మర్ ఎనాలసిస్ ప్యాకేజీ) 2.0లో నమోదు చేస్తున్న వీడియోలను ఆన్‌లైన్‌లో హైదరాబాద్‌కు పంపించాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లోని పర్యవేక్షక అధికారులు సైతం సంబంధిత రైతులతోనూ మాట్లాడి నిర్ధారించుకుంటారు.

మూడేళ్లపాటు 26 మండలాల్లో సర్వే

తెలంగాణలో 2026 సంవత్సరం వరకు

- **జోన్-1** ఉత్తర తెలంగాణలో తాంసి, సిర్పూర్(యు), కొడిమ్యాల, బోయిన్‌పల్లి, బీర్కూరు, భిక్కనూరు, మాచారెడ్డి, జక్రాన్‌పల్లి.
- **జోన్-2** సెంట్రల్ తెలంగాణలో జహీరాబాద్, పుల్కల్, కోహీర్, నిజాంపేట, నర్మెట్ట, ముదిగొండ, కేసముద్రం, అశ్వారావుపేట.
- **జోన్-3** దక్షిణ తెలంగాణలో వనపర్తి, వీపనగండ్ల, గద్వాల, పెద్దపూర, మాడుగులపల్లి, నడిగూడెం, మట్టంపల్లి, కొల్లాపూర్, యాచారం, షాబాద్ గ్రామాలను సర్వేకు ఎంపిక చేశారు.

- ఈనాడు, హైదరాబాద్

సాగర్ ఎడమ కాల్వ పరిధిలో నేడు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- రేపు 1,800 మంది లస్కర్లను నియమించనున్నట్లు వెల్లడి
- కాల్వ మరమ్మతులను పరిశీలించిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి



సూర్యాపేట జిల్లా కాగితరామచంద్రాపురం వద్ద గండి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ✦ ఖమ్మం జిల్లా పాలేరు సమీపంలో కాల్వ గండి పూడ్చిన ప్రదేశంలో నీటి ప్రవాహం తీరును పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

నడిగూడెం, కూసుమంచి, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో ఇటీవలి వర్షాలు, వరదలకు దెబ్బతిన్న సాగర్ ఎడమ కాల్వ మరమ్మతు పనులను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు మంగళవారం వేర్వేరుగా పరిశీలించారు. సాగర్ ఎడమ కాల్వ పరిధిలో ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాల్లోని అన్ని మేజర్ కాల్వలకు బుధవారం పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయనున్నట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద ఎడమ కాల్వకు గండిపడిన ప్రదేశంలో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షం, వరదల వల్ల కాల్వకు పలుచోట్ల గండ్లు పడటంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టామని మంత్రి తెలిపారు. ఆయకట్టు పరిధిలోని రైతులకు నష్టం వాటిల్లకుండా కాల్వలకు నీరు విడుదల చేస్తున్నామన్నారు. గురువారం నీటిపారుదల శాఖలో 1,800 మంది లస్కర్లను నియమించనున్నట్లు చెప్పారు. కాగితరామచంద్రాపురం పరిధిలో సాగునీరు అందడం లేదని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రంగుల వారధి సమీపంలో జరుగుతున్న మరమ్మతు పనుల గురించి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఉత్తమ్ ఫోన్‌లో మాట్లాడారు.

మరమ్మతుల్లో జాప్యంపై ఉత్తమ్ ఆగ్రహం..

ఖమ్మం జిల్లా పరిధిలో పాలేరు జలాశయానికి ఎగువన నాగార్జునసాగర్ ఎడమ ప్రధాన కాల్వ అక్విడక్ట్‌కు (133.5 కి.మీ వద్ద) పడిన గండి పూడ్చివేత పనుల్లో జాప్యం జరుగుతోందని రైతులు ఫిర్యాదు చేయడంతో పనులను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. అక్విడక్ట్ వద్ద నీటి ప్రవాహ ఉద్ధృతికి రాతిగోడ కూలిపోగా ఆ స్థానంలో కాంక్రీటు గోడ నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతోందని జలవనరుల శాఖ సీఈ విద్యాసాగర్‌పై ఉత్తమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ జరిగిన నష్టాన్ని, చేపట్టిన పనుల వివరాలను అధికారి వివరించగా.. మంత్రి సంతృప్తి చెందలేదు. 'మీపై ఎందుకు చర్యలు తీసుకోవద్ద'ని ప్రశ్నించారు. బుధవారంలోగా పూర్తి చేయించాలని సీఈని ఆదేశించారు. మంత్రితోపాటు కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, సీఈ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

నీటి విడుదలలో జాప్యానికి చింతిస్తున్నా: పొంగులేటి

ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టు రైతులకు నీటి విడుదలలో ఆలస్యానికి.. రైతుగా చింతిస్తున్నానని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కూసుమంచి మండలం పాలేరు సమీపంలో వరదలకు దెబ్బతిన్న సాగర్ ఎడమ కాల్వ యూటీని తొలగించి, కట్ట గండ్లను పూడ్చిన అనంతరం అధికారులు మంగళవారం ఉదయం నీటిని విడుదల చేశారు. గండి పూడ్చిన ప్రదేశంలో నీటి ప్రవాహాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ టన్నెల్ కట్టడం గోడలు కూలిపోవడంతో నీరందించడంలో మూడు, నాలుగు రోజులు ఆలస్యమైందన్నారు. బుధవారం ఉదయానికి నీటి విడుదలను 3200 క్యూసెక్కులకు పెంచుతామని, ప్రతి ఎకరాకు నీరందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో వరదల కారణంగా దెబ్బతిన్న రైతులకు రెండు, మూడు రోజుల్లో నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. సకాలంలో నీరందక ఎండిపోయిన పంటలకు పరిహారం ఇచ్చే విషయమై మంత్రిని విలేకరులు ప్రశ్నించగా పరిశీలిస్తున్నామని చెప్పారు. మంత్రి వెంట సత్తుపలి ఎమ్మెల్యే మట్టా రాగమయి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీఈ విద్యాసాగర్ ఉన్నారు.

త్వరలోనే నామినేటెడ్ పదవుల భర్తీ

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కోదండరాం

హైదరాబాద్, న్యూస్‌టుడే: త్వరలోనే రాష్ట్ర, జిల్లాస్థాయి నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని, కష్టపడ్డ వారికి గుర్తింపు దక్కుతుందని పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు పార్టీ గెలిచేలా శ్రేణులు కృషి చేయాలన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్ జిల్లా నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు హైదరాబాద్ వచ్చారు. హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మహేశ్‌ కుమార్‌గౌడ్‌ను కలిసి సన్మానించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పునర్వైభవం తీసుకువస్తామని ఆయన పేర్కొన్నారు. మహేశ్‌కుమార్ గౌడ్‌ను తెలంగాణ జన సమితి పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం మంగళవారం గాంధీభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీ అధ్యక్షుడిగా నియమితులైనందుకు అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు.

స్టాండింగ్ కౌన్సిళ్లను నియమించండి

సీఎంకు టీపీసీసీ లీగల్‌సెల్ ఛైర్మన్ లేఖ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థల స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతూ టీపీసీసీ లీగల్ సెల్ ఛైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ మంగళవారం లేఖ రాశారు. గత భారాస ప్రభుత్వంలో నియమితులైన వారే స్టాండింగ్ కౌన్సిళ్లుగా ఉన్నారని, కాంగ్రెస్ పార్టీకి చెందిన న్యాయవాదులకు అవకాశం కల్పించాలని కోరారు.

భారాస ఎమ్మెల్యేలు మోసం చేశారని కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదం: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, న్యూస్‌టుడే: పదేళ్లలో విచ్చలవిడిగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ఇప్పుడు తమ ఎమ్మెల్యేలు మోసం చేశారని కేటీఆర్ మాట్లాడటం హాస్యాస్పదమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. 60 మందికి పైగా ప్రతిపక్ష ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను, ఎంపీలను భారాసలో చేర్చుకున్నవారికి ఇప్పుడు ఫిరాయింపుల గురించి మాట్లాడే అర్హత ఉందా అని ప్రశ్నించారు. 'ఆనాడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు ప్రగతిభవన్‌లో గులాబీ కండువా కప్పిందెవరు? వారి ఇళ్లకు వెళ్లి ప్రలోభపెట్టి, బెదిరించి చేర్చుకున్నదెవరు' అని నిలదీశారు. కోర్టు పరిధిలో ఉన్న ఫిరాయింపుల అంశంపై ఉప ఎన్నికలు వస్తాయంటూ పదే పదే ఎందుకు మాట్లాడుతున్నారని కేటీఆర్‌ను ప్రశ్నించారు.

అమృత్ టెండర్లపై కేటీఆర్‌కు తప్పుడు సమాచారం

భారాస మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: అమృత్ పథకం టెండర్ల గురించి కేటీఆర్‌కు ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చినట్లున్నారని భారాస మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి స్పష్టంచేశారు. దీనిపై కేటీఆర్‌తో మాట్లాడతానని, ఆయన ఇంకా అందుబాటులోకి రాలేదన్నారు. ఉపేందర్‌రెడ్డి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'అమృత్ టెండర్లు రేవంత్‌రెడ్డి బావమరిది సృజన్‌రెడ్డికి దక్కాయని కేటీఆర్ చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదు. సృజన్‌రెడ్డి నా అల్లుడు. రేవంత్‌రెడ్డికి సొంత బావమరిది కాదు. టెండర్లతో సీఎంకు ఎలాంటి సంబంధం లేదు. శోధ కంపెనీలో నా కుమార్తె డైరెక్టర్. అమృత్ టెండర్లలో శోధ కంపెనీకి 29% వాటా ఉంది. టెండర్ విలువ రూ.8 వేల కోట్లు కాదు. టెండర్లను వివాదం చేయడం సరికాదు. ఇందులోకి మమ్మల్ని లాగి ఇబ్బంది పెట్టొద్దు' అని కేటీఆర్‌ను కోరారు. మంత్రి పొంగులేటి ఇంట్లో జరిగే శుభకార్యాలకు తానూ వెళ్తానని.. రాజకీయాన్ని, వ్యాపారాన్ని వేర్వేరుగా చూడాలన్నారు. తాను చెడ్డవాణ్నని ఒక్కరైనా అంటే రాజకీయాల నుంచి తప్పుకొంటానని ఆయన పేర్కొన్నారు. కాగా, నిబంధనల ప్రకారమే ఆన్‌లైన్ ద్వారా టెండర్ దక్కిందని సృజన్‌రెడ్డి తండ్రి మనోహర్‌రెడ్డి తెలిపారు.

సీఎం అన్నకో న్యాయం.. గరీబోళ్లకో న్యాయమా?

- దమ్ముంటే పట్నం, పొంగులేటి అక్రమ నివాసాలను కూల్చాలి
- భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



తెలంగాణభవన్‌లో కేటీఆర్‌తో సమావేశమైన భారాస బీసీ నేతలు శ్రీనివాస్‌గౌడ్, మధుసూదనాచారి, రవిచంద్ర తదితరులు

ఈనాడు, హైదరాబాద్: 'అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదన్న కోపంతోనే నగర ప్రజలపై సీఎం రేవంత్‌రెడ్డి పగబట్టారు. పేదలకో న్యాయం.. సీఎం అన్న అనుముల తిరుపతిరెడ్డికో న్యాయమా? ఆయన్ని హైడ్రా ఎందుకు వదిలిపెడుతోంది' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణభవన్‌లో మంగళవారం నిర్వహించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 'సీఎం అన్నదమ్ములు ఏడుగురు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. మాదాపూర్ అయ్యప్ప సొసైటీలో తిరుపతిరెడ్డి కమీషన్ల దుకాణం తెరిచారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యేనే చెప్పారు. వీరి వ్యవహారంతోనే రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ పడిపోయింది. సర్కారుకు దమ్ముంటే మంత్రి పొంగులేటి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు, ఎంపీల అక్రమ నిర్మాణాలను కూలగొట్టాలి. పేదల ఇళ్లను కూల్చేస్తామంటే భారాస ఊరుకోదు. వారికండగా త్వరలో నగర ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తాం. సినీనటుడు నాగార్జునకు సంబంధించిన నిర్మాణాన్ని కూల్చడం మంచిదే.. దానికి అనుమతిచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం' అని తెలిపారు.

మీలో నుంచే ఒకరు ఎమ్మెల్యేగా...

శేరిలింగంపల్లి కార్యకర్తలు బాధపడాల్సిన అవసరం లేదని, ఉప ఎన్నికల్లో వారిలో నుంచే ఒకరు కొత్త ఎమ్మెల్యేగా ఎన్నికవుతారని కేటీఆర్ భరోసా ఇచ్చారు. 'త్వరలోనే కొత్త కమిటీలు వేసుకుందాం. ఏం తక్కువ చేసిందని గాంధీ పార్టీ మారారు. మొన్నటి హైకోర్టు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో వణుకు మొదలైంది' అని అన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు సబిత, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు మాగంటి గోపినాథ్, మాధవరం కృష్ణారావు, పార్టీ నేత కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

తమిళనాడులో బీసీ పథకాల అధ్యయనానికి భారాస బృందం

తమిళనాడులో బీసీల సంక్షేమానికి అమలవుతున్న పథకాలు, కార్యక్రమాల అధ్యయనానికి భారాస బీసీ నేతల బృందాన్ని పంపాలని నిర్ణయించినట్లు కేటీఆర్ తెలిపారు. వారిచ్చే నివేదిక ఆధారంగా తమిళనాడు తరహాలో తెలంగాణలో బీసీల సమస్యల పరిష్కారానికి, పథకాల అధ్యయనానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మంగళవారం ఆయన తెలంగాణభవన్‌లో భారాస బీసీ నేతలతో సమావేశమయ్యారు. పార్లమెంటరీ పార్టీ ఉపనేత వద్దిరాజు రవిచంద్ర, శాసనమండలిలో విపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, బూడిద భిక్షమయ్యగౌడ్, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యులు జూలూరు గౌరీశంకర్, ఆంజనేయులుగౌడ్, శుభప్రద పటేల్, ఉపేంద్రాచారి, కిశోర్ గౌడ్ పాల్గొన్నారు. తమిళనాడులో సమగ్ర అధ్యయనం చేసి నివేదిక రూపొందించాలని నాయకులకు కేటీఆర్ సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో వైఫల్యాలను ఎండగట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

కాంగ్రెస్‌తో మీది అజబ్ ప్రేమ్‌కీ గజబ్ కహానీ

అమృత్ పథకంలో అవినీతిని ఆధారాలు సహా తాము బయటపెట్టినా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చిల్లరమాటలు మాట్లాడుతున్నారని. కాంగ్రెస్‌తో భాజపా.. అజబ్ ప్రేమ్‌కీ గజబ్ కహానీ(వింత ప్రేమకు సంబంధించిన విచిత్ర కథ)ని అందరూ గమనిస్తూనే ఉన్నారని కేటీఆర్ మంగళవారం 'ఎక్స్' వేదికగా ధ్వజమెత్తారు. వాస్తవానికి అమృత్ కేంద్ర పథకమని, అందులో అవినీతి జరిగిందని ముందుగా చెప్పింది స్వయానా భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అని, దాన్ని సంజయ్ పట్టించుకోలేదన్నారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ స్వయం ప్రతిపత్తి గల సంస్థ అని దానికి తాను సిఫార్సు చేస్తానని సంజయ్ అనడం విడ్డూరంగా ఉందని తెలిపారు.

బీసీ రిజర్వేషన్ల సాధనకు ఉద్యమ పంథా మార్చాలి: ఆర్.కృష్ణయ్య

సోమాజిగూడ, న్యూస్‌టుడే: జాతీయస్థాయిలో బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు సాధించేందుకు ఉద్యమ పంథా మార్చుకోవాలని, అది మిలిటెంట్ తరహా ఉద్యమంలా ఉండాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. కులగణన కేవలం బీసీలకు మాత్రమే కాదు అన్ని కులాల లెక్కలు తేల్చాలన్నారు. 28న తెలంగాణ బీసీ మహాసభ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించే బీసీ మహాధర్నా కరపత్రం, జెండా మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యమ సెగ దిల్లీకి తాకాలన్నారు. స్థానిక సంస్థల్లో 42% రిజర్వేషన్లకు గ్రామగ్రామాన టెంట్లు వేసి ఉద్యమం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. భారాస నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. హైడ్రా కూల్చివేతలతో పేదల బతుకులు శిథిలం అవుతున్నాయని పేర్కొన్నారు. కామారెడ్డి వేదికగా బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. తెలంగాణ బీసీ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కరీంనగర్ జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ తుల ఉమ, భారాస నాయకుడు డా.దూదిమెట్ల బాలరాజు, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు పిడికిలి రాజన్న, తదితరులు మాట్లాడారు.



అన్నింటికంటే చెత్త జైలు ఇదే!

ఈ ప్రపంచంలో అన్నింటికంటే చెత్త జైలు ఏంటో తెలుసా..? 'నేను చేయలేనేమో' అనే భావన! ప్రతిభ, మేధో సామర్థ్యం ఎంతగా ఉన్నప్పటికీ.. ఏదైనా గొప్ప పనిని మొదలుపెట్టే ధైర్యం లేకపోతే జీవితంలో ఎదగలేం. అనుమానాలను పక్కనపెట్టి సంపూర్ణ విశ్వాసంతో ముందడుగు వేయండి.

– సాహిల్ బ్లూమ్, రచయిత

హామీల అమలుకు డిమాండ్.. 30న రైతుదీక్ష

- భాజపా శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి



ఈనాడు, హైదరాబాద్: అన్నదాతలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 30న భాజపా ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద 24 గంటల రైతు దీక్ష చేపట్టనున్నట్లు భాజపా శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యే రామారావు పటేల్, మాజీ ఎంపీ రాములు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డితో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 30న ఉదయం 11 గంటల నుంచి 24 గంటల పాటు చేపట్టే దీక్షలో భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్.. అసెంబ్లీలో కనీసం చర్చకు పెట్టలేదన్నారు. రైతు రుణమాఫీ కోసం రూ.40 వేల కోట్లు అవసరం కాగా క్యాబినెట్ సమావేశంలో రూ.30 వేల కోట్లకు ఆమోదం తెలిపి.. రూ.17 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు. రైతు భరోసా కింద రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి.. ఇప్పుడు ఆ మాటే ఎత్తడం లేదని, రైతుకూలీలకు రూ.12 వేలు ఇవ్వడం లేదన్నారు.

ఇకపై తెలంగాణలో మావోయిస్టులకు పట్టు కష్టం

- రెడ్‌కార్నర్ నోటీసు జారీ సుదీర్ఘ ప్రక్రియ
- డీజీపీ డా.జితేందర్ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్. చిత్రంలో ఐజీలు రమేశ్, చంద్రశేఖర్‌రెడ్డి, అదనపు డీజీపీ మహేశ్ భగవత్, ఐజీ సత్యనారాయణ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో మావోయిస్టులకు ఇకపై పట్టు దొరకడం కష్టమని డీజీపీ డా.జితేందర్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆ పార్టీ నాయకత్వమంతా ఛత్తీస్‌గఢ్‌కే పరిమితమైందని, ఇటువైపు రావడానికి ప్రయత్నించినప్పుడల్లా వారికి పోలీసుల చేతిలో ఎదురుదెబ్బలు తప్పడం లేదన్నారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అదనపు డీజీపీ(శాంతి భద్రతలు) మహేశ్ భగవత్, ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, సత్యనారాయణ, ఎం.రమేశ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. 'ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితులపై రెడ్‌కార్నర్ నోటీసు జారీ అనేది సుదీర్ఘ ప్రక్రియ. ఇప్పటికే తమ నివేదికను సీబీఐ ఆమోదించి ఇంటర్‌పోల్‌కు పంపింది. ఇటీవల కుమురం భీం జిల్లా జైనూర్‌లో మత ఘర్షణలు చోటు చేసుకోవడం దురదృష్టకరం. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతోంది. హ్యాకింగ్‌కు గురైన అనంతరం పోలీసుశాఖ వెబ్‌సైట్‌లను పునరుద్ధరించడంపై దృష్టి సారించాం. త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తాం. రాష్ట్రంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియతోపాటు మిలాద్-ఉన్-నబీ ర్యాలీలు ప్రశాంతంగా ముగిశాయి. 5,879 ప్రాంతాల్లో 1,36,638 విగ్రహాల నిమజ్జనం జరిగింది. మిలాద్-ఉన్-నబీ సందర్భంగా 330 ర్యాలీలు జరిగాయి. ఒక్క నారాయణపేట పట్టణంలోనే రెండు వర్గాల మధ్య జెండా విషయంలో చిన్నపాటి వివాదం చెలరేగగా వెంటనే రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చాం' అని వివరించారు.

ఆన్‌లైన్ పోర్టల్‌లో 'బీఎఫ్ఎస్ఐ' విద్యార్థుల జాబితా

నేడు నైపుణ్య శిక్షణ కోర్సుకు సీఎం శ్రీకారం

ఈనాడు, హైదరాబాద్: బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ)లో శిక్షణ పొందిన డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థుల జాబితాను రాష్ట్ర ఉన్నత విద్యామండలి కంపెనీల కోసం ఆన్‌లైన్‌లో ఉంచనుంది. అందుకు ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించనుంది. శిక్షణ పొందిన వారికి, పరిశ్రమలకు ఈ పోర్టల్ వారధిగా నిలుస్తుంది. అందులో వారి బయోడేటా తదితర వివరాలను పొందుపరుస్తుంది. ఆయా కంపెనీలు వీడియో కాల్ చేసి వారిని ఎంపిక చేసుకోవచ్చు. ఈ నైపుణ్య శిక్షణ కోర్సుకు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం శ్రీకారం చుట్టనున్నారు. మొత్తం 10 వేల మందికి బీఎఫ్ఎస్ఐలో రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా శిక్షణ అందించనుంది. ఇందుకోసం 18 ఇంజినీరింగ్, 20 డిగ్రీ కళాశాలలను ఎంపిక చేశారు.

ఇంజినీరింగ్ కళాశాలలు: బీవీఆర్ఐటీ మహిళా, నారాయణమ్మ, గోకరాజు, జేబీ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, జేఎన్‌టీయూహెచ్ ప్రధాన క్యాంపస్, కేఎంఐటీ, ఎంజీఐటీ, వర్ధమాన్, వీఎన్ఆర్, కిట్స్, సీబీఐటీ, మాతృశ్రీ, ఎంవీఎస్ఆర్, మెథడిస్ట్, స్టాన్లీ, ఓయూ క్యాంపస్, ఆర్జీయూకేటీ బాసర, బీవీఆర్ఐటీ(నర్సాపూర్).

డిగ్రీ కళాశాలలు: పింగిళి(హనుమకొండ), ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్(ఖమ్మం), నాగార్జున(నల్గొండ), భవన్(హైదరాబాద్), సిటీ కాలేజీ, బేగంపేట మహిళా, ఖైరతాబాద్ ప్రభుత్వ, ఇందిరా ప్రియదర్శిని(నాంపల్లి), నిజాం కాలేజ్, ఆర్‌బీవీఆర్ఆర్(హైదరాబాద్), సెయింట్ ఆన్స్(మెహిదీపట్నం), సెయింట్ ఫ్రాన్సిస్(బేగంపేట), సెయింట్ పియూస్ (నాచారం), తారా(సంగారెడ్డి), ఎస్ఆర్ఆర్(కరీంనగర్), మహిళా విశ్వవిద్యాలయం, గిరిరాజ్(నిజామాబాద్), ఆంధ్రమహిళా సభ (హైదరాబాద్), డిగ్రీ కాలేజి (సిద్దిపేట), ఎం.వి.ఎస్.డిగ్రీ కళాశాల(మహబూబ్‌నగర్)



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు

ఆర్ఆర్ఆర్ బాధిత రైతులకు అండగా భారాస

- మాజీ మంత్రి హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్(ఆర్ఆర్ఆర్) బాధిత రైతులకు భారాస అండగా ఉంటుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం దిగి రాకపోతే బాధితుల పక్షాన పోరాడతామని తెలిపారు. ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు మంగళవారం హైదరాబాద్‌లో హరీశ్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. తమకు నష్టం జరగనీయబోమని భువనగిరి ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో చెప్పించి అధికారంలోకి వచ్చాక మాట మార్చారని అన్నారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ..'ఉత్తర భాగం ఆర్ఆర్ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని ప్రియాంకా గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్ రెడ్డి, రాజగోపాల్‌రెడ్డిలను భారాస పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఉత్తర భాగంలో 40 కి.మీ.కు బదులుగా 28 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకొని జంక్షన్ ఏర్పాటు చేయడం వల్ల చౌటుప్పల్ మున్సిపాలిటీ, మండల రైతులు నష్టపోతున్నారు. చౌటుప్పల్ వద్ద జంక్షన్ రింగు గతంలో 78 ఎకరాల్లో ఉంటే ఇప్పుడు 184కు పెంచడంతో పేదలు భూములు, ప్లాట్లు కోల్పోతున్నారు. దీనికి తక్కువ నష్టపరిహారం చెల్లిస్తున్నారు. గతంలో ఎంపీగా ఉన్నపుడు కోమటిరెడ్డి రాయగిరి, చౌటుప్పల్ రైతులతో కలిసి ధర్నాలు చేశారు. ఇప్పుడేమో నిర్బంధంగా రోడ్డుకు 28 కి.మీ. పరిధిలోనే సర్వే చేయించి, ఒప్పంద పత్రాల మీద సంతకాలు పెట్టాలని బలవంతపెట్టడం దుర్మార్గం' అని హరీశ్‌రావు తెలిపారు.

వరద విలయంలో.. దాతృత్వపు వెలుగులు


పి.వి.మనోహర్‌రావు, హైదరాబాద్
విరాళం: రూ.1,00,000


బత్తిని వెంకట రమణమ్మ, పొందూరు, ప్రకాశం జిల్లా
విరాళం: రూ.1,00,000

కుటీర పరిశ్రమలు, బడ్డీ కొట్లు, చక్రాల బండ్లు, ఇళ్లు, వీధులు.. అన్నీ ఒక్క వరదతో తుడిచి పెట్టుకుపోయాయి. అక్కడక్కడ అయిన వారూ గల్లంతై.. బాధితులంతా బిక్కుబిక్కుమంటున్నారు. వరద పెట్టిన కోత ప్రభావం అక్కడి ప్రజలను ఇంకా వదల్లేదు. ముఖ్యంగా బుడమేరు చేసిన గాయాలు విజయవాడలోని చాలా కుటుంబాలను కోలుకోలేనంతగా పీడిస్తున్నాయి. ఆ గాయాలను మాన్పించి.. అక్కడి వారినీ ఉషోదయం వైపు నడిపించేందుకు చేపట్టిన యజ్ఞంలో ముందుకొస్తున్న మనసున్న మారాజులు ఎందరో..

తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితులకు అండగా నిలిచేందుకు రామోజీ గ్రూపు తరఫున రూ.5 కోట్లతో ఏర్పాటు చేసిన 'ఈనాడు సహాయనిధి'కి ఉదారంగా విరాళాలు ఇస్తున్న దాతలకు కృతజ్ఞతలు. ఈనాడు పిలుపు అందుకొని స్పందిస్తున్న సహృదయుల వివరాలు..

ఈనాడు సహాయనిధికి విరాళాలిచ్చిన దాతలు

వ్యక్తులు / సంస్థలు	సాయం (రూ.లలో)
జి.సాంబశివరావు అండ్ కో (చార్టర్డ్ అకౌంటెంట్స్), హైదరాబాద్	51,000
నూతక్కి వెంకటప్పయ్య (జైహింద్‌బాబు), తాడేపల్లి, గుంటూరు జిల్లా	50,000
పైడా వెంకట పవన్ కుమార్, బెంగళూరు	25,001
తాడేపల్లి శివరామ్, బెంగళూరు	25,000
శ్రీ వెంకటేశ్వర జ్యుయలరీ, తిరుపతి	25,000
యలమంచిలి విజయలక్ష్మి, విజయవాడ	15,000
వెల్లంకి మైథిలి, విజయవాడ	15,000
జి.రవిచంద్ర, విజయవాడ	12,066
సేఫ్టీ టూల్స్, విశాఖపట్నం	11,000
నిమ్మగడ్డ వెంకట రామాంజనేయ జ్యోతికుమార్, ఆయిజోల్, మణిపూర్	10,116
విక్రం పర్వతనేని, విశాఖపట్నం	10,116
శ్రీ పాలమూరు స్టీల్ ట్రేడర్స్, మహబూబ్‌నగర్	10,000
గొల్ల బుద్దన్నగారి లక్ష్మమ్మ-ఉదయ్‌కుమార్ మెమోరియల్ ట్రస్టు, బురాన్‌దొడ్డి, కర్నూలు జిల్లా	5,116
ఊటుకూరి ఆంజనేయులు, విజయనగరం	5,116
షేక్ సుమైయా, నెల్లూరు	5,116
పూసల మణిప్రసాద్, యద్దనపూడి	5,106
కుడిపూడి విజయ్‌కుమార్, హైదరాబాద్	5,016
పావూరి వెంకటేశ్వర్లు నాయుడు, హైదరాబాద్	5,011
పూడి మునికుమార్, శ్రీకాళహస్తి	5,002
గడ్డం జయ, మహబూబాబాద్	5,000
వై.సుభాష్‌చంద్రబోస్, చెన్నై	5,000
జి.రజిత అండ్ శ్రీనాథ్, హైదరాబాద్	5,000
ఎం.సుబ్బలక్ష్మమ్మ, బెంగళూరు	5,000

సాయం అందిద్దాం గాయం మాన్పుదాం

RAMOJI GROUP

విరాళాలు పంపవలసిన ఎకౌంట్ వివరాలు

ఈనాడు రిలీఫ్ ఫండ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సైఫాబాద్ బ్రాంచి, SB A/C No: 370602010006658 IFSC: UBIN0537063

దాతలకు ముఖ్య సూచన: మీరిచ్చే విరాళాలకు రసీదులు పొందేందుకు ఈ వివరాలు పంపవలసిందిగా మనవి. 1. దాత పేరు 2. పూర్తి చిరునామా 3. పాన్‌కార్డు నంబరు.

- ఈ వివరాలను 9154990933 నంబరుకు లేదా relieffund@eenadu.in ఈ మెయిల్ ఐడీకి పంపగలరు.

మీకు ఏ కష్టం కావాలి?



రోజూ వ్యాయామం చేయడం కష్టమే. కానీ బలహీనంగా ఉండటం అంతకంటే ఎక్కువ ఇబ్బందికరం. ఆహార నియమాలు నిక్కచ్చిగా పాటించడం కష్టమే. కానీ ఊబకాయులుగా మారితే అంతకంటే ఎక్కువ ఇబ్బందిపడాల్సి వస్తుంది. రోజూ సమయానికి నిద్రపోవడం సులువు కాదు. కానీ తగినంత నిద్ర లేకపోతే ఇంకా ఎక్కువ సమస్యలొస్తాయి. కాబట్టి- మీకు ఏ కష్టం కావాలో మీరే నిర్ణయించుకోండి. – డాన్ గో, హై పర్ఫార్మెన్స్ కోచ్



అనుమతి లేకుండానే నిర్మాణ సంస్థకు బ్యాంకు గ్యారంటీ

- కాళేశ్వరం కమిషన్ విచారణలో పేర్కొన్న ఇంజినీర్లు
- ఐదుగురు ఇంజినీర్లను విచారించిన జస్టిస్ పీసీ ఘోష్

ఈనాడు, హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీకి ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే కార్యనిర్వాహక ఇంజినీరు(ఈఈ) బ్యాంకు గ్యారంటీని విడుదల చేశారని, 2019లోనే బ్యారేజీల్లో సీపేజీలను గుర్తించామంటూ పలువురు ఇంజినీర్లు కాళేశ్వరం కమిషన్ ఎదుట వెల్లడించారు. హైదరాబాద్ బీఆర్కే భవన్‌లో మంగళవారం అఫిడవిట్లలో పేర్కొన్న సమాచారం ఆధారంగా జస్టిస్ పీసీ ఘోష్ పలు ప్రశ్నలు సంధించి ఐదుగురు ఇంజినీర్ల నుంచి సమాధానాలు రాబట్టారు. మంగళవారం నాటి విచారణకు ఎస్ఈ ఓంకార్ సింగ్ హాజరు కాలేదు.

అండర్ టేకింగ్ లేకుండానే...

బ్యాంకు గ్యారంటీ విడుదలకు సంబంధించి ఈఎన్సీ కార్యాలయంలో జరిగిన వివిధ అంశాలపై కార్యాలయ డిప్యూటీ సీఈ మహ్మద్ అజ్మల్‌ఖాన్‌ను కమిషన్ ప్రశ్నించింది. "2020 నవంబరు 13న రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ బ్యాంకు గ్యారంటీ విడుదలకు రికమెండ్ చేసింది. మినిట్స్ ఆమోదం పొందినా... బ్యాంకు గ్యారంటీ విడుదల కాలేదు. నిజమేనా' అని కమిషన్ ప్రశ్నించగా.. అవునని డిప్యూటీ సీఈ సమాధానమిచ్చారు. కొవిడ్ మినహాయింపు కింద బ్యాంకు గ్యారంటీల విడుదలకు ప్రభుత్వం మెమో జారీ చేసిన మాట నిజమేనా అని కమిషన్ ప్రశ్నించగా.. . అవునని ఆయన పేర్కొన్నారు. మేడిగడ్డ నిర్మాణ సంస్థ ఎల్‌అండ్‌టీకి బ్యాంకు గ్యారంటీ కింద రూ.159 కోట్లు ఎవరు విడుదల చేశారని కమిషన్ ప్రశ్నించగా... మహదేవ్‌పూర్ డివిజన్ ఈఈ సీహెచ్.తిరుపతిరావు విడుదల చేశారని, ఈఎన్సీ కార్యాలయానికి మాత్రం ఆ వివరాలను పంపలేదన్నారు. బ్యాంకు గ్యారంటీ విడుదలకు ఏదైనా అథారిటీ నుంచి అండర్‌టేకింగ్ తీసుకున్నారా అని కమిషన్ ప్రశ్నించింది. అండర్‌టేకింగ్ తీసుకున్నట్లు ఈఎన్సీ కార్యాలయానికి సమాచారం లేదని సమాధానమిచ్చారు.

2019లోనే సీపేజీ గుర్తించాం

సుందిళ్ల బ్యారేజీలో సీపేజీలను గుర్తించగానే 2019 డిసెంబరులో పుణెలోని సీడబ్ల్యూపీఆర్ఎస్ సంస్థకు లేఖ రాసినట్లు ఈఈ విష్ణుప్రసాద్ కమిషన్ ఎదుట పేర్కొన్నారు. 'బ్యారేజీల డిజైన్లు, డ్రాయింగ్‌లను ఎవరు రూపొందించారని, తుది డిజైన్లను ఎవరు ఆమోదించారన్న ప్రశ్నకు వాప్కోస్ సంస్థ డిజైన్లు, డ్రాయింగ్‌లను సిద్ధం చేసిందని, తుది డిజైన్లను సీఈ సీడీవో ఆమోదించారని తెలిపారు. బ్యారేజీల్లో 2022 జులైలో సీసీ బ్లాకులు చెదిరినట్లు గుర్తించి, నిర్మాణ సంస్థలకు తెలియజేసినట్లు విశ్రాంత ఎస్ఈ ముత్యాల కరుణాకర్ తెలిపారు. నిర్మాణ సంస్థకు ఐదేళ్లు నిర్వహణ బాధ్యత ఉంటుందని తెలిపారు. రామగుండం డిప్యూటీ ఎస్ఈ ఎస్.సత్యనారాయణ గౌడ్, విశ్రాంత ఎస్ఈ సత్తిరెడ్డి కమిషన్ విచారణకు హాజరయ్యారు. గజ్వేల్ ఈఎన్సీ బి.హరీరాం, డైరెక్టరేట్ ఆఫ్ వర్క్స్ అకౌంటెంట్ ఫణిభూషణ్, నీటిపారుదల శాఖ ముఖ్య అకౌంట్స్ అధికారిణి పద్మావతిని బుధవారం జస్టిస్ పీసీ ఘోష్ క్రాస్‌ఎగ్జామిన్ చేయనున్నారు.

తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలని రాష్ట పోలీసు గృహ నిర్మాణ సంస్థ మాజీ ఛైర్మన్, కోలేటి దామోదర్ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు.



లక్ష్యాల సాధనలో రాష్ట్రం ముందడుగు

- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ఈనాడు, దిల్లీ: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లే అయినప్పటికీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ముందడుగు వేస్తోందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నేతృత్వంలో రెండు రోజులుగా ఇక్కడ జరిగిన కామన్‌వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో 'సుస్థిర అభివృద్ధిలో శాసన వ్యవస్థల పాత్ర' అన్న అంశంపై ఆయన మాట్లాడారు. "విద్య, ఆరోగ్యం, సమానత్వం, పరిశుభ్రమైన తాగునీరు, ఆర్థిక వృద్ధి వంటి రంగాల్లో జాతీయ ర్యాంకింగ్‌లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రంలో గత డిసెంబరులో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500కే వంట గ్యాస్ పథకాలు మహిళా సాధికారతకు ఎంతో తోడ్పడుతున్నాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి.. పేదలకు ఖరీదైన వైద్యం ఉచితంగా అందిస్తున్నాం. 200 యూనిట్ల లోపు విద్యుత్తు వాడే పేద గృహ వినియోగదారులకు ఉచితంగా సరఫరా చేస్తున్నాం. రైతుల మేలు కోసం దేశ చరిత్రలో మొదటిసారిగా రూ.రెండు లక్షల రుణమాఫీని తెలంగాణ ప్రభుత్వం అమలు చేసింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఒక మోడల్‌గా నిలుస్తోంది" అని ప్రసాద్‌కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్ బండా ప్రకాశ్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ప్రసాద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.


ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



ఇక మండలానికో ఎంఈఓ

- సీనియర్ గెజిటెడ్ హెచ్‌ఎంలకు పూర్తి అదనపు బాధ్యతలు
- 609 మందిని నియమిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో ఇక ప్రతి మండలానికీ ఒక విద్యాశాఖ అధికారి రానున్నారు. ఈ మేరకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో పాఠశాల విద్యాశాఖ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో 632 మండలాలు ఉండగా.. 609 మండలాలకు సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను ఇన్‌ఛార్జి ఎంఈఓలుగా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు ఈవీ నర్సింహారెడ్డి ఉత్తర్వులిచ్చారు. ప్రస్తుతం 16 మంది రెగ్యులర్ ఎంఈఓలు పనిచేస్తున్నారు. తాజాగా 609 మందికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించడంతో.. మరో ఏడు మండలాలకు నియమించాల్సి ఉంది.

ఇప్పుడే ఈ నిర్ణయం ఎందుకంటే?..

ఉమ్మడి రాష్ట్రంలో 2005లో చివరిసారిగా ఎంఈఓలుగా పదోన్నతులు ఇచ్చారు. తర్వాత ఎంఈఓ పోస్టులను తమకే కేటాయించాలని, పంచాయతీరాజ్ టీచర్లకు వద్దని ప్రభుత్వ ఉపాధ్యాయులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. అప్పటినుంచి ఎంఈఓ పదోన్నతులు ఇవ్వడం లేదు. 2017లో హైకోర్టు రాష్ట్రంలో పంచాయతీరాజ్ టీచర్లకు ఎంఈఓ పోస్టులు ఇవ్వరాదని తీర్పునిచ్చింది. అప్పటికే ఉన్న రెగ్యులర్, ఇన్‌ఛార్జి ఎంఈఓలకు ఇతర మండలాల బాధ్యత అప్పగిస్తూ వస్తున్నారు. కొత్తవారికి బాధ్యతలు ఇవ్వడం లేదు. ఫలితంగా ఒక్కొక్కరు అయిదారు మండలాలను పర్యవేక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. జనగామ జిల్లా మొత్తానికి ఒక ఎంఈఓ మాత్రమే పనిచేస్తున్నారు. దీంతో ప్రభుత్వం హైకోర్టు తుది తీర్పులకు లోబడి సీనియర్ హెచ్‌ఎంలను ఇన్‌ఛార్జి ఎంఈఓలుగా నియమించింది. దీనిపై టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి అంజిరెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్రాధ్యక్షుడు రాజభానుచంద్రప్రకాశ్‌లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

తుది దశకు పంట నష్టం సర్వే

- త్వరలో రైతుల ఖాతాల్లో పరిహారం జమ: మంత్రి తుమ్మల



ఈటీవీ, ఖమ్మం: భారీ వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పంట నష్టం లెక్కించేందుకు చేపట్టిన సర్వే తుది దశకు చేరుకుందని తెలిపారు. మంగళవారం ఆయన ఖమ్మం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్, వికారాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి పంట నష్టానికి సంబంధించిన నివేదికలు అందాల్సి ఉందన్నారు. మిగిలిన జిల్లాల్లో నష్టం అంచనాపై ప్రభుత్వానికి నివేదిక అందిందని వెల్లడించారు. ఈ నివేదికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమర్పించిన అనంతరం రైతుల ఖాతాల్లో పరిహారం జమచేస్తామని పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదలతో రాష్ట్రానికి రూ.10వేల కోట్ల నష్టం జరిగినట్లు కేంద్రానికి నివేదించామన్నారు. కేంద్ర ప్రభుత్వం న్యాయం చేస్తుందన్న నమ్మకం ఉందని తెలిపారు. వరదల కారణంగానే రుణమాఫీ వర్తించని రైతుల కుటుంబ నిర్ధారణ సర్వే కాస్త ఆలస్యమైందని చెప్పారు. ఇప్పటివరకు అందిన వివరాల మేరకు రుణాలు మాఫీ చేస్తున్నామన్నారు. ఖమ్మం నగరంలో మున్నేరుకు ఇరువైపులా చేపట్టిన రక్షణ గోడల నిర్మాణ పనులను పరిశీలించేందుకు నిపుణుల కమిటీ త్వరలోనే వస్తుందని చెప్పారు. మున్నేరు రిటైనింగ్ వాల్‌ను రీడిజైనింగ్ చేస్తామని తెలిపారు.

గాయని పి.సుశీలకు తమిళనాడు ప్రభుత్వ పురస్కారం

చెన్నై, న్యూస్‌టుడే: ప్రముఖ నేపథ్య గాయని పి.సుశీలకు తమిళనాడు ప్రభుత్వం దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పేరిట ఇస్తున్న 'కలైజ్ఞర్ నినైవు కలైతురై విత్తగర్' పురస్కారాన్ని ప్రకటించింది. 30న సచివాలయంలో సీఎం స్టాలిన్ ప్రదానం చేస్తారు.

మెడికల్ కోర్సుల ప్రవేశాల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు

హైకోర్టుకు నివేదించిన ప్రభుత్వం

ఈనాడు, హైదరాబాద్: మెడికల్ ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ కోర్సుల్లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ-ప్రస్తుత ఎన్ఎంసీ) నిబంధనల ప్రకారం ప్రవేశాల్లో ఈడబ్ల్యూఎస్(ఆర్థికంగా వెనకబడిన తరగతులకు) రిజర్వేషన్లు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, పీజీ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లను అమలు చేయాలంటూ ఆగస్టు 28న ఇచ్చిన వినతి పత్రంపై నిర్ణయం తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ భాజపాకు చెందిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎంసీఐ నోటిఫికేషన్ ప్రకారం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు 10 శాతం అమలు చేయాల్సి ఉందన్నారు. అయితే రాష్ట్రంలో ఆ ప్రస్తావనే లేకుండా ప్రవేశాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ 2024-25 విద్యాసంవత్సరానికి ఎంసీఐ మార్గదర్శకాల ప్రకారం మెడికల్ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీన్ని రికార్డు చేసిన ధర్మాసనం పిటిషన్‌పై విచారణను మూసివేసింది.



EENADU Vol: 51, Iss: 46 | Printed and Published by D N Prasad on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Ushodaya Publications, Eenadu Press, Plot No. A-1/1, Block No. 3, Industrial Development Area, Uppal, Hyderabad, Medchal District - 500 039, Telangana State. Published at Eenadu Corporate Office, Ramoji Film City, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy District - 501 512, Telangana State. Editor: D N Prasad. Phone: 040-22232223. RNI No. 27656/75. Regd. No. HSE/1009/2024-26, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

40 ఏళ్ల శత్రుత్వం

ఎంతో కాలంగా హెజ్‌బొల్లా, ఇజ్రాయెల్‌ల పోరాటం • ప్రతిసారీ భారీ నష్టం

ఇంటర్నెట్ డెస్క్: పశ్చిమాసియాలో మరో భీకర యుద్ధం జరుగుతోంది. ఇన్నాళ్లూ హమాస్, ఇజ్రాయెల్ మధ్య జరిగిన పోరు.. ఇప్పుడు లెబనాన్‌వైపు మళ్లింది. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా లక్ష్యంగా ఇజ్రాయెల్ నిప్పుల వర్షం కురిపిస్తోంది. ఈ దాడుల్లో ఇప్పటిదాకా 560 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా వేల మంది క్షతగాత్రులయ్యారు. అయితే హెజ్‌బొల్లా, ఇజ్రాయెల్ మధ్య శత్రుత్వం ఇప్పటిది కాదు, దాదాపు 4 దశాబ్దాల పూర్వమే వీరి మధ్య వైరం పురుడుపోసుకుందని చరిత్ర చెబుతోంది.

గాజాలో హమాస్- ఇజ్రాయెల్ సైన్యానికి మధ్య యుద్ధం సమయంలో.. అటు లెబనాన్‌లోని హెజ్‌బొల్లా ఇజ్రాయెల్‌ను తీవ్రంగా ప్రతిఘటించింది. సరిహద్దులోని ప్రాంతాలపై క్షిపణులు, డ్రోన్‌లతో దాడి చేసింది. ఈ క్రమంలోనే మరోసారి ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య ఉద్రిక్తతలు తలెత్తాయి. ఇటీవల పేజర్ పేలుళ్లు, వాకీటాకీల పేలుళ్లు, మరోవైపు హెజ్‌బొల్లా అగ్రశ్రేణి కమాండర్ల హత్యలతో ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరుకున్నాయి.

పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్‌ఓ) నిర్మూలనే లక్ష్యంగా 1980లో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. రాజధాని బీరుట్ నుంచి పీఎల్‌ఓను తరిమికొట్టి విజయం సాధించింది. అయితే ఎలాగైనా కక్ష తీర్చుకోవాలని ప్రయత్నించిన పీఎల్‌ఓలోని కొందరు 1982లో ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయం షిన్‌బెట్‌పై దాడి చేశారు. ఈ ఘటనలో దాదాపు 91 మంది ఇజ్రాయెల్ అధికారులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి తామే కారణమని షియా ఇస్లామిస్టులు ప్రకటించుకున్నారు. ఆ తర్వాత వారంతా కలిసి హెజ్‌బొల్లాగా ఏర్పాటయ్యారు. అప్పటి నుంచి హెజ్‌బొల్లా, ఇజ్రాయెల్ మధ్య శత్రుత్వం కొనసాగుతూనే ఉంది. వీలు చిక్కినప్పుడల్లా ప్రత్యక్ష దాడులు జరుగుతున్నప్పటికీ గత 40 ఏళ్లుగా ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతూనే ఉంది.

ఇరాన్ అండదండలు

1983లో హెజ్‌బొల్లా ఏర్పాటైంది. తొలినాళ్లలోనే తన బలం పెంచుకొనేందుకు ఇరాన్‌తో చేతులు కలిపింది. 'నా శత్రువుకు శత్రువు నాకు మిత్రుడు' అన్న చందంగా హెజ్‌బొల్లా ఇరాన్‌కు మిత్రుడైంది. ఇరాన్ అండదండలతో ఆయుధాలతో ఇజ్రాయెల్‌కు ఓ బలీయమైన శత్రువుగా తయారైంది. గెరిల్లా, కోవర్టు ఆపరేషన్లు చేస్తూ కేవలం లెబనాన్‌లో కాకుండా సరిహద్దులు దాటి తన ప్రతాపాన్ని చూపించే స్థాయికి చేరింది. 1980, 1990ల మధ్య కాలంలో బీరుట్‌లోని అమెరికా, ఫ్రాన్స్ మిలిటరీ స్థావరాలపై లెక్కలేనన్ని సార్లు దాడులు చేసింది.

ప్రపంచ దృష్టిని ఆకర్షించి..

కేవలం ఇరాన్ మాత్రమే కాకుండా చాలా దేశాలు పరోక్షంగా హెజ్‌బొల్లాకు ఇప్పటికీ మద్దతు పలుకుతున్నాయి. దక్షిణ అమెరికాలోని చాలా దేశాలు హెజ్‌బొల్లాను ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. మాదక ద్రవ్యాల రవాణా, మనీలాండరింగ్ తదితర వ్యవహారాల్లో హెజ్‌బొల్లా ప్రమేయం.. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వీలు కల్పించింది. ఓ ప్రాంతానికి మాత్రమే పరిమితమైన హెజ్‌బొల్లా.. 1990లో ప్రపంచ వ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. అదే ఏడాది హెజ్‌బొల్లా నేత అబ్బాస్ అల్ ముసావిని ఇజ్రాయెల్ దళాలు హతమార్చాయి. దీనికి ప్రతీకారంగా అర్జెంటీనాలోని ఇజ్రాయెల్ దౌత్య కార్యాలయంతోపాటు, యూదుల కమ్యూనిటీ సెంటర్‌పై ఏకకాలంలో దాడులకు పాల్పడింది. ఈ ఘటనల్లో 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.



దాడుల భయంతో బీరుట్ శివారు ప్రాంతాల నుంచి వలస

మొస్సాద్ మరణశాసనం

హెజ్‌బొల్లా నుంచి ఎన్నిసార్లు ప్రతిఘటనలు ఎదురవుతున్నా ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ మౌనంగా తన పని చేసుకుంటూ వస్తోంది. ఇజ్రాయెల్‌పై దాడులకు పురిగొల్పిన ఇరాన్ నేతలతోపాటు హెజ్‌బొల్లా అగ్రనాయకుల మరణ శాసనాలను రాస్తూ వస్తోంది. కీలక నేతలను మట్టుబెడుతోంది. కానీ హెజ్‌బొల్లా మిలిటరీ కమాండర్ ఇమాద్ ముగ్నియేను అంతమొందించడం సాధ్యపడటం లేదు. 1983 లెబనాన్‌లో జరిగిన బాంబు దాడులతోసహా అనేక కీలక దాడులకు అతడే ప్రధాన సూత్రధారి అని ఇజ్రాయెల్ చెబుతోంది. అతడిని అంతం చేసేందుకు మొస్సాద్ కొన్ని దశాబ్దాలుగా ప్రయత్నిస్తోంది. చివరి సారిగా 2008లో డమాస్కస్‌లో కారు బాంబుతో ముగ్నియేను అంతం చేయాలన్న ఇజ్రాయెల్ వ్యూహం బెడిసికొట్టింది.

అగ్ర నాయకుల మరణంతో..

ఆ తర్వాత నుంచి ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా దాడులు ఉధృతమయ్యాయి. వివిధ దేశాల్లోని ఇజ్రాయెల్ ఎంబసీలు, ఆ దేశ పౌరులే లక్ష్యంగా హెజ్‌బొల్లా దాడులు చేస్తూనే ఉంది. 2012లో బల్గేరియాలో జరిగిన కారు బాంబు దాడిలో ఐదుగురు ఇజ్రాయెల్ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. తాజాగా ఈ ఏడాది జులైలో హెజ్‌బొల్లా అగ్రనాయకులు ఫాద్ షుకర్, ఇబ్రహీం అఖిల్‌ను ఇజ్రాయెల్ అంతం చేసింది. 1980లో లెబనాన్‌లోని ఇజ్రాయెల్ దళాలపై చేసిన దాడిలో వీరి హస్తం ఉంది. ఈ ఘటన తర్వాత ఇజ్రాయెల్, హెజ్‌బొల్లా మధ్య ఉద్రిక్తతలు తీవ్ర రూపం దాల్చాయి. ఓ పక్క ఇజ్రాయెల్‌తో యుద్ధం చేస్తున్న హమాస్‌కు మద్దతు పలుకుతూనే, లెబనాన్ సరిహద్దులోని ఇజ్రాయెల్ ప్రాంతాలపై హెజ్‌బొల్లా విరుచుకుపడుతోంది. ఈ క్రమంలోనే వారం రోజుల కిందట.. లెబనాన్‌లో పేజర్, వాకీటాకీ పేలుళ్లు జరిగాయి. వీటికి కారణం ఇజ్రాయెల్ అని భావించిన హెజ్‌బొల్లా కవ్వింపు చర్యలకు పాల్పడింది. ప్రతిగా ఇజ్రాయెల్ సేనలు దక్షిణ లెబనాన్‌పై విరుచుకుపడ్డాయి. సైదా, మర్జయాన్, టైర్, జహరానిత్ బెకా లోయలోని జిల్లాల్లో యుద్ధ విమానాలు, డ్రోన్లతో బాంబుల వర్షం కురిపించాయి. అయితే ఈ యుద్ధం తీవ్ర రూపం దాల్చి ఎటువైపు వెళ్తుందోనని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేస్తోంది.

హెజ్‌బొల్లాకు మానవ కవచాలుగా మారొద్దు: నెతన్యాహు



బీరుట్: దాడుల నేపథ్యంలో లెబనాన్ పౌరులనుద్దేశించి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఓ సందేశం విడుదల చేశారు. హెజ్‌బొల్లాకు మానవ కవచాలుగా మారొద్దని హెచ్చరించారు. 'మా యుద్ధం మీతో కాదు. హెజ్‌బొల్లాతోనే.. చాలా ఏళ్లుగా హెజ్‌బొల్లా మిమ్మల్ని మానవ కవచాలుగా ఉపయోగించుకుంటోంది. మీ ఇళ్లలో రాకెట్లు, క్షిపణులను దాచిపెడుతోంది. వీటితో మా నగరాలపై, మా పౌరులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడుతోంది. మా ప్రజల ప్రాణాలను రక్షించుకొనేందుకు మేం హెజ్‌బొల్లాపై దాడులు చేయడం తప్పటంలేదు. మీ ఇళ్లల్లో దాచిన ఆయుధాలను నిర్వీర్యం చేయడం తప్పనిసరి. హెజ్‌బొల్లా కారణంగా మీ జీవితాలను ప్రమాదంలోకి నెట్టేసుకోవద్దు. లెబనాన్‌ను నాశనం చేయనివ్వొద్దు. ఈ హానికర పరిస్థితి నుంచి బయటపడండి. మా హెచ్చరికలను తీవ్రంగా తీసుకోండి. మా ఆపరేషన్ పూర్తయిన తర్వాత మీరు సురక్షితంగా మీ ఇళ్లకు తిరిగి రావొచ్చు' అని నెతన్యాహు పేర్కొన్నారు.

✦ యుద్ధం కారణంగా నిరాశ్రయులైన వారు బీరుట్, సైడన్‌లోని పాఠశాల్లో శిబిరాల్లో ఉన్నారు. బీరుట్‌లోని హోటల్ గదులన్నీ నిండిపోయాయి. ఇదే అదనుగా హోటళ్ల యజమానులు అధిక ధరలను వసూలు చేస్తున్నారు. శిబిరాల్లో చోటు దొరకడం కష్టంగా ఉందని నిర్వాసితులు వాపోతున్నారు.

✦ యుద్ధం కారణంగా లెబనాన్ వాసులు సిరియాకు వలస వెళ్తున్నారు. దీంతో సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడ్డాయి.

మా మద్దతు లెబనాన్‌కే: చైనా

గాజా యుద్ధంలో కొంత తటస్థంగా ఉన్న చైనా.. లెబనాన్ విషయంలో మాత్రం స్పష్టమైన వైఖరి తీసుకుంది. లెబనాన్‌కు పూర్తి మద్దతు ప్రకటించింది.

ఆర్టీఐ పోర్టల్‌ను ఏర్పరచని 11 రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు



దిల్లీ: సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ప్రజలు సమాచారం పొందడానికి ఆన్‌లైన్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని నిరుడు మార్చి 20న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆంధ్రప్రదేశ్‌తో సహా 11 రాష్ట్రాలు ఇంతవరకు అమలు చేయలేదని సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. దీనికి కారణాలేమిటో అక్టోబరు 21న తెలపాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలాల ధర్మాసనం సోమవారం సంబంధిత నోటీసు ఇచ్చింది. సుప్రీంకోర్టు తీర్పులు, తదితర సమాచారాన్ని ప్రజలు తెలుసుకోవడానికి వీలుగా 2022 నవంబరులోనే సర్వోన్నత న్యాయస్థానం ప్రత్యేక పోర్టల్‌ను తెరచింది. దానికి ముందు సమాచారం కోసం ప్రజల నుంచి అర్జీలు తపాలా ద్వారా వచ్చేవి. ఇకపై అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, హైకోర్టులు, జిల్లా కోర్టులు కూడా తనలాగే ఆర్టీఐ వెబ్‌సైట్లను మూడు నెలల్లో ఏర్పాటు చేయాలని నిరుడు మార్చి 20న సుప్రీంకోర్టు ఆదేశించింది. అయినా ఆంధ్రప్రదేశ్, ఝార్ఖండ్, జమ్మూకశ్మీర్, పశ్చిమబెంగాల్‌తో సహా 11 రాష్ట్రాలు ఇంతవరకు అమలు చేయలేదు.

యోగనిద్ర గుట్టు వీడింది!

దిల్లీ: యోగనిద్రలో నిమగ్నమైన వారు నిద్రలాంటి స్థితిలోకి వెళ్తారు. అదే సమయంలో అప్రమత్తతతోనూ ఉంటారు. ఈ స్థితిలో విశ్రాంతి భావనను కలిగించడానికి దోహదపడే నాడీ కణాల చర్యలను శాస్త్రవేత్తలు గుర్తించారు. మెదడు స్కాన్ల విశ్లేషణ ద్వారా దిల్లీ ఐఐటీ పరిశోధకులు ఈ ఆవిష్కారం చేశారు. పరిశోధనలో భాగంగా శాస్త్రవేత్తలు.. ధ్యానంలో అనుభవజ్ఞులైన 30 మంది, అనుభవం లేని 31 మంది మెదళ్లను ఫంక్షనల్ మ్యాగ్నెటిక్ రెజోనెన్స్ ఇమేజింగ్ (ఎఫ్ఎంఆర్ఐ)లతో పరిశీలించారు. ముఖ్యంగా పరీక్షార్థుల 'డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్'పై దృష్టిసారించారు. ఆత్మపరిశీలన, పరధ్యానం వంటి అంశాల్లో ఈ భాగానికి పాత్ర ఉంది. రెండు వర్గాల పరీక్షార్థుల ఎఫ్ఎంఆర్ఐలను పరిశీలించి చూసినప్పుడు.. ధ్యానంలో అనుభవజ్ఞుల 'డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్' సంధానతలు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీరు యోగనిద్రలో కొనసాగినంతసేపు ఇదే పోకడ కనిపించింది. దీన్నిబట్టి వారు 'వర్తమానం'లోనే ఎక్కువగా ఉంటున్నారని వెల్లడైంది. కానీ డిఫాల్ట్ మోడ్ నెట్‌వర్క్.. గతం, వర్తమానం గురించిన ఆలోచనలతో ముడిపడి ఉంటుందని పరిశోధకులు తెలిపారు. ధ్యానంలో అనుభవజ్ఞులు యోగనిద్రలో ఉన్నప్పుడు వారి మనస్సు ఇతర అంశాలపైకి మళ్లడం, భవిష్యత్ లేదా వర్తమానం గురించి ఆలోచించడం వంటివి చేయడంలేదని వివరించారు. అనుభవంలేని వారి విషయంలో ఇలా కనిపించలేదన్నారు.

ఇజ్రాయెల్ టార్గెట్ అలీ కరాకీ!

ఇంటర్నెట్ డెస్క్: హెజ్‌బొల్లాకు చెందిన కీలక కమాండర్ అలీ కరాకీ కోసం ఇజ్రాయెల్ భారీ వేట మొదలుపెట్టింది. ఇప్పుడు అతడినే నెంబర్-2గా భావిస్తున్నారు. సోమవారం రాత్రి అతడిని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ వైమానిక దాడి చేసింది. కానీ అతడు సురక్షితంగానే రహస్య ప్రదేశంలో ఉన్నట్లు హెజ్‌బొల్లా ప్రకటించింది. మరోవైపు ఇజ్రాయెల్ దళాలు ఆచితూచి స్పందించాయి. తాము చేసిన దాడి ఫలితాలను తర్వాత వెల్లడిస్తామన్నాయి. ప్రస్తుతం కరాకీ హెజ్‌బొల్లా దక్షిణ కమాండ్‌కు చీఫ్‌గా పని చేస్తున్నాడు. దక్షిణ లెబనాన్‌లో హెజ్‌బొల్లా కార్యకలాపాలు మొత్తం అతడి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. జిహాద్ కౌన్సిల్ సభ్యుడిగానూ పని చేస్తున్నాడు. అతడి కింద నాసర్, అజీజ్, బదేర్ రీజనల్ డివిజన్లున్నాయి. కరాకీని ఇటీవల మరణించిన హెజ్‌బొల్లా నెంబర్-2 నాయకుడు, రద్వాల్ ఫోర్స్ అధినేత ఇబ్రహీం అకిల్ స్థానంలో నియమించినట్లు సౌదీ అరేబియాకు చెందిన అల్ హదాత్ పేర్కొంది. అతడితోపాటు మరో సీనియర్ కమాండర్ తలాల్ హమియాకూ ముఖ్య బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించింది.

బీఎస్ఎఫ్ జవాన్ అపహరణ

• బంగ్లాదేశీ దుండగుల దుశ్చర్య

దిల్లీ: బంగ్లాదేశ్‌కు చెందిన కొందరు దుండగులు పశ్చిమ బెంగాల్ సరిహద్దుల్లోని దినాజ్‌పుర్ ప్రాంతంలో గస్తీ కాస్తున్న ఓ బీఎస్ఎఫ్ జవాన్‌ను అపహరించుకెళ్లారు. ఆయన్ను బంగ్లాదేశ్‌లోకి తీసుకెళ్లి.. అక్కడి భద్రతా దళాలకు అప్పగించారు. ఈ వ్యవహారాన్ని భారత సైన్యం తీవ్రంగా పరిగణించింది. ఇదే అంశంపై బంగ్లా దళాలైన 'బార్డర్ గార్డ్ బంగ్లాదేశ్' ఎదుట తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. సెక్టార్ కమాండర్ల స్థాయిలో జరిగిన సమావేశం అనంతరం భారత జవాన్‌ను తిరిగి సురక్షితంగా తీసుకువచ్చినట్లు తెలిపింది.

మీ ఎజెండాలోకి మమ్మల్ని లాగొద్దు

• మిషనరీలపై సిట్ దర్యాప్తు కోరిన ఎన్సీపీసీఆర్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు

దిల్లీ: ఝార్ఖండ్‌లో మిషనరీస్ ఆఫ్ ఛారిటీ ఆధ్వర్యంలో నడిచే శరణాలయాల్లో చిన్నారులను విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు మంగళవారం తోసిపుచ్చింది. ఈ శరణాలయాలపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో దర్యాప్తు జరిపించాలని కోరుతూ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్) ఈ వ్యాజ్యం వేసింది. దీనిని పరిశీలించిన జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఎన్.కె.సింగ్ ధర్మాసనం...'మీ ఎజెండాలోకి సర్వోన్నత న్యాయస్థానాన్ని లాగొద్దు' అని వ్యాఖ్యానించింది. పిటిషనర్ అభ్యర్థనలు అస్పష్టంగా ఉన్నాయని, పరిశీలనార్హత లేదని అభిప్రాయపడింది. బాలల హక్కుల పరిరక్షణ చట్టంలోని నిబంధనల ప్రకారం... దర్యాప్తు జరపటానికి ఎన్సీపీసీఆర్‌కూ అధికారం ఉందని ధర్మాసనం గుర్తు చేసింది. పిటిషన్‌పై విచారణను కొనసాగించేందుకు నిరాకరించింది.

మోదీ విశ్వాసం కోల్పోయారనడం పెద్ద జోక్

• రాహుల్ వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి స్పందన

దిల్లీ: ప్రధాని మోదీ ప్రజా విశ్వాసం కోల్పోయారని జమ్మూ కశ్మీర్ ఎన్నికల ప్రచార సభల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొనడం పెద్ద జోక్ అని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. నిరాధార ఆరోపణలు చేయడం కాంగ్రెస్ నేతకు హాల్‌మార్క్‌గా మారిందని విమర్శించారు. జమ్మూ కశ్మీర్‌కు పార్టీ ఇన్‌ఛార్జ్ అయిన కిషన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోదీని విమర్శించే నైతిక హక్కు రాహుల్‌కు లేదని స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తున్న మోదీ నిస్వార్థంగా పని చేస్తున్నారని తెలిపారు. ప్రజా విశ్వాసం విషయంలో తమకు రాహుల్ సర్టిఫికెట్ అవసరం లేదని స్పష్టం చేశారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడి నిర్హేతుకం: జోర్డాన్



అబ్దుల్లా

ఐరాస: గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడిని ఏ విధంగానూ సమర్థించలేమని జోర్డాన్ రాజు అబ్దుల్లా పేర్కొన్నారు. ఐరాస సర్వప్రతినిధి సభలో ఆయన ప్రసంగిస్తూ.. ఇజ్రాయెల్-పాలస్తీనా ఘర్షణపై ప్రధానంగా ప్రస్తావించారు. గాజాలో ఇజ్రాయెల్ తీరు, వెస్ట్‌బ్యాంకుపై దాని విధానాలు, లెబనాన్‌లో హెజ్బొల్లాపై దాడుల గురించి విరుచుకుపడ్డారు. ఇజ్రాయెల్ సాధారణ పౌరులపై గత అక్టోబరులో జరిగిన దాడిని జోర్డాన్ సహా ప్రపంచమంతా ఖండించిందని, గాజాపై ఆ దేశం చేస్తున్న భయానక దాడి మాత్రం ఏ రకంగా చూసినా నిర్హేతుకమని ఆక్షేపించారు. తన ప్రసంగం మొత్తంలో ఎక్కడా ఆయన హమాస్ గురించి ప్రస్తావించలేదు. ''ఇజ్రాయెల్ ప్రభుత్వ దాడి.. ఇటీవలి ఘర్షణల్లో అత్యంత ఎక్కువగా ప్రాణనష్టం కలిగించింది. అత్యంత వేగంగా క్షుద్బాధకు దారితీసిన యుద్ధల్లో ఇదొకటి. అనేకమంది పిల్లలు క్షతగాత్రులుగా మిగిలింది ఇక్కడే. ఇక విధ్వంసం సరేసరి. పలువురు బాలల్ని, పాత్రికేయుల్ని, సహాయక కార్యకర్తల్ని, ఆఖరికి వైద్య సేవల సిబ్బందినీ ఇజ్రాయెల్ చంపేసింది. ఇటీవలి ఏళ్లలో మరే ఇతర యుద్ధంలోనూ ఇంతలా ప్రాణనష్టం లేదు. సాధారణ పౌరులు తమ లక్ష్యం కాదని, హమాస్ మాత్రం ఉద్దేశపూర్వకంగా పౌరులను తమకు కవచంగా చేసుకుంటోందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ తరుణంలో వెస్ట్‌బ్యాంక్‌లో, గాజాలో పాలస్తీనావాసులకు రక్షణ కల్పించే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి'' అని చెప్పారు.

పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై కేంద్రం మార్గదర్శకాలను అమలుచేయండి

• అన్ని రాష్ట్రాలకు సర్వోన్నత న్యాయస్థానం నిర్దేశం

దిల్లీ: పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు సంబంధించి కేంద్ర విద్యాశాఖ 2021లో జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బచ్‌పన్ బచావో ఆందోళన్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ముగిస్తూ జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఎన్.కె.సింగ్ మంగళవారం ఆ ఆదేశాలిచ్చింది. కేవలం అయిదు రాష్ట్రాలే ఇప్పటి వరకు కేంద్రం మార్గదర్శకాల అమలుకు ఉత్తర్వులు జారీ చేశాయని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. పాఠశాలల్లో చిన్నారులు ఎలాంటి పీడనకు గురికాకుండా, వారి శారీరక, సామాజిక, మానసిక, నైతిక ఆరోగ్యానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆ మార్గదర్శకాల్లో సూచించింది.

మహిళకు అద్దెకిచ్చిన ఇంట్లో నిఘా కెమెరాలు

• యజమాని కుమారుడు అరెస్టు

దిల్లీ: మహిళకు అద్దెకిచ్చిన ఇంట్లోని పడకగదిలో, స్నానపుగదిలో నిఘా కెమెరాలు పెట్టిన ఓ 30 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తూర్పు దిల్లీలోని శకర్‌పుర్ ప్రాంతంలో ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవుతున్న బాధితురాలు గత కొద్దికాలంగా ఓ ఇంట్లో అద్దెకుంటోంది. తాను బయటకు వెళ్లే క్రమంలో ఇంటి తాళాలను భవన యజమాని కుమారుడు కరణ్‌కు ఇచ్చి వెళ్లేది. దీన్ని అవకాశంగా తీసుకున్న కరణ్.. ఆమె లేని సమయంలో ఇంట్లో సీసీ కెమెరాలు అమర్చాడు. ఈ క్రమంలోనే ఆమె మొబైల్ ఫోన్‌కు మరో డివైజ్ అనుసంధానమైనట్లు సందేశం వచ్చింది. వెంటనే అప్రమత్తమైన ఆమె.. స్నానపుగదిలో సీసీ కెమెరా ఉన్నట్లు గుర్తించింది. పోలీసు స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసుల సోదాల్లో మరో సీసీ కెమెరా కూడా బయటపడింది.

త్రిపురలో 500 మంది మిలిటెంట్ల లొంగుబాటు

• పునరావాసానికి రూ.250 కోట్ల ఆర్థిక ప్యాకేజీ

అగర్తలా: త్రిపుర విమోచన జాతీయ కూటమి (ఎన్ఎల్ఎఫ్‌టీ), ఆల్ త్రిపుర టైగర్ ఫోర్స్ (ఏటీటీఎఫ్)కు చెందిన దాదాపు 500 మంది ముష్కరులు తమ ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. మంగళవారం సిపాహీజాలా జిల్లాలోని జంపుయిజాలాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరు ముఖ్యమంత్రి మాణిక్ సాహా ముందు ఆయుధాలను త్యజించారు. వీరంతా సామూహికంగా లొంగిపోవడంతో ఈశాన్య రాష్ట్రం పూర్తిగా సాయుధమూకల రహితంగా మారిందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాణిక్ సాహా వెల్లడించారు. 'వివిధ పథకాలను ప్రవేశపెడుతూ ఆదివాసీల సమగ్ర అభివృద్ధికి కేంద్రం, రాష్ట్రం కృషి చేస్తున్నాయి. హింసామార్గాన్ని వీడి జనజీవనంలో కలిసిన వారిని నేను స్వాగతిస్తున్నాను' అని సీఎం వ్యాఖ్యానించారు. ఆయుధాలను త్యజించిన మిలిటెంట్ల పునరావాసం కోసం కేంద్రం రూ.250 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది.



జంపుజాలలో లొంగిపోయిన ఎన్ఎల్ఎఫ్‌టీ, ఏటీటీఎఫ్ ప్రతినిధులు

నౌక నుంచి రోదసిలోకి రాకెట్ ప్రయోగం

• 8 ఉపగ్రహాలను నింగిలోకి పంపిన చైనా

బీజింగ్: అంతరిక్ష రంగంలో దూసుకెళుతున్న చైనా.. తాజాగా మరో సత్తాను చాటింది. సముద్రంలోని ఒక వేదిక నుంచి ఉపగ్రహ వాహకనౌకను ప్రయోగించింది. దీనిద్వారా రోదసిలోకి విజయవంతంగా 8 శాటిలైట్లను పంపింది. షాండాంగ్ ప్రావిన్స్ తీరానికి చేరువలోని హైయాంగ్ సముద్ర వేదికపై నుంచి ఈ ప్రయోగం జరిగింది. ఇందులో జీలాంగ్-3 (స్మార్ట్ డ్రాగన్-3) రాకెట్‌ను ఉపయోగించారు. ఘన ఇంధనంతో పనిచేసే ఈ రాకెట్‌ను చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ అభివృద్ధి చేసింది. వాణిజ్య ఉపగ్రహ ప్రయోగాలు, సముద్రంపై నుంచి ప్రయోగాల కోసం దీన్ని రూపొందించారు. హైయాంగ్ వేదిక ఒక నౌకలో మార్పులు చేయడం ద్వారా హైయాంగ్ వేదికను సిద్ధం చేశారు. ఇది సంచార లాంచ్ ప్యాడ్‌లా పనిచేస్తుంది.

వైవాహిక అత్యాచారం పిటిషన్లపై విచారణ ఈ వారంలో వద్దు

• సుప్రీంకోర్టును కోరిన కేంద్రం

దిల్లీ: మైనరు కాని భార్యను శారీరక కలయిక కోసం భర్త ఒత్తిడి చేయడాన్ని అత్యాచారంగా పరిగణించాలా? ఇటువంటి కేసు నుంచి భర్తకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందా? అనే న్యాయపరమైన చిక్కు ప్రశ్నలపై దాఖలైన పిటిషన్లను ఈ వారం విచారణకు చేపట్టవద్దని కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మంగళవారం సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేశారు. వాటిని వచ్చే వారానికి వాయిదా వేయాలని సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనాన్ని కోరారు. అయితే, విచారణ జాబితాలోని కేసులను వరుస క్రమంలో చేపడుతూ వస్తున్నామని జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. ఈ ధర్మాసనంలో జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్ర సభ్యులుగా ఉన్నారు.

పుల్వామా నిందితుడి మృతి

జమ్మూ: పుల్వామా దాడిలో నిందితుడు గుండెపోటుతో మరణించాడు. అనారోగ్యం కారణంగా జమ్మూలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బిలాల్ అహ్మద్ కుచేయ్ గుండెపోటుతో సోమవారం రాత్రి మృతిచెందాడని మంగళవారం అధికారులు వెల్లడించారు. ఉగ్రదాడికి పాల్పడిన జైషే మహ్మద్ ముష్కరులకు ఆశ్రయం కల్పించారన్న కారణంతో బిలాల్ సహా మరో ఏడుగురిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అదుపులోకి తీసుకుంది. కాకపొరలోని హాజీబల్ గ్రామానికి చెందిన బిలాల్ ప్రస్తుతం కిశ్త్‌వాడ్ జిల్లా జైల్లో బిలాల్ శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ నెల 17న అనారోగ్యానికి గువడంతో అతడు అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. 2019 ఫిబ్రవరి 14న పుల్వామాలో పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ సీఆర్‌పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌పై ఉగ్రదాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడిలో 40మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మరణించగా మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం కేసు దర్యాప్తును చేపట్టిన ఎన్ఐఏ 19మందిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ముష్కరులకు ఆశ్రయం కల్పించారన్న అభియోగాలపై బిలాల్ సహా మరో ఏడుగురిని అదుపులోకి తీసుకుంది.

ప్రభుత్వ నియంత్రణల నుంచి ఆలయాలకు విముక్తి

• త్వరలో ఉద్యమం చేపడతాం
• విశ్వహిందూ పరిషత్ ప్రకటన

దిల్లీ: దేశవ్యాప్తంగా గల దేవాలయాలకు ప్రభుత్వ నియంత్రణల నుంచి విముక్తి కలిగిస్తామని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మంగళవారం ప్రకటించింది. ఇదే తమ సంకల్పమని స్పష్టం చేసింది. దీని సాధన కోసం త్వరలోనే జాతీయస్థాయిలో ఉద్యమం చేపడతామని వెల్లడించింది. వీహెచ్‌పీ సంయుక్త ప్రధాన కార్యదర్శి సురేంద్ర జైన్ విలేకరులతో మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వాలు దేవాలయాలను హిందూ సమాజానికి అప్పగించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ క్రమంలో ప్రతి రాష్ట్రంలో ప్రదర్శనలు, ఆందోళనలు నిర్వహించి గవర్నర్లకు వినతి పత్రాలను అందజేస్తామన్నారు. త్వరలో ఉద్యమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు.

గతంలో శబరిమల ప్రసాదంలోనూ..

ప్రసాదంలో జంతు కొవ్వుల వినియోగానికి సంబంధించిన వార్తలు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి దేవాలయానికే పరిమితం కాలేదని, గతంలో కేరళలోని శబరిమల ప్రసాదం విషయంలోనూ ఫిర్యాదులొచ్చాయని సురేంద్ర వివరించారు. అక్కడి పాయసంలో అపవిత్రమైన అవశేషాలు కనిపించాయన్నారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా రాష్ట్రప్రభుత్వాల ఆధ్వర్యంలోని ఆలయాలకు సంబంధించిన ఆస్తులు దుర్వినియోగానికి గురవుతున్నాయనే నివేదికలున్నాయని తెలిపారు.

కేరళలో నటుడు ముకేశ్ అరెస్టు.. బెయిల్‌పై విడుదల



కొచ్చిన్: నటిపై అత్యాచారం కేసులో సీపీఎం ఎమ్మెల్యే, నటుడు ఎం.ముకేశ్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మంగళవారం అరెస్టు చేసింది. అయితే ఈనెల ప్రారంభంలోనే సెషన్స్ కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేయడంతో వైద్య పరీక్షలు నిర్వహించి ఆయన్ను విడుదల చేసినట్లు ముకేశ్ తరఫు న్యాయవాది నిర్ధారించారు. ఆయనను కోస్టల్ పోలీస్ హెడ్‌క్వార్టర్‌లో మూడున్నర గంటలకు పైగా సిట్ విచారించింది.

సిద్దీఖీ అరెస్టుకు రంగం సిద్ధం

మరోవైపు, నటిపై అత్యాచారం కేసులో కేరళ నటుడు సిద్దీఖీని అరెస్ట్ చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్‌ను కేరళ హైకోర్టు తిరస్కరించింది. ప్రస్తుతం ఆయన ఎక్కడ ఉన్నారో తెలుసుకోవడానికి వీలుగా లుకౌట్ సర్క్యులర్‌ను జారీ చేసింది. 2016లో తిరువనంతపురంలోని ప్రభుత్వ హోటల్‌లో సిద్దీఖీ తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఓ నటి ఇటీవల ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తొలుత సదరు నటి ఈ ఘటనపై ఫిర్యాదు చేయకూడదని భావించారు. గత నెల జస్టిస్ హేమ కమిటీ నివేదిక సమర్పించడంతో ధైర్యంగా ముందుకొచ్చారు. మలయాళం సినీ పరిశ్రమలో మహిళలపై వ్యవస్థీకృత వేధింపులను ఈ నివేదికలో ప్రస్తావించారు. మాజీ నటీమణులు తమ చేదు అనుభవాలను పంచుకోవాలని ప్రోత్సహించారు.

కవచ్ ట్రయల్ విజయవంతం

సవాయ్ మాధోపుర్: ఎదురెదురుగా వస్తున్న రైళ్లు ఢీకొనకుండా తీసుకొచ్చిన వ్యవస్థ 'కవచ్' ట్రయల్ విజయవంతమైంది. రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపుర్, ఇందర్‌గఢ్ రైల్వే స్టేషన్ల మధ్య ఈ ట్రయల్ మంగళవారం జరిగింది. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆ రైలులో ప్రయాణిస్తుండగా రెడ్ సిగ్నల్‌కు 50 మీటర్ల దూరంలో రైలు ఆగిపోయింది. ఇందులో ఎటువంటి మానవ ప్రమేయం లేదు. రైలును గంటకు 130 కిలోమీటర్ల వేగంతో నడిపి చూశారు. ఇప్పటివరకూ కవచ్‌ను 7 అత్యవసర సమయాల్లో ప్రయోగించి చూశామని, అన్నిసార్లూ విజయవంతమైందని ట్రయల్‌లో పాల్గొన్న అధికారులు వెల్లడించారు. త్వరలో కవచ్ 4.0ను 6,000 కిలోమీటర్ల మార్గాల్లో అమర్చుతామని మంత్రి వైష్ణవ్ తెలిపారు.

రైళ్ల విధ్వంసానికి పాల్పడితే కఠిన చర్యలు : అశ్వినీ వైష్ణవ్

దేశంలో పలు రైళ్ల విధ్వంసానికి కుట్రలు జరుగుతున్న నేపథ్యంలో రైల్వే యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. రైళ్ల విధ్వంసానికి ఎవరైనా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపుర్‌లో కవచ్ రక్షణ వ్యవస్థతో అనుసంధానమైన ఆటోమేటిక్ రైలు సామర్థ్యాన్ని తనిఖీ చేసేందుకు మంగళవారం జైపుర్‌కు వచ్చిన రైల్వే మంత్రి మీడియాతో మాట్లాడారు. రైళ్ల విషయంలో భద్రతాపరమైన బెదిరింపులను కేంద్ర ప్రభుత్వం అత్యంత తీవ్రంగా పరిగణిస్తుందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా వివిధ రాష్ట్రాల పోలీసు అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, భాజపా కార్యకర్తలతో భేటీ అయ్యారు. జైపుర్‌లోని గాంధీనగర్ రైల్వేస్టేషన్‌లో నిర్మించిన రూఫ్ ప్లాజాను పరిశీలించారు. ఇది నగరాన్ని రెండు వైపుల నుంచి కలుపుతుందని, దేశంలో ఇలాంటి ప్రాజెక్టుల్లో ఇదే మొదటిదని తెలిపారు.

'ఆపీ' ఓటర్లలో హారిస్‌కే మొగ్గు

వాషింగ్టన్: ఆసియన్ అమెరికన్, జన్మత హవాయియన్, పసిఫిక్ ఐలాండర్ రిజిస్టర్డ్ (ఆపీ) ఓటర్లలో డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌కే మొగ్గు కనిపిస్తోంది. తాజాగా వారిపై నిర్వహించిన సర్వేలో ట్రంప్‌పై హారిస్ ఆధిక్యం కనబరిచారు. తమ తరఫున ప్రాతినిధ్యం వహించడంలో, విధాన పరమైన నిర్ణయాలను తీసుకోవడంలో ఆమె సమర్థంగా వ్యవహరిస్తారని వారు నమ్ముతున్నారు. ఆపీ డేటా, అపియా వోట్ జరిపిన సర్వేలో ప్రతి 10 మంది ఆపీ ఓటర్లలో ఆరుగురు హారిస్‌కే మద్దతు పలుకుతున్నారు. ముగ్గురు మాత్రమే ట్రంప్‌నకు మద్దతిస్తున్నారు.

ఫోన్ కొన్నందుకు పార్టీ ఇవ్వలేదని బాలుడి హత్య

• కత్తితో పొడిచి చంపిన స్నేహితులు
• నిందితులు ముగ్గురూ తొమ్మిదో తరగతి విద్యార్థులే

దిల్లీ: ఫోన్ కొన్నందుకు పార్టీ ఇవ్వలేదని ఓ బాలుడిని అతడి స్నేహితులు కత్తితో పొడిచి చంపేశారు. దిల్లీలోని షకర్‌పుర్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు మంగళవారం తెలిపిన ప్రకారం.. సచిన్ (16) అనే బాలుడు కొత్త ఫోన్ కొనుగోలు చేయడానికి తన స్నేహితుడిని తీసుకొని వెళ్లాడు. ఫోన్ తీసుకున్న అనంతరం ఇంటికి తిరిగి వస్తుండగా దారిలో మరో ముగ్గురు స్నేహితులు కలిశారు. సచిన్ దగ్గర ఫోన్ చూసి, మొబైల్ కొన్నందుకు తమకు పార్టీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాలుడు దానికి నిరాకరించడంతో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది తీవ్రమై ఘర్షణకు దారి తీసింది. దీంతో ఓ బాలుడు సచిన్‌ను కత్తితో పొడవగా స్థానికులు వెంటనే బాధితుడిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సచిన్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. డీసీపీ అపూర్వ గుప్తా మాట్లాడుతూ.. 'దారుణానికి పాల్పడిన ముగ్గురూ 16 ఏళ్ల వయసు వారే. తొమ్మిదో తరగతి చదువుతున్నారు. హత్యకు ఉపయోగించిన కత్తిని ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్నాం. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి ముగ్గురు నిందితులనూ మంగళవారం అదుపులోకి తీసుకున్నాం' అని వెల్లడించారు.

ఈనాడు బిజినెస్



లాభాలు ఆర్జిస్తున్న 'పెద్ద సంస్థల' పేర్లు చెప్పండి

'దేశంలో గత అయిదేళ్లలో ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ అసాధారణ స్థాయిలో 45 రెట్లు పెరిగింది. గత మూడేళ్లలో 90% మంది పైగా చిన్న మదుపరులు రూ.1.8 లక్షల కోట్లు పోగొట్టుకున్నారు. అయితే కొన్ని 'పెద్ద సంస్థలు', విదేశీ పెట్టుబడిదార్లకు లాభాలు వచ్చినట్లు సెబీనే ప్రకటించింది. దేశీయ చిన్న మదుపరులు నష్టపోయిన ఆ డబ్బును, తమ లాభాలుగా మల్చుకున్న పెద్ద సంస్థల పేర్లను సెబీ వెల్లడించాలి'

– రాహుల్ గాంధీ, లోక్‌సభలో విపక్ష నేత

టాటా నెక్సాన్ కొత్త మోడళ్లు



- సీఎన్‌జీ ప్రారంభ ధర రూ.8.99 లక్షలు
- 350-370 కి.మీ. ప్రయాణించే ఈవీ ప్రారంభ ధర రూ.13.99 లక్షలు

దిల్లీ: టాటా మోటార్స్ తన నెక్సాన్ ఎస్‌యూవీలో సీఎన్‌జీ వేరియంట్‌ను తీసుకొచ్చింది. నెక్సాన్ ఐసీఎన్‌జీ ప్రారంభ ధర రూ.8.99 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా సంస్థ ప్రకటించింది. ఇప్పటికే నెక్సాన్‌లో పెట్రోల్, డీజిల్, విద్యుత్తు (ఈవీ) వేరియంట్లు అందుబాటులో ఉన్నాయి. నెక్సాన్.ఈవీ మోడల్‌ను 45 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌తో అప్‌గ్రేడ్ చేసినట్లు కంపెనీ తెలిపింది. ప్రామాణిక పరిస్థితుల్లో ఒకసారి ఛార్జింగ్‌తో 489 కిలోమీటర్లు ప్రయాణించేలా రూపొందించిన ఈ కొత్త వాహనం, వాస్తవ పరిస్థితుల్లో 350-370 కిలోమీటర్లు వెళ్తుందని సంస్థ వివరించింది. నెక్సాన్.ఈవీ ప్రారంభ ధర రూ.13.99 లక్షలు (ఎక్స్-షోరూమ్).

✦ 1.2 లీటర్ టర్బోఛార్జ్‌డ్ ఇంజిన్‌తో నెక్సాన్ ఐసీఎన్‌జీని సంస్థ తీసుకొచ్చింది. రెండు స్లిమ్ సిలిండర్లు ఉండటంతో, అధిక సామగ్రి తీసుకెళ్లేందుకూ అనువుగా ఉంటుందని కంపెనీ తెలిపింది. 6 ఎయిర్‌బ్యాగ్‌లు దీని సొంతం. హారియర్, సఫారీతో ఆదరణ పొందిన రెడ్ డార్క్ ఎడిషన్‌ను దీంట్లోనూ తీసుకొచ్చారు.

✦ పనోరమిక్ సన్‌రూఫ్, 10.25 అంగుళాల డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, 360 డిగ్రీల కెమెరా, లెదర్ సీట్లు, నావిగేషన్ డిస్‌ప్లే ఇందులో ఉన్నాయి. స్మార్ట్ (ఓ), స్మార్ట్+, స్మార్ట్+ ఎస్, ప్యూర్, ప్యూర్ ఎస్, క్రియేటివ్, క్రియేటివ్+, ఫియర్‌లెస్+ పీఎస్.. ఇలా 8 వేరియంట్లతో నెక్సాన్ ఐసీఎన్‌జీ వచ్చింది. వీటిలో టాప్ వేరియంట్ అయిన ఫియర్‌లెస్+ పీఎస్ ధర రూ.14.50 లక్షలు (ఎక్స్-షోరూమ్).

రూ.25,000 కోట్లకు మించిన ఎన్‌ఎండీసీ నికర విలువ



ఈనాడు, హైదరాబాద్: ఎన్‌ఎండీసీ గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో రికార్డు స్థాయి పనితీరు కనబరచినట్లు ఆ సంస్థ ఛైర్మన్ - ఎండీ అమితవ ముఖర్జీ కంపెనీ వాటాదార్ల వార్షిక సమావేశం (ఏజీఎం)లో తెలిపారు. 2022-23తో పోల్చితే ఉత్పత్తి 10%, అమ్మకాలు 16% పెరిగినట్లు వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో 45 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేసి, 44.48 లక్షల టన్నుల అమ్మకాలు నమోదు చేయడం ద్వారా రూ.21,294 కోట్ల ఆదాయాన్ని సంస్థ ఆర్జించింది. నికరలాభం రూ.5,632 కోట్లుగా నమోదైంది. రూ.2,066 కోట్ల మూలధన వ్యయాలు చేయడం వల్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని, ఉత్పాదకతను పెంచుకునే అవకాశం లభించింది. ఫలితంగా సంస్థ నికర విలువ రూ.25,000 కోట్లను మించింది. తద్వారా ఈ సంస్థ ఆర్థికంగా బలంగా మారడమే గాక, భవిష్యత్తు లక్ష్యాలకు అనుగుణంగా మూలధన పెట్టుబడులు పెట్టగల సామర్థ్యాన్ని సంపాదించుకుంది. ఇనుప ఖనిజం వినియోగం చైనాతో పాటు మనదేశంలో కొన్నేళ్ల పాటు పెరుగుతుందని అంచనా. వినియోగంలో మనదేశం రికార్డు సృష్టించే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల ఎన్‌ఎండీసీ లిమిటెడ్ ఏటా అధికోత్పత్తి లక్ష్యాలను నిర్దేశించుకుని, దానికి అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటోంది.

విద్యార్థుల కోసం ఏఐ గేమింగ్ జోన్

ఈనాడు, హైదరాబాద్: ఆధునిక సాంకేతికతతో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత గేమింగ్ జోన్‌ను విశాల్ పెరిఫెరల్స్ అందుబాటులోకి తెచ్చింది. ఇంటెల్ సాంకేతిక సహకారంతో ఇది రూపుదిద్దుకుంది. ఏఐ, గేమింగ్ సాఫ్ట్‌వేర్‌పై పనిచేస్తున్న విద్యార్థులు, అంకుర సంస్థలు దీన్ని ఉచితంగా ఉపయోగించుకోవచ్చని విశాల్ పెరిఫెరల్స్ డైరెక్టర్ వికాస్ హిసారియా తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోని ఇంజినీరింగ్ కాలేజీలతోనూ ప్రత్యేక భాగస్వామ్యం ఏర్పాటు చేసుకుంటున్నట్లు వివరించారు.

వైస్‌రాయ్ హోటల్స్ రైట్స్ ఇష్యూ

ఈనాడు, హైదరాబాద్: ఖాయిలా పడి, దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా కొత్త యాజమాన్యం చేతికి వెళ్లిన వైస్‌రాయ్ హోటల్స్ తన వాటాదార్లకు రైట్స్ పద్ధతిలో షేర్లు జారీ చేయడం ద్వారా రూ.50 కోట్లు సమీకరించనుంది. మంగళవారం ఇక్కడ జరిగిన వైస్‌రాయ్ హోటల్స్ బోర్డు డైరెక్టర్ల సమావేశం ఈ నిర్ణయం తీసుకుంది. వైస్‌రాయ్ హోటల్స్ ప్రస్తుత జారీ మూలధనం రూ.63 కోట్లు (6.31 కోట్ల షేర్లు) కాగా, ఇందులో ప్రమోటర్లకు 90% వాటా ఉంది.


రూ.77,000 మించిన 24 క్యారెట్ల బంగారం

అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాములు) మేలిమి బంగారం ధర రికార్డు స్థాయిలో 2652 డాలర్లకు చేరడంతో, దేశీయంగానూ ధరలు పెరిగాయి. 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర మంగళవారం రాత్రి 11.30 గంటల సమయానికి రూ.77,400 (జీఎస్‌టీతో కలిపి) వద్ద ట్రేడ్ అవుతోంది. కిలో వెండి ధర రూ.93,400కు చేరింది.

ఎస్‌ఎమ్‌ఈ పబ్లిక్ ఇష్యూనా..

పారాహుషార్!

- కంపెనీల విలువ పెంపులో ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల మాయ
- మోసపోవద్దని మదుపర్లకు సెబీ హెచ్చరిక
- 6 బ్యాంకులపై దర్యాప్తు



'మీ కంపెనీ పబ్లిక్ ఇష్యూకు వచ్చే ఆలోచన ఉందా? మీ కంపెనీ విలువను అసలు కంటే అధికంగా చూపిస్తాం. అప్పుడు మీరు ఎక్కువ మొత్తం నిధుల సమీకరణ కోసం పబ్లిక్ ఇష్యూకు వెళ్లొచ్చు. మా సాయంతో, మీరు అదనంగా సేకరించిన నిధుల్లో సగమైనా మాకు ఇవ్వాలి' - చిన్న, మధ్య తరహా సంస్థల (ఎస్‌ఎమ్‌ఈ)తో కొన్ని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థల తీరిదీ.

ఇందుకోసం 'పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధులు సమీకరించే ఆలోచన ఉన్న కంపెనీల ప్రమోటర్లు మీకు తెలిస్తే, మాకు చెప్పండి' అని చిన్న పట్టణాల్లోని చార్టర్డ్ అకౌంటెంట్లనూ కొందరు ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు సంప్రదిస్తున్నారట. అలాంటి ప్రమోటర్లు అందుబాటులోకి వస్తే, 'పబ్లిక్ ఇష్యూ లాభాలను వివరిస్తూనే.. తాము అందించే అదనపు ప్రయోజనాలను' కూడా చెప్పి వాళ్లను ఒప్పిస్తున్నారని ఈ పరిణామాలను గమనిస్తున్న వర్గాలు చెబుతున్నాయి.

దేశంలో ఎస్‌ఎమ్‌ఈ ఐపీఓలకు పెరిగిన ఆదరణను తమకు అనుకూలంగా మల్చుకునేందుకు కొన్ని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థలు ఇలాంటి తప్పుడు పద్ధతిని అనుసరిస్తున్నాయని ఆ వర్గాలు తెలిపాయి. గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాలకు పరిమితమైన ఈ 'అక్రమ వ్యాపార విధానం'.. ఇప్పుడు మరికొన్ని రాష్ట్రాలకూ విస్తరించిందని వెల్లడించాయి.

అధిక స్పందన కోసమూ వక్రమార్గం..

పబ్లిక్ ఇష్యూల్లో అధిక సంపన్న వ్యక్తులు, సాధారణ చిన్న మదుపర్లుగా బిడ్‌లు దాఖలు చేసేందుకు కొందరు మదుపర్లను కూడా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులు ఉపయోగించుకుంటున్నట్లు సమాచారం. 'ఇష్యూకు అధిక స్పందన వచ్చినట్లుగా చూపించేందుకు, ఇలాంటి వారితో ఎక్కువ సంఖ్యల్లో బిడ్‌లు వేయిస్తున్నారట. ఇతర మదుపర్లను ఆకర్షించేందుకు ఈ వ్యూహాన్ని వాడుతున్నట్లు' ఆ వర్గాలు వివరించాయి.

✦ సాధారణంగా పబ్లిక్ ఇష్యూల నిర్వహణ నిమిత్తం ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ల రుసుములు 1-3 శాతంగా ఉంటాయి. ఎస్‌ఎమ్‌ఈ ఐపీఓలకు ఇది 7 శాతం వరకు పెరిగినట్లు సమాచారం. ఇందులో కొంత మొత్తాన్ని బ్యాంకుల ద్వారా చెల్లిస్తుండగా.. మిగిలింది నగదు రూపేణా జరుగుతోంది. నగదు రూపేణా వచ్చిన డబ్బులను, తదుపరి ఇష్యూలో కొందరు మదుపర్లతో బిడ్‌లు వేసేందుకు సదరు బ్యాంకర్లు వాడుతున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.

ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకులపై దర్యాప్తు

ఎస్‌ఎమ్‌ఈల పబ్లిక్ ఇష్యూలపై పనిచేసిన 6 దేశీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థలపై సెబీ దర్యాప్తు చేస్తోందని ఈ పరిణామాన్ని దగ్గర నుంచి గమనిస్తున్న వర్గాలు తెలిపాయి. ఆయా బ్యాంకులు వసూలు చేసిన రుసుముల వివరాలను సెబీ పరిశీలిస్తోందని వెల్లడించాయి. ఐపీఓ ద్వారా సమీకరించిన మొత్తంలో 15 శాతాన్ని ఇవి రుసుముగా తీసుకున్నట్లు దర్యాప్తులో సెబీ గుర్తించిందని రాయిటర్స్ వార్తా కథనం వెల్లడించింది. దర్యాప్తును ఎదుర్కొంటున్న ఆ బ్యాంకుల పేర్లు తెలియరాలేదని పేర్కొంది.

సెబీ హెచ్చరించింది..

కొన్ని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ సంస్థలు అనుసరిస్తున్న ఈ అక్రమ పద్ధతులపై, ఇప్పటికే మదుపర్లను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అప్రమత్తం చేసింది. ఎస్‌ఎమ్‌ఈ పబ్లిక్ ఇష్యూల్లో పెట్టుబడులు పెట్టేటప్పుడు జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించింది. ఎస్‌ఎమ్‌ఈ కంపెనీల ఆర్థిక పరిస్థితి పారదర్శకంగా వెల్లడయ్యేలా.. కఠిన నిబంధనలు రూపొందించడంపైనా సెబీ దృష్టి పెట్టింది.

రూ.5-250 కోట్ల టర్నోవర్ కలిగిన కంపెనీల నమోదుకు ఎస్‌ఎంఈ ప్లాట్‌ఫామ్‌ను వినియోగిస్తున్నారు

2023-24లో 205 చిన్న కంపెనీలు రూ.6,000 కోట్లను పబ్లిక్ ఇష్యూల ద్వారా సమీకరించాయి. 2022-23లో 125 కంపెనీలు రూ.2,200 కోట్లనే సమీకరించడం గమనార్హం.

హ్యుందాయ్ రూ.25,000 కోట్ల ఇష్యూకు సెబీ అనుమతి!

దక్షిణ కొరియా వాహన దిగ్గజం హ్యుందాయ్ మోటార్ అనుబంధ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా 3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.25,000 కోట్ల) పబ్లిక్ ఇష్యూ ప్రతిపాదనకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి ఇచ్చిందని మనీకంట్రోల్ తెలిపింది. అక్టోబరులోనే ఈ మెగా ఇష్యూ ఉండొచ్చని సమాచారం. 2022లో నమోదైన ఎల్‌ఐసీ 2.7 బిలియన్ డాలర్ల ఇష్యూ ఇప్పటివరకు దేశీయంగా అతిపెద్ద ఐపీఓగా ఉండగా, హ్యుందాయ్ ఇకపై అతిపెద్ద ఐపీఓగా నిలవనుంది. ఈ ఇష్యూ కోసం హ్యుందాయ్ మోటార్ ఇండియా విలువను 18-20 బిలియన్ డాలర్లుగా పరిగణించనున్నారు.

డెట్ సెక్యూరిటీ ఇష్యూలకు యూపీఐతో దరఖాస్తు

దిల్లీ: వ్యక్తిగత మదుపర్లు ఇకపై డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూల కోసం యూపీఐ ద్వారానే దరఖాస్తుచేయాల్సి ఉంటుంది. ఇంటర్మీడియటరీల ద్వారా దరఖాస్తు చేసే వారు, రూ.5 లక్షల వరకు మొత్తాలను బ్లాక్ చేయాలంటే కచ్చితంగా యూపీఐ విధానాన్నే వాడాలని సెబీ మంగళవారం స్పష్టం చేసింది. మదుపర్ల యూపీఐ ఐడీకి అనుసంధానమైన బ్యాంక్ ఖాతాను తమ దరఖాస్తులో పేర్కొనాల్సి ఉంటుంది. స్వయం ధ్రువీకృత సిండికేట్ బ్యాంకులు లేదా స్టాక్ ఎక్స్ఛేంజీ ప్లాట్‌ఫాం ద్వారా దరఖాస్తు చేసుకునేవారు యథావిధిగా కొనసాగొచ్చని తెలిపింది. నవంబరు 1 నుంచి మొదలయ్యే డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూలకు తాజా నిబంధనలు వర్తిస్తాయి. డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూలు, నాన్ కన్వర్టబుల్ రీడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్లు, మున్సిపల్ డెట్ సెక్యూరిటీలకు దరఖాస్తు చేసే ప్రక్రియను క్రమబద్ధీకరించడం కోసం సెబీ ఈ నిర్ణయం తీసుకుంది.

మరో 200 విక్రయ కేంద్రాలు

ఈనాడు, హైదరాబాద్: సంప్రదాయ దుస్తులను ఉత్పత్తి చేస్తూ, విక్రయిస్తున్న రామ్‌రాజ్ కాటన్ రానున్న మూడేళ్లలో కొత్తగా 200 విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉంది. ఇందులో భాగంగానే ఈ ఆర్థిక సంవత్సరం చివరికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కొత్తగా 28 స్టోర్లు ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ఛైర్మన్ కేఆర్ నాగరాజన్ తెలిపారు. ప్రస్తుతం దక్షిణ భారత దేశంలో 300 స్టోర్లు ఉండగా, వీటిల్లో తెలుగు రాష్ట్రాల్లో 82 ఉన్నాయని పేర్కొన్నారు. మొత్తం 11 ప్లాంట్లపై ఇప్పటికే రూ.1,300 కోట్లు ఖర్చు చేశామని, రాబోయే అయిదేళ్లలో రూ.700 కోట్లు పెట్టుబడి పెడతామని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 25 శాతానికి పైగా వృద్ధి సాధించే అవకాశం ఉందన్నారు.


కోడి గుడ్లు

25న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	525
వరంగల్	527
విజయవాడ	555
గోదావరి	550
విశాఖపట్నం	555
చిత్తూరు	543

రూ.4 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలకు గిరాకీ

- ప్రైవేటు మూలధన వ్యయాలు పెరుగుతాయ్
- ఎస్‌బీఐ ఛైర్మన్ సి. శ్రీనివాసులు శెట్టి



దిల్లీ: భారత కార్పొరేట్ రంగం నుంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)కు ఇప్పటికే రూ.4 లక్షల కోట్ల రుణాలకు గిరాకీ ఉన్నట్లు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఛైర్మన్ సి. శ్రీనివాసులు శెట్టి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో ప్రైవేటు రంగ మూలధన వ్యయాలు మరింత పెరిగే అవకాశం ఉండొచ్చని అంచనా వేశారు. 'రోడ్లు, పునరుత్పాదక ఇంధనం, రిఫైనరీల వంటి మౌలిక సదుపాయాల రంగం నుంచి రుణాల కోసం ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయ'ని ఆయన తెలిపారు.

ద్వితీయార్ధంలో మరింత గిరాకీ: 'సాధారణంగా కార్పొరేట్లు తమ ప్లాంట్ల విస్తరణ కోసం సొంత నిధులు, సమీకరణలపై ఆధారపడతారు. ఇపుడు కొంత మంది ఈ విస్తరణలకూ టర్మ్ రుణాలను తీసుకుంటున్నారు. మా వద్ద ప్రస్తుతం మంజూరైన ప్రతిపాదనలు (పంపిణీ కాలేదు) రూ.4 లక్షల కోట్ల వరకు ఉంది. అంటే మా కార్పొరేట్ రుణాల విభాగం బలంగా ఉంది. ఎన్నికల కారణంగా ఏప్రిల్-జూన్‌లో మందకొడిగా ఉన్న ప్రభుత్వ వ్యయాలు రెండో త్రైమాసికంలో పుంజుకున్నాయి. అక్టోబరు నుంచి ఇవి మరింత బలపడతాయి. ఫలితంగా ప్రైవేటు, ప్రభుత్వ మూలధన వ్యయాలు రాణిస్తాయ'ని ఎస్‌బీఐ ఛైర్మన్ వివరించారు.

అనుబంధ సంస్థల్లో వాటా విక్రయం లేదు: తమ అనుబంధ సంస్థల్లో ప్రస్తుతానికి వాటా విక్రయ ఆలోచనలేవీ లేవని ఆయన స్పష్టం చేశారు. ఆహార ద్రవ్యోల్బణంపై అనిశ్చితి కారణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) 2024లో కీలక రేట్లను తగ్గించకపోవచ్చని శ్రీనివాసులు పేర్కొన్నారు.

బాండ్లపైనే భారం

డిపాజిట్లు తగ్గడంతో బ్యాంకుల కొత్త మార్గం: ఇక్రా

ముంబయి: రుణాల వృద్ధికి తగ్గట్లుగా డిపాజిట్లలో వృద్ధి నమోదు అవ్వడం లేదు కనుక, నగదు కొరత ఇబ్బందులు రాకుండా చూసేందుకు బ్యాంకులు బాండ్ల జారీకి సిద్ధమవుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే రూ.1.3 లక్షల కోట్ల విలువైన బాండ్లను బ్యాంకులు జారీ చేయబోతున్నాయని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా నివేదిక వెల్లడించింది. ఇందులో దాదాపు 85% బాండ్లను ప్రభుత్వరంగ బ్యాంకులే జారీ చేసే వీలుందని నివేదిక అంచనా వేసింది. ముఖ్యంగా ఇన్‌ఫ్రా బాండ్లను తీసుకొచ్చే విషయంపై దృష్టి సారిస్తున్నాయని పేర్కొంది.

గత ఆర్థిక సంవత్సరంలో రూ.లక్ష కోట్లు: గత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు రూ.లక్ష కోట్ల వరకు బాండ్ల ద్వారా సమీకరించాయి. అంతకు క్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.1.1 లక్షల కోట్ల మేర సేకరించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆరు నెలల కాలం ముగింపు దగ్గరకు వస్తున్న నేపథ్యంలో, బ్యాంకులు ఇప్పటికే రూ.76,700 కోట్లను బాండ్ల జారీ ద్వారా సమీకరించాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంతో పోలిస్తే ఇది 225% అధికం.

పండుగ అమ్మకాలు బాగుంటాయ్

- 1,10,000 తాత్కాలిక ఉద్యోగాలు
- అమెజాన్ ఇండియా వైస్‌ప్రెసిడెంట్ అభినవ్ సింగ్



దిల్లీ: గతేడాది కంటే ప్రస్తుత పండుగల సీజన్‌లో దేశీయంగా విక్రయాలు బాగుంటాయని అమెజాన్ ఇండియా అంచనా వేస్తోంది. కొనుగోలుదార్ల సెంటిమెంటు ఆశావహంగా ఉండటమే దీనికి కారణమని అమెజాన్ ఇండియా వైస్‌ప్రెసిడెంట్ (కార్యకలాపాలు) అభినవ్ సింగ్ వివరించారు. వివిధ ఉత్పత్తులపై భారీ రాయితీలు ఇస్తూ, తమ అమ్మకాలను దెబ్బతీస్తోందన్న రిటైల్ వ్యాపారుల ఆరోపణలు సరికాదని పేర్కొన్నారు. విక్రయదార్లకు వేదికగా మాత్రమే అమెజాన్ ఉందని, ధరల నిర్ణయాన్ని తమ ప్లాట్‌ఫాంపై అమ్మకాలు జరుపుతున్న వ్యాపారులే తీసుకుంటారని స్పష్టం చేశారు. వివిధ అంశాలపై ఆయనేమన్నారంటే..

✦ **దీర్ఘకాల దృక్పథంతో కొనసాగుతున్నాం:** భారీ అవకాశాలున్న భారత్‌లో, దీర్ఘకాల దృక్పథంతోనే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాం. 100 కోట్ల మందికి పైగా కొనుగోలుదారులుండి, త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్న దేశంలో లక్షల మంది చిన్న వ్యాపారులు డిజిటల్ బాట పట్టేందుకు సాయం చేస్తున్నాం.

✦ **ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాల సామర్థ్యం పెంచాం, భారీ నియామకాలు కూడా:** పండుగల సమయంలో వచ్చే భారీ ఆర్డర్లను సాధ్యమైనంత త్వరగా డెలివరీ చేసేందుకు లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌తో పాటు ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలు - ఇతర మౌలిక వసతుల సామర్థ్యాన్ని మెరుగుపరచాం. కొనుగోలుదారులకు సమీపంలోనే విక్రేతలు ఉండేలా చూస్తున్నాం. హైదరాబాద్ సహా ఇతర ప్రధాన నగరాలన్నింటిలో కలిపి 1,10,000 మంది తాత్కాలిక ఉద్యోగులను నియమించాం.

✦ **రైళ్లలో వేగంగా బట్వాడా:** దేశంలో దూర ప్రాంతాలకు కూడా సత్వరం డెలివరీ చేసేందుకు, రైల్వేలతో చేసుకున్న ఒప్పందం ఉపకరిస్తోంది. గత అయిదేళ్లలో రైళ్లలో మా పార్శిళ్ల రవాణా 15 రెట్లు పెరిగింది.

✦ **పోటీ సంస్థల వల్ల వ్యూహాలు మార్చం:** ఇతర ఇ-కామర్స్ సంస్థలు, క్విక్ కామర్స్ సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీ అనుసరించి మా వ్యూహాలు రూపొందించం. మా వినియోగదారులకు మెరుగైన కొనుగోలు అనుభవాన్ని అందించేందుకు మావైన వ్యూహాలు అమలు చేస్తున్నాం.

2024-25లో 6.8% వృద్ధి

అక్టోబరులోనే రేట్ల కోతకు వీలు: ఎస్ అండ్ పీ

దిల్లీ: ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వృద్ధి రేటు 6.8 శాతంగా నమోదు కావొచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ మంగళవారం అంచనా వేసింది. 2025-26లో వృద్ధి రేటు 6.9 శాతానికి చేరొచ్చని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో దేశ ఆర్థిక వ్యవస్థ 8.2% వృద్ధి సాధించింది. 2024-25లో ద్రవ్యోల్బణం సరాసరిన 4.5 శాతంగా నమోదు కావొచ్చని ఎస్ అండ్ పీ అంచనా వేసింది. ఇటీవల అమెరికా ఫెడరల్ రిజర్వ్ 50 బేసిస్ పాయింట్ల మేర రేట్ల కోతకు దిగిన నేపథ్యంలో, అక్టోబరు 7-9 తేదీల్లో జరగబోయే ద్వైమాసిక పరపతి విధాన సమీక్షలో ఆర్‌బీఐ కూడా 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గించే అవకాశం ఉందని ఎస్ అండ్ పీ అంచనా వేసింది.

'బాధ్యతాయుత ఏఐ' అవసరం

ఐబీఎమ్ ఇండియా ఎండీ సందీప్ పటేల్

ముంబయి: భారత్‌లో 'డిజిటల్ పునరుజ్జీవం' జరుగుతున్న నేపథ్యంలో బాధ్యతాయుత కృత్రిమ మేధ (ఏఐ)పై దృష్టి సారించాలని ఐబీఎమ్ ఇండియా ఎండీ సందీప్ పటేల్ పేర్కొన్నారు. మంగళవారమిక్కడ జరిగిన 'ఐబీఎమ్ థింక్ 2024' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'ఐబీఎమ్ సహా ప్రతి ఒక్కరూ భారత్‌లో వినూత్నత సృష్టికి కట్టుబడి ఉండాలి. మా వరకు హైబ్రిడ్ క్లౌడ్, ఏఐపై వ్యూహాలను రచించడంపై దృష్టి సారించాం. ఏఐ అనేది అందరి నోళ్లలో ప్రస్తుతం నానుతున్న పదమే కాదు.. భారత కీలక వృద్ధికి చోదకశక్తిగానూ ఉండగలద'ని వివరించారు. భారత్‌లో 59% మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఏఐని అందిపుచ్చుకుంటున్నారని ఇటీవలి ఒక సర్వేలో తేలిందన్నారు. అంతర్జాతీయంగా ఇదే అత్యధిక స్థాయి అని పేర్కొన్నారు.

స్కోడా ఆటోలో మహీంద్రాకు 50% వాటా!

దిల్లీ: స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియాలో 50% వాటా తీసుకునేందుకు మహీంద్రా అండ్ మహీంద్రా ఆసక్తిగా ఉందని సమాచారం. ఇందుకు 800 మిలియన్ డాలర్ల నుంచి 100 కోట్ల డాలర్ల (సుమారు రూ.6,686-8358 కోట్ల) వరకు పెట్టుబడి అవసరం అవుతుందని అంచనా. ఈ విషయమై చర్చించేందుకు ఇరు సంస్థల ఉన్నతాధికారులు త్వరలో సమావేశం కానున్నారని ఆంగ్లపత్రికలు పేర్కొన్నాయి.

దిల్లీ విమానాశ్రయంలో ఎయిర్ ట్రైన్!

దిల్లీ: దిల్లీ విమానాశ్రయంలో టర్మినల్ 1 నుంచి ఇతర రెండు టర్మినళ్లకు ప్రయాణికులను చేరవేయడానికి రైళ్ల (ఎయిర్ ట్రైన్స్)ను నిర్వహించాలని ఆ విమానాశ్రయాన్ని నిర్వహిస్తున్న దిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్(డయల్) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఎయిర్ ట్రైన్ లేదా ఆటోమేటెడ్ పీపుల్ మూవర్ (ఏపీఎమ్) వ్యవస్థను డిజైన్ చేసి, నిర్మించి, నిర్వహించి, బదిలీ చేసే (డీబీఎఫ్ఓటీ) నమూనా అందించడానికి టెండర్ జారీ చేసింది. టర్మినల్ 1, టర్మినల్-3/2ల మధ్య 7.7 కి.మీ. మేర ఏపీఎమ్ సిస్టమ్‌ను నిర్మించాలి. ఈ రైళ్లు అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు అత్యంత సౌకర్యవంతంగా ఉండడమే కాకుండా కర్బన ఉద్గారాలు తగ్గుతాయని డయల్ పేర్కొంది. ప్రస్తుతం ఈ టెర్మినళ్ల మధ్య రోడ్డుపై బస్సుల్లో ప్రయాణిస్తున్నారు.

10,700 నకిలీ రిజిస్ట్రేషన్లు.. రూ.10,000 కోట్ల ఎగవేతలు

దిల్లీ: దేశవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో 10,700 నకిలీ కంపెనీల రిజిస్ట్రేషన్లు, రూ.10,179 కోట్ల జీఎస్‌టీ ఎగవేతలను జీఎస్‌టీ అధికారులు గుర్తించినట్లు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) సభ్యుడు శశాంక్ ప్రియ తెలిపారు. ఆగస్టు 16న ప్రారంభమైన తనిఖీల ప్రక్రియ అక్టోబరు 15 వరకు కొనసాగనుంది. ఇప్పటివరకు 67,970 జీఎస్‌టీ గుర్తింపు సంఖ్యలను (జీఎస్‌టీఐఎన్) పన్ను అధికారులు గుర్తించారు. సెప్టెంబరు 22 వరకు వీటిల్లో 59% (39,965 జీఎస్‌టీఐఎన్‌లను) పరిశీలించారు.


సెన్సెక్స్ 85,000+.. నిఫ్టీ 26,000+

సరికొత్త రికార్డులు సృష్టించిన సూచీలు

సమీక్ష

మార్కెట్లు సరికొత్త రికార్డులు నమోదు చేశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి లభించిన సానుకూల సంకేతాలతో మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ తొలిసారిగా 85,000 పాయింట్ల మైలురాయిని, నిఫ్టీ 26,000 పాయింట్ల స్థాయిని అధిగమించాయి. గరిష్ఠ స్థాయుల్లో అమ్మకాల ఒత్తిడితో, చివరకు పెద్దగా మార్పేమీ లేకుండా ముగిశాయి. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 75.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 9 పైసలు నష్టపోయి 83.63 వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ సానుకూలంగా ముగిశాయి. ఐరోపా సూచీలూ ఇదే ధోరణిలో ట్రేడయ్యాయి.

✦ సెన్సెక్స్ ఉదయం 84,860.73 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,928.61 పాయింట్లు) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. తర్వాత లాభాల్లోకి వచ్చినా, రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొంది. ఇంట్రాడేలో 85,163.23 పాయింట్ల వద్ద జీవనకాల కొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 14.57 పాయింట్ల నష్టంతో 84,914.04 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 ఒక పాయింటు లాభంతో 25,940.40 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 26,011.55 పాయింట్ల వద్ద జీవనకాల కొత్త గరిష్ఠాన్ని తాకింది.



✦ సెన్సెక్స్ 30 షేర్లలో 15 నష్టపోయాయి. హెచ్‌యూఎల్ 2.56%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.54%, కోటక్ బ్యాంక్ 1.23%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.20%, టైటన్ 1%, నెస్లే ఇండియా 0.97%, ఏషియన్ పెయింట్స్ 0.86%, బజాజ్ ఫైనాన్స్ 0.81%, బజాజ్ ఫిన్‌సర్వ్ 0.76% చొప్పున డీలా పడ్డాయి. టాటా స్టీల్ 4.29%, పవర్‌గ్రిడ్ 2.65%, టెక్ మహీంద్రా 1.88%, హెచ్‌సీఎల్ టెక్ 1.49%, ఎం అండ్ ఎం 0.78%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 0.61% లాభపడ్డాయి.

సెన్సెక్స్ ▼ 15	నిఫ్టీ ▲ 01
84914	25940

✦ రంగాల వారీ సూచీలకొస్తే ఎఫ్‌ఎంసీజీ, టెలికాం, సేవలు, ఆర్థిక సేవలు, మన్నికైన వినిమయ వస్తువులు, బ్యాంకెక్స్ నష్టపోయాయి. లోహ, విద్యుత్, యుటిలిటీస్, కమొడిటీస్ రంగాలు రాణించాయి.

✦ ఒడిశాలో రూ.40,000 కోట్ల ప్రతిపాదిత విద్యుత్ వాహన (ఈవీ), బ్యాటరీ ప్రాజెక్టును ఉపసంహరించుకోవడం లేదని **జేఎస్‌డబ్ల్యూ గ్రూప్** వివరణ ఇచ్చింది. ఈ ప్రాజెక్టును ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలించే ఉద్దేశంలో సంస్థ ఉందని వార్తలు రావడంతో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ స్పందించింది.

✦ ఇంజిన్ లీజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఈఎల్ఎఫ్‌సీ)తో వివాదాన్ని సామరస్యపూర్వకంగా పరిష్కరించుకున్నట్లు విమానయాన సంస్థ **స్పైస్‌జెట్** వెల్లడించింది. ఈఎల్ఎఫ్‌సీకి చెల్లించాల్సిన 16.7 మిలియన్ డాలర్ల (సుమారు రూ.139 కోట్ల)లో కొంత మొత్తం చెల్లించడం ద్వారా వివాదాన్ని పరిష్కరించుకున్నట్లు తెలుస్తోంది. ఎంత మొత్తం చెల్లించిందీ వెల్లడించలేదు.

లోహ షేర్లకు గిరాకీ

తన ఆర్థిక వ్యవస్థతో పాటు స్థిరాస్తి విపణికి మద్దతుగా చైనా విధాన నిర్ణయాలు ప్రకటించడంతో, మన లోహ షేర్లకూ గిరాకీ పెరిగింది. నేషనల్ అల్యూమినియం కంపెనీ 6.16%, టాటా స్టీల్ 4.29%, హిందాల్కో ఇండస్ట్రీస్ 3.98%, ఎన్‌ఎండీసీ 3.90%, వేదాంతా 3.80%, సెయిల్ 3.2%, జిందాల్ స్టెయిన్‌లెస్ 2%, జిందాల్ స్టీల్ 1.91%, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 0.61% చొప్పున పెరిగాయి.

తొలిరోజు నమోదు ఇలా..

✦ లాజిస్టిక్స్ కంపెనీ **వెస్ట్రన్ క్యారియర్స్** ఇష్యూ ధర రూ.172తో పోలిస్తే, తొలిరోజు ట్రేడింగ్‌లో 7 శాతానికి పైగా నష్టపోయి రూ.159.45 వద్ద ముగిసింది. బీఎస్ఈలో 1% నష్టంతో రూ.170 వద్ద నమోదైన షేరు ఒక దశలో 7.84% కోల్పోయి రూ.158.50 వద్ద కనిష్ఠాన్ని తాకింది కూడా. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,625.68 కోట్లుగా నమోదైంది.

✦ బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ **నార్తర్న్ ఆర్క్ క్యాపిటల్ లిమిటెడ్** షేరు బీఎస్ఈలో 33.46% ప్రీమియంతో (ఇష్యూ ధర రూ.263) రూ.351 వద్ద నమోదైంది. చివరకు 23% లాభంతో రూ.323.60 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.5,222.24 కోట్లుగా నమోదైంది.

✦ ఆర్కేడ్ డెవలపర్స్ లిమిటెడ్ షేరు, ఇష్యూ ధర రూ.128తో పోలిస్తే బీఎస్ఈలో 37.42% లాభంతో రూ.175.90 వద్ద నమోదైంది. ఒక దశలో 48.43% పెరిగి రూ.190 స్థాయిని తాకింది. చివరకు 29.57% లాభంతో రూ.165.85 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.3,079.23 కోట్లుగా నమోదైంది.

✦ **మన్బా ఫైనాన్స్** ఐపీఓ రెండో రోజుకు మదుపర్ల నుంచి 73.18 రెట్ల స్పందన లభించింది. 87,99,000 షేర్లను ఆఫర్ చేయగా, 64,39,20,375 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ విభాగంలో 70.18 రెట్ల స్పందన దక్కింది.

వసుంధర

vasundhara@eenadu.in



చదరంగంలో భారత్‌కి చారిత్రాత్మక విజయం! ఎన్నో ఏళ్ల ఎదురుచూపుల తరవాత చెస్ ఒలింపియాడ్‌లో మన తొలి 'పసిడి' కల నెరవేరింది. బుడాపెస్ట్ వేదికగా జరిగిన ఈ పోటీలో మన మహిళలు, పురుషుల జట్లు రెండూ ఈ ఘనత సాధించాయి. మహిళా బృందంలో మన తెలుగమ్మాయి ద్రోణవల్లి హారిక ఒకరు. ఈ సందర్భంగా 'వసుంధర' ఆమెను పలకరించింది...

ఇరవయ్యేళ్ల కల నిజమైంది!

ఆటలో గెలుపోటములు సహజమే కానీ ప్రయత్నలోపం ఉండకూడదన్నది నా అభిప్రాయం. ఎందుకంటే ఇది ఎంతటి క్లిష్టపరిస్థితులనైనా తట్టుకుని నిలబడగలిగే స్థైర్యాన్ని ఇస్తుంది. నా ఇరవై ఏళ్ల కెరియర్‌లో పది చెస్ ఒలింపియాడ్ పోటీల్లో పాల్గొన్నా. తాజా ఒలింపియాడ్ బృందంలో నేనే అందరికంటే సీనియర్‌ని. ఒక్కోసారి ఎంత అనుభవమున్న క్రీడాకారిణి అయినా ఒత్తిడికి తలొగ్గక తప్పదు. ఇలాంటప్పుడు ఓర్పు, సహనం చాలా అవసరం. అనుభవంతోనే ఈ విషయాన్ని నేర్చుకున్నా. తాజా పోటీల్లో మొదటి నాలుగు గేముల్లో తడబడినా.... తిరిగి పుంజుకుని నా తోటి క్రీడాకారిణులైన వంతిక, దివ్య, వైశాలి, తానియాల్లో స్ఫూర్తిని నింపగలిగా. దీంతో సమష్టిగా శ్రమించి... పసిడి పతకాన్ని సాధించి భారత పతాకాన్ని ఎగరేయగలిగాం.

బేబీ కిక్ కొట్టేది...

నాకు 13 ఏళ్లున్నప్పుడు చెస్‌లోకి అడుగుపెట్టాను. అప్పట్నుంచీ ప్రతిసారి భారత మహిళల బృందం... పోడియంపై నిలబడి పతకం అందుకోవాలని కలలు కన్నా.. తాజాగా సాధించిన బంగారు పతకంతో అది నెరవేరింది. దీంతో పాటు 2022లో చెన్నైలో జరిగిన ఒలింపియాడ్ కూడా నాకు ప్రత్యేకం. కెరియరా? పిల్లలా?.. అనడిగితే దేన్నీ వదులుకోలేరు చాలామంది మహిళలు. జీవితం ఎంత క్లిష్టంగా మారినా.. రెండింటినీ సమన్వయం చేసుకోవడానికే శాయశక్తులా ప్రయత్నిస్తారు. నేనూ అదే చేశా. తొమ్మిది నెలల గర్భిణిగా, అదీ ప్రసవానికి రెండు వారాల ముందు ఈ పోటీలో పాల్గొన్నా. అంతా సాహసం చేస్తున్నావన్నారు. కానీ, డాక్టర్ సలహాతో ధైర్యంగా ముందడుగు వేశా. బోర్డు ముందు కూర్చుని ఎంత ఏకాగ్రతతో గేమ్ ఆడుతున్నా... కడుపులోని బిడ్డ కాళ్లతో తన్నడం తెలిసేది. ఆ మధుర క్షణాలను కూడా ఆస్వాదిస్తూ గేమ్‌లో ముందుకు సాగాను. ఆ ఒలింపియాడ్‌లో దేశానికి తొలి పతకం(కాంస్యం) అందించడం ఎంతో సంతోషాన్నిచ్చింది. తరవాత నాకు పాప పుట్టింది. హారిక, కార్తీక్.. ఈ రెండు పేర్లు కలిసేలా తనకి 'హన్విక' అని పేరు పెట్టుకున్నాం. పాపకి నాలుగు నెలలు వచ్చినప్పటి నుంచే తిరిగి పోటీలకు వెళ్లడం మొదలుపెట్టా. నెమ్మదిగా అమ్మ, అమ్మమ్మలకు తనని అలవాటు చేశా. చుట్టూ ఎవరో ఒకరు ఉంటారు కాబట్టి... నేను లేనని గ్రహించలేకపోయేది. కానీ, తల్లిగా నాకు మాత్రం చాలా గిల్టీగా అనిపిస్తుంది. కుటుంబ సభ్యులతో గడిపే సమయం తక్కువే. అయినా సరే, నన్ను, నా ఆశయాలను నా భర్త, ఇతర కుటుంబ సభ్యులు అర్థం చేసుకుని ప్రోత్సహిస్తున్నారు.

చదరంగమే నా ప్రపంచం...

చాలామంది శారీరక శ్రమ అవసరం లేకుండా చెస్ ఆడేయొచ్చు అనుకుంటారు. కానీ, చదరంగం ఆడటం అంత సులువేం కాదు. ఎత్తుకు పైఎత్తులేస్తూ మెదడును పరుగెత్తించాలి. ఆట పూర్తయ్యేవరకూ స్థిరంగా కూర్చోవాలి. ఇందుకు శారీరకంగానూ, మానసికంగానూ దృఢంగా ఉండాలి. నాకు చిన్నప్పటి నుంచీ చెస్ తప్ప మరో ప్రపంచం తెలియదు. నిత్యం సాధన పోటీలే. అందుకే, ఫిట్‌నెస్ కోసం రోజూ ఒక గంట బ్యాడ్మింటన్, టెన్నిస్, పిలాటిస్ వంటి వర్కవుట్లు సాధన చేస్తా. ఇవి ఎప్పటికప్పుడు నన్ను రిఫ్రెష్ చేస్తాయి. మరిన్ని లక్ష్యాలను ఏర్పరుచుకోవడానికి సిద్ధం చేస్తాయి. ఒలింపియాడ్ విజయం స్ఫూర్తితో విమెన్స్ వరల్డ్ చెస్ ఛాంపియన్‌షిప్ గెలవడం లక్ష్యంగా పెట్టుకున్నా.

– తాతినేని పూర్ణిమ శ్రీనివాసరావు, విజయవాడ



మొదటి సీఎంగా..!

మీకు తెలుసా?

సుచేతా కృపలానీ... మన దేశంలో మొట్టమొదటి మహిళా సీఎం. ఈవిడ 1963 నుంచి 1967వరకూ ఉత్తర్‌ప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా పనిచేశారు.



వారివైపే మాట్లాడితే ఎలా?

నేనో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నా. మా బృందానికి కొన్నినెలల నుంచీ ప్రాజెక్టు ఇవ్వలేదు. గతవారం బృందంలో ఇద్దరు సభ్యులు నా గురించి చెడుగా మాట్లాడుకోవడం విన్నాను. ఇదే విషయాన్ని మా టీమ్‌లీడ్‌కు చెప్పాను. కానీ, ఆయన కూడా వారివైపే మాట్లాడుతున్నారు. దాంతో నాకు చాలా కోపం, బాధ కలిగాయి. ఉద్యోగం వదిలేయాలని అనిపిస్తోంది. ఏం చేయను – ఓ సోదరి

డియర్... వసుంధర



కవితా గూడపాటి

ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

మీ గురించి చెడుగా మాట్లాడుకోవడం విని మీకు బాధగా అనిపించడంలో తప్పులేదు. అయితే, ఆ విషయాన్ని మీ టీమ్‌లీడ్‌కు చెప్పడానికి ముందే ఆమెతోనే నేరుగా మాట్లాడి ఉండాల్సింది. పని చేసేటప్పుడు ఒక్కోసారి ఇలాంటి పరిస్థితులు వస్తుంటాయి. అయితే, మొదటవాటిని నేరుగానే పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలి. అదీ సాధ్యం కాకపోతే ఫిర్యాదు చేయాలి. లేదా అసలు అందులో ఎటువంటి నిజం లేదనుకున్నప్పుడు ఆ విషయాన్ని పట్టించుకోకుండా వదిలేయనూవచ్చు. మీ టీమ్‌లీడ్, సహోద్యోగులు మీ వైపు మాట్లాడలేదని ఉద్యోగం మానేయాలనుకుంటున్నారు. అది పరిష్కారం కాదు. ముందు మనల్ని ఏ సంస్థ అయినా నియమించుకునేది పనిచేయడం కోసం. మన ప్రథమ కర్తవ్యమూ అవ్వాలి. అంతే తప్ప ఎవరైనా సరే అనవసర వదంతులు వ్యాపింపజేయడం, ఒకరిపైఒకరు ఫిర్యాదులు చేసుకోవడం సరికాదు. పైగా మీకు ఇంకా ఎటువంటి పనీ ఇవ్వలేదంటున్నారు. అలాంటప్పుడు మీరూమీరూ పోట్లాడుకుని బాస్‌కు తలనొప్పి తీసుకురావడం వల్ల మీ ఉద్యోగాలకే ప్రమాదం. బృందంతో కలిసి పనిచేసేటప్పుడు ఒకరికొకరు సహకరించుకుంటూ పనిచేయాల్సి ఉంటుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుంటే ఎటువంటి సమస్యలూ ఎదురుకావు. మీపని మీరు హాయిగా చేసుకోగలుగుతారు.

నెయ్యి స్వచ్ఛమేనా?

వేడి అన్నం... ఆవకాయ... కాస్తంత నెయ్యి... దానిముందు పంచభక్ష్య పరమాన్నాలూ అవసరం లేదని తినేస్తాం. త్వరగా జీర్ణమవుతుంది, ఆరోగ్యానికి మంచిదని పిల్లలకీ తినిపిస్తుంటాం. అయితే అందరికీ ఇంట్లోనే చేసే ఓపిక ఎక్కడిది? అందుకే బయటి నుంచి తెచ్చుకునే వారే ఎక్కువ. మరి అది మంచిదేనా? పరీక్షించుకోండిలా!

- వేడి అన్నం మీద నెయ్యి వెయ్యగానే చిటికెలో కరిగిపోతుంది కదా! ఈసారి మీ అరచేతిలో కాస్త వేసుకుని కొన్ని నిమిషాలు వేచిచూడండి. కరిగిందా... అయితే అది స్వచ్ఛమైనదే! మన శరీర వేడికి అలా జరుగుతుందట. కరగకపోతే మంచిది కాదన్నట్టే!
- చాలావరకూ నెయ్యిలో వెజిటబుల్ ఆయిల్స్ కలిపి అమ్మేస్తుంటారు. అలా కల్తీ జరిగిందేమో తెలుసుకోవాలంటే ఓ పారదర్శక డబ్బాలో రెండు చెంచాల నెయ్యి పోసి, దానికి చెంచా చక్కెర చేర్చి బాగా కలపండి. రంగు మారలేదా... నిర్భయంగా వాడుకోవచ్చు. ఎర్రగా మారితే మాత్రం కల్తీ జరిగినట్టే.



- ఒక గిన్నె తీసుకొని దానిలో నెయ్యి వేసి వేడి చేయండి. వెంటనే కరిగి గోధుమ రంగులోకి మారితే సరే! కరగడం ఆలస్యమైనా... పసుపు వర్ణంలో కనిపిస్తున్నా అనుమానించాల్సిందే. లేదంటే కొన్ని చెంచాల నెయ్యిని పారదర్శక పాత్రలో పోసి, కొన్ని గంటలు ఫ్రిజ్‌లో పెట్టండి. మొత్తం సమానంగా గడ్డకడితే అనుమానమే అక్కర్లేదు. అలాకాకుండా వేర్వేరు పొరలుగా విడిపోయి గడ్డకడితే సోయాబీన్, కొబ్బరి, సన్‌ఫ్లవర్ వంటి నూనెలు కలిపారని అర్థం.
- ఓ గ్లాసునీరు తీసుకుని దానిలో చెంచా నెయ్యి వేయండి. నీటిలో కలిసిపోయినా, నీటి అడుగుకు చేరినా అది స్వచ్ఛమైనది కాదు. స్వచ్ఛమైన నెయ్యి నీటిపై తేలుతుంది.
- ఓ తెల్లకాగితం లేదా వస్త్రం మీద ఒక చుక్క నెయ్యి వేసి కొద్దిసేపు పక్కన పెట్టండి. స్వచ్ఛమైన నెయ్యి నూనె మరకలా ఏర్పడి క్రమంగా మాయమవుతుంది. కల్తీది మరక కనిపించడమే కాదు... జిడ్డుగానూ ఉంటుంది.

ఇవన్నీ తెలియడం లేదు అనిపిస్తే నెయ్యిని కరిగించి, కొన్ని చుక్కల అయోడిన్ కలపండి. వంకాయ రంగులోకి మారితే పిండి కలిపారని అర్థం. లేదా హైడ్రోజన్ క్లోరైడ్ ద్రావణం, కొద్దిగా చక్కెర కలిపి బాగా కుదపండి. ఎర్రరంగులోకి మారితే వనస్పతిని జోడించినట్టు. ఆహారంతోనే ఆరోగ్యం. ఒకటికి రెండుసార్లు పరీక్షించుకున్నాకే తీసుకోవడం మేలు.

బంగారం వెండి



24న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	76,360	76,150	74,750	74,590
ఆర్నమెంట్	70,000	69,800	70,000	69,800
వెండి (కిలో)	98,000	98,000	91,200	91,400

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	75,950	75,700	75,900	74,610
ఆర్నమెంట్	70,300	70,100	69,960	69,460
వెండి (కిలో)	89,000	89,000	90,300	90,500

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	75,870	75,870	------	------
ఆర్నమెంట్	69,800	67,800	7,000	6,980 గ్రా
వెండి (కిలో)	89,000	89,000	98.00	98.00 గ్రా

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్, టెలిగ్రాంల ద్వారా పంపవచ్చు.



నిమ్స్... చీరల నుంచి సూట్‌లకు మారింది!

కాలం మారుతోన్న కొద్దీ కట్టుబాట్లూ మారాలి. అప్పుడే సమాజంతో పాటు ముందుకువెళ్లగలం. ఈ స్ఫూర్తితోనే తాజాగా హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి కూడా ఓ కీలక నిర్ణయం తీసుకుంది. 60ఏళ్ల నిమ్స్ చరిత్రలో తొలిసారి మహిళా నర్సుల యూనిఫామ్‌లో మార్పులు తీసుకొచ్చింది. ఒకప్పుడు నర్సులంటే తెల్లని చీర, ఫ్రాక్, తలపై టోపీ... ఇలానే కనిపించేవారు. అయితే, కాలక్రమంలో కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఈ డ్రెస్‌కోడ్ మారినా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రం కొనసాగుతోంది. అయితే, ఈ పద్ధతిలో మార్పు తెస్తూ... ఇకపై నర్సులందరూ షర్ట్‌ప్యాంట్ సెట్(స్క్రబ్ సూట్లు), సల్వార్లను వేసుకోవచ్చని సూచించింది నిమ్స్. అంతేకాదు, అనాదిగా వస్తోన్న టోపీ ధరించే నియమాన్నీ సడలించింది. ఇందులో భాగంగా స్టాఫ్ నర్సులకు టర్కోయిస్ బ్లూ స్క్రబ్ సూట్ లేదా హాఫ్ స్లీవ్స్‌తో ఉన్న చుడీదార్, హెడ్ నర్స్‌లకైతే బర్గండీ స్క్రబ్ సూట్ లేదా త్రీఫోర్త్ స్లీవ్స్ ఉన్న చుడీదార్, నర్సింగ్ సూపరింటెండెంట్‌లకు పీచ్ కలర్ స్క్రబ్ సూట్ లేదా చుడీదార్‌లు వేసుకునే అవకాశం ఇచ్చింది. ఒకప్పటి డ్రెస్ కోడ్ పనిచేయడానికి సౌకర్యంగా లేదంటూ మహిళా నర్సులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వార్డుల్లో, ఎమర్జెన్సీ వింగ్స్‌లో పనిచేస్తున్నప్పుడు తరచూ ఈ తెల్లటి దుస్తులపై రసాయనాలు, మందుల్లాంటివి చిందడం, రక్తపు మరకలు అంటుతుండడం వల్ల శుభ్రం చేసుకోవడానికి కష్టమవుతోంది. ప్రతిసారీ కొత్తవి కొనాలంటే అదనపు భారం. పైగా నెలసరి సమయంలో ఈ తెల్లటి దుస్తులతో పనిచేయడం మరో సవాలు. ఈ సమస్యలన్నింటినీ వాళ్లు ఇంటర్నల్ కమిటీకి వివరించడంతో వాళ్లు ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌ను సంప్రదించి ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతేకాదు, ప్రస్తుతం మిగతా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మహిళా నర్సులు కూడా ఈ డ్రెస్‌కోడ్‌ను తమకూ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏదిఏమైనా నిమ్స్ తీసుకున్న ఈ నూతన నిర్ణయం ప్రగతిశీల ఆలోచనా విధానాన్ని తెలియజేస్తోంది కదూ!

క్రీములు... ఫ్రిజ్‌లో..!

చాలావరకూ స్కిన్ కేర్ ఉత్పత్తులపై ఎండ తగలని, చల్లగా ఉండే ప్రదేశాల్లో ఉంచమనే ఉంటుంది. చర్మానికి చల్లగా వేసే ప్యాక్‌లు ఎంత హాయిగా అనిపిస్తాయో! అలాంటప్పుడు వీటినీ ఫ్రిజ్‌లో పెట్టి వాడుకుంటే...?

ఆహార పదార్థాలు త్వరగా పాడవకుండా ఫ్రిజ్‌లో పెడతాం కదా! అది స్కిన్ కేర్ ఉత్పత్తులకూ వర్తిస్తుంది. సహజ, సేంద్రియ ఉత్పత్తుల్లో నిల్వ కారకాలు వాడరు. దీంతో త్వరగా పాడయ్యే అవకాశమెక్కువ. ఇలాంటప్పుడు వాటిని ఫ్రిజ్‌లో పెడితే త్వరగా పాడవ్వవు. కళ్లు ఉబ్బడం, మంట పుట్టడం లాంటివి జరిగితే చల్లని నీటిలో తడిపి, పిండేసిన వస్త్రాన్ని కళ్లపై ఉంచుతాం. కీర, బంగాళదుంప ముక్కల్ని చల్లగా ఉంచినా త్వరగా ప్రయోజనం ఉంటుంది గమనించారా? ముఖం మంటగా ఉంచినప్పుడు, ఏవైనా అలర్జీలు వచ్చినా చల్లగా ఏదైనా ఉంచితే ఎంత హాయిగా ఉంటుంది! అన్నీ ప్రయోజనాలే. ఇంకెందుకు ఆలస్యం... క్రీములన్నీ ఫ్రిజ్‌లో పెట్టేద్దాం అంటారా? ఆగండాగండి... చల్లదనం చర్మానికి మంచిదే! కానీ అన్నింటికీ ఒకే మంత్రం అంటే ఎలా?



ఐ క్రీములు అలసిన కళ్లను సేదతీరుస్తాయి. ఉబ్బు, గీతలు వంటివీ తగ్గిస్తాయి. వీటిని పెడితే ప్రయోజనమే. జెల్ ఆధారిత, షీట్ మాస్కులు కూడా చల్లగా ఉన్నప్పుడు మరింత ప్రయోజనాన్ని అందిస్తాయి. పైగా చర్మానికి తాజా లుక్‌ని ఇస్తాయి. వీటినీ పెట్టొచ్చు. ఇక సీరమ్‌లు... ముఖ్యంగా విటమిన్ సి ఉన్నవి ఆక్సీడేషన్‌కి గురయ్యే అవకాశమెక్కువ. కాబట్టి, వీటికీ చోటివ్వొచ్చు. అలోవెరా జెల్, రోజ్‌వాటర్, మిస్ట్‌లు... అన్నీ మేలు చేసేవే! అయితే ఆయిల్ బేస్డ్, క్లే ఆధారిత ఉత్పత్తులను పెడితే వాడటానికి ఇబ్బందిగా మారతాయి. ఇక క్రీముల్లో బోలెడు పదార్థాలను వాడతారు. అవి వేటికవే విడిపోయే ప్రమాదం ఉంటుంది. సన్‌స్క్రీన్‌దీ అదే పరిస్థితి. కాబట్టి, వాటిని గది ఉష్ణోగ్రతకే పరిమితం చేస్తే సరి. అయితే వాటి మూతలు గట్టిగా పెడుతున్నారా అన్నది గమనించుకోవడం మాత్రం తప్పనిసరి.

74ఏళ్ల విద్యార్థిని!

పేదరికం, బాల్యవివాహం ఆమెను చదువుకు దూరం చేశాయి. కానీ చదువుకోవాలి, ఎదగాలన్న తపన ఆమెను ముందుకు నడిపాయి. కాబట్టే... 74 ఏళ్ల వయసులోనూ కాలేజీ గడప తొక్కగలిగారు తంకమ్మ!



ఎనిమిదో తరగతి పూర్తవ్వగానే తంకమ్మకు పెళ్లిచేశారు. పేదకుటుంబం... చదువుకుందామని ఉన్నా కొనసాగించలేకపోయారామె. ఇంతలో ఇద్దరు పిల్లలు. ఈమెది కేరళలోని కొట్టాయం. భర్తకు సాయంగా మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీమ్‌లో పని చేసేవారు. బృందంలో సభ్యురాలిగా కాదు... అందరినీ నడిపే సూపర్‌వైజర్ కావాలన్నది ఆమె కల. కానీ దానికి పదోతరగతి పూర్తిచేయాలి. ఆ హోదా కోసం తిరిగి పుస్తకం పట్టారు తంకమ్మ. ఓవైపు ఉద్యోగం చేస్తూనే రాత్రుళ్లు చదువునీ కొనసాగించారు. 74శాతం మార్కులతో పది పాసయ్యారు. 60ఏళ్ల వయసులో సూపర్‌వైజర్ అయ్యారు. అంతేకాదు, కుటుంబశ్రీతోపాటు కొన్ని ఎన్‌జీఓలతో కలిసి సేవాకార్యక్రమాలూ ప్రారంభించారు. స్థానిక ఫైర్ స్టేషన్‌లో ట్రైనింగ్ కోర్సు పూర్తిచేసి, సివిల్ డిఫెన్స్ ఆఫీసర్‌గా మారారు. పోలీస్ అకాడమీ నుంచి ప్రమాదాల్లో గాయాలపాలైన వారికి సాయపడేలా సీపీఆర్, ఫస్ట్ ఎయిడ్ వంటివీ నేర్చుకున్నారు.

మరోవైపు ఆమె పట్టుదలగా చదవడం చూసిన కోడలు కూడా పదోతరగతి పూర్తిచేసింది. ఆపై ఇంటర్ కూడా. తను ఒకరికి స్ఫూర్తిగా నిలవడం తంకమ్మకి ఆనందాన్నిచ్చింది. దీంతో ఆమెకూడా పై చదువులు కొనసాగించాలనుకుని ఇంటర్‌లో చేరారు. ఈసారి 78% మార్కులతో పాసయ్యారు. ఈమె పట్టుదల చూసిన స్థానిక డిగ్రీ కళాశాల వాళ్లు ఆమెకు కళాశాలలో సీటిచ్చారు. అలా బీకాం ఆనర్స్‌లో చేరారు తంకమ్మ. 'నాకు ఇంగ్లిష్‌లో ఇబ్బంది అని మలయాళంలో నోట్స్‌ని సిద్ధం చేసిస్తున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు కలిసిపోవడమే కాదు... 'అమ్మ', 'అమ్మమ్మ', 'బామ్మ' అనీ పిలుస్తున్నారు. యువతతో కలిసి చదవడం కొత్త అనుభూతి. ఆరోగ్యం సహకరిస్తే డిగ్రీ తర్వాతా చదువు కొనసాగించాలని ఉంది' అంటోన్న 74 ఏళ్ల తంకమ్మ నుంచి మనమూ నేర్చుకోవాల్సింది చాలానే ఉంది కదూ!



ప్రతిచుక్కా వచ్చేలా...

సాధారణంగా కిచెన్‌లో సంప్రదాయ వంటపరికరాలనే ఎక్కువగా వాడుతుంటాం కదా! కానీ, కాలానికి తగ్గట్లు ఈ అధునాతన పరికరాలనూ వంటగదిలోకి ఆహ్వానించేయండి. పని మరింత వేగంగా పూర్తవుతుంది.

స్మార్ట్ కిచెన్

అనువుగా...

సాధారణంగా నిమ్మకాయల నుంచి రసం తీయడానికి మనం వాడే స్క్వీజర్... ఎంత గట్టిగా ఒత్తినప్పటికీ ఎంతో కొంత రసం ఇంకా మిగిలేఉంటుంది. ఆ తరవాత చేత్తో ఒత్తితే కానీ పూర్తిగా రసం రాదు. ఆ శ్రమ లేకుండా ఈ 'పోర్టబుల్ లెమన్ స్క్వీజర్'ను తీసుకురండి. దీనిలో స్లిమ్‌లైన్ డిజైన్ ఉండడంవల్ల నిమ్మకాయలోని రసమంతా ఒకేసారి పిండేయొచ్చు. అంతేకాదు దీంతో ఆరెంజ్, బత్తాయి లాంటివీ ముక్కలుగా కట్ చేసి సులువుగా రసం తీసుకోవచ్చు.





ఒకేసారి రెండు..

కజ్జికాయలు, డంప్లింగ్స్ లాంటివి చేయడానికి మనం వాడే సంప్రదాయ పరికరంతో శక్తినంతా ఉపయోగించి ఒత్తాల్సి ఉంటుంది. ఆ ఇబ్బందిలేకుండా 'ఆటోమేటిక్ డంప్లింగ్ మేకర్'ను తెచ్చేసుకోండి. దీంతో రెండు డంప్లింగ్స్‌నూ ఒకేసారి తయారుచేసుకోవచ్చు. ముందుగా రుద్దిన చపాతీలు రెండింటిని ట్రేల్లో పెట్టాలి. ఆ తరవాత వాటిమీద పొడిపిండి చల్లి అందులో స్టఫ్ పెట్టేసుకుని బటన్ నొక్కితే చాలు. ఒకేసారి రెండు డంప్లింగ్స్ తయారైపోతాయి.





ఆ భయం లేకుండా...

మామూలుగా రెండు మూడు కోడిగుడ్లను ఉడికించడం పెద్ద పనేం కాదు. కానీ ఒకేసారి ఎక్కువ గుడ్లు ఉడికించాలంటే మాత్రం ఎక్కడ పగిలిపోతాయో అన్న భయం. అలాకాకుండా 'ఎగ్ స్టీమర్ ర్యాక్' మనకు సాయపడుతుంది. దీన్లో సింగిల్, డబుల్ ర్యాక్ ఉన్నవీ ఉంటాయి. గుడ్లను వాటిలో పెట్టి ర్యాక్‌కు ఉన్న హ్యాండిల్ సాయంతో కుకర్‌లో పెట్టి ఉడికించుకుంటే సరి.







వచ్చేసింది హానర్ లైట్ 200



హానర్ సంస్థ తమ 200 ఫోన్ల శ్రేణిని విస్తరించింది. మనదేశంలో అధికారికంగా **హానర్ 200 లైట్‌**ను ఆవిష్కరించింది. ఆక్టాకోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 6080 చిప్‌సెట్‌తో కూడిన ఇది 8జీబీ ర్యామ్, 256జీబీ ఇంటర్నల్ స్టోరేజీతో వస్తోంది. ఫీచర్ల విషయానికి వస్తే- 108ఎంపీ ప్రధాన కెమెరా, 50ఎంపీ సెల్ఫీ కెమెరా, 6.7 అంగుళాల ఎఫ్‌హెచ్‌డీ+ అమొలెడ్ డిస్‌ప్లే, 1080×2412 పిక్సెల్ రెజల్యూషన్, 90హెచ్‌జెడ్ రిఫ్రెష్ వేగం, 2000 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, 4,500 ఎంఏహెచ్ బ్యాటరీ, 35డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్టు కలిగుంది. ఆండ్రాయిడ్ 14 ఆపరేటింగ్ సిస్టమ్, హానర్ సొంత మ్యాజిక్ ఓస్ 8.0తో పనిచేస్తుంది. ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఈ ఫోన్‌కు పక్క వైపున ఉంటుంది. స్టారీ బ్లూ, సియాన్ లేక్, మిడ్‌నైట్ బ్లాక్ రంగుల్లో లభించే దీని ధర రూ.17,999.


ఇన్ఫినిక్స్ ఏఐతో కొత్త ఫోన్



ఇన్ఫినిక్స్ సంస్థ తాజా మధ్య శ్రేణి స్మార్ట్‌ఫోన్ **ఇన్ఫినిక్స్ జీరో 40 5జీ**ని మనదేశంలో పరిచయం చేసింది. ఇన్ఫినిక్స్ ఏఐని సమ్మిళితం చేసిన తొలి ఫోన్ ఇదే. మీడియాటెక్ డైమెన్సిటీ 8200 అల్టిమేట్ ఎస్‌ఓసీ చిప్‌సెట్‌తో పనిచేస్తుంది. ఫీచర్ల విషయానికి వస్తే- 6.7 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ కర్వ్‌డ్ అమొలెడ్ తెర, 144హెచ్‌జెడ్ రిఫ్రెష్ వేగం, 1,300 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ ప్రొటెక్షన్, వెనక మూడు కెమెరాల వ్యవస్థ, గోప్రో మోడ్, 12జీబీ ఎల్‌పీడీడీఆర్‌ఎక్స్ ర్యామ్, 512 జీబీ యూఎఫ్‌ఎస్ 3.1 ఆన్‌బోర్డ్ స్టోరేజీ వంటివి అలరిస్తున్నాయి. ఈ ఫోన్ ఆండ్రాయిడ్ 14 ఆధారిత ఎక్స్‌ఓఎస్ 14.5తో ముందే ఇన్‌స్టాల్ అయ్యి వస్తోంది. 12జీబీ + 256 జీబీ రకం ధర రూ.27,999, 12జీబీ + 512 జీబీ రకం రూ.30,000కు అందుబాటులో ఉంటుంది.

హెచ్‌పీ కొత్త కలర్ ప్రింటర్లు

మనదేశ వ్యాపార సంస్థలను దృష్టిలో పెట్టుకొని హెచ్‌పీ సంస్థ హెచ్‌పీ కలర్ లేజర్‌జెట్ ప్రో 3000 శ్రేణిలో కొత్త ప్రింటర్లను తీసుకొచ్చింది. విద్యుత్తును ఆదా చేసే టెరాజెట్ టెక్నాలజీతో కూడిన ఇది మునుపటి కన్నా స్పష్టమైన రంగులతో, అత్యంత వేగంగా ప్రింట్ చేస్తుంది. ఈ శ్రేణిలో రెండు మోడళ్లు.. సింగిల్ ఫంక్షన్ **హెచ్‌పీ కలర్ లేజర్‌జెట్ ప్రో 3203డీడబ్ల్యూ**, మల్టీ ఫంక్షన్ **హెచ్‌పీ కలర్ లేజర్‌జెట్ ప్రో 3303ఎస్‌డీడబ్ల్యూ** అందుబాటులోకి వచ్చాయి.



వీటితో కలర్, బ్లాక్ అండ్ వైట్‌లో ప్రింటింగ్, స్కానింగ్, కాపీ చేసుకోవచ్చు. నిమిషానికి 25 పేజీలు ప్రింట్ చేస్తాయి. డ్యూప్లెక్స్ ప్రింటింగ్ ఫీచర్ తనకు తానే పేజీకి రెండు వైపులా ప్రింట్ చేస్తుంది. దీంతో కాగితాలు ఆదా అవుతాయి. ఒక్కో సైకిల్‌లో 40వేల పేజీలను ప్రింట్ చేసుకోవచ్చు. ఒక టోనర్ 1300 నలుపు, 1200 రంగుల పేజీలను ప్రింట్ చేస్తుంది. హెచ్‌పీ స్టోర్‌లో 3203డీడబ్ల్యూ రూ.50,404, 3303ఎస్‌డీడబ్ల్యూ రూ.61,181 ధరల్లో లభిస్తాయి.

భూమికి రెండో చంద్రుడు!

గ్రహ శకలాలు భూమిని సమీపిస్తున్నప్పుడు రెండు ఘటనలు జరిగే అవకాశముంది. ఒకటి- అవి భూ వాతావరణంతో ఢీకొని మండిపోవటం. దీంతో ఆకాశంలో ప్రకాశవంతమైన వెలుగు రేఖ ఒకటి ఏర్పడుతుంటుంది. రెండు- భూమిని ఢీకొని పెద్ద రంధ్రం ఏర్పడటం. చాలా చాలా అరుదుగా భూమి గురుత్వాకర్షణ దాన్ని ఒడిసి పట్టొచ్చు. అప్పుడవి భూమి చుట్టూ తిరుగుతుంటాయి. అంటే చంద్రుడిలాగా అన్నమాట. ఇప్పుడు అలాంటి ఘటనే ఆవిష్కృతం కానుంది!



మన భూమికి రెండు చంద్రుళ్లుంటే ఎలా ఉంటుంది? ఊహించుకోవటానికే అద్భుతంగా అనిపిస్తోంది కదా. ఇక అదే నిజమైతే? తాత్కాలికంగానే అయినా ఇది త్వరలోనే నిజం కానుంది. మన భూమి గురుత్వాకర్షణకు లోబడిన **2024 పీటీ5** అనే గ్రహ శకలం జాబిల్లిగా మారనుంది! ఈ నెల 29 నుంచి నవంబరు 25 వరకూ భూమి చుట్టూ ప్రదక్షిణ చేయనుంది. అనంతరం భూ గురుత్వాకర్షణ నుంచి విడిపోయి, తిరిగి అంతరిక్షంలోకి ఎగిరిపోతుంది. అయితే చాలా ఎత్తులో, చిన్నగా ఉండటం వల్ల మన కళ్లతో గానీ చిన్న టెలిస్కోప్‌తో గానీ చూడలేం. పెద్ద టెలిస్కోప్‌లతోనైతే చూడొచ్చు. వర్ధమాన ఖగోళ శాస్త్రవేత్తలకిదో అరుదైన అవకాశంగా భావిస్తున్నారు. ఇది 33 అడుగుల పొడవు.. అడ్డంగా 16 నుంచి 138 అడుగులు ఉంటుంది. రష్యాలో 2013లో పేలిన గ్రహశకలం కన్నా కాస్త పెద్దది. అదృష్టంకొద్దీ దీంతో మనకు కలిగే ముప్పేమీ లేదు. భూమిని ఢీకొట్టే ఆస్కారమైతే లేదు.


గుర్తించటం కష్టమే

సాధారణంగా భూ గురుత్వాకర్షణను తప్పించుకోలేక, కొద్దికాలం ప్రదక్షిణ చేసే గ్రహ శకలాలను 'మినీ మూన్స్' అంటారు. చిన్నగా ఉండటం, అతి వేగంగా కదలటం వల్ల వీటిని గుర్తించటం కష్టం. కొన్నిసార్లు కృత్రిమ వస్తువులూ ఇలా కనిపించిన ఉదంతాలు లేకపోలేదు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీకి చెందిన గాయియా వ్యోమనౌకను ఒకసారి గ్రహ శకలమనీ పొరపడ్డారు. రాకెట్ల అవశేషాలూ వీటిని తలపిస్తుంటాయి. కానీ 2024 పీటీ5 మాత్రం అలాంటిది కాదని, ఖగోళ వస్తువు అనటంలో ఎలాంటి సందేహం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

అట్లాస్ సాయంతో

నాసా ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న ఆస్టరాయిడ్ టెరిస్ట్రియల్-ఇంపాక్ట్ లాస్ట్ అలర్ట్ సిస్టమ్ (అట్లాస్) సాయంతో ఆగస్టు 7న 2024 పీటీ5ను గుర్తించారు. ఇది సుమారు రెండు నెలల పాటు భూమి చుట్టూ ప్రదక్షిణ చేయొచ్చని దీని గమనం తీరు సూచిస్తోంది. దీని పుట్టుక చివరికి చంద్రుడి వద్దకే చేరుతుండటం విచిత్రం. గత గమనాలను బట్టి చూస్తే- ఇది ఏదో ఒక అంతరిక్ష వస్తువు ఢీకొన్నప్పుడు చంద్రుడి నుంచి విడివడిన ముక్కలా కనిపిస్తోందని నాసా జెట్ ప్రొపల్షన్ ల్యాబొరేటరీకి చెందిన నియర్ ఎర్త్ ఆబ్జెక్ట్ స్టడీస్ డైరెక్టర్ పాల్ చోడస్ అంటున్నారు. అంటే కొత్త మినీ మూన్ మన చంద్రుడిలో చిన్న భాగమన్నమాట. చంద్రుడి వారసత్వాన్ని కలిగున్నప్పటికీ సాంకేతికంగా దీన్ని మినీ మూన్‌గా భావించలేం. భూమి గురుత్వాకర్షణకు లోబడిన గ్రహ శకలం మన గ్రహం చుట్టూ కనీసం ఒకసారైనా పూర్తిగా ప్రదక్షిణ చేయాలి. కానీ గుర్రం నాడా ఆకారం కక్ష్య గల 2024 పీటీ5 అలా తిరగటం లేదు. అందువల్ల దీన్ని మినీ మూన్‌గా పరిగణించే అవకాశాలు లేవని శాస్త్రవేత్తలు అంటున్నారు.

విలువైన లోహాల గనులు




ఇదీ 2024 పీటీ5 గమన మార్గం అంచనా

మినీ మూన్స్ కావొచ్చు, భూమిని చుట్టే 2024 పీటీ5 వంటి గ్రహ శకలాలు కావొచ్చు. ఖగోళ పరంగా ఆసక్తిని కలిగించే వీటిల్లో విలువైన లోహాలు దండిగా ఉంటాయి. ఏదో ఒకరోజున కంపెనీలు వీటి మీద తవ్వకాలు జరిపినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇప్పటికే ఇలాంటి ప్రయత్నాలకు శ్రీకారం చుట్టారు. ఏకంగా సుదూర గ్రహ శకలాల మీదే తవ్వకాలు జరపటానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక భూమి చుట్టూ తిరుగుతుంటే చెప్పేదేముంది? అత్యాధునిక వ్యోమనౌకను ప్రయోగించి, దాన్ని గ్రహ శకలానికి అనుసంధానం చేస్తే సరి. తవ్వుకున్నవారికి తవ్వుకున్నంత. భవిష్యత్తులో ఇలాంటి ప్రయోగాలను సుసాధ్యం చేయటానికి 2024 పీటీ5 మీద చేసే అధ్యయనాలు తోడ్పడనున్నాయి.

భూ రక్షణ మార్గాల కోసమూ

భూమిని కాపాడుకోవటం మీద దృష్టి సారించే పరిశోధకులకూ 2024 పీటీ5 వంటి శకలాలంటే చాలా ఆసక్తి. వీళ్లు ప్రధానంగా 460 అడుగులు అడ్డంగా ఉండే భూ సమీప వస్తువులను గమనిస్తుంటారు. ఇవి ఒక నగరాన్ని నేల మట్టం చేయగలవు. ప్రస్తుతం ఇలాంటి వస్తువులను 11వేల వరకూ గుర్తించారు. కానీ చిన్న సైజులో భూ సమీప అంతరిక్ష రాళ్లు కోట్ల కొద్దీ ఉండే అవకాశముంది. ఇవి చిన్నవే అయినా మనకు ఆపద తెచ్చిపెట్టేవే. జనావాసాల్లో ఢీకొంటే పెద్ద అనర్థమే వాటిల్లుతుంది. అయితే ఇలాంటి చిన్న చిన్న రాళ్లు ఎక్కడెక్కడ ఉన్నాయో ఇంకా తెలియదు. 2024 పీటీ5 ఉనికితో భూమి చుట్టూ అంతరిక్ష రాళ్లకు సంబంధించి భారీ రహదారే ఉన్నట్టు తెలుస్తోంది. ఇవన్నీ ఎక్కడున్నాయో? ఎలా ఉన్నాయో? ఎక్కడికి వెళ్తున్నాయో? తెలుసుకుంటే భూమిని కాపాడుకునే మార్గాలనూ అన్వేషించొచ్చు. ఆ మధ్య డార్ట్ వ్యోమనౌకతో డైమార్ఫస్ అనే గ్రహశకలాన్ని ఢీకొట్టించి, దాని మార్గాన్ని మార్చిన ఉదంతం తెలిసిందే. భూమికి ఏదైనా ప్రమాదం వాటిల్లే అవకాశముంటే గ్రహ శకలం దారిని మళ్లించే అవకాశముందని ఇది రుజువు చేసింది. కాకపోతే భూమి వైపు వచ్చే గ్రహ శకలాలను గుర్తించటమే పెద్ద సవాలు. 2024 పీటీ5 వంటి చిన్న వాటిని గుర్తించటమైతే ఇంకా కష్టం.

బీపీని కొలిచే ఫోన్ యాప్



అధిక రక్తపోటు (హైబీపీ) పెద్ద సమస్య. అయితే చేతికి పట్టీ కట్టి బీపీని కొలిచే పరికరాలు చాలామందికి అందుబాటులో ఉండవు. క్రమం తప్పకుండా డాక్టర్ దగ్గరికి వెళ్లేవారూ తక్కువే. కొందరికి అసలు రక్తపోటు ఉందన్న విషయమే తెలియదు. ఎక్కడికీ వెళ్లకుండా, ఇంట్లోనే.. అదీ జేబులోని స్మార్ట్‌ఫోన్‌తోనే రక్తపోటును కొలుచుకునే వీలుంటే? యూనివర్సిటీ ఆఫ్ పిట్స్‌బర్గ్‌కు చెందిన బయోఇంజినీరింగ్ ప్రొఫెసర్ **రామకృష్ణ ముక్కమాల** ఇలాగే ఆలోచించారు. అందరూ వాడే స్మార్ట్‌ఫోన్‌తోనే బీపీని కొలిచే వినూత్న పద్ధతిని రూపొందిస్తున్నారు. ఫోన్‌లోని యాక్సెలోమీటర్, ముందు కెమెరా, టచ్ సెన్సర్ సాయంతో పల్స్ ప్రెజర్‌ను గుర్తించటం దీని ప్రత్యేకత. రక్తపోటును తెలిపే పై, కింది (సిస్టాలిక్, డయాస్టాలిక్) అంకెల మధ్య తేడాను పల్స్ ప్రెజర్ అంటారు. ఉదాహరణకు బీపీ 120/80 ఉంటే.. పల్స్ ప్రెజర్ 40 అన్నమాట. దీని ఆధారంగా ఇది రక్తపోటును కొలిచి చెబుతుంది. స్మార్ట్‌ఫోన్‌ను పట్టుకొని తెరపై స్పర్శను గుర్తించే భాగం మీద బొటనవేలును ఉంచి, చేతిని పైకెత్తితే చాలు. చేయిని గుండె కన్నా ఎత్తుకు తీసుకొచ్చినప్పుడు భూ గురుత్వాకర్షణ ప్రభావంతో బొటనవేలులో హైడ్రోస్టాటిక్ పీడనం మారుతుంది. దీన్ని ఫోన్‌లోని యాక్సెలోమీటర్ సాపేక్ష పీడనంలో తేడాగా మార్చి, చూపిస్తుంది. ఈ యాప్‌తో చేతికి పట్టీ కట్టాల్సిన అవసరం లేకుండానే రక్తపోటును కచ్చితంగా తెలుసుకోవచ్చు. బీపీ పరికరాలు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో నివసించేవారికిది ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఇంట్లోంచి బయటకు వెళ్లటం కుదరని వారికీ మేలు చేస్తుంది.

క్రోమ్ మాల్వేర్ దోపిడి!

గూగుల్ క్రోమ్ బ్రౌజర్ వాడుతున్నారా? అయితే సరికొత్త మాల్వేర్‌తో జాగ్రత్త. స్టీల్‌సీ అనే ఇది యూజర్లను సిస్టమ్‌లోకి వెళ్లకుండా అడ్డుకుంటోంది. ఆటోఐటీ క్రెడెన్షియల్ ఫ్లషర్ అనే కొత్త టెక్నిక్‌ను వాడుకుంటూ.. గూగుల్ ఖాతా ఐడీ, పాస్‌వర్డ్‌లను ఎంటర్ చేస్తే తప్ప ఇతర యాప్‌లను వాడుకోనీయటం లేదు. గత రెండేళ్లుగా విజృంభిస్తున్న దీన్ని ఓఏల్యాబ్స్ పరిశోధకులు గుర్తించారు. ఇది క్రోమ్‌కు చెందిన కియోస్క్ మోడ్ ఫీచర్‌ను తనకు అనుగుణంగా ఉపయోగించుకొని, క్రోమ్ విండో ఫుల్‌స్క్రీన్‌ను లాక్ చేస్తుంది. ఎఫ్11, ఎస్కేప్ కీస్ రెండింటినీ డిసేబల్ చేస్తుంది. సాధారణంగా యూజర్ ఇంటరాక్షన్‌ను పరిమితం చేయటానికి పబ్లిక్ కియోస్క్‌లు, డెమో టెర్మినళ్లలో క్రోమ్ కియోస్క్ మోడ్‌ను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దీన్ని ఎంచుకున్నప్పుడు టూల్‌బార్స్, నావిగేషన్ బటన్లు, అడ్రస్ బార్స్ వంటివి కనిపించవు. స్టీల్‌సీ దీంతోనే దొంగ దెబ్బ కొడుతుంది. క్రోమ్ విండోను బ్లాక్ చేసి, పీసీలో ఇతర యాప్స్‌ను వాడుకోవాలంటే గూగుల్ ఖాతా వివరాలు ఇవ్వాలని బలవంత పెడుతుంది. వీటిని ఎంటర్ చేయగానే దొంగిలిస్తుంది.

ఇన్‌స్టా టీన్ ఖాతాలు



ఇన్‌స్టాగ్రామ్ 18 ఏళ్లలోపు వారి కోసం కఠినమైన గోప్యత సెటింగ్స్, పేరెంటింగ్ కంట్రోల్స్‌తో టీన్ అకౌంట్స్‌ను పరిచయం చేయనుంది. సామాజిక మాధ్యమాల్లో యువత భద్రత, క్షేమంపై రేగుతున్న ఆందోళనలను పరిష్కరించే లక్ష్యంతో దీనికి నడుం బిగించింది. ఇన్‌బిల్ట్ రక్షణ వ్యవస్థలుండటం వీటి ప్రత్యేకత. ఇవి డిఫాల్ట్‌గా 16 ఏళ్లలోపు వారికి కట్టుదిట్టమైన గోప్యతను అమలు చేస్తాయి. పిల్లలను ఎవరు కాంటాక్ట్ చేయాలో నిర్ణయిస్తాయి. అపరిచితులు ట్యాగ్ చేయకుండా, మెసేజ్‌లు పంపించకుండా అడ్డుకుంటాయి. కంటెంట్‌ను మరింత కట్టుదిట్టంగా వడపోయటం, ఖాతా సెటింగ్స్‌ను తల్లిదండ్రులు పర్యవేక్షించటం, రాత్రిపూట స్క్రీన్ టైమ్‌ను పరిమితం చేయటం వంటి ఫీచర్లూ ఉంటాయి. ఈ సెటింగ్స్‌ను మార్చాలంటే తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. టీన్ అకౌంట్లను ముందుగా అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియాలో ప్రవేశపెట్టనున్నారు. వచ్చే సంవత్సరం మిగతా దేశాలకు విస్తరించనున్నారు.

లేఖలతోనూ ఫిషింగ్!

ఈమెయిళ్లు, టెక్స్ట్ మెసేజ్‌లతో లింకులను ఎర వేసి (ఫిషింగ్) సైబర్ దాడులు చేయటం తెలిసిందే. నకిలీ వెబ్‌సైట్లతోనూ ఇలాంటివి చేస్తుంటారు. అయితే ఒక్క ఆన్‌లైన్‌లోనే ఫిషింగ్ జరుగుతుందనుకుంటే మోసాల్లో కాలేసినట్టే. సంప్రదాయ ఉత్తరాల ద్వారానూ నేరగాళ్లు బురిడీ కొట్టిస్తున్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. బ్యాంకుల నుంచి వచ్చినట్టుగా నకిలీ ఉత్తరాలను పంపించటం ఇందులో కీలకాంశం. కొన్ని ఉత్తరాలు అచ్చం బ్యాంకులు పంపించే లేఖల్లా, కొన్నింటిలో వ్యక్తిగత వివరాలు, అధికార లోగోలూ ఉండటం ఆశ్చర్యకరం. దీంతో అవి బ్యాంకుల నుంచి వచ్చినవే అనుకొని మోసపోతున్నారు.

మోసం ఇలా..

మోసగాళ్లు నకిలీ ఉత్తరాల్లో 'మీ ఖాతాకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన విషయం' అని ప్రత్యేకంగా పేర్కొంటారు. వ్యక్తిగత డేటా అప్‌డేట్ చేసుకోవాలని కోరేవి కొన్నయితే.. మనం భయపడేలా బెదిరించేవి మరికొన్ని. ప్రతి ఉత్తరంలోనూ క్యూఆర్ కోడ్ ఉంటుంది. సమస్యను పరిష్కరించుకోవటానికి స్మార్ట్‌ఫోన్‌తో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలని సూచిస్తారు. బ్యాంకు వెబ్‌సైట్‌లోకి వెళ్లటం కన్నా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సరిపోతుందనే భావన కలిగిస్తారు. స్కాన్ చేయగానే అది నకిలీ బ్యాంకు వెబ్‌సైట్‌లోకి తీసుకెళ్తుంది. చూడటానికి అది అసలు బ్యాంకు వెబ్‌సైట్ మాదిరిగానే కనిపిస్తుంది. యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ వంటి రహస్య సమాచారాన్ని ఎంటర్ చేయగానే మోసగాళ్లు వాటిని సంగ్రహిస్తారు.



ఎలా కాపాడుకోవాలి?

- అనూహ్యంగా, ఎన్నడూ లేని విధంగా బ్యాంకుల నుంచి ఉత్తరాలు వస్తే అప్రమత్తం కావాలి.
- అనుమానం వస్తే బ్యాంకుకు కాల్ చేసి అది నిజమైనదో, కాదో నిర్ధరించుకోవాలి.
- ఎలాంటి క్యూఆర్‌కోడ్లనైనా విశ్వసనీయమైనవని ధ్రువీకరించుకున్నాకే స్కాన్ చేయాలి.
- క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసేటప్పుడు ఫోన్‌లో 'ఓపెన్ లింక్స్ ఇమ్మిడియెట్లీ'కి సంబంధించిన అన్ని ఆప్షన్లను డీయాక్టివేట్ చేసుకోవాలి. దీంతో ఆ వెబ్‌సైట్లకు వెళ్లే ముందు యూఆర్ఎల్ వివరాలను చూసుకోవటానికి వీలుంటుంది.
- ఒకవేళ ఫిషింగ్ మోసానికి గురయ్యామని గమనిస్తే వెంటనే బ్యాంకుకు ఫోన్ చేసి, ఖాతాను బ్లాక్ చేయమని కోరాలి. తర్వాత ఖాతాను పునరుద్ధరించుకొని, పాస్‌వర్డ్ మార్చుకోవాలి.
- సైబర్ మోసానికి గురైనా, ఆర్థికంగా నష్టపోయినా సైబర్ నేరాల హెల్ప్‌లైన్ **1930**కి ఫోన్ చేయాలి. https://www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చు.

కొత్తకొత్తగా యూట్యూబ్



క్రియేటర్ల సృజనాత్మక భావ వ్యక్తీకరణను దృష్టిలో పెట్టుకొని యూట్యూబ్ సరికొత్త ఫీచర్లను తీసుకొస్తోంది. ఇటీవల జరిగిన 'మేడ్ ఆన్' కార్యక్రమంలో వీటిని ప్రకటించింది. ఈ ఫీచర్ల మూలంగా కృత్రిమ మేధ (ఏఐ) మోడల్‌తో స్వల్ప నిడివి వీడియో క్లిప్స్, షార్ట్స్ కోసం బ్యాక్‌గ్రౌండ్‌ను సృష్టించుకోవటం సాధ్యం కానుంది. యూట్యూబ్ స్టుడియోలో ఇన్‌స్పిరేషన్ ట్యాబ్ ద్వారా కంటెంట్ క్రియేటర్లు ఏఐ బాట్‌ను అడిగి వీడియో ఐడియాలు, టైటిళ్లు, థంబ్‌నెయిల్స్, అవుట్‌లైన్స్ కోసమూ సలహాలు, సూచనలు పొందొచ్చు. ఈ కొత్త ఫీచర్ల మీద ఓ కన్నేద్దామా.

ఏఐ షార్ట్స్: యూట్యూబ్ షార్ట్స్ కోసం 6 సెకండ్ల నిడివి గల వీడియోలను సృష్టించే ఏఐ మోడల్ అందుబాటులోకి రానుంది. గూగుల్‌కు చెందిన వియో అనే డీప్‌మైండ్ దీన్ని రూపొందించింది. వీడియోలను పోస్ట్ చేసే ముందు అందులో ఏదైనా తక్కువైందని అనిపించినప్పుడు ఇది తోడ్పడుతుంది. అప్పటికే తీసిన వీడియోకు సరిగ్గా సరిపోయే క్లిప్‌ను సృష్టించటం దీని ప్రత్యేకత. ఈ క్లిప్స్ మీద సింథ్‌ఐడీ అనే వాటర్‌మార్క్ కూడా కనిపిస్తుంది.

డ్రీమ్ స్క్రీన్: షార్ట్స్ కోసం బ్యాక్‌గ్రౌండ్లను జనరేట్ చేసుకోవటానికిది సాయం చేస్తుంది. వియోతో అప్‌గ్రేడ్ చేసుకొని ఏఐ జనరేటెడ్ వీడియో బ్యాక్‌గ్రౌండ్లనూ సృష్టించుకోవచ్చు. కాకపోతే వీటిని వాడుకోవటానికి ఈ సంవత్సరం చివరి వరకూ వేచి చూడాలి.

కమ్యూనిటీస్: యూట్యూబ్ క్రియేటర్ల ఛానెల్‌లో ఇదో కొత్త విభాగం. ఇందులో క్రియేటర్లు, అభిమానులు కలిసి వీడియోల మీద చర్చించుకోవచ్చు. ప్రస్తుతానికిది కొంతమంది క్రియేటర్లకే అందుబాటులో ఉంది. మున్ముందు దీన్ని ఎక్కువమందికి విస్తరించనున్నారు.

హైప్: క్రియేటర్లు పోస్ట్ చేసిన వీడియోలను ఒక్క ట్యాప్‌తోనే ఆకాశానికి ఎత్తేయటానికి (హైప్) తోడ్పడే ఫీచర్. వీడియో దిగువన లైక్ మాదిరిగానే హైప్ బటన్ కనిపిస్తుంది. హైప్స్ సంఖ్య పెరుగుతున్నకొద్దీ టాప్ 100 హైప్డ్ వీడియోల జాబితాలో పైకి చేరుకుంటుంది. యూజర్లు వారానికి మూడు సార్లు మాత్రమే యూట్యూబ్ వీడియోను హైప్ చేయటానికి వీలుంటుంది. సబ్‌స్క్రయిబర్ల సంఖ్య 5లక్షల కన్నా తక్కువున్న క్రియేటర్లు పోస్ట్ చేసిన వీడియోలకు మాత్రమే ఈ ఫీచర్ కనిపిస్తుంది.

ఆటోమేటిక్ డబ్బింగ్: ఆడియో ట్రాక్స్‌ను వీడియోలకు జత చేయటానికి ముందే వాటిని వివిధ భాషల్లోకి అనువాదం చేసుకోవటానికిది ఉపయోగపడుతుంది. కొద్ది నెలల్లో దీన్ని ప్రవేశపెట్టనున్నారు. కాకపోతే మొదట్లో స్పానిష్, పోర్చుగీస్, ఫ్రెంచ్, ఇటాలియన్ భాషలనే సపోర్టు చేస్తుంది. స్వరం, నినాదం, చుట్టుపక్కల పరిసరాల ధ్వనులనూ డబ్బింగ్ ఆడియోలో జొప్పించటానికిది తోడ్పడుతుంది. కామెంట్స్ విభాగంలో ఏఐ ఆధారిత జవాబుల సూచనలనూ ఎనేబుల్ చేయనున్నారు.

ఆభరణాలు, బహుమతులు: ఇవో కొత్త రకం డిజిటల్ ఐటెమ్‌లు. ప్రత్యక్ష ప్రసారాలు చేస్తున్నప్పుడు అభిమానులు వీటిని క్రియేటర్లకు ఇవ్వొచ్చు. ప్రాథమికంగా వీటిని అమెరికాలో వర్టికల్ ప్రత్యక్ష ప్రసారాలకే వర్తింపజేయనున్నారు.

కనెక్టెడ్ టీవీ: క్రియేటర్లు టీవీ తెరల మీదే ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తున్న నేపథ్యంలో దీన్ని మరింత మెరుగు పరచటం మీద యూట్యూబ్ దృష్టి సారించింది. క్రియేటర్ల ఛానెళ్ల నుంచి నేరుగా టీవీల్లో వీడియోలు, ప్రత్యక్ష ప్రసారాలు ప్లే చేసుకోవటానికి వీలు కల్పించనుంది.

స్మార్ట్‌ఫోన్లూ పేలుతాయా?



ఇటీవల లెబనాన్‌లో పేజర్లు, వాకీటాకీలు వరుసగా పేలటం ప్రపంచవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఆశ్చర్యమూ కలిగించింది. డిజిటల్ పరికరాలనూ పేలుళ్లకు వాడుకోవచ్చా? మనమంతా వాడే స్మార్ట్‌ఫోన్లూ పేలుతాయా? అనే భయం చాలామందికి కలిగింది. కొంతమందిని లక్ష్యంగా చేసుకొని పేల్చిన ఆ పేజర్లు, వాకీటాకీల్లో వాటిని తయారుచేసేటప్పుడే పేలుడు పదార్థాలను కూర్చారని, తర్వాత పేలుళ్లకు వాడుకున్నారని భావిస్తున్నారు. సైబర్ దాడితో బ్యాటరీలను బాగా వేడెక్కించి, పేల్చే అవకాశముందనే వాదన నిజం కాదనీ తేలింది. బ్యాటరీలు మండటం లేదా పేలటం ద్వారా పేజర్లు, వాకీటాకీలు పేలినట్టు వీడియోల్లో ఎక్కడా కనిపించలేదు. ఇక స్మార్ట్‌ఫోన్ల విషయానికి వస్తే- వీటిల్లో పేజర్లు, వాకీటాకీల్లో మాదిరిగా పేలుడు పదార్థాలను కూర్చటానికి అంత స్థలమేమీ ఉండదు. పైగా కంపెనీలు కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలకు అనుగుణంగానే ఉత్పత్తి చేస్తాయి. కాబట్టి భయపడాల్సిన పనేమీ లేదు. అయితే కొన్నిసార్లు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం లేకపోలేదు.

బ్యాటరీలు అతిగా వేడెక్కటంతో: స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర గ్యాడ్జెట్లలోని లిథియం అయాన్ బ్యాటరీలు దెబ్బతిన్నా, బాగా వేడికి గురైనా బాగా వేడెక్కి, మండి పోవచ్చు. మంచి నాణ్యతతో కూడిన ఛార్జర్లు వాడుకోవటం, నేరుగా ఎండ, వేడి తగలకుండా చూసుకోవటం ద్వారా దీన్ని నివారించుకోవచ్చు. థర్మల్ ప్రొటెక్షన్ కేస్‌తోనూ ముప్పు వాటిల్లకుండా చూసుకోవచ్చు.

చవక ఛార్జింగ్ కేబుళ్ల వాడకంతో: నకిలీ లేదా నాణ్యత లేని ఛార్జింగ్ కేబుళ్లు విద్యుత్ షాక్ లేదా ఓవర్‌లోడ్ కావటానికి దారితీయొచ్చు. ఇవి పరికరాన్ని దెబ్బతీయొచ్చు. అరుదుగా అతిగా వేడెక్కేలా చేయొచ్చు.

అతిగా ఛార్జింగ్‌తో: నిరంతరం అతిగా ఛార్జ్ చేయటం, పూర్తిగా ఛార్జ్ అయినా ప్లగ్‌లోంచి తీయకపోవటం వంటివి బ్యాటరీ మీద భారం పడేలా చేయొచ్చు. దీంతో కొన్నిసార్లు అతిగా వేడెక్కొచ్చు. క్రమంగా పూర్తిగా చెడిపోవచ్చు.

దెబ్బతినటంతో: ఫోన్ కిందపడటం లేదా లోపలి భాగాలు దెబ్బతినటం వల్ల బ్యాటరీకి రంధ్రాలు పడొచ్చు. ఫలితంగా అతిగా వేడెక్కొచ్చు. పేలిపోవచ్చు కూడా.

మరమనిషితో మనిషి!

కృత్రిమ మేధ (ఏఐ), రోబోలు కలిస్తే? విప్లవాత్మక మార్పులు రావటం ఖాయం. నిర్దేశించిన పనులను వాటంతటవే చేయటమే కాకుండా పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేర్పులు చేసుకునే రోబోలు వివిధ రంగాలను గణనీయంగా మలుపు తిప్పగలవు. అమెజాన్ సంస్థ ఈ దిశగా ఇప్పటికే గొప్ప ముందడుగు వేస్తోంది. వస్తువుల రవాణా, చేరవేతలో ఏఐ రోబోలను ఉపయోగించుకుంటోంది. 7.5 లక్షల డ్రైవ్ యూనిట్లతో ప్రపంచంలోనే అతి పెద్ద పారిశ్రామిక మొబైల్ రోబోలు గల సంస్థగా ఇప్పటికే పేరొందింది. అధునాతన ఏఐ వ్యవస్థలతో కూడిన ఈ రోబోలు సంక్లిష్ట గోదాము వాతావరణాల్లో తేలికగా సంచరిస్తాయి. మనుషులతో కలిసి పనిచేస్తాయి.

అమెజాన్ కంపెనీ ఆవిష్కరణల్లో అత్యంత ఆసక్తి కలిగించే రోబోలు **హెర్క్యులస్ డ్రైవ్ యూనిట్లు**. చక్రాలతో కూడిన చిన్న పీటల మాదిరిగా ఉండే ఇవి గోదాముల్లో తమకు తామే కదులుతాయి. వస్తువులతో కూడిన మొత్తం షెల్ఫ్‌లను మోసుకొని, అవసరమైన చోట్లకు చేరవేస్తాయి. వస్తువుల కోసం ఉద్యోగులు వెతకాల్సిన పనిలేదు. రోబోలే వాటిని ఉద్యోగుల దగ్గరకు తీసుకొస్తాయి. ఎన్‌కోడెడ్ మార్కర్ల గ్రిడ్‌తో కూడిన గచ్చులు, ఉపరితలాల మీద కదిలేలా వీటిని రూపొందించారు. కిందికి చూసే కెమెరాల సాయంతో మార్కర్లను చదివి ఎక్కడికి వెళ్లాలో తెలుసుకుంటాయి. ముందుకు చూసే 3డీ కెమెరా సాయంతో మనుషులను, ఇతర రోబోలను, అడ్డంకులను గుర్తిస్తాయి. విద్యుత్తుకు, వైఫై కనెక్షన్‌కు అంతరాయం కలిగినా సురక్షితంగా ప్రతిస్పందించేలా కూడా వీటిని తీర్చిదిద్దారు. ఛాతీకి ధరించే వెస్ట్‌ల సాయంతో ఇవి ఇతర రోబోలు, మనుషులతో ముచ్చటిస్తాయి. సంప్రదాయ వ్యవస్థలతో పోలిస్తే ఇవి గోదాముల్లో స్టోరేజీ సామర్థ్యాన్ని 40% వరకూ మెరుగు పరచటం విశేషం.



- **పెగాసస్** అనే రోబోలు ఉద్యోగులు ప్యాక్ చేసిన వాటిని జిప్ కోడ్ లేదా డెలివరీ రూట్ ప్రకారం విభజిస్తాయి.
- **గ్జాంతస్** అనే రోబోలైతే పార్సెళ్లను విభజించటంతో పాటు ఇతర పనులనూ నిర్వర్తిస్తాయి.
- **ప్రొటీయస్** అనే తాజా రోబో మరింత ముందడుగు వేసింది. తనకు తానుగా కదిలే ఇది మనుషులతో కలిసి సురక్షితంగా పనిచేయగలదనే సర్టిఫికెట్ కూడా పొందింది. అధునాతన ఏఐ ఆధారిత పర్సెప్షన్ వ్యవస్థలతోనే ఇది సాధ్యమైంది. కిక్కిరిసిన ప్రాంతాల్లోనూ రోబో మనుషుల మాదిరిగా సంచరించగలదు. విజువల్ సూచికలు ఉండటం వల్ల తన భావాలను మనుషులకు అర్థమయ్యేలా చేయగలదు కూడా.

ఈనాడు సినిమా


కొరటాల శివ

దర్శకుడు కొరటాల శివ నుంచి వచ్చేవన్నీ కమర్షియల్ చిత్రాలే అయినా అంతర్లీనంగా బలమైన సందేశాన్ని నింపుకుని అందర్నీ అలరిస్తుంటాయి. కుటుంబం, సమాజం, ప్రకృతి.. ఇలా ఏదోక దాని విషయంలో బాధ్యతల్ని గుర్తు చేస్తుంటాయి. 'మిర్చి', 'శ్రీమంతుడు', 'భరత్ అనే నేను' లాంటివన్నీ ఈ కోవకు చెందినవే. ఇప్పుడాయన కథానాయకుడు ఎన్టీఆర్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'దేవర'. 'జనతా గ్యారేజ్' విజయం తర్వాత ఈ ఇద్దరి నుంచి వస్తున్న రెండో సినిమా ఇది. ఈ చిత్ర తొలి భాగం 'దేవర పార్ట్ 1' పేరుతో ఈ నెల 27న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు కొరటాల శివ.

మనిషిని సరైన దారిలో నడిపించేది భయమే!

? అందరూ ధైర్యాన్ని సానుకూలంగా.. భయాన్ని ప్రతికూలంగా చూస్తుంటారు. కానీ, 'దేవర'లో భయాన్ని ఎందుకు చూపించనున్నారు

"మనిషికి ధైర్యం అవసరమే కానీ.. మితిమీరిన ధైర్యం మంచిది కాదు. అది మూర్ఖత్వానికి.. విధ్వంసానికి కారణమవుతుంది. అందుకే మనలో ఉన్న భయాన్ని గౌరవించాలి. అది అందరికీ మంచిది. ఎవరైనా భయం ఉండకూడదని చెబితే అది చాలా తప్పు. ట్రాఫిక్‌లో రెడ్ సిగ్నల్ పడినప్పుడు ఎవరైనా ఆగుతారంటే ఓ భయం వల్లే. లేదంటే ఎవరూ ఆగరు. భయమే మనిషిని సరైన దారిలో నడిపిస్తుందని నమ్ముతా. దీన్నే 'దేవర'లో చాలా గట్టిగా చెప్పా".

? అప్పట్లో అల్లు అర్జున్‌తో ఒక సినిమా చేయాలనుకున్నారు. ఇదీ అదీ ఒకే కథా? దీన్ని రెండు భాగాలుగా తీయాలని ఎప్పుడనుకున్నారు

"లేదు. 'దేవర' కథకు దానికీ ఏ సంబంధం లేదు. ఇక దీన్ని రెండు భాగాలుగా చెప్పాలన్నది ముందు నుంచీ అనుకున్నదే. ఎందుకంటే నాకు ఈ కథ చెప్పడానికే 4గంటలు పట్టింది. దాన్ని తెరపైకి తీసుకొస్తే మొత్తం 6 గంటల కథ అవుతుంది. ఇంత విస్తృతి ఉన్న కథను ఒకే భాగంలో తెరకెక్కించడం చాలా కష్టం. అందుకే సెకండ్ షెడ్యూల్ చేసే టైమ్‌లోనే దీన్ని రెండు భాగాలు తీసుకురావాలని నిర్ణయించుకున్నాం. తొలి భాగానికి ఇంటర్వెల్, ముగింపు చక్కగా కుదిరాయి. అలాగే క్లైమాక్స్ రెండో భాగంపై అంచనాలు పెంచేలాగే ఉంటుంది. ఆ రెండో పార్ట్‌తోనే సినిమా పూర్తయిపోతుంది. 'దేవర 3, 4' ఏమీ ఉండవు".

? 'ఆచార్య' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ కథ పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు? మీపై ఏమైనా ఒత్తిడి ఉందా

"ఒత్తిడని కాదు గానీ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థికీ ఉండే ఫీలింగ్ ఇది. నేను జయాపజయాల్ని ఒకేలా తీసుకుంటాను. ఏదైనా టీమ్ ఎఫర్టే. అన్నీ నాకే తెలుసని నేనెప్పుడూ అనుకోను. ఇక కథ పరంగా అంటే దీని విషయంలో చాలా జాగ్రత్తలే తీసుకున్నా. మనం ఒక పరీక్ష బాగా రాయకపోతే దాని తర్వాత పరీక్ష కచ్చితంగా బాగా రాయాలనుకుంటాం కదా. ఇదీ అంతే. 'ఆచార్య' విడుదలైన 20రోజుల్లోపే నేను ఈ చిత్ర పనుల్లో బిజీ అయిపోయాను. అందుకే ఆ ఫలితం నాపై మరీ అంతగా ప్రభావం చూపలేదు".

ఈ కథ విన్నాక ఎన్టీఆర్ స్పందనేంటి? మీకెలాంటి ప్రోత్సాహాన్నిచ్చారు?

"తారక్ ఏదైనా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు. ఎక్కడా రాజీ పడరు. బాగున్నా.. బాలేకున్నా నిర్మొహమాటంగా చెప్పేస్తారు. ఈ కథ చెప్పగానే తను చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. ఆయన వల్లే ఈ చిత్రం ఇంత బాగా వచ్చింది. ఎన్టీఆర్ నాకు మంచి స్నేహితుడితో సమానం. ఆయన కోసం నేను ఈ చిత్ర విషయంలో వందశాతం కష్టపడ్డాను. ఈ కథ రాసుకుంటున్నప్పుడు ఎన్టీఆర్‌ను తప్ప మరొకర్ని ఊహించుకోలేదు. ఆయన ఎప్పుడూ మాస్ హీరోనే. ఈ కథలోని తండ్రీకొడుకుల పాత్రల్ని ఎన్టీఆర్‌తోనే చేయించాలని ముందే అనుకున్నాం. దేవర పాత్ర ఎంత శక్తిమంతంగా ఉంటుందో.. తన కొడుకు వర పాత్ర అంతకు మించేలా ఉంటుంది".

ప్రస్తుతం మీకు చిరంజీవికి మధ్య అనుబంధం ఎలా ఉంది?

"మా అనుబంధం ఎప్పుడూ మంచిగానే ఉంటుంది. 'ఆచార్య' విడుదలయ్యాక నాకు మెసేజ్ పెట్టిన మొదటి వ్యక్తి చిరంజీవి. 'నువ్వు రెట్టించిన ఉత్సాహంతో తిరిగి రావాలి. చాలా గట్టిగా కొట్టాలి' అని సందేశం పంపారు. అలాంటి వ్యక్తికి నాకు మధ్య తేడా ఏముంటుంది. కాకపోతే కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా చెడును ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అలా చేయొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. సోషల్ మీడియాని మంచికి ఉపయోగించాలని కోరుకుంటున్నా. మీమ్స్ చేయొచ్చు. అందులో ఫన్ ఉంటుంది. కానీ, నెగటివ్‌గా ట్రోల్ చేసి ద్వేషాన్ని పెంచే స్థాయికి తీసుకెళ్లకండి".

కొత్త చిత్ర విశేషాలేంటి?

"ప్రస్తుతం నా దృష్టంతా 'దేవర' పైనే ఉంది. తర్వాతి చిత్రమేదన్నది ఇంకా ఆలోచించలేదు. 'దేవర 2' మళ్లీ ఎన్టీఆర్ అందుబాటులోకి వచ్చే దాన్ని బట్టి ఉంటుంది. ప్రస్తుతం ఆయన పూర్తి చేయాల్సిన సినిమాలు కొన్ని ఉన్నాయి".

? ఈ చిత్రంతో జాన్వీ కపూర్, సైఫ్ అలీ ఖాన్‌తో కలిసి పని చేయడం ఎలా అనిపించింది

"జాన్వీ కపూర్ చాలా ప్రతిభావంతురాలు. రోజు సెట్‌కు భయంతో వస్తుంది. తన డైలాగ్స్ ముందే పంపాలని అడుగుతుంది. ఎంతో ప్రాక్టీస్ చేసుకుని సెట్లోకి అడుగు పెట్టేది. తొలి రోజు సీన్ పూర్తవగానే తన ప్రతిభ చూసి నేను, ఎన్టీఆర్ షాకయ్యాం. అంత గొప్పగా చేసింది. తనని చూస్తే ఉత్తరాది అమ్మాయని ఎక్కడా అనిపించలేదు. మన ఇంటి ఆడపిల్లలాగే అనిపించింది. ఇక సైఫ్ దీంట్లో భైరా పాత్రలో కనిపిస్తారు. కథ రాసుకున్నప్పుడే ఆ పాత్రకు ఆయనైతేనే సరిపోతారనిపించింది. సైఫ్‌కు స్క్రిప్ట్ వినిపించాక తన లుక్‌ను స్కెచ్ వేసి పంపాను. 'నేను ఇలా ఉంటానా' అని ఆయన ఆశ్చర్యపోయారు. సెట్‌కు రాగానే గంటసేపు మేకప్‌కు కేటాయించేవారు. ఇక దీనికి ఎంతో మంది లెజెండరీ టెక్నీషియన్స్ పని చేశారు. నేను వాళ్లకు నా ఐడియాని ఇచ్చానంతే. వాళ్లే ఎక్కువ కష్టపడ్డారు".

? ఇది మీ తొలి పాన్ ఇండియా చిత్రం కదా. బడ్జెట్, ప్రచార విషయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు

"బడ్జెట్ చూసుకోవడం చాలా కష్టం. అన్ని కోణాల్లో నిర్మాతలకు లాభాలు రావాలని చూస్తుంటా. ఓటీటీ హక్కుల గురించి కూడా ఆలోచిస్తా. వాళ్లు సేఫ్‌లో ఉండాలని కోరుకుంటా. ఇక మార్కెటింగ్ విషయంలో నేను కొంచెం వీక్. నా కథకు న్యాయం చేయడం కోసమే ఎప్పుడూ ప్రయత్నిస్తుంటా. నిర్మాతల్ని దృష్టిలో పెట్టుకుని ప్రచారం విషయంలో వాళ్లకు సలహాలిస్తుంటా".

కొత్త ప్రపంచాన్ని చూపించే జటాధర



సుధీర్‌బాబు

"ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరిచే ఎన్నో విషయాలు మా 'జటాధర' చిత్రంలో ఉన్నాయంటున్నారు హీరో సుధీర్‌బాబు. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని వెంకట్ కల్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్ బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మిస్తున్నారు. ఈ చిత్ర సెకండ్ లుక్‌ను మంగళవారం విడుదల చేశారు. అందులో సుధీర్ బైక్‌పై వస్తుండగా.. ఆకాశంలో ఓ మహాశక్తి అవతారం గర్జిస్తూ కనిపించడం ఆసక్తిరేకెత్తించేలా ఉంది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ.. "ఈ చిత్రంలోకి అడుగు పెట్టడం నాకు ఓ సరికొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. మర్చిపోలేని అనుభవమిది. శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్స్‌కు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు. విజువల్‌గా, ఎమోషనల్‌గా ఓ అద్భుతమైన సినిమాని ప్రేరణ రూపొందిస్తున్నారు" అన్నారు. "ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే హైదరాబాద్‌లో చిత్రీకరణ మొదలవుతుంది. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకొస్తుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

రోమ్‌ను కాపాడేందుకు గ్లాడియేటర్ పోరు


పాల్ మెస్కల్

ప్రపంచ సినీ ప్రియులకు పరిచయం అవసరం లేని చిత్రం 'గ్లాడియేటర్'. 2000 సంవత్సరంలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీసు వద్ద కలెక్షన్ల వర్షం కురిపించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనికి కొనసాగింపుగా 'గ్లాడియేటర్ 2'ను రిడ్లీ స్కాట్ తెరకెక్కిస్తున్నారు. హిస్టారికల్ యాక్షన్ నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. విడుదల సమయం దగ్గర పడుతున్న వేళ తాజాగా 'గ్లాడియేటర్ 2' నుంచి మరో ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసింది చిత్ర బృందం. "గ్లాడియేటర్‌ను ఎంచుకోవడం అనేది ఓ కళ.. నేను పోరాడేది అధికారం కోసం కాదు.. రోమ్‌ను కాపాడేందుకు..', 'కాలక్రమంలో అందరూ అన్నీ మర్చిపోతారు.. సామ్రాజ్యాలు పతనమవుతాయి. అలాగే చక్రవర్తులు కూడా..' అనే సంభాషణలతో ఆసక్తికరంగా సాగుతున్న ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఇందులో పాల్ మెస్కల్, పెడ్రో పాస్కల్, డెంజల్ వాషింగ్టన్, కొన్నీ నీల్సన్ తదితర నటులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం నవంబరులో విడుదల కానుంది.

ఎర్రమందారం... మెరుపు సింగారం


అలియా భట్


ఐశ్వర్యరాయ్

ఓ వైపు సినిమాల్లో వారి నటనతో సినీప్రియుల్ని మురిపిస్తూనే.. అవకాశం వచ్చినప్పుడు, వీలు చిక్కినప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలోనూ తళుక్కున మెరుస్తుంటారు మన అందాల నాయికలు. తాజాగా కథానాయికలు ఐశ్వర్యరాయ్, అలియా భట్ పారిస్ ఫ్యాషన్ వీక్‌లో పాల్గొని సందడి చేశారు. ప్రపంచ స్థాయిలో జరిగే ఈ ఫ్యాషన్ షోలో ఐశ్వర్య ఎర్ర మందారంలా ఎరుపు రంగు దుస్తుల్లో అలరించింది. తొలి సారి ఈ ఫ్యాషన్ వీక్‌లో సందడి చేసిన అలియా నలుపు, వెండి రంగు డ్రెస్‌లో మెరిసింది. హాలీవుడ్ అందాల తారల మధ్య ఈ ఇద్దరూ ర్యాంప్‌పై హొయలొలికించి ఆకట్టుకున్నారు.

సిరిమల్లె చెట్టు లాంటి అందమైన చిత్రం


సునీల్‌నారంగ్, రాకేందు మౌళి, ప్రశాంత్ వర్మ, కార్తి, శ్రీదివ్య, ప్రేమ్‌కుమార్, డి. సురేశ్‌బాబు

"ఊపిరి' నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకం. దాని తర్వాత మళ్లీ అంతే ప్రత్యేకంగా అనిపించిన చిత్రం 'సత్యం సుందరం'. ఇలాంటి సినిమాలు తెర పైకి రావడం చాలా కష్టం. ఇది తప్పకుండా అందరి మనసుల్ని హత్తుకుంటుంది" అన్నారు హీరో కార్తి. ఆయన.. అరవింద్ స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ తెరకెక్కించారు. సూర్య, జ్యోతిక సంయుక్తంగా నిర్మించారు. శ్రీదివ్య కథానాయిక. ఈ సినిమా ఈ నెల 28న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఇటీవల ముందస్తు విడుదల వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో కార్తి మాట్లాడుతూ.. 'ఖైదీ' తరహాలోనే ఒక్క రాత్రిలో జరిగే కథ ఇది. ఇందులో బావ.. బామ్మర్దుల భావోద్వేగాల్ని చూస్తారు. ఈ చిత్రం చూశాక ప్రతి ఒక్కరూ వాళ్ల కజిన్స్‌కు ఫోన్ చేసి మాట్లాడతారు. ఇందులో అరవింద్ స్వామి పాత్ర చాలా కొత్తగా ఉంటుంది. ఈ నెల 27 ఎన్టీఆర్ 'దేవర' వస్తోంది. అది వార్ ఫైర్ లాంటి సినిమా. తప్పకుండా పెద్ద హిట్ కొట్టాలి. మాది 'సిరిమల్లె చెట్టు'లాంటి చిన్న అందమైన చిత్రం. దీన్ని అందరం మనసు పెట్టి చేశాం" అన్నారు. "తెలుగు పరిశ్రమ నాకెంతో ప్రత్యేకం. 'ఆర్య', 'జగడం' చిత్రాలతో నా కెరీర్ ఇక్కడే ప్రారంభించాను" అన్నారు దర్శకుడు సి.ప్రేమ్‌కుమార్. దర్శకుడు ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ.. "కొన్ని నెలల క్రితమే చెన్నైలో కార్తిని కలిశాను. ప్రశాంత్ సినిమాటిక్ యూనివర్స్‌లో ఆయన్ని కూడా చూస్తారేమో. ఇప్పటికే ఆయనకు కథ వినిపించా. ఈ చిత్ర టీజర్, ట్రైలర్ బాగున్నాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో విష్వక్ సేన్, శ్రీదివ్య, డి.సురేశ్‌బాబు, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

తండ్రి ఆరాటం.. కొడుకు పోరాటం!


శ్రీహర్ష, కషిక కపూర్

శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా పవన్ కేతరాజు తెరకెక్కిస్తున్న చిత్రం 'లైఫ్'. లవ్ యువర్ ఫాదర్.. అన్నది ఉపశీర్షిక. కిశోర్ రాఠీ, మహేశ్ రాఠీ, ఎ.రామస్వామి రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఎస్పీ చరణ్, రఘుబాబు తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర బృందం మంగళవారం ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు పవన్ మాట్లాడుతూ.. "తన బిడ్డ బాధ్యత తీర్చేందుకు తండ్రి పడే ఆరాటం.. ఆ తండ్రి కోసం కొడుకు చేసే పోరాటం నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది. కాశీ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో శివతత్వాన్ని చూపించే చిన్న ప్రయత్నం చేశాం. శ్యామ్ కె.నాయుడు విజువల్స్, మణిశర్మ సంగీతం ఆకర్షణగా నిలుస్తాయి. కచ్చితంగా ఈ సినిమా అందరికీ నచ్చుతుంది" అన్నారు.

నా మెహబూబ్ కోసమే ఈ నిరీక్షణ!


త్రిప్తి దిమ్రీ

"నా మెహబూబ్ వచ్చేస్తున్నాడు. నా నిరీక్షణ, ఆరాటమంతా ఆయన కోసమే" అని తన ప్రియుడి కోసం ప్రేమపాటలు పాడుతుంది త్రిప్తి దిమ్రీ. మరి వారి ప్రేమ కథేంటో తెలుసుకోవాలంటే 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో' సినిమా చూడాల్సిందే. బాలీవుడ్ కథానాయకుడు రాజ్‌కుమార్ రావ్, త్రిప్తి జంటగా నటించిన చిత్రమిది. రాజ్ శాండిల్య దీన్ని తెరకెక్కించారు. తాజాగా ఈ సినిమాలోని 'మేరే మెహబూబ్..' అనే పాటను విడుదల చేసింది చిత్రబృందం. పెప్పీ స్టెప్పులతో సాగుతున్న ఈ గీతంలో రాజ్, త్రిప్తిల మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. దీన్ని శిల్పా రావ్, సచేత్ ఆలపించారు. 90ల కాలం నాటి నేపథ్యంలో కామెడీ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో మల్లికా షెరావత్, ముఖేశ్ తివారీ తదితరులు నటిస్తున్నారు. వచ్చే నెల 11న విడుదల కానుందీ చిత్రం.

ఓ సమస్యని చర్చిస్తూనే నవ్వులు పంచాం

'రాజ రాజ చోర'తో తొలి ప్రయత్నంలోనే సినీప్రియుల్ని మెప్పించారు దర్శకుడు హసిత్ గోలి. ఇప్పుడాయన హీరో శ్రీవిష్ణుతో కలిసి రెండో ప్రయత్నంగా 'శ్వాగ్'తో అలరించేందుకు సిద్ధమయ్యారు. వీళ్ల కాంబోలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. రీతూ వర్మ కథానాయిక. ఈ సినిమా అక్టోబరు 4న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు హసిత్.


హసిత్ గోలి

● "వంశ వృక్షం గురించి అందరికీ తెలిసే ఉంటుంది. కానీ, దాన్ని సినిమాలోకి తీసుకురావడం అరుదు. ఈ కథ అదే నేపథ్యంతో సాగుతుంది. ఇందులో ఓ వంశ వృక్షంలోని పలు భిన్న తరాల కథల్ని చెప్పనున్నాం. దీంట్లో శ్రీవిష్ణు నాలుగు భిన్న పాత్రల్లో కనిపిస్తారు. అలాగే ఇంకొన్ని సర్‌ప్రైజ్‌లు కూడా ఉన్నాయి. ఈ కథలోని సింగ పాత్ర వర్తమానంలో సాగుతుంటుంది. అలాగే 1990లకు సంబంధించిన పాత్ర మరొకటి ఉంది. దానికంటే ముందుకు వెళ్తే 70లకు సంబంధించిన పాత్ర ఎదురవుతుంది. ఇంకా ముందకెళ్తే శ్వాగణిక వంశ పురుషుడు కింగ్ భవభూతి కథ వస్తుంది. ఈ పాత్రలన్నింటిలోనూ శ్రీవిష్ణునే కనిపిస్తాడు. ఇందులో అన్నీ అచ్చ తెలుగు విషయాలే ఉన్నాయి. అలాగే రూటెడ్ కల్చర్ ఉంది".

● "ఇది సందేశం కోసం తీసిన చిత్రం కాదు. కాకపోతే ప్రేక్షకులకు వినోదం పంచుతూనే ఓ సమస్యను చర్చిస్తుంది. తరతరాలుగా ఆడ, మగల మధ్య ఆధిపత్య పోరు ఎలా మారుతూ వచ్చింది.. సమాజంలో ఇప్పటికీ లింగ వివక్ష ఎలా సాగుతుందన్నది ఆసక్తికరంగా చూపించాం. అలాగే మాతృస్వామ్య వ్యవస్థను ఇందులో చూపించనున్నాం. ఈ కథలో వినోదం చాలా సహజంగా కుదిరింది. విరామ సన్నివేశాలు ఆశ్చర్యపోయేలా చేస్తాయి. ఇది 'రాజ రాజ చోర'కు ప్రీక్వెల్ కాదు కానీ, కొన్ని పాత్రలు దానితో రిలేట్ చేసుకునేలా ఉంటాయి".

● "భిన్న గెటప్స్‌తో కూడిన సినిమా చేయడం శ్రీవిష్ణుకే కాదు మాకూ కొత్తే. కానీ, దీన్ని అందరం ఒక సవాల్‌గా తీసుకుని కష్టపడి ఈ చిత్రం చేశాం. తెరపై విష్ణు కాకుండా ఆయన చేసిన పాత్రలే కనిపిస్తాయి. తను చేసిన వాటిలో భవభూతి పాత్ర నన్ను బాగా సర్‌ప్రైజ్ చేసింది. ఇక యయాతి పాత్ర అందరి మనసుల్ని హత్తుకుంటుంది. కొనసాగింపుకు అవకాశమున్న కథ ఇది. ఇది వంశానికి సంబంధించిన కథ. కాబట్టి ఆయా పాత్రల్లో ఇంకెవరి కథైనా రాసుకోవచ్చు. రీతూ వర్మ ఇందులో వింజామర వంశ రాణిగా కనిపిస్తుంది. అలాగే మరో భిన్నమైన పాత్రలోనూ సందడి చేస్తుంది. మీరా జాస్మిన్‌ది చిన్న పాత్రైనా అందికీ గుర్తుండిపోయేలా ఉంటుంది".

● "నాకు ఫాంటసీ జానర్ చాలా ఇష్టం. ఎవరూ చూడని.. ఊహలకు అందని కొత్త ప్రపంచాల్ని తెరపైకి తీసుకురావొచ్చు. నాకు ఆ జానర్‌లో సినిమా చేయాలని ఉంది. నా తర్వాతి చిత్రం కోసం కొన్ని కథలు సిద్ధం చేసుకున్నా. కానీ, దేనితో ముందుకెళ్లాలన్నది ఇంకా నిర్ణయించుకోలేదు".

భార్యను కాపాడేందుకు ఓ భర్త తాపత్రయం


అనుపమ్ ఖేర్

బాలీవుడ్‌లో విభిన్న పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను అలరించిన అగ్ర నటుడు అనుపమ్ ఖేర్. తాజాగా ఆయన 'ది సిగ్నేచర్' అనే కుటుంబ కథా చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. దీనికి గజేంద్ర అహిరే దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. ఇందులో అనారోగ్యంతో ఉన్న తన భార్యను కాపాడుకునే ఓ భర్తగా కనిపించనున్నారు అనుపమ్. 'మనకు పెళ్లై 35 ఏళ్లయ్యింది. జీవితమంతా బాధ్యతలు నెరవేరుస్తూనే ఉన్నాం..' అంటూ సాగిన ఈ ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్, మహిమా చౌదరి, రణ్‌వీర్ శోరే కీలక పాత్రలు పోషించారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ చిత్రం అక్టోబరు 4న ఓటీటీలో విడుదల కానుంది.



స్థానాల నిర్ణయానికి సరైన పరీక్ష!

పోటీలో విజేతలను నిర్ణయించాలంటే ఏదో ఒక ప్రాతిపదికన వారిని నిర్దిష్ట వరుసలో అమర్చాలి. సంస్థలో బాగా పని చేస్తున్న ఉద్యోగులకు అదనపు ప్రయోజనాలు అందించాలంటే వారి నైపుణ్యాలను లెక్కించడానికి సరైన పద్ధతిని అనుసరించాలి. ఇలాంటి సందర్భాల్లోనే రీజనింగ్‌లోని ర్యాంకింగ్ టెస్ట్ ఉపయోగపడుతుంది. ప్రశ్నలో ఇచ్చిన డేటాను విశ్లేషించి, తార్కిక క్రమంలో రాసి సామర్థ్యాలను కొలవడాన్నే ర్యాంకింగ్ టెస్ట్ అంటారు. పెద్ద సమూహంలోని సమాచారాన్ని చిన్న భాగాలుగా విభజించి అర్థం చేసుకోవడానికి ఈ టెస్ట్ ఉపయోగపడుతుంది. సంకలన వ్యవకలనాలు, గుణకార భాగహారాలతోపాటు శాతాలు, సరాసరి, భిన్నాలపై అభ్యర్థులు పట్టు పెంచుకుంటే ఈ ప్రశ్నలకు వేగంగా సమాధానాలను గుర్తించవచ్చు. అదే విధంగా ఒక్కోసారి ప్రాథమిక గణిత పరిక్రియలతో సంబంధం లేకుండా కేవలం తార్కిక ఆలోచనలతో కూడా జవాబులు కనుక్కోవచ్చనే విషయాన్నీ గుర్తుంచుకోవాలి.

ర్యాంకింగ్ టెస్ట్

ర్యాంక్ అనేది ఒక వ్యక్తి లేదా వస్తువు స్థానాన్ని నిర్దేశిస్తుంది. ఈ ర్యాంకింగ్ టెస్ట్ అనే పాఠానికి సంబంధించి సాధారణంగా .. వ్యక్తులు/పక్షులు /చెట్లపై ప్రశ్నలు వస్తుంటాయి. సమూహంలో ఒక వ్యక్తి స్థానం ఒక వైపు నుంచి మరొక వైపు కనుక్కోవడం లేదా తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్యను కనుక్కోవడం లేదా వారు తమ స్థానాలను పరస్పరం మార్చుకున్నప్పుడు ఏర్పడే నూతన స్థానాలను కనుక్కోవడం లాంటి ప్రశ్నలు సాధారణంగా ఉంటాయి. వీటిని కనుక్కోవడానికి కింది సూత్రాన్ని ఉపయోగిస్తారు.

T = n + k – 1

T = మొత్తం

n = వస్తువు యొక్క స్థానం ఒకవైపు నుంచి

k = అదే వస్తువు యొక్క స్థానం మరొక వైపు నుంచి

ఒక వస్తువు యొక్క స్థానం రెండు వైపుల నుంచి తెలిసినా లేదా వస్తువు స్థానం ఒక వైపు నుంచి ఇచ్చి, మరొక వైపు నుంచి కనుక్కోమనద్న ఆ సూత్రాన్ని ఉపయోగిస్తారు.

మోడల్ - 1

1. 45 మంది విద్యార్థులున్న ఒక తరగతిలో రాము అనే విద్యార్థి ఎడమ వైపు నుంచి 19వ స్థానంలో ఉన్నాడు. అయితే అతడి స్థానం కుడి వైపు నుంచి ఎంత?
   1) 25 2) 32 3) 27 4) 28

వివరణ: T = n + k – 1

45 = 19 + k – 1 ⇒ 45 = 18 + k

k = 45 – 18 ⇒ k = 27

∴ రాము కుడి వైపు నుంచి 27వ స్థానంలో ఉన్నాడు. **జ: 3**

2. 102 మంది వ్యక్తులున్న ఒక సమూహంలో మోహన్ తూర్పు నుంచి 91వ స్థానంలో ఉన్నాడు. అయితే అతడి స్థానం పడమర వైపు నుంచి ఎంత?
   1) 12 2) 17 3) 23 4) 18

వివరణ: T = n + k – 1

102 = 91 + k – 1 ⇒ 102 = 90 + k

k = 102 – 90 ⇒ k = 12

∴ మోహన్ పడమర వైపు నుంచి 12వ స్థానంలో ఉన్నాడు. **జ: 1**

మోడల్ - 2

3. పక్షుల వరుసలో ఒక పక్షి ఇరువైపుల నుంచి 13వ స్థానంలో ఉంది. అయితే ఆ వరుసలోని మొత్తం పక్షులు ఎన్ని?
   1) 19 2) 24 3) 27 4) 25

వివరణ: T = n + k – 1

T = 13 + 13 – 1 = 26 – 1 = 25

∴ మొత్తం పక్షులు = 25 **జ: 4**

4. ఒక చెట్ల వరుసలో ఒక చెట్టు ఎడమవైపు నుంచి 27వ స్థానంలో, కుడి వైపు నుంచి 12వ స్థానంలో ఉంది. అయితే ఆ వరుసలోని మొత్తం చెట్లు ఎన్ని?
   1) 38 2) 35 3) 40 4) 37

వివరణ: T = n + k – 1

= 27 + 12 – 1 = 39 – 1 = 38

∴ వరుసలోని మొత్తం చెట్లు = 38 **జ: 1**

మోడల్ - 3

5. ఒక వరుసలో అభినవ్ అనే విద్యార్థి కుడివైపు నుంచి 16వ స్థానంలో, కృష్ణ అనే విద్యార్థి ఎడమ వైపు నుంచి 25వ స్థానంలో ఉన్నారు. అయితే ఆ వరుసలోని మొత్తం వ్యక్తులు ఎంత మంది?
   1) 41 2) 40 3) 38 4) చెప్పలేం

వివరణ: T = n + k – 1

పై సూత్రాన్ని ఒకే వ్యక్తి స్థానం రెండు వైపుల నుంచి తెలిసినప్పుడు మాత్రమే ఉపయోగిస్తాం.

ప్రశ్నలో అభినవ్, కృష్ణల స్థానాలు రెండు వైపుల నుంచి తెలియవు కాబట్టి సమాధానం చెప్పలేం. **జ: 4**

మోడల్ - 4

6. ఒక పరీక్షలో ఉత్తీర్ణులైనవారిలో మహిమ అనే విద్యార్థిని ముందు నుంచి 19వ, వెనక నుంచి 17వ స్థానంలో ఉంది. 9 మంది విద్యార్థులు ఫెయిల్ అయి, 8 మంది పరీక్షకు హాజరు కాలేకపోయినా, మొత్తం విద్యార్థుల సంఖ్య ఎంత?
   1) 60 2) 52 3) 53 4) 54

వివరణ: T = n + k – 1

= 19 + 17 – 1 = 36 – 1 = 35

ఉత్తీర్ణులైన మొత్తం విద్యార్థులు = 35


ఫెయిలైన మొత్తం విద్యార్థులు = 09

హాజరు కాలేకపోయిన మొత్తం విద్యార్థులు = 08

∴ మొత్తం విద్యార్థులు = 52 **జ: 2**

7. ఒక వరుసలో A అనే బాలుడు ఎడమవైపు నుంచి 14వ స్థానంలో, B అనే బాలుడు కుడివైపు నుంచి 12వ స్థానంలో ఉన్నాడు. వీరిద్దరి మధ్య 7 మంది బాలురు ఉన్నారు. అయితే ఆ వరుసలోని మొత్తం బాలురు ఎంతమంది?
   1) 38 2) 36 3) 33 4) 42

వివరణ:




= 14 + 7 + 12 = 33

∴ మొత్తం బాలుర సంఖ్య = 33 **జ: 3**

మోడల్ - 5

8. 35 మంది విద్యార్థులున్న ఒక తరగతిలో కీర్తన ఎడమవైపు నుంచి 7వ స్థానంలో, మహాలక్ష్మి కుడివైపు నుంచి 9వ స్థానంలో ఉన్నారు. వీరిద్దరికి సరిగ్గా మధ్యలో దృతి ఉంది. అయితే దృతి నుంచి కీర్తన స్థానం ఎన్నోది?
   1) 10 2) 11 3) 12 4) 13

వివరణ:




= 35 – (7 + 1 + 9) = 35 – 17 = 18

దృతి నుంచి కీర్తన స్థానం = 1 + 9 + 1 = 11 **జ: 2**

9. ఒక తరగతిలో N ర్యాంక్ ముందు నుంచి 5వది. S ర్యాంక్ చివరి నుంచి 8వది. T ర్యాంక్ N తర్వాత 6వది. T అనే వ్యక్తి N, S లకు సరిగ్గా మధ్యలో ఉన్నాడు. అయితే ఆ తరగతిలోని మొత్తం విద్యార్థుల సంఖ్య?
   1) 19 2) 25 3) 22 4) 24

వివరణ:



T అనే వ్యక్తి N తర్వాత 6వ స్థానం అంటే వీరిద్దరి మధ్య అయిదుగురు ఉన్నారు. అంతేకాకుండా T అనే వ్యక్తి N, S లకు సరిగ్గా మధ్యలో ఉన్నాడు. కాబట్టి T, S ల మధ్య కూడా అయిదుగురు ఉన్నారు.


= 5 + 5 + 1 + 5 + 8 = 24

∴ మొత్తం విద్యార్థుల సంఖ్య = 24 **జ: 4**

మోడల్ - 6

10. ఒక బాలికల వరుసలో A ఎడమ నుంచి 10వ స్థానంలో, B కుడివైపు నుంచి 9వ స్థానంలో ఉన్నారు. వారు తమ స్థానాలను పరస్పరం మార్చుకున్నా A ఎడమవైపు నుంచి 15వ స్థానంలో ఉంది. అయితే ఆ వరుసలోని మొత్తం బాలికల సంఖ్య?
   1) 18 2) 20 3) 22 4) 17

వివరణ:



A అనే అమ్మాయి ఎడమ వైపు నుంచి 10వ స్థానంలో ఉంది. పరస్పరం స్థానాలు మారిన తర్వాత A, B స్థానంలో ఉంది. B కుడి వైపు నుంచి 9వ స్థానం కాబట్టి A కూడా కుడి వైపు నుంచి 9వ స్థానంలో ఉంది.


ఒకే వ్యక్తి స్థానం ఇరువైపుల నుంచి తెలిసింది కాబట్టి,

T = n + k – 1 ⇒ T = 10 + 9 – 1 = 18

∴ వరుసలోని మొత్తం బాలికలు = 18 **జ: 1**

11. ఒక వరుసలో అరుణ్ ఎడమ నుంచి 5వ స్థానంలో, సురేష్ కుడివైపు నుంచి 6వ స్థానంలో ఉన్నారు. వారు తమ స్థానాలను పరస్పరం మార్చుకుని అరుణ్ ఎడమవైపు నుంచి 13వ స్థానంలో ఉన్నాడు. అయితే సురేష్ స్థానం కుడివైపు నుంచి ఎంత?
    1) 12 2) 16 3) 14 4) 19

వివరణ:



వారు తమ స్థానాలను పరస్పరం మార్చుకున్న తర్వాత అరుణ్ ఎడమ నుంచి 13వ స్థానంలో ఉన్నాడు. ఇది సురేష్ స్థానం కాబట్టి అరుణ్ కుడివైపు నుంచి 6వ స్థానంలో ఉన్నాడు.

5వ స్థానంలో ఉన్న అరుణ్ 13వ స్థానానికి మారాడు అంటే ఎడమవైపు 8 స్థానాలు జరిగాడు. కాబట్టి సురేష్ కూడా కుడివైపునకు 8 స్థానాలు జరుగుతాడు.

సురేష్ స్థానం = 6 + 8

= 14వ స్థానం **జ: 3**



రచయిత: గోలి ప్రశాంత్ రెడ్డి

మాదిరి ప్రశ్నలు

కరెంట్ అఫైర్స్



✦ ఏ దేశంలో మూడు రోజుల పర్యటన సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల రామ్ లల్లా స్మారక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు? (అయోధ్యలోని రామ్ లల్లా విగ్రహంపై విడుదల చేసిన ప్రపంచంలోనే మొదటి పోస్టల్ స్టాంప్‌గా ఖ్యాతి గాంచింది.) **జ:** లావోస్

✦ 'వరల్డ్ బ్లడ్ డోనర్ డే'ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? ('20 ఇయర్స్ ఆఫ్ సెలబ్రేటింగ్ గివింగ్: థ్యాంక్యూ బ్లడ్ డోనర్స్' అనే థీమ్‌తో ఈ ఏడాది ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు.) **జ:** జూన్ 14

✦ నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ (ఎన్‌టీసీఏ) తాజా గణాంకాల ప్రకారం 2019 నుంచి 2023 వరకు ఐదేళ్ల కాలంలో భారతదేశంలో మొత్తం ఎన్ని పులులు చనిపోయాయి?
జ: 628 (2019లో 96, 2020లో 106, 2021లో 127, 2022లో 121, 2023లో 178 పులులు సహజ కారణాలు, వేట వల్ల మరణించినట్లు ఎన్‌టీసీఏ వెల్లడించింది. ఇదే సమయంలో పులుల దాడిలో దేశవ్యాప్తంగా 349 మంది మరణించినట్లు ఎన్‌టీసీఏ పేర్కొంది.)

✦ 2025లో పురుషుల టీ-20 ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్ ఆతిథ్య హక్కులను ఏ దేశం దక్కించుకుంది? (2027లో వచ్చే ఆసియా కప్‌కు బంగ్లాదేశ్ ఆతిథ్యం ఇవ్వనుంది.) **జ:** భారత్

✦ 2024, జులై 27న న్యూదిల్లీలోని పృథ్వీభవన్‌లో మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ ఎన్నో వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు? (2006 జులై 27న భూమి శాస్త్రాల మంత్రిత్వశాఖ (ఎంఓఈఎస్)ను ఏర్పాటు చేశారు. డాక్టర్ జితేంద్రసింగ్ ప్రస్తుతం ఈ శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్నారు.) **జ:** 18

మరింత సమాచారం


టీజీపీఎస్సీ
జనరల్ స్టడీస్ - సైన్స్ అండ్ టెక్నాలజీ
భారత రక్షణరంగం

డీఎస్సీ/టెట్-2024
విద్యా దృక్పథాలు

రాచరికానికి దారితీసిన తెగల సంస్కృతి!

డీఎస్సీ/టెట్ 2024
భారతదేశ చరిత్ర

జనపదాల ఆవిర్భావం ప్రాచీన భారతదేశ చరిత్రలో ప్రధానమైన మలుపుగా నిలిచింది. సింధూ నాగరికత అంతరించిన తర్వాత ఉపఖండంలోని మైదాన ప్రాంతాల్లో స్థిరపడిన నాగరిక తెగల సమాజాలు జనపద రాజ్యాలుగా వెలిశాయి. వ్యవసాయ వృద్ధితో ఆర్థికంగా, సైనికంగా బలపడటంతో విస్తరణవాదం ప్రబలి సామ్రాజ్యాలుగా ఎదిగాయి. ఈ పరిణామక్రమం, నాటి జనపదాలు, వాటి లక్షణాలు, వృత్తుల వారీగా ఉన్న సమాజ నిర్మాణం, సామాజిక స్థితిగతులు, ఆర్థిక వనరులు, పాలనా నియమాలు, ప్రధాన నగరాలు, నూతన మతాల ఆవిర్భావం, వాటి విశేషాలను వివరించే చారిత్రక ఆధారాల గురించి పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. జనపదాల్లో మగధ రాజ్యం మహాసామ్రాజ్యంగా విస్తరించేందుకు దోహదం చేసిన పరిస్థితులు, ఉపఖండాన్ని ఏకం చేసి రాజకీయ ఐక్యత తెచ్చిన నాటి పాలకులు, ముఖ్య సంఘటనలపై అవగాహన కలిగి ఉండాలి.


శ్రావస్తి నగర శిథిలాలు

తొలి రాజ్యాలు, సామ్రాజ్యాలు, ఆర్థిక పరిస్థితులు

1. క్రీ.పూ. 6వ శతాబ్దంలో భారతదేశంలో 16 మహా జనపద రాజ్యాలుండేవని పేర్కొన్న గ్రంథాలు?
   1) హిందూ మత గ్రంథాలు
   2) జైన మత గ్రంథాలు
   3) బౌద్ధ మత గ్రంథాలు 4) పైవన్నీ
2. నిశ్చితం (ఎ): 2700 ఏళ్ల కిందట ప్రజలు గంగా-సింధు మైదానాల్లో వ్యవసాయం చేస్తూ స్థిరపడ్డారు.
   కారణం (ఆర్): హిమాలయాల నుంచి ప్రవహించే ఈ నదుల పరిసర ప్రాంతాల్లో నల్లరేగడి నేలలు అధికంగా ఉండటం.
   1) 'ఎ' కు 'ఆర్' సరైన వివరణ.
   2) 'ఎ' 'ఆర్' లు సరైనవి. 'ఎ'కు 'ఆర్' సరైన వివరణ.
   3) 'ఎ' కు 'ఆర్' సరికాని వివరణ.
   4) 'ఎ' సరికాదు, 'ఆర్' సరైంది.
3. హిమాలయాలకు - ద్వీపకల్ప పీఠభూమికి మధ్య ఉన్న మైదానాలు?
   1) గంగా మైదానాలు 2) సింధు మైదానాలు
   3) పెద్ద మైదానాలు 4) గంగా-సింధు మైదానాలు
4. కిందివాటిలో జనపదాల కాలం నాటి ముఖ్యమైన పురాతత్వ ప్రాంతాలు?
   1) అత్రంజిఖేరా 2) కౌశాంబి
   3) రాజగిర్, అయోధ్య 4) పైవన్నీ
5. కౌశాంబి ఏ ప్రాంతానికి దగ్గరగా ఉంది?
   1) హైదరాబాద్ 2) ఔరంగాబాద్
   3) నిజామాబాద్ 4) అలహాబాద్
6. జనపదాల గురించి తెలియజేసే రచనలు చేసిన గ్రీకు రచయితలు?
   1) పెరిప్లస్ 2) హెరిడోటస్ 3) స్ట్రాబో 4) 2, 3
7. జనపదాల కాలంలో 'భర్తుక' అంటే?
   1) బానిస 2) వర్తకుడు
   3) కమ్మరి 4) రోజువారీ కూలీ
8. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన లోహం?
   1) రాగి 2) తగరం 3) ఇనుము 4) కంచు
9. కింది వాక్యాలు పరిశీలించి, సరైనవి గుర్తించండి.
   ఎ) జనపదాల కాలంలో ధర్మసూత్రాలు, ధర్మశాస్త్రాల ఆధారంగా రాజ్యపాలన జరిగింది.
   బి) రాజుకు దండించే అధికారం ఉండేది.
   సి) జనపదాల్లో కొన్ని గణతంత్రాలు, మరికొన్ని రాచరికాలు ఉండేవి.
   డి) జనపదాల కాలం నాటి రాజ్యాలు ప్రజలు, ప్రదేశం, ప్రభుత్వం, సార్వభౌమ అధికారం కలిగి ఉండేవి.
   1) ఎ, బి, సి, డి 2) బి, డి
   3) బి, సి, డి 4) ఎ, బి, సి
10. కింది వాక్యాల్లో భిన్నమైంది?
    ఎ) జనపదాల కాలం నాటి గణరాజ్యాల్లో పదవి వంశ పారంపర్యంగా వస్తుంది.
    బి) జనపదాల కాలం నాటి రాచరిక రాజ్యాల్లో సభ, సమితిలు ఉండవు.
    సి) జనపద కాలం నాటి గణరాజ్యాల్లో సభ, సమితి కీలక పాత్ర పోషించాయి.
    డి) జనపదాల కాలం నాటి 'తెగ' సంస్కృతి రాచరికానికి దారితీసింది.
    1) సి, డి 2) ఎ 3) సి 4) బి
11. మహా జనపదాల్లో గంగా-సింధు మైదానాల్లో లేనిది?
    1) అంగ 2) గాంధార 3) అస్మక 4) పాంచాల
12. మహా జనపదాల్లో ముఖ్యమైన రాజ్యాలు?
    1) మగధ, కోసల, వత్స, అవంతి
    2) అంగ, వజ్జి, మగధ, కాశీ
    3) మగధ, వత్స, మల్ల, అస్మక
    4) పాంచాల, కురు, మగధ, వజ్జి
13. మగధ ప్రాంతపు రాజధాని?
    1) రాజగృహ 2) చంప 3) తక్షశిల 4) బోధన్
14. వైశాలి ఏ సామ్రాజ్యానికి రాజధాని?
    1) గాంధార 2) వజ్జి 3) కాంభోజ 4) అవంతి
15. కిందివాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
    ఎ) 16 మహా జనపదాల్లో ఎక్కువ భాగం రాజరిక రాజ్యాలు.
    బి) 16 మహా జనపదాల్లో రాచరిక రాజ్యాలు మైదాన ప్రాంతాల్లో వెలిశాయి.
    సి) 16 మహా జనపదాల్లో గణతంత్ర రాజ్యాలు పర్వత ప్రాంతాల్లో వెలిశాయి.
    డి) 16 మహా జనపదాల్లో మల్ల, వజ్జి గణ రాజ్యాలు.
    1) ఎ, బి, సి, డి 2) సి, డి
    3) బి, సి 4) ఎ, సి, డి
16. కిందివాటిని జతపరచండి.
    1) మత్స్య ఎ) కుశినగర్
    2) మల్ల బి) కౌశాంబి
    3) వత్స సి) విరాట్‌నగర్
    4) అవంతి డి) శ్రావస్తి
    ఇ) ఉజ్జయిని
    1) 1-ఎ 2-బి, 3-సి, 4-డి
    2) 1-ఇ, 2-సి, 3-డి, 4-బి
    3) 1-సి, 2-ఎ, 3-బి, 4-ఇ
    4) 1-సి, 2-ఎ, 3-ఇ, 4-బి
17. ప్రకటన – ఎ: జనపదాల కాలంలోని బౌద్ధ సాహిత్యం పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయ పరిస్థితుల గురించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.
    ప్రకటన – బి: జనపదాల కాలం నాటి బౌద్ధసాహిత్యం తూర్పు ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ రాజకీయ పరిస్థితులను వివరించింది.
    1) ఎ, బి లు సరికావు 2) బి మాత్రమే సరైంది
    3) ఎ, బి లు సరైనవి 4) ఎ మాత్రమే సరైంది
18. వజ్జి అనే జనపద రాజ్యాన్ని పరిపాలించిన రక్తసంబంధాల సమూహం?
    1) 7 2) 8 3) 9 4) 6
19. అవంతి అనే రాజ్యం భారతదేశంలోని ఏ రాష్ట్రానికి సమీపంలో ఉంది?
    1) ఉత్తర్‌ప్రదేశ్ 2) హరియాణా
    3) మధ్యప్రదేశ్ 4) గుజరాత్
20. సింధు నది పరిసర ప్రాంతాల్లో వెలసిన జనపద రాజ్యాలు?
    1) తక్షశిల - మగధ 2) గాంధార - కాంభోజ
    3) మగధ - గాంధార 4) కాంభోజ - అస్మక
21. మగధ గొప్ప రాజ్యంగా అవతరించడానికి ఎన్ని సంవత్సరాలు పట్టింది?
    1) 300 2) 100 3) 200 4) 400
22. జనపదాల కాలం నాటి రాజకీయ పరిస్థితుల గురించి వివరించిన రాజనీతి శాస్త్రవేత్తలు?
    1) కౌటిల్య, భరద్వాజ, మెగస్తనీస్
    2) పరాశర, కింజల్క, పిసూన
    3) వైశాలిక, దీర్ఘచరణ్య 4) పైవారంతా
23. ఛేది అనే జనపదానికి రాజధాని నగరం?
    1) వైశాలి 2) సుక్తిమతి 3) ఇంద్రప్రస్థ 4) మధుర
24. మహాజనపద రాజ్యాల లక్షణాలు?
    ఎ) ప్రతి జనపదానికి రాజధాని నగరం ఉండేది.
    బి) అన్ని జనపదాలు ఆర్థిక వనరులు కలిగి ఉండేవి.
    సి) రాజధాని నగర రక్షణకు సైన్యం ఉండేది.
    డి) అన్ని రాజ్యాలకు ఉద్యోగులు ఉండేవారు.
    1) ఎ, సి 2) బి, సి, డి
    3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
25. కింది రాజ్య (మగధను పాలించిన) వంశాలను సరైన క్రమంలో అమర్చండి.
    ఎ) హర్యంక బి) మౌర్య
    సి) శిశునాగ డి) నంద
    1) ఎ, బి, సి, డి 2) ఎ, డి, సి, బి
    3) ఎ, సి, డి, బి 4) డి, ఎ, సి, బి
26. అంగ రాజ్యాన్ని ఆక్రమించిన హర్యంక వంశపు రాజు?
    1) ఉదయనుడు 2) కినుక
    3) బింబిసారుడు 4) అజాతశత్రువు
27. కోసల రాజు ప్రసేనజిత్తుతో యుద్ధం చేసిన హర్యంక వంశపు రాజు?
    1) బిందుసారుడు 2) బింబిసారుడు
    3) అజాత శత్రువు 4) ఉదయనుడు
28. గంగ – శోణ్ నదుల మధ్య నిర్మితమైన పాటలీపుత్రను ప్రారంభించిన మగధ రాజు?
    1) ఉదయనుడు 2) అజాతశత్రువు
    3) అశోకుడు 4) బింబిసారుడు
29. నిశ్చితం (ఎ): హర్యంక వంశానికి చెందిన అజాతశత్రువు వైశాలి రాజ్యంపై యుద్ధం ప్రకటించి విజయం సాధించాడు.
    కారణం (ఆర్): లిచ్ఛవీ తెగ రాజులు మగధ రాజ్య వ్యాపారులను గంగా నది పరీవాహక ప్రాంతంలో పన్నుల కోసం వేధించడం.
    1) 'ఎ' కు 'ఆర్' సరైన వివరణ కాదు.
    2) 'ఎ'కు 'ఆర్' సరైన వివరణ.
    3) 'ఎ' సరైంది కాదు, 'ఆర్' సరైంది.
    4) 'ఎ' సరైంది, 'ఆర్' సరైంది కాదు.
30. మగధను పరిపాలించిన శిశునాగ వంశస్థుల రాజధాని?
    1) రాజ్‌గిర్ 2) పాటలీపుత్రం 3) వైశాలి 4) గిరివ్రజ
31. క్రీ.పూ.321లో మగధ సామ్రాజ్యంలో మౌర్యవంశ స్థాపకుడు?
    1) బిందుసారుడు 2) చంద్రగుప్త మౌర్యుడు
    3) బింబిసారుడు 4) అశోకుడు
32. మొదటి డేరియస్ భారతదేశంపైకి దాడికి వచ్చిన సంవత్సరం?
    1) క్రీ.శ. 261 2) క్రీ.పూ. 516
    3) క్రీ.పూ. 561 4) క్రీ.శ. 561
33. క్రీ.పూ.327లో భారత్‌పై దాడి చేసిన గ్రీకు రాజు?
    1) అలెగ్జాండర్ 2) మొదటి డేరియస్
    3) మూడో డేరియస్ 4) మెగస్తనీస్
34. మగధ సామ్రాజ్య విజృంభణకు కారణాలు?
    ఎ) బింబిసారుడు - అజాత శత్రువు, మహాపద్మనందుడు లాంటి బలమైన రాజులు పరిపాలించడం.
    బి) మగధలో ఇనుము అధికంగా లభ్యం కావడం.
    సి) మగధలో సారవంతమైన ఒండ్రునేలలు ఉండటం.
    డి) మగధ పటిష్ఠమైన రాజధానులను కలిగి ఉండటం.
    1) ఎ, బి, సి, డి 2) సి, డి
    3) ఎ, బి, సి 4) బి, సి, డి
35. భారతదేశ ఖగోళశాస్త్రంపై ఏ దేశస్థుల ప్రభావం ఉంది?
    1) ఈజిప్టు 2) గ్రీకులు 3) రోమన్ 4) పర్షియన్లు
36. జనపదాల కాలంలో ప్రధాన వృత్తి?
    1) పశుపోషణ 2) వ్యవసాయం
    3) వ్యాపారం 4) శాస్త్రవిజ్ఞానం
37. కిందివాటిలో తప్పుగా ఉన్న వాక్యం?
    ఎ) అనేక రకాల కులాలు, వర్గాలుండే గ్రామాలు - భోజక గ్రామాలు
    బి) హస్తకళలు, చేతివృత్తులుండే గ్రామాలు - పట్టణ గ్రామాలు
    సి) అటవీ ప్రాంతాల సమీపంలో ఉన్న గ్రామాలు - సరిహద్దు గ్రామాలు
    డి) పాళీ గ్రంథాల ప్రకారం ప్రజలు పంటలకు దూరంగా నివాసం ఉండేవారు
    1) ఎ, డి 2) సి 3) బి 4) డి
38. అటవీ ప్రాంతాలను చదును చేసి వ్యవసాయయోగ్యంగా మార్చినవారు?
    1) వైశ్యులు 2) సైనికులు 3) శూద్రులు 4) క్షత్రియులు
39. జనపదాల కాలంలో ఎన్నిరకాల చేతి వృత్తులుండేవి?
    1) 4 2) 6 3) 64 4) 46
40. జనపదాల కాలంలో ముఖ్యమైన వర్తకశ్రేణులు ఎన్ని?
    1) 8 2) 18 3) 16 4) 46
41. క్రీ.పూ. 6వ శతాబ్దంలో ఏ లోహంతో చేసిన నాణేలు అధిక సంఖ్యలో ఉండేవి?
    1) రాగి 2) బంగారం
    3) వెండి 4) ఇనుము

సమాధానాలు

1-4; 2-3; 3-4; 4-4; 5-4; 6-4; 7-4; 8-3; 9-1; 10-2; 11-3; 12-1; 13-1; 14-2; 15-1; 16-3; 17-3; 18-2; 19-3; 20-2; 21-4; 22-4; 23-2; 24-4; 25-3; 26-3; 27-3; 28-2; 29-2; 30-3; 31-2; 32-2; 33-1; 34-1; 35-4; 36-2; 37-4; 38-3; 39-3; 40-2; 41-3.

కారణం - ఫలితం (Cause & Effect)

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగం నుంచి కారణాలు - ఫలితాలు అనే అంశం నుంచి ప్రశ్నలు అడుగుతుంటారు. ఇందులో రెండు ప్రవచనాలు ఇచ్చి, వాటిలో కారణం, ఫలితాలు ఏమవుతాయి, వాటి మధ్య ఉన్న సంబంధం కనుక్కోవాల్సి ఉంటుంది. ఇచ్చిన అంశాల మధ్య కారణం, ఫలితాలను నిర్ణయించగల సామర్థ్యం అభ్యర్థుల్లో ఏ మేరకు ఉందో తెలుసుకునేందుకు ఈ ప్రశ్నలు అడుగుతారు.



ఫలితానికి కారణం తెలిస్తేనే..
ప్రశ్నకు సమాధానం దొరికేది..

టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

సూచన (1 – 16): కింది ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండి.

ప్రవచనాలు I, II లు స్వతంత్ర కారణాలు అయినప్పుడు 1 అని

ప్రవచనాలు I, II లు ఫలితానికి ఉమ్మడి కారణం అయినప్పుడు 2 అని

ప్రవచనం I కారణం, ప్రవచనం II ఫలితం అయినప్పుడు 3 అని

ప్రవచనాలు I, II లు స్వతంత్ర కారణాలై ఆ రెండూ ఫలితాన్ని తెలియజేస్తే 4 అని

ప్రవచనం II కారణం, ప్రవచనం I ఫలితం అయినప్పుడు 5 అని గుర్తించండి.

1. ప్రవచనం I: ఈ వేసవిలో కూరగాయల ధరలు గణనీయంగా పెరిగాయి.

ప్రవచనం II: వేసవి కాలంలో ఉష్ణోగ్రతల్లో విపరీతమైన పెరుగుదల నమోదైంది. చాలా వరకు పంటలు దెబ్బతిన్నాయి.

సాధన: వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధిక స్థాయిలో ఉంటాయి. ఈ కారణంగా పంటల దిగుబడి తగ్గుతుంది. దీంతో కూరగాయల సరఫరాలో కొరత ఏర్పడి ఉండవచ్చు. అందుకే వాటి ధరలు పెరిగాయి. ఇక్కడ ప్రవచనం II అనేది కారణమైతే దాని ఫలితం ప్రవచనం I అవుతుంది.

సమాధానం: 5

2. ప్రవచనం I: ఈ సంవత్సరం నూనె గింజల ఉత్పత్తిలో తీవ్రమైన క్షీణత ఉంది.

ప్రవచనం II: వంట నూనెల దిగుమతి మొత్తాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

సాధన: నూనె గింజలు అనేవి నిత్యావసర సరకుల్లో ముఖ్యమైనవి. వీటి ఉత్పత్తిలో తీవ్ర క్షీణత ఏర్పడితే ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుంది. కాబట్టి తీవ్రతను కట్టడి చేయడానికి దిగుమతే మార్గం. ప్రవచనం I అనేది కారణమైతే దాని ఫలితం ప్రవచనం II అవుతుంది.

సమాధానం: 3

3. ప్రవచనం I: ఈ వర్షాకాలంలో A అనే నగరంలో నీటి కారణంగా సంభవించే వ్యాధుల వల్ల ప్రభావితమైన ప్రజల సంఖ్య గణనీయంగా తగ్గింది.

ప్రవచనం II: ఏడాది ప్రారంభంలో ప్రభుత్వం నగరం Aలో నాలుగు పౌర ఆసుపత్రులు ప్రారంభించింది.

సాధన: ఇచ్చిన ప్రవచనాలు స్వతంత్ర సంఘటనలను సూచిస్తున్నాయి. ప్రవచనాలు I, II లు స్వతంత్రమైనవి.

సమాధానం: 1

4. ప్రవచనం I: విశ్వవిద్యాలయ అధికారులు తమ అధికార పరిధిలోని అన్ని కళాశాల ప్రాంగణాల్లో సెల్‌ఫోన్ వినియోగాన్ని నిషేధించాలని ఆదేశించారు.

ప్రవచనం II: తరగతి గదిలో సెల్‌ఫోన్ వినియోగం వల్ల తరగతులకు కలిగే అవాంతరాల గురించి విశ్వవిద్యాలయానికి ఫిర్యాదు చేస్తూ అత్యధిక కళాశాలల ఉపాధ్యాయులు ఉమ్మడి పిటిషన్‌పై సంతకాలు చేశారు.

సాధన: కళాశాల ఆవరణలో సెల్‌ఫోన్ వినియోగానికి వ్యతిరేకంగా కళాశాల ఉపాధ్యాయుల నుంచి అందుకున్న ఫిర్యాదుకు అనుగుణంగా విశ్వవిద్యాలయం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఇక్కడ ప్రవచనం II అనేది కారణమైతే దాని ఫలితం ప్రవచనం I అవుతుంది.

సమాధానం: 5

5. ప్రవచనం I: ఇళ్లకు కన్నం వేసే దొంగల ముఠాను పోలీస్ అధికారులు పట్టుకున్నారు.

ప్రవచనం II: స్థానిక పౌరుల సమూహం రాత్రివేళల్లో కాపు కాయడం ప్రారంభించింది.

సాధన: రెండు ప్రవచనాలు ఒక ఉమ్మడి కారణంతో ముడిపడి ఉన్నాయి. ఇవి ఆ ప్రాంతంలోని దొంగతనాల గురించి తెలియజేస్తున్నాయి.

సమాధానం: 2

6. ప్రవచనం I: గత నాలుగు సంవత్సరాలుగా జిల్లాలో అక్షరాస్యత రేటు పెరుగుతోంది.

ప్రవచనం II: జిల్లా యంత్రాంగం అక్షరాస్యత పెంపు కోసం ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది.

సాధన: అక్షరాస్యత రేటు పెరుగుదల అనేది నేరుగా ఆ జిల్లా పరిపాలన యంత్రాంగ కఠినమైన ప్రయత్నాల ఫలితమే అని చెప్పవచ్చు. ఇక్కడ ప్రవచనం II అనేది కారణం అయితే ప్రవచనం I అనేది ఫలితం.

సమాధానం: 5

7. ప్రవచనం I: గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో అత్యధికంగా ఉక్కును ఉత్పత్తి చేసే కంపెనీలు గణనీయంగా లాభాలు ఆర్జించాయి.

ప్రవచనం II: అనేక ఆసియా దేశాలు భారతదేశం నుంచి ఉక్కును భారీ స్థాయిలో దిగుమతి చేసుకుంటున్నాయి.

సాధన: ఇతర దేశాల నుంచి ఉక్కు డిమాండ్ పెరగడం అనేది నేరుగా వ్యాపారం పెరిగిందని చెప్పడానికి సూచిక. భారతదేశం నుంచి ఉక్కు ఎగుమతులు అధిక స్థాయిలో ఉండటం వల్లే ఆయా కంపెనీలు గణనీయ లాభాలు గడించాయి. ప్రవచనం II అనేది కారణం అయితే ప్రవచనం I అనేది ఫలితం.

సమాధానం: 5

8. ప్రవచనం I: కాలం పరిగెడుతూనే ఉంటుంది. జీవితంలోని అన్ని అంశాల్లో డిమాండ్, వైవిధ్యం అవసరం. ఇది కొన్నిసార్లు ఒత్తిడితో కూడిన పరిస్థితులకు దారితీస్తుంది.

ప్రవచనం II: యువత ఆత్మహత్య కేసుల సంఖ్య పెరుగుతోంది.

సాధన: యువతలో చిరాకుకు ప్రధాన కారణం ఒత్తిడి. ఇది కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యా యత్నాలకు దారితీస్తుంది. ప్రవచనం I అనేది కారణం అయితే ప్రవచనం II అనేది దాని ఫలితం.

సమాధానం: 3

9. ప్రవచనం I: వారం క్రితం పట్టణంలోని అనేక గుంతల్లో భారీ స్థాయిలో నీరు నిలిచింది.

ప్రవచనం II: గతవారం రైల్వే ట్రాక్‌పై నీరు నిలిచి ఉండటంతో చాలా రైళ్లను రద్దు చేశారు.

సాధన: రెండు ప్రవచనాల్లో ఇచ్చిన సమస్యలు స్పష్టంగా ఆ ప్రాంతంలో భారీ వర్షం కురిసినట్లు తెలియజేస్తున్నాయి. ఇక్కడ రెండు ప్రవచనాలు ఫలితానికి ఉమ్మడి కారణం.

సమాధానం: 2

10. ప్రవచనం I: గత సంవత్సరంతో పోల్చితే నిరుద్యోగుల సంఖ్య తీవ్రంగా పెరుగుతోంది.

ప్రవచనం II: ఒక మేనేజర్ పోస్టు భర్తీ కోసం బ్యాంకు జారీ చేసిన ఒక ప్రకటనకు స్పందనగా భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి.

సాధన: నిరుద్యోగులైన యువత సంఖ్య పెరగడం వల్ల ఖాళీగా ఉన్న ఒక పోస్టు కోసం కూడా భారీ సంఖ్యలో దరఖాస్తులు సమర్పిస్తున్నారు. ఇక్కడ ప్రవచనం I అనేది కారణం అయితే ప్రవచనం II అనేది ఫలితం.

సమాధానం: 3

11. ప్రవచనం I: రాబోయే రెండు నెలల్లో వాయు కాలుష్యాన్ని 20% తగ్గించాలనేది నగరపాలక అధికారుల లక్ష్యం.

ప్రవచనం II: నగరంలో ఆస్తమా రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

సాధన: వ్యాధిని ప్రేరేపించే వాయు కాలుష్యాన్ని నియంత్రించే దిశగా అధికారులను అప్రమత్తం చేయడానికి కారణం ఆస్తమా కేసుల సంఖ్య పెరగడమే. ఇక్కడ ప్రవచనం II అనేది కారణం అయితే ప్రవచనం I అనేది ఫలితం.

సమాధానం: 5

12. ప్రవచనం I: గత కొద్ది నెలలుగా నగరంలో మహిళలపై అమానుష చర్యలు హెచ్చు స్థాయిలో పెరిగిపోయాయి.

ప్రవచనం II: పోలీసు అధికారులు నేరస్థులను అదుపులోకి తీసుకోవడంలో విఫలమయ్యారు.

సాధన: మహిళలపై అమానుష చర్యల కేసులు పెరగడం, పోలీసులు నేరస్థులను (అనేక రకాలు) అదుపులోకి తీసుకోకపోవడం అనేవి రెండు స్వతంత్ర సంఘటనలు.

సమాధానం: 1

13. ప్రవచనం I: గత కొద్ది రోజులుగా లోతట్టు ప్రాంతంలో నివసించే ప్రజలను పెద్ద సంఖ్యలో సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

ప్రవచనం II: బాధిత ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు ప్రభుత్వం సరకులను సరఫరా చేసింది.

సాధన: లోతట్టు ప్రాంత వాసులను ఖాళీ చేయించడం, ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఉపశమనం అందించడం అనేది ఆ ప్రాంతంలో వరదలు సంభవించాయని సూచిస్తోంది. ఫలితానికి ప్రవచనాలు ఉమ్మడి కారణాలు.

సమాధానం: 2

14. ప్రవచనం I: ఆ ప్రాంతంలోని అత్యధిక పౌరులు అధిక ఆదాయ వర్గానికి చెందినవారు.

ప్రవచనం II: ఇతర ప్రాంతాలతో పోల్చినప్పుడు స్థానిక సూపర్ మార్కెట్‌లో అమ్మకాలు చాలా ఎక్కువగా ఉన్నాయి.

సాధన: ఒక ప్రత్యేక ప్రాంతంలోని అధిక అమ్మకాలు ఆ ప్రాంత నివాసితుల అధిక చెల్లింపు సామర్థ్యాన్ని సూచిస్తాయి. ప్రవచనం II అనేది కారణం అయితే ప్రవచనం I అనేది ఫలితం

సమాధానం: 5

15. ప్రవచనం I: ప్రభుత్వం విధించనున్న కొత్త పన్ను విధానానికి వ్యతిరేకంగా స్థానిక వ్యాపారుల సంఘం ఒక రోజు దుకాణాలను మూసివేయాలని వారి సంఘంలోని వ్యాపారులను కోరింది.

ప్రవచనం II: చాలామంది వ్యాపారులు వారి దుకాణాలను ఒక రోజు మూసివేయాలని, వారి ఉద్యోగులకు ఒక రోజు సెలవు ఇవ్వాలని నిర్ణయించారు.

సాధన: ప్రభుత్వం విధించనున్న కొత్త పన్ను విధానంపై నిరసన వ్యక్తం చేయడానికి బంద్ నిర్వహించాలని సంఘం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా సంఘంలోని సభ్యులందరూ వారి దుకాణాలను ఒకరోజు మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రవచనం I అనేది కారణం అయితే ప్రవచనం II అనేది ఫలితం.

సమాధానం: 3

16. ప్రవచనం I: గతవారం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు స్వల్పంగా తగ్గాయి.

ప్రవచనం II: రాష్ట్ర ప్రభుత్వం గతవారం పెట్రోలియం ఉత్పత్తులపై పన్ను తగ్గించింది.

సాధన: ఒక ప్రత్యేక ఉత్పత్తిపై పన్ను లేదా సుంకంలో కోత అనేది ఉత్పత్తి ధరలో తగ్గింపునకు కారణం అవుతుంది. ప్రవచనం II అనేది కారణం అయితే ప్రవచనం I అనేది ఫలితం.

సమాధానం: 5



రచయిత
బూసర గణేష్, విషయ నిపుణులు

421 Word of the Day

Penurious

Telugu meaning: నిరుపేద, అతిబీద

English meaning: The word penurious is an adjective that describes someone who is extremely poor.

Synonyms: Impoverished, Destitute

Antonyms: Wealthy, Generous

Usage: 1. He grew up in a penurious household, where every penny had to be spent cautiously.

2. Despite his penurious nature, he reluctantly agreed to help with the fundraiser.

Latest Updates

Undergraduate Posts

Railway Recruitment Board (RRB) invites applications for the Non-Technical Popular Categories (Undergraduate) in different Railway Recruitment Boards (RRBs). The total no. of posts is 3445. The application fee is Rs.500. Eligible candidates can apply online before 20 October 2024.

Faculty Posts

Dr.Ram Manohar Lohia Institute of Medical Sciences, Lucknow is conducting interviews for the Professor, Associate Professor, Assistant Professor posts. The total number of posts is 225. The last date for online application is 28 September 2024. The date of interview is on 30 September 2024.

Did You Apply..?

Today (September 25) is the last date for the following Posts/ Admissions

Various posts in Indian Institute of Management Jammu (IIM-Jammu). ***Qualification:*** Intermediate, ITI, Diploma, Degree, PG pass in relevant department following the post along with work experience.

103 Senior Resident posts in AIIMS, Deoghar. ***Qualification:*** MD/ MS/ DNB pass in relevant discipline along with work experience.

Junior Draftsman Posts In EIL, Delhi. ***Qualification:*** Should have passed Diploma in relevant discipline along with work experience.

For more information and other notifications - scan QR code



☛ తెలంగాణ చరిత్రలో పోలీస్ చర్య ముఖ్య అంశం. హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి నాటి భారత ప్రభుత్వం దీన్ని చేపట్టింది.

☛ ఈ వీడియోలో సంలీన ఉద్యమం - దాని ఉద్దేశం, దాన్ని నడిపించిన నాయకులు, హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమయ్యేందుకు నాటి కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వ్యూహాత్మక చర్యలు మొదలైన విషయాలు ఉన్నాయి.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. వీడియో పాఠం చూడండి.. మరిన్ని వీడియోల కోసం ఈప్రతిభ యూట్యూబ్ ఛానల్ సబ్‌స్క్రైబ్ చేయండి!

కరెంట్ అఫైర్స్



45వ చెస్ ఒలింపియాడ్‌లో భారత అబ్బాయిలు, అమ్మాయిల జట్లు రెండూ విజేతలుగా నిలిచాయి. 2024, సెప్టెంబరు 22న బుడాపెస్ట్ (హంగేరీ)లో జరిగిన చివరిదైన పదకొండో రౌండ్లో పురుషుల జట్టు 3.5-0.5తో స్లొవేనియాపై గెలిచింది. మొత్తం 21 పాయింట్లతో ఆ జట్టు పసిడిని సొంతం చేసుకుంది.

- మహిళల జట్టు కూడా 3.5-0.5 తేడాతోనే అజర్‌బైజాన్‌ను ఓడించి ట్రోఫీని అందుకుంది. ఆ జట్టు 19 పాయింట్లతో స్వర్ణం నెగ్గింది.
- చెస్ ఒలింపియాడ్‌లో భారత్ స్వర్ణాలు గెలవడం ఇదే తొలిసారి. 2014, 2022లో పురుషుల జట్లు, 2022లో మహిళల జట్టు కాంస్యాలు గెలిచాయి.



గుజరాత్ రాష్ట్రానికి చెందిన రియా సింఘా (18) 'మిస్ యూనివర్స్ ఇండియా 2024' టైటిల్ గెలుచుకున్నారు. అంతర్జాతీయ వేదికపై భారత్ తరఫున 'మిస్ యూనివర్స్' కిరీటం కోసం పోటీపడే అవకాశాన్ని దక్కించుకున్నారు. రాజస్థాన్‌లోని జైపూర్ వేదికగా 2024, సెప్టెంబరు 23న జరిగిన ఈ పోటీల్లో సుమారు 51 మంది ఫైనలిస్టులతో పోటీపడి రియా ఈ కిరీటాన్ని సొంతం చేసుకున్నారు.

ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కింద 2024 సెప్టెంబరు 1 నాటికి 7.79 కోట్ల మందికి రూ.1.07 లక్షల కోట్ల విలువైన వైద్య చికిత్సలు అందించినట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. ఈ పథకం కింద లబ్ధి పొందిన వారిలో 3.61 కోట్ల మంది మహిళలు ఉన్నట్లు పేర్కొంది.

- దేశవ్యాప్తంగా దిల్లీ, ఒడిశా, పశ్చిమ్ బెంగాల్ మినహా మిగిలిన 33 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ పథకం అమలవుతున్నట్లు తెలిపింది. పథకం కింద 12.37 కోట్ల కుటుంబాల్లో 55 కోట్ల మంది లబ్ధిదారులుగా ఉన్నట్లు పేర్కొంది.

కరెంట్ అఫైర్స్ ఈబుక్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Fillers

Directions (Qs. 1 - 14): *Here, a sentence is given with one, two or three blank spaces, indicating that those words have been omitted from it. Select the word/words that fits in the blank, thereby making the sentence meaningful and grammatically correct.*

1. The company decided to .... its operations due to the economic downturn.
A) reduce B) expand
C) initiate D) celebrate
E) ignore

2. The government issued new guidelines to .... the spread of misinformation.
A) encourage B) prevent
C) spread D) ignore
E) celebrate

3. The team members were asked to .... their concerns during the grievance meeting.
A) discard B) suppress
C) ignore D) highlight
E) avoid

4. The professor's lecture was so .... that students struggled to stay awake.
A) fascinating B) engaging
C) informative D) boring
E) innovative

5. She was praised for her ability to .... even the most complex topics.
A) simplify B) confuse
C) complicate D) neglect
E) discard

6. The new policy is expected to .... the economic recovery and .... investor confidence.
A) hinder, boost
B) weaken, boost
C) accelerate, boost
D) disrupt, accelerate
E) slow, accelerate

7. The artist's work was both .... and ...., leaving a lasting impression on the audience.
A) mundane, ordinary
B) innovative, thought-provoking
C) uninspired, dull
D) forgettable, routine
E) standard, conventional

8. The CEO's decision to .... the project and .... a new strategy was met with approval.
A) cancel, extend
B) expand, expect
C) abandon, propose
D) delay, remove
E) launch, terminate

Bank Exams
English

9. The community came together to .... resources and .... support for the affected families.
A) squander, limit B) waste, diminish
C) ignore, reject D) reduce, avoid
E) gather, provide

10. The report aims to .... the challenges and .... solutions for the ongoing crisis.
A) overlook, reject
B) suppress, complicate
C) ignore, disregard
D) obscure, delay
E) highlight, suggest

11. The team's ability to .... under pressure, ... resources effectively, and .... innovative solutions was key to their success.
A) excel, allocate, generate
B) crumble, waste, ignore
C) falter, misuse, discard
D) fail, mismanage, hinder
E) stumble, exhaust, prevent

12. The company's decision to .... its workforce, ... production, and .... new technologies paid off in the long run.
A) reduce, cut, ignore
B) hire, lower, dismiss
C) dismiss, halt, abandon
D) expand, increase, adopt
E) restrict, pause, delay

13. To .... public awareness, ... community participation, and .... environmental protection, the NGO launched a new campaign.
A) hinder, reduce, oppose
B) ignore, delay, abandon
C) enhance, encourage, promote
D) suppress, discourage, complicate
E) obscure, limit, prevent

14. The government plans to .... the infrastructure, ... educational programs, and .... employment opportunities in rural areas.
A) dismantle, cut, decrease
B) delay, suppress, avoid
C) ignore, halt, restrict
D) improve, launch, create
E) reduce, terminate, restrict

Scan the QR code for Key

Writer:
P. Manoj Kumar, Subject Expert

బీటెక్ మొదటి ఏడాది (సీఎస్ఈ) చదువుతున్నాను. కంప్యూటర్ లాంగ్వేజ్ లేదా ఏదైనా కోర్సు నేర్చుకోమంటారా? లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంలో తడబడుతున్నాను. – నవ్య

ఏ లక్ష్యం నిర్దేశించుకోవాలి?

■ బీటెక్ మొదటి సంవత్సరంలోనే అదనంగా కంప్యూటర్ లాంగ్వేజెస్ / కోర్సులు నేర్చుకోవాలన్న ఆలోచన రావడమే భవిష్య లక్ష్యం నిర్దేశించుకోవడంలో మీరు వేసిన మొదటి అడుగు. ఏ లాంగ్వేజ్, కోర్సు నేర్చుకోవాలి అన్న నిర్ణయం తీసుకోవడంలో అధ్యాపకుల, సీనియర్ల సాయం తీసుకోవచ్చు. కెరియర్ కౌన్సెలర్లూ సహాయపడతారు. ప్రాంగణ నియామకాల ద్వారా ఉద్యోగం పొందాలనుకొంటున్నారా? విదేశాల్లో పీజీ చదవాలనుకొంటున్నారా? ప్రభుత్వ ఉద్యోగం చేయాలనుకుంటున్నారా? గేట్ రాసి ఎంటెక్ చేద్దామని ఉందా? సివిల్ సర్వీసెస్/ గ్రూప్స్‌కు సన్నద్ధం అవ్వాలనుకొంటున్నారా? ఈ విషయాలపై స్పష్టత తెచ్చుకోండి. బీటెక్ కంప్యూటర్ సైన్స్ చదివినవారికి సీ/ సీ ప్లస్ ప్లస్, జావా, పైతాన్, జావా స్క్రిప్ట్, ఎస్‌క్యూఎల్ లాంటి ప్రోగ్రామింగ్ లాంగ్వేజెస్‌పై పట్టు ఉండాలని సాధారణంగా ఐటీ ఉద్యోగ నియామక సంస్థలు ఆశిస్తాయి. వీటికి తోడు ఆర్ ప్రోగ్రామింగ్, మ్యాట్ ల్యాబ్, హెచ్‌టీఎంఎల్, పీహెచ్‌పీ, రూబీ, కొట్లిన్, స్విఫ్ట్ లాంటి లాంగ్వేజెస్ నేర్చుకుంటే మీ ఉద్యోగావకాశాలు మెరుగవుతాయి. లక్ష్యం నిర్ణయించుకోవడం ఎంత ముఖ్యమో దాన్ని నెరవేర్చడం కోసం అహర్నిశలూ కృషి చేయడం అంతే ముఖ్యం. రాబోయే నాలుగు సంవత్సరాలూ ప్రణాళికాబద్ధంగా చదివి మంచి కెరియర్‌కు బాటలు వేసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్



తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

తెలుగు ట్రాన్‌స్క్రిప్షన్
సంస్థ: ఇండియామ్ సొల్యూషన్స్
నైపుణ్యాలు: తెలుగు మాట్లాడటం, రాయడం, ట్రాన్‌స్క్రిప్షన్
స్టైపెండ్: రూ.7,000-15,000
internshala.com/i/a1cfb1

ఆర్గనైజేషనల్ సైకాలజీ
సంస్థ: డీప్‌థాట్ ఎడ్యుటెక్ వెంచర్స్ ప్రై.లి.
నైపుణ్యం: ఆర్గనైజేషనల్ సైకాలజీ
స్టైపెండ్: రూ.2,000
internshala.com/i/f4b819

వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 13

బిజినెస్ డెవలప్‌మెంట్ (సేల్స్)
సంస్థ: కలనీ గట్టానీ అండ్ కంపెనీ
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.5,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 14
internshala.com/i/0f2f4a

టెక్ అండ్ ఈవీ స్క్రిప్ట్ రైటింగ్
సంస్థ: ఫియర్‌డాగ్ మ్యూజిక్
నైపుణ్యాలు: కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్
స్టైపెండ్: రూ.10,000-14,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 15
internshala.com/i/097ee3

వెబ్‌మొబి సంస్థలో...

1. బ్యాక్‌ఎండ్ డెవలప్‌మెంట్
నైపుణ్యాలు: ఎక్స్‌ప్రెస్.జేఎస్, మాంగోడీబీ, మైఎస్‌క్యూఎల్, నోడ్.జేఎస్, పైతాన్, రెస్ట్ ఏపీఐ
స్టైపెండ్: రూ.3,000
దరఖాస్తు గడువు: అక్టోబరు 13
internshala.com/i/3ea313

2. కంటెంట్ రైటింగ్
నైపుణ్యాలు: బ్లాగింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ రాయడం, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్
స్టైపెండ్: రూ.2,100
internshala.com/i/ae1b9c

మొబైల్ యాప్ డెవలప్‌మెంట్
సంస్థ: అల్‌బియరోటీ సొల్యూషన్స్ ఇంక్ (ఒట్టావా, కెనడా)
నైపుణ్యాలు: ఆండ్రాయిడ్, ఏపీఐస్, సీఐ/సీడీ, ఫ్లట్టర్, గిట్, గిట్‌హబ్, ఐఓఎస్, జావాస్క్రిప్ట్, రియాక్ట్ నేటివ్, రెస్ట్ ఏపీఐ, స్విఫ్ట్
స్టైపెండ్: రూ.10,000
internshala.com/i/a510a8

ఫేస్‌బుక్ మార్కెటింగ్
సంస్థ: బిజ్‌గుల్ ఇంక్
నైపుణ్యాలు: కేన్వా, సీఆర్ఎం, ఫేస్‌బుక్ యాడ్స్, ఫేస్‌బుక్ మార్కెటింగ్, గూగుల్ యాడ్‌వర్డ్స్
స్టైపెండ్: రూ.7,000-12,000
internshala.com/i/b317e7

వీడియో ఎడిటింగ్/ మేకింగ్
సంస్థ: ఐవీటెక్ సొల్యూషన్స్ ఇంక్ (అర్లింగ్‌టన్ హైట్స్, యూఎస్)
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, యానిమేషన్, ఫైనల్ కట్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.7,000-10,000
internshala.com/i/f49f6e

యూనిటీ డెవలపర్
సంస్థ: విష్‌గ్రాంటర్స్ (సబ్‌సిడరీ ఆఫ్ జర్‌జురా స్టూడియోస్)
నైపుణ్యాలు: సీ#, జావా, ఆబ్జెక్టివ్ సీ, యూనిటీ 3డీ, యూనిటీ ఇంజిన్ స్టైపెండ్: రూ.7,500
internshala.com/i/3429b0

ఈక్విటీ అనలిస్ట్
సంస్థ: మనీష్ షా
నైపుణ్యాలు: ఫైనాన్షియల్ లిటరసీ, ఫైనాన్షియల్ మోడలింగ్ స్టైపెండ్: రూ.8,000
internshala.com/i/21b0d1

ఈ-కామర్స్ క్యాటలాగ్ మేనేజ్‌మెంట్
సంస్థ: యాక్స్ కన్సల్టెన్సీ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ ఎల్ఎల్‌పీ
నైపుణ్యం: ఈ-కామర్స్ క్యాటలాగ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.5,000-8,000
internshala.com/i/a7a29c

డిజైన్ (ఫిగ్మా అండ్ కేన్వా)
సంస్థ: ఎన్‌వీఏఐ టెక్నాలజీస్
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కేన్వా, ఫిగ్మా
స్టైపెండ్: రూ.10,000
internshala.com/i/ad9e2c

టెక్నికల్ రిక్రూటర్
సంస్థ: మ్యాక్‌టోర్స్
నైపుణ్యాలు: అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రిక్రూట్‌మెంట్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ.5,000-7,000
internshala.com/i/3c733a

వీటికి దరఖాస్తు గడువు: అక్టోబరు 16

కొలువుల వేటలో ఏయే జాగ్రత్తలు?

ఎంచుకున్న కోర్సు పూర్తవుతూనే.. ఉద్యోగం వెతుక్కోవడం ఇప్పటి పరిస్థితుల్లో సాధారణం. అయితే అప్పుడే కొత్తగా కాలేజీ నుంచి బయటకు వచ్చే విద్యార్థులు ఈ ప్రక్రియలో తెలిసీ తెలియక కొన్ని చిన్నచిన్న తప్పులు చేస్తుంటారు. పేరుకి అవి చిన్నవే అయినా, కొన్నిసార్లు మంచి అవకాశాన్ని కోల్పోయేలా చేసేంత పెద్దవి కాగలవు. అందుకే అవేంటో ముందే తెలుసుకుంటే.. వాటిని చేయకుండా జాగ్రత్త పడేందుకు వీలుంటుంది.

ఫోన్ ఇంటర్వ్యూలు, కవర్ లెటర్లు, రిఫరెన్సులు, థాంక్యూ నోట్స్, నెట్‌వర్కింగ్, డ్రెస్సింగ్ అంశాల్లో చేసే పొరపాట్లు మన అవకాశాన్ని వెనక్కి లాగేందుకు కాచుకుని కూర్చుంటాయి. వీటన్నింటినీ సమర్థంగా ఎదుర్కొంటేనే.. అనుకున్న కొలువును సులువుగా చేజిక్కించుకోగలం.

ఉద్యోగ సాధన సవాళ్లతో కూడుకున్న టాస్క్. దీనికి తగిన విధంగా బలమైన వ్యూహం అవసరం. పూర్తిగా ఆన్‌లైన్ దరఖాస్తులను నమ్ముకుని ఉండకూడదు. చాలా ఉద్యోగాలకు రిఫరల్స్, నెట్‌వర్కింగ్ ద్వారానే నియామకాలు జరిగిపోతూ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల పరిశ్రమలో జరిగే కార్యక్రమాలకు హాజరవుతుండాలి. నెట్‌వర్కింగ్ ద్వారా పరిచయాలు పెంచుకుని నచ్చిన ఉద్యోగాన్ని చేజిక్కించుకోవచ్చు.



పోస్టుకు తగిన రెజ్యూమె

▲ ఉద్యోగ ప్రకటనలు ఇచ్చేటప్పుడు సంస్థలు 'జాబ్ డిస్క్రిప్షన్లు' ఇస్తాయి. దరఖాస్తు చేసే ముందు అవి చదవడం చాలా ముఖ్యం. అందులో ఉన్న పాయింట్ల ఆధారంగా రెజ్యూమెను మార్చుకుంటూ పంపాలి. ఒక్కటే దరఖాస్తును అన్నింటికీ పంపే అలవాటు మానుకుంటే మంచిది. కొలువుకు ఏం అవసరమో గమనించాలి. ఆ నైపుణ్యాలు కొట్టొచ్చేట్టు కనిపించేలా దరఖాస్తు ఉండాలి.

▲ లింక్‌డిన్ ప్రొఫైల్‌ను జాగ్రత్తగా నడిపించడం కూడా అవసరం. ఎందుకంటే మన వ్యక్తిత్వాన్ని ఈ ప్రొఫైల్ ప్రతిబింబిస్తుంది. దాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం కీలకం. నైపుణ్యాలూ, విజయాలూ, కెరియర్ లక్ష్యాలను ఉంచుతూ ఉండాలి. బలమైన లింక్‌డిన్ ప్రొఫైల్ చక్కని అవకాశాలను అందించగలదు.

▲ కనిపించిన ప్రతి ఉద్యోగానికీ దరఖాస్తు చేయడం, ఫలితం కోసం వేచిచూడటం సరికాదు. ఇది మనల్ని అనవసరంగా అలిసిపోయేలా చేస్తుంది. దరఖాస్తుల తిరస్కరణకూ దారితీయగలదు. కేవలం మనకు కచ్చితంగా కావాలనుకున్న ఉద్యోగాలు.. వస్తే తప్పనిసరిగా జాయిన్ అయ్యేవాటికే దరఖాస్తు చేయాలి. దరఖాస్తు చేస్తున్న ఉద్యోగం మన దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేందుకు సహకరిస్తుందా లేదా అన్నది పరిశీలించాలి.

దరఖాస్తుకు ముందు..

▲ కంపెనీల గురించి రిసెర్చ్ చేయడం కూడా అవసరం. దరఖాస్తు చేసే ముందు సంస్థ స్థాయి, పని ప్రదేశం, తీరుతెన్నులు తెలుసుకోవడం ద్వారా అక్కడ పనిచేయగలమా లేదా అన్నది పరిశీలించవచ్చు. తీరా వచ్చాక సర్దుకోలేకపోతే.. చాలా చిక్కులు. అప్పటికప్పుడు మారడం, వేరేది వెతుక్కోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చే ప్రమాదం ఉంటుంది.

▲ సాఫ్ట్ స్కిల్స్ ఈ సందర్భంలో చాలా ముఖ్యమైన అంశం. టెక్నికల్‌గా ఏం చేయగలం, ఎంతవరకూ చేయగలం అన్నది డిగ్రీలు చెబితే.. ఆ పనిని ఎంత సమర్థంగా నిర్వహించగలమనేది సాఫ్ట్‌స్కిల్స్ చెబుతాయి. కమ్యూనికేషన్, నాయకత్వం, అడాప్టబిలిటీ వంటి లక్షణాలను తెలియజెప్పేలా మన రెజ్యూమె ఉంటే మెరుగ్గా ఉంటుంది.

వ్యాకరణ దోషాలున్నాయా?

▲ రెజ్యూమెను తప్పుల్లేకుండా ఉంచడం కూడా ప్రధానం. చాలామంది చిన్న చిన్న టైపింగ్- వ్యాకరణ దోషాలను పట్టించుకోకుండా వదిలేస్తుంటారు. కానీ ఆ నిర్లక్ష్యం.. ఒక మంచి అవకాశాన్ని కోల్పోయేలా చేయొచ్చు. అందుకే అది దోషరహితంగా, ఆసక్తికరంగా ఉండటంతో పాటు ప్రొఫెషనల్‌గా కనిపించేలా ఉండాలి.

▲ ఎవరూ మనకు అవకాశం ఇచ్చేందుకు వేచిచూడరు. ఇంటర్వ్యూల తర్వాత కచ్చితంగా ఫాలోఅప్ చేసుకోవాలి. ఇది ప్రొఫెషనలిజాన్నీ, ఆ ఉద్యోగం పట్ల మనకున్న ఆసక్తినీ తెలియజేస్తుంది. దీర్ఘకాలపు ఇంప్రెషన్‌ను కలిగించేలా మనం చేసే ఒక ఈ-మెయిల్, ఒక ఫోన్ కాల్ తదుపరి విడతలో అయినా విజయావకాశాలను పెంచుతుంది.

విఫలమైతే నిరాశ వద్దు

● ఇంటర్వ్యూలకు హాజరైనప్పుడు వైఫల్యాలు సాధారణం. 'ఇక మన వల్ల కాదు' అనుకుని త్వరగా విడిచిపెట్టడం.. మంచి అవకాశాలను దూరం చేస్తుంది. ఉద్యోగం వెతుక్కోవడం అనే ప్రక్రియలో నిబ్బరంగా ఉండటం ముఖ్యం. విశ్వాసాన్ని కోల్పోకుండా ప్రయత్నించడం.. అంతిమంగా విజయం సాధించడానికి దోహదం చేస్తుంది.

● ఫీడ్‌బ్యాక్ ఇటువంటి సమయాల్లో చాలా ఉపయోగపడుతుంది. కొందరు విద్యార్థులు తిరస్కరణ ఎదురైతే.. ఎందుకు అలా జరిగిందో తెలుసుకోరు. ఏం మార్చుకోవాలా అని ఆలోచించరు. వైఫల్యానికి మన వైపు నుంచి ఉన్న కారణం ఏంటో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ప్రతి ప్రయత్నానికీ మరింత మెరుగ్గా, పకడ్బందీగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. దీని ద్వారా ఆ తప్పులు తదుపరి ప్రయత్నంలో చేసే అవకాశం ఉండదు.



ప్రశ్నలు అడగటమూ అవసరమే

▌ ఇంటర్వ్యూయర్లు అవకాశం ఇచ్చినప్పుడు తిరిగి అడిగేందుకు ప్రశ్నలు ముందుగానే సిద్ధం చేసుకోవాలి. చాలామంది విద్యార్థులు దీనిపై దృష్టిపెట్టరు. కానీ దీన్ని ముఖాముఖిలో భాగంగానే సంసిద్ధం అవ్వాలి. కంపెనీ, పని ప్రదేశం, చేయబోయే ఉద్యోగం.. ఇలా దేని గురించి అయినా ఒకటి రెండు మంచి ప్రశ్నలు అడిగితే ఇంటర్వ్యూ చేసేవారికి మనపై మంచి అభిప్రాయం కలుగుతుంది.

▌ దరఖాస్తు చేసిన ఉద్యోగానికి సరిపోయే డ్రెస్ వేసుకోవాలి. క్యాజువల్ కావొచ్చు, ఫార్మల్ కావొచ్చు. అది సౌకర్యంగా ఉండటం ముఖ్యం. అలవాటు లేని దుస్తులు వేసుకుని, ఇబ్బంది పడుతుంటే ఇంటర్వ్యూపై చూపాల్సిన ఏకాగ్రతను దెబ్బతీస్తుందని గుర్తించాలి.

▌ అయితే ఎంత సన్నద్ధమైనా.. ఇంటర్వ్యూ అన్నప్పుడు ఎంతో కొంత టెన్షన్ తప్పదు. చేసిన తప్పులు మళ్లీ చేయకుండా.. కొత్త తప్పులకు అవకాశం లేకుండా ప్రయత్నిస్తే.. అనుకున్న కొలువును చేజిక్కించుకోవచ్చు!

హాల్‌లో అవకాశాలు

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కోరా, అమేఠీలోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) 81 ఆపరేటర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. కాంట్రాక్ట్ ప్రాతిపదిన నాలుగేళ్ల కాలానికి ఎంపిక చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.



మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఫిట్టింగ్, కెమికల్, టర్నింగ్, ల్యాబ్, ఎలక్ట్రోప్లేటింగ్, వెల్డింగ్ విభాగాల్లో ఈ ఖాళీలు ఉన్నాయి.

1. **ఆపరేటర్ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రికల్/ మెకానికల్/ కెమికల్-18:** ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో మూడేళ్ల రెగ్యులర్/ ఫుల్‌టైమ్ డిప్లొమా.
2. **ఆపరేటర్ ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రికల్/ టర్నింగ్/ ఫిట్టింగ్/ వెల్డింగ్/ అడ్మిన్ అసిస్టెంట్-16:** మూడేళ్ల ఎన్ఏసీ లేదా రెండేళ్ల ఐటీఐ ఎలక్ట్రానిక్స్, ఏడాది ఎన్ఏసీ/ ఎన్‌సీటీవీటీ.
3. **ఆపరేటర్ ఎలక్ట్రానిక్స్-44:** మూడేళ్ల ఎన్ఏసీ లేదా రెండేళ్ల ఐటీఐ - ఎలక్ట్రానిక్స్, ఎన్ఏసీ/ ఎన్‌సీటీవీటీ.
4. **ఆపరేటర్ ఎలక్ట్రోప్లేటింగ్/ ఆపరేటర్ ల్యాబ్-2:** మూడేళ్ల ఎన్ఏసీ లేదా రెండేళ్ల ఐటీఐ (ఎలక్ట్రోప్లేటర్, ఏడాది ఎన్ఏసీ/ఎన్‌సీటీవీటీ.
5. **ఆపరేటర్ వెల్డింగ్-1:** మూడేళ్ల ఎన్ఏసీ లేదా రెండేళ్ల ఐటీఐ - వెల్డర్, ఏడాది ఎన్ఏసీ/ ఎన్‌సీటీవీటీ.

◆ పార్ట్‌టైమ్/ కరస్పాండెన్స్/ డిస్టెన్స్ ఎడ్యుకేషన్/ ఈ-లెర్నింగ్ విధానంలో చదివినవారూ.. ఉన్నత విద్యార్హతలు ఉన్నవారు దరఖాస్తుకు అనర్హులు.

అభ్యర్థుల వయసు 28 సంవత్సరాలు మించకూడదు. గరిష్ఠ వయసులో.. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల మినహాయింపు ఉంటుంది. దరఖాస్తు ఫీజు రూ.200. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

ఎంపిక ఇలా...

రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

◆ విద్యార్హతల ఆధారంగా అభ్యర్థుల షార్ట్‌లిస్ట్‌ను తయారుచేసి.. రాత పరీక్ష తేదీ, వేదికల వివరాలను అభ్యర్థుల ఈమెయిల్/ సంస్థ వెబ్‌సైట్ ద్వారా తెలియజేస్తారు.

◆ రాత పరీక్ష మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 160 మార్కులకు ఉంటుంది. ప్రశ్నపత్రంలో మూడు పార్టులుంటాయి. పార్ట్-1లో జనరల్ అవేర్‌నెస్ - 20 ప్రశ్నలు, పార్ట్-2లో ఇంగ్లిష్, రీజనింగ్-40 ప్రశ్నలు, పార్ట్-3లో సంబంధిత విభాగానికి చెందిన 100 ప్రశ్నలు అడుగుతారు. వ్యవధి రెండున్నర గంటలు. ప్రతి సరైన సమాధానానికీ ఒక మార్కు. రుణాత్మక మార్కులు లేవు.

◆ రాత పరీక్ష తేదీ, సమయం, చిరునామా.. మొదలైన వివరాలను అడ్మిట్ కార్డ్ ద్వారా తెలియజేస్తారు.

◆ రాత పరీక్షలో అన్‌రిజర్వ్‌డ్/ ఈడబ్ల్యూఎస్/ ఓబీసీలు 60 శాతం, ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు 50 శాతం మార్కులు సంపాదించాలి.

◆ రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపిక చేస్తారు.

◆ ధ్రువపత్రాల పరిశీలన తేదీ, సమయం, చిరునామాల వివరాలను అభ్యర్థుల ఈమెయిల్‌కు తెలియజేస్తారు.

◆ దీంట్లో అర్హత సాధించిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించి కేటగిరీలవారీగా తుది ఎంపిక చేస్తారు.

సన్నద్ధత

విద్యార్హతలకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి వంద ప్రశ్నలు ఇస్తారు. కాబట్టి ముఖ్యంగా వీటి పైన దృష్టి సారించాలి.

▸ జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్, రీజనింగ్‌కు వివిధ పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.

▸ మాక్‌టెస్టులు రాయడం వల్ల ఎప్పటికప్పుడు నైపుణ్యాలను సమీక్షించుకుని మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుంది. వ్యవధిలోపల అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాయగలుగుతున్నారో లేదో తెలుస్తుంది.

▸ నెగటివ్ మార్కులు లేవు కాబట్టి అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాయడానికి ప్రయత్నించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 05.10.2024
వెబ్‌సైట్: www.hal-india.co.in

పరీక్ష లేకుండానే..

నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) ఇండియా లిమిటెడ్.. 56 ఇండస్ట్రియల్ ట్రెయినీ (ఫైనాన్స్) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. ఎంపికైనవారిని దేశవ్యాప్తంగా ఉన్న యూనిట్లు/ ఆఫీసుల్లో నియమిస్తారు.

యూనిట్లు/ ఆఫీసులవారీగా: నైవేలీ యూనిట్లు-17, కార్పొరేట్ ఆఫీస్-10, బర్సింగ్‌సర్ ప్రాజెక్టు-3, ఎన్‌టీపీఎల్/ ట్యుటికోరిన్-6, ఎన్‌యూపీపీఎల్, కాన్పూర్-6, రీజనల్ ఆఫీస్/ చెన్నై-2, రీజినల్ ఆఫీస్/చెన్నై - కమర్షియల్-2, రీజనల్ ఆఫీస్/న్యూదిల్లీ-2, తలబిరా ప్రాజెక్టు-6, సౌత్ పచ్‌వరా-దుమ్‌కా-2 ఖాళీలు ఉన్నాయి.

విద్యార్హతలు: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా 2022/2023లో నిర్వహించిన చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ)- ఇంటర్మీడియట్ పాసవ్వాలి. లేదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) - ఇంటర్మీడియట్ పాసవ్వాలి.

వయసు: 01.09.2024 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు. గరిష్ఠ వయసులో.. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల మినహాయింపు ఉంటుంది. మాజీ సైనికోద్యోగులకు తాజా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సడలింపు వర్తిస్తుంది.

ఎంపిక

సీఏ/సీఎంఏ ఇంటర్మీడియట్ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైనవారికి ఏడాది శిక్షణ ఉంటుంది. ఈ సమయంలో రూ.22,000 స్టైపెండ్ చెల్లిస్తారు. ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ (ఎన్‌సీఎల్)/ ఈడబ్ల్యూఎస్/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రిజర్వేషన్లూ, సడలింపులూ వర్తిస్తాయి.

▲ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా/ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియాలో అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలి.

▲ గతంలో ఎలాంటి శిక్షణ కార్యక్రమాలకు హాజరై ఉండకూడదు.

▲ శిక్షణ కాలంలో స్టైపెండ్‌తోపాటు కనీస అద్దెతో వసతి సదుపాయం కూడా కల్పిస్తారు.

▲ ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలకు చెందిన వ్యక్తులకు ప్రాధాన్యమిస్తారు.

▲ ధ్రువపత్రాల పరిశీలన సమయంలో ప్రభుత్వ వైద్యులు జారీచేసిన మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను సమర్పించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 10.10.2024
వెబ్‌సైట్: www.nlcindia.in

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, మెదక్‌లో ప్రాజెక్ట్ ఇంజినీర్లు

రక్షణ శాఖ పరిధిలోని ఆర్మర్డ్ వెహికిల్స్ నిగమ్ లిమిటెడ్‌కు చెందిన ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్.. ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన 31 ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, క్యాడ్ స్పెషలిస్ట్, మెటలర్జీ, కెమికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్/ఐటీ.
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఈ/ బీటెక్‌తో పాటు పని అనుభవం. **వేతనం:** నెలకు రూ.50,000. **వయసు:** 21 నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. **దరఖాస్తు ఫీజు:** రూ.300; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ ఎక్స్ సర్వీస్‌మెన్ / మహిళలకు ఫీజు మినహాయింపు ఉంటుంది.
ఎంపిక: విద్యార్హతలు, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు గడువు: ప్రకటన వెలువడిన తేదీ (21.9.2024) నుంచి 21 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'ది డిప్యూటీ జనరల్ మేనేజర్/ హెచ్‌ఆర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ మెదక్, ఎద్దుమైలారం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ' చిరునామాకు పంపాలి.
వెబ్‌సైట్: https://avnl.co.in/

ఝార్ఖండ్ యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఖాళీలు

రాంచీలోని సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఝార్ఖండ్.. డైరెక్ట్ ప్రాతిపదికన 33 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
▸ సెక్షన్ ఆఫీసర్: 02 ▸ ప్రైవేట్ సెక్రటరీ: 02 ▸ అసిస్టెంట్: 03
▸ జూనియర్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్): 01 ▸ హిందీ ట్రాన్స్‌లేటర్: 01
▸ సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: 01 ▸ టెక్నికల్ అసిస్టెంట్: 01
▸ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్: 01 ▸ ఎల్‌డీసీ/ యూడీసీ: 06
▸ లైబ్రరీ అసిస్టెంట్: 01 ▸ ల్యాబొరేటరీ అసిస్టెంట్: 03 ▸ డ్రైవర్: 03
▸ అటెండెంట్ (ల్యాబొరేటరీ/ లైబ్రరీ): 06 ▸ అటెండెంట్ (హాస్టల్): 02
అర్హత: పదో తరగతి, 10+2, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ, బీఈ/ బీటెక్ (సివిల్/ మెకానికల్/ ఎలక్ట్రికల్)తో పాటు పని అనుభవం. **వయసు:** 27 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
దరఖాస్తు ఫీజు: రూ.1000; ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూబీడీ/ మహిళలకు ఫీజు మినహాయింపు ఉంటుంది. **ఎంపిక:** రాత పరీక్ష, ట్రేడ్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, ఇంటర్వ్యూల ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 08-10-2024. **వెబ్‌సైట్:** https://cuj.ac.in/

బామర్ లారీ లిమిటెడ్‌లో ఆఫీసర్లు

కోల్‌కతాలోని ప్రభుత్వ రంగ సంస్థ - బామర్ లారీ అండ్ కంపెనీ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన 7 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
▲ మేనేజర్: 01 ▲ డిప్యూటీ మేనేజర్: 01
▲ అసిస్టెంట్ మేనేజర్: 01 ▲ ఆఫీసర్/జూనియర్ ఆఫీసర్: 04
విభాగాలు: ఛానల్ సేల్స్, వెకేషన్స్, కార్పొరేట్ బిజినెస్, ట్రావెల్.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఎంటీఎం/ ఎంబీఏ/ గ్రాడ్యుయేట్ ఇంజినీర్‌తో పాటు పని అనుభవం.
వయసు: మేనేజర్ పోస్టుకు 38 ఏళ్లు; డిప్యూటీ మేనేజర్ పోస్టుకు 35 ఏళ్లు; అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు 32 ఏళ్లు; ఆఫీసర్/జూనియర్ ఆఫీసర్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. **ఎంపిక:** రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా. **పని ప్రదేశాలు:** హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి, దిల్లీ. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 04-10-2024.
వెబ్‌సైట్: https://www.balmerlawrie.com/

వాక్ ఇన్

కొచ్చిన్ ఎయిర్‌పోర్టులో ..

ఎయిర్ ఇండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్‌కు చెందిన కొచ్చిన్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్, కొచ్చిన్.. ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 208 పోస్టుల భర్తీకి దరఖాస్తులను కోరుతోంది.
▼ ర్యాంప్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్: 03 ▼ యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్: 04 ▼ హ్యాండీమెన్/ హ్యాండీ విమెన్: 201
అర్హత: పదో తరగతి, పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా (మెకానికల్/ ఎలక్ట్రికల్/ ప్రొడక్షన్/ ఎలక్ట్రానిక్స్/ ఆటోమొబైల్)తో పాటు పని అనుభవం. యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్ పోస్టులకు హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి.
వయసు: 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు ర్యాంప్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్‌లకు రూ.24,960; యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్లకు రూ.21,270; హ్యాండీమెన్/ హ్యాండీ విమెన్‌కు రూ.18,840.
ఎంపిక: షార్ట్‌లిస్ట్, ట్రేడ్ టెస్ట్, ఫిజికల్ ఎంట్రన్స్ టెస్ట్, ఇంటర్వ్యూల ఆధారంగా.
ఆన్‌లైన్ **దరఖాస్తుకు చివరి తేదీ:** 1-10-2024.
ఇంటర్వ్యూ తేదీలు: అక్టోబరు 5,7
వేదిక: శ్రీ జగన్నాథ్ ఆడిటోరియం, వెంగూర్ దుర్గాదేవి ఆలయం దగ్గర, వెంగూర్, అంగమలీ, ఎర్నాకులం, కేరళ.
వెబ్‌సైట్: https://www.aiasl.in/index

సీఈసీఆర్ఐలో ప్రాజెక్ట్ అసోసియేట్లు

తమిళనాడు రాష్ట్రం కరైకుడిలోని సీఎస్ఐఆర్- సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్.. ఒప్పంద ప్రాతిపదికన 5 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
▌ సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్: 01 ▌ ప్రాజెక్ట్ అసోసియేట్-II: 01
▌ ప్రాజెక్ట్ అసోసియేట్-I: 02
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.
వేతనం: నెలకు సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టుకు రూ.42,000, ప్రాజెక్ట్ అసోసియేట్-IIకు రూ.28,000, ప్రాజెక్ట్ అసోసియేట్-Iకు రూ.25,000 నుంచి రూ.31,000. **ఇంటర్వ్యూ తేదీ:** 01-10-2024.
వేదిక: సీఈసీఆర్ఐ, చెన్నై యూనిట్, సీఎస్ఐఆర్- మద్రాస్ కాంప్లెక్స్, తారామణి, చెన్నై. **వెబ్‌సైట్:** https://www.cecri.res.in/

చదువు

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు.

మా చిరునామా: చదువు, ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్‌సిటీ – 501 512 edc@eenadu.in